ఈనాడు

విజయవాడ 19-7-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 340
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ

- రెండు రోజులపాటు నిపుణులతో చర్చలు
- నేడు డిక్లరేషన్ ప్రకటిస్తాం
- ఎస్ఆర్ఎం 'గ్రీన్ హైడ్రోజన్ సదస్సు-2025'లో సీఎం చంద్రబాబు వెల్లడి



సీఎం చంద్రబాబు సమక్షంలో నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్‌బాబుతో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న యూకేకు చెందిన యమ్మా సంస్థ ప్రతినిధి గాల్ బోగిన్, పోలండ్‌కు చెందిన జేకేఎస్‌హెచ్ అండ్ హై ఇన్‌ఫ్రా సంస్థల ప్రతినిధి ఐ.కె.శ్రీవాత్సవ. చిత్రాల్లో సీఎస్ విజయానంద్, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ఈనాడు, అమరావతి: అమరావతిలో హైడ్రోజన్ వ్యాలీ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'గ్రీన్ హైడ్రోజన్ సమిట్-2025'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రెండు రోజుల సమిట్ ముగిసిన తర్వాత నిపుణులు చేసిన సూచనలతో 'అమరావతి గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్-2025' ప్రకటిస్తామని వెల్లడించారు. వచ్చే ఏడాది ఇదే రోజు సమావేశమై ఏడాదిలో సాధించిన లక్ష్యాలపై సమీక్షించుకుందామన్నారు. 'రాష్ట్రానికి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ గేమ్ ఛేంజర్ కాబోతోంది. దీన్ని పూర్తి సామర్థ్యంతో, తక్కువ ఖర్చుతో ఎలా అందుబాటులోకి తేవాలన్నదే ఇప్పుడు కీలకమైన సవాలు. రెండు రోజుల సమిట్‌లో దీనిపై వినూత్న ఆలోచనలు చేయాలి. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద పరిశీలించిన ఫలితాలు (ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్) ప్రపంచానికి ఒక నమూనాగా నిలవాలి. దీనికోసం ప్రపంచంలో ఉన్న సాంకేతికత, నిపుణుల సూచనల ఆధారంగా విలువ జోడింపు అంశాలను పరిశీలించాలి. రెండు రోజుల మేధోమథనంలో సర్క్యులర్ ఎకానమీలో భాగంగా నీటి రీసైక్లింగ్‌తో పాటు ఇతర అవకాశాలపై నిపుణులు చర్చించాలి' అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. తొలుత ఆయన గ్రీన్ హైడ్రోజన్ తయారీ రంగ నిపుణులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.

సాంకేతిక, హరిత నగరంగా అమరావతి

క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు ద్వారా ఆధునిక సాంకేతిక నగరంగా అమరావతి మారుతుందని సీఎం పేర్కొన్నారు. 'పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నాం. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలతో సమన్వయం చేసి.. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చే బాధ్యత నెడ్‌క్యాప్ తీసుకోవాలి. విద్యా సంస్థలు కేవలం బోధన అంశాలకే పరిమితమయ్యాయి. అప్లికేషన్ (అమలు) గురించి ఆలోచన చేయడం లేదు. ఒక అంశానికి పరిష్కారాలను చూపితేనే అది (మిగతా 5లో)

మిథున్‌రెడ్డికి
ముందస్తు బెయిల్ నిరాకరణ



- పిటిషన్ డిస్మిస్ చేసిన సుప్రీం కోర్టు
- లొంగుబాటుకు కొంత సమయం ఇవ్వాలన్న అభ్యర్థనకూ నో



ఈనాడు, దిల్లీ: మద్యం కుంభకోణంలో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ముందస్తు బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. ఏ ప్రాతిపదికన మీకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఈనెల 15న ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై విచారించిన జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం దాన్ని డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది. కనీసం వారం సమయం ఇవ్వాలన్న మిథున్‌రెడ్డి న్యాయవాది విజ్ఞప్తిని తోసిపుచ్చింది. వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో ఏ4గా ఉన్న మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టేయడంతో ఆయన సుప్రీం కోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఈ కేసు జస్టిస్ పర్దీవాలా, జస్టిస్ మహాదేవన్‌ల ముందు విచారణకు వచ్చింది.

మిథున్‌రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. 'ఇది మీరు గతంలో హైకోర్టుకు (మిగతా 5లో)

ఏ క్షణమైనా మిథున్‌రెడ్డి అరెస్టు!

వారెంట్ కోసం ఏసీబీ కోర్టులో సిట్ మెమో 5లో


లులుకు కేటాయించనున్న విజయవాడలోని గవర్నర్‌పేట-2 బస్ డిపో ప్రాంగణం

విజయవాడలో లులు మాల్

గవర్నర్‌పేట-2 డిపో స్థలంలో ఏర్పాటుచేసే యోచన

గొల్లపూడిలో ఆర్టీసీకి ప్రత్యామ్నాయ భూమి

5లో

పన్నులు ఎగ్గొట్టే మోసగాళ్లను నియంత్రించలేరా?



రాష్ట్రానికి ఆర్థికంగా పెద్ద సవాళ్లే ఎదురవుతున్నాయ్

ఆదాయం పెంపుపై దృష్టి పెట్టండి

వాణిజ్య పన్నుల శాఖ సమీక్షలో మంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు, అమరావతి: 'పదో తరగతి, ఇంటర్ తప్పిన వాళ్లు కూడా అనేక మోసాలు చేసి మీకు సవాలు విసురుతున్నారు. తప్పుడు మార్గాల్లో పన్నులు ఎగ్గొడుతున్నారు. అలాంటి వారిని ఇంత అనుభవమున్న మీరు నియంత్రించలేరా? వాళ్లు సవాలు విసురుతోంటే, ఆ మోసాన్ని అరికట్టలేరా? వాళ్లకు తలవంచుదామా' అని రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య పన్నులశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. 'వాణిజ్య పన్నులశాఖ అధికారులు రోడ్ల మీదకు వెళ్లాలని నేను చెప్పడం లేదు. ఆ రోజులు పోయాయి. డేటా సమీకరించాలి. ఆ డేటాతో స్మార్ట్‌గా పని చేస్తూ ఫలితాలు సాధించాలి. అవసరమైతే ఇతర శాఖలతో సమన్వయ సమావేశం పెడదాం. ఆదాయం పెంపునకు అడ్డంకులేంటో గుర్తించండి. కొత్త ఆలోచనలతో ముందుకు వచ్చిన వారిని (మిగతా 5లో)

రాబోయే ఐదు రోజులు విస్తారంగా వర్షాలు



ఈనాడు, విశాఖపట్నం: రాబోయే ఐదు రోజులు.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. పిడుగులతో కూడిన వర్షాలతో పాటు ఈదురు గాలులు వీచే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. శనివారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, (మిగతా 5లో)

'బిగ్‌బాస్'ను నిందితుడిగా చేరుస్తారా?

మద్యం కుంభకోణం కేసులో నేడు ఛార్జ్‌షీట్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన రూ.వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణం కేసులో సిట్ అధికారులు శనివారం ప్రాథమిక అభియోగ పత్రం (ప్రిలిమినరీ ఛార్జ్‌షీట్) దాఖలు చేసే అవకాశముంది. ఇప్పటికే న్యాయ పరిశీలన (లీగల్ వెట్టింగ్) ప్రక్రియ పూర్తి చేశారు. ఈ అభియోగపత్రం 160 పేజీలు, దానికి అనుబంధంగా సాక్షుల వాంగ్మూలాలు, డాక్యుమెంట్లు, రికార్డులు, ఫోరెన్సిక్ నివేదికలు, బ్యాంకుల లావాదేవీల వివరాలు వంటివి కొన్నివేల పత్రాలు ఉంటుంది. ఏవైనా కారణాల వల్ల శనివారం కుదరకపోతే.. సోమవారం దాఖలు చేయవచ్చని భావిస్తున్నారు. ఈ మొత్తం కుంభకోణంలో ప్రధాన కుట్రదారు, అంతిమ లబ్ధిదారైన 'బిగ్‌బాస్'ను ఈ దశలో నిందితుడిగా చేరుస్తారా.. లేదా? ఈ కుంభకోణంలో ఆయన ప్రమేయం గురించి అభియోగపత్రంలో ఏమేం ప్రస్తావించనున్నారు? అనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బిగ్‌బాస్‌కు సంబంధించి సిట్ ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించింది. ఈ కేసులో ఇప్పటివరకూ మొత్తం 40 మందిని నిందితులుగా చేర్చింది. 11 మందిని అరెస్టు చేసింది. తాజా అభియోగపత్రంలో మరి కొంతమంది వ్యక్తుల్ని, సంస్థల్ని నిందితులుగా చేర్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల అమలుపై సమీక్ష

ఈనాడు, అమరావతి: పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ విధానం పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న తీరు, వివిధ సందర్భాల్లో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులపై మంత్రుల కమిటీ శుక్రవారం సచివాలయంలో సమీక్షించింది. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు తీరుపై ఏ తీర్పులు ఇచ్చాయన్నది ఉన్నతాధికారులు మంత్రులకు వివరించారు. దీనిపై మరింత అధ్యయనం చేసి, నిర్ణయాన్ని తీసుకుంటామని మంత్రుల కమిటీ ప్రకటించింది.



తెదేపాకు అశోక్ గజపతిరాజు రాజీనామా

- ఇక ప్రత్యక్ష రాజకీయాలకు దూరం
- గోవా గవర్నరుగా 26న బాధ్యతల స్వీకారం

ఈనాడు, విజయనగరం: విశాఖపట్నం (సింహాచలం), న్యూస్‌టుడే: గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు తెదేపా ప్రాథమిక/శాశ్వత సభ్యత్వానికి శుక్రవారం రాజీనామా చేశారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యత్వాన్ని సైతం వదులుకున్నారు. ఈ మేరకు తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులకు శుక్రవారం లేఖలు రాశారు. 1983 నుంచి ఇప్పటి వరకు పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి క్రమశిక్షణ కలిగిన సైనికుడిలా పనిచేశానన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన నందమూరి తారక రామారావుకు, పార్టీకి ఎంతో రుణపడి ఉంటానన్నారు. ప్రధాని మోదీ, చంద్రబాబు ఆశీస్సులతో ఇక గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నానని తెలిపారు. ఆయన ఈ నెల 26న గవర్నరుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.



సింహాచలం అప్పన్న ఆలయంలో కప్పస్తంభం వద్ద మొక్కుతున్న అశోక్ గజపతిరాజు దంపతులు

ఆవిర్భావం నుంచి తెదేపాతోనే..

విజయనగరం రాజవంశీకుడైన అశోక్ గజపతి రాజు 1978లో రాజకీయాల్లోకి ప్రవేశించి శాసనసభలో అడుగుపెట్టినా 1983లో ఎన్టీఆర్ పిలుపు మేరకు తెదేపాలో చేరారు. ఇప్పటి వరకు అందులోనే కొనసాగారు. విజయనగరం శాసనసభ స్థానం నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా, లోక్‌సభ స్థానం నుంచి ఒకసారి ఎంపీగా విజయం సాధించారు. తెదేపా అధికారంలో ఉన్నన్నాళ్లు రాష్ట్రమంత్రిగా పనిచేశారు. 2014లో ఎంపీగా విజయం సాధించి ప్రధాని నరేంద్రమోదీ మంత్రివర్గంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా మూడున్నరేళ్లు పనిచేశారు. 2019 ఎన్నికల్లో ఆయన మళ్లీ ఎంపీ స్థానానికి పోటీ చేయగా, కుమార్తె ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచినా ఇద్దరూ ఓటమి చెందారు. 2024లో కుమార్తెను అసెంబ్లీ బరిలో నిలిపి ఆమె విజయానికి కృషి చేశారు. ఎప్పుడూ పసుపు రంగు చొక్కా ధరించే పార్టీ కార్యక్రమాలకు హాజరయ్యే ఆయన ఇక ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండనున్నారు.

పసుపు రంగు పవిత్రమైంది..

గవర్నర్‌గా నియమితులైన నేపథ్యంలో అశోక్ గజపతిరాజు కుటుంబ సమేతంగా శుక్రవారం సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'పసుపు రంగు పవిత్రమైనది. మనమంతా అంత పవిత్రంగా ఉండాలని ఎన్టీఆర్ చెప్పేవారు. తెదేపాలో జీవితకాల సభ్యుడిగా ఉండి రాజీనామా చేయాల్సి రావడం బాధాకరం' అని అన్నారు. రాజ్యాంగ పదవిలోకి వెళ్తున్నప్పటికీ కుటుంబ వారసత్వంగా వచ్చినందున సింహాచలం ఆలయ అనువంశిక ధర్మకర్తగా కొనసాగుతానని తెలిపారు. 1978లో తొలిసారి శాసనసభ్యుడిగా ఎన్నికైనప్పుడు అప్పన్నను దర్శించుకునే అసెంబ్లీకి వెళ్లానని గుర్తుచేసుకున్నారు. తెదేపా ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ పదవులకు రాజీనామాను ప్రకటిస్తూ.. ఆలయ ధ్వజస్తంభం వద్ద పత్రాలపై సంతకాలు చేశారు.

కోటను తలపించే గోవా రాజ్ భవన్



గోవా రాజ్ భవన్

అశోక్ గజపతిరాజు ఈ నెల 26న గోవా రాజ్‌భవన్‌లో గవర్నరుగా బాధ్యతలు చేపట్టనున్నారు. దోనాపౌలాలోని గవర్నర్ నివాస గృహం 88 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. 17వ శతాబ్దంలో అరేబియా సముద్రానికి ఎదురుగా కోటను తలపించేలా దానిని నిర్మించారు. అప్పట్లో దీనిని 'కేప్ ప్యాలెస్' అనేవారు. దేశంలోని గవర్నర్ల నివాస భవనాలన్నింటిలోనూ ఇదే అత్యుత్తమమైనదిగా పేర్కొంటారు.

చెత్త పన్నువేసి వ్యర్థాల గుట్టలు మిగిల్చిన జగన్

- మంత్రి నారాయణ విమర్శ

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: జగన్ ప్రభుత్వం రూ.లక్షల కోట్లు అప్పులు చేయడమే కాకుండా ప్రజలపై చెత్త పన్ను వేసి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో వ్యర్థాల గుట్టలు పేరుకుపోయేలా చేసిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ విమర్శించారు. శుక్రవారం అనంతపురంలోని డంపింగ్ యార్డులో నిల్వ ఉన్న వ్యర్థాల బయోమైనింగ్ ప్రక్రియను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కలెక్టరు వినోద్‌కుమార్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఇచ్చిన మాట ప్రకారం చెత్తపన్నును రద్దు చేయడంతోపాటు వైకాపా ప్రభుత్వ హయాంలో వదిలివెళ్లిన 85 లక్షల టన్నుల చెత్తను 2025 అక్టోబరు 2 లోగా బయోమైనింగ్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని ఆ మేరకు 50 లక్షల టన్నుల చెత్తను ఇప్పటికే తొలగించామన్నారు. అక్టోబరు 2 లోగా మిగిలిన 35 లక్షల టన్నులను తొలగిస్తామన్నారు. ఆగిపోయిన ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టును పునరుద్ధరించి రూ.5,350 కోట్లు వెచ్చించి ప్రతి ఇంటికీ నీటి కనెక్షన్ ఇస్తామన్నారు. అమృత్ పథకం ద్వారా నీటి సౌకర్యాలు మెరుగుపరచడానికి 2020లో కేంద్ర ప్రభుత్వం రూ.8,500 కోట్లు మంజూరు చేస్తే వైకాపా ప్రభుత్వం రాష్ట్రం వాటా ఇవ్వకపోవడంతో పథకం ఆగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం వాటా చెల్లించడంతో పాటు సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఇటీవలే టెండర్లు పిలిచామని రాష్ట్రవ్యాప్తంగా త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. టిడ్కో ఇళ్లను డిసెంబరుకు పూర్తి చేస్తామన్నారు.

గ్రహం అనుగ్రహం

19-7-2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, బహుళపక్షం
నవమి: మ. 1-29 తదుపరి దశమి; భరణి: రా. 12-14 తదుపరి కృత్తిక
వర్జ్యం: ఉ. 10-51 నుంచి 12-20 వరకు; అమృత ఘడియలు: రా. 7-46 నుంచి 9-15 వరకు; దుర్ముహూర్తం: ఉ. 5-37 నుంచి 7-21 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5.38; సూర్యాస్తమయం: సా.6.34

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	38.5	25.0
తాడేపల్లిగూడెం	37.4	27.3
విజయవాడ	35.4	24.6
గుంటూరు	35.0	28.0
విజయనగరం	35.0	26.0
శ్రీకాకుళం	34.0	28.0
కడప	34.0	26.0
నరసాపురం	34.0	24.3
ఒంగోలు	33.7	24.5
విశాఖపట్నం	33.6	27.0
నెల్లూరు	33.6	26.2
తిరుపతి	33.2	23.8
అనంతపురం	32.6	24.0
హైదరాబాద్	32.3	23.0
మెదక్	31.6	22.6
కర్నూలు	31.4	24.9
మహబూబ్‌నగర్	27.5	23.1

నీట్ కౌన్సెలింగ్‌పై ఉచిత వెబినార్

వైద్యవిద్యలో ప్రవేశం కోసం నిర్వహించే 'నీట్' కౌన్సెలింగ్‌పై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అభ్యర్థుల అవగాహన కోసం **ఈనాడు- చదువు, శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ** సంయుక్తంగా ఆన్‌లైన్‌లో ఉచిత వెబినార్‌ను జూమ్ ప్లాట్‌ఫామ్‌పై నిర్వహించనున్నాయి.

సమయం: ఈ నెల 20 (ఆదివారం) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.

కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (వరంగల్) వైస్ ఛాన్సలర్ డా. పి.వి. నందకుమార్‌రెడ్డి, డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (విజయవాడ) రిజిస్ట్రార్ డా. వేమిరెడ్డి రాధికారెడ్డి, అనుభవజ్ఞులైన అధ్యాపకులు పాల్గొంటారు. నీట్ కౌన్సెలింగ్ కీలక అంశాలు, రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ మెలకువలు, కాలేజీల ఎంపికలో జాగ్రత్తలు తదితర అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తారు.

నీట్ కౌన్సెలింగ్‌కు హాజరవుతున్న అభ్యర్థులు, తల్లిదండ్రులతో పాటు కౌన్సెలింగ్ ప్రక్రియపై అవగాహన పెంపొందించుకోవాలనుకునేవారు ఎవరైనా ఈ వెబినార్‌లో ఉచితంగా పాల్గొనవచ్చు. వెబినార్‌లో భాగస్వాములు కావాలంటే...

20.7.2025 (ఆదివారం) నాడు...

- క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

లేదా

- https://bit.ly/NEET_AP_TG వెబ్‌లింకు ఓపెన్ చేయండి.
- zoom id - 953 5620 4227 passcode - 037253 తో జాయిన్ కావచ్చు.

డిగ్రీలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ప్రవేశాలకు ఆధార్ లింక్‌తో రిజిస్ట్రేషన్ చేయడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. "ఆధార్-మొబైల్ లింకింగ్ కోసం విద్యార్థులు ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ ఆ ప్రక్రియ కనీసం వారం రోజులు పడుతోంది. ఫలితంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు" అని పేర్కొన్నారు.

ఇదీ సంగతి!



మంచి ఆలోచన! ఈ ఆరోగ్యకరమైన ఆహారం వల్ల చర్చలూ ఆరోగ్యకరంగా మారవచ్చేమో!




ఫోన్ చూసే ముందు ఈ ప్రశ్నలు వేసుకోండి

సాంకేతికత మీ అవసరాలు తీర్చే సాధనమా లేక అది మీకు వ్యసనమా అన్నది విశ్లేషించుకోండి. అవసరానికి ఫోన్ వాడుతున్నారా లేక ఫోన్ చేతిలో ఉంది కాబట్టి దానితోనే కాలక్షేపం చేస్తున్నారా? మీ ఆనందకర క్షణాలను, అభిప్రాయాలను స్నేహితులతో పంచుకోవడానికి మాత్రమే సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నారా లేక సోషల్ మీడియా అందుబాటులో ఉంది కాబట్టి గంటల తరబడి అందులో గడుపుతున్నారా?
ప్రతి ఒక్కరూ ఈ ప్రశ్నలు వేసుకోవడం అత్యవసరం.
– బ్రాడ్ స్టుల్‌బర్గ్, రచయిత

ప్రభుత్వ పాఠశాలల ముందు 'ప్రవేశాలు లేవు' బోర్డులు రావాలి

- నాణ్యమైన విద్య అందిస్తున్నామని తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించాలి: లోకేశ్
- పెనమలూరు జడ్పీ హెచ్‌ఎం దుర్గాభవానిని సన్మానించిన మంత్రి



ఉండవల్లి నివాసంలో పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గా భవానిని 'షైనింగ్ టీచర్' పేరుతో సత్కరిస్తున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం ద్వారా ప్రవేశాలు పెంచడమే తమ లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కృష్ణా జిల్లా పెనమలూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అద్భుత ఫలితాలు సాధించిన ప్రధానోపాధ్యాయురాలు యలమంచిలి దుర్గాభవానిని 'షైనింగ్ టీచర్' పేరుతో ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మా లక్ష్యం ఒక్కటే! వచ్చే నాలుగేళ్లల్లో ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గాలి. ప్రభుత్వ బడుల్లో పెరగాలి. ప్రభుత్వ పాఠశాలల ముందు 'ప్రవేశాలు లేవు' అనే బోర్డులు ఉండాలి. అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య అందిస్తారని తల్లిదండ్రులు నమ్ముతారు. మనం నిజంగా విజయం సాధించిన వారమవుతాం. ఇందుకోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు ఉపాధ్యాయులను నేరుగా కలవాలని నిర్ణయం తీసుకున్నాం. వచ్చే నాలుగేళ్ల విద్యార్థుల అభ్యసనఫలితాలపై దృష్టిసారిస్తాం" అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రధాన ఉపాధ్యాయురాలు దుర్గాభవాని నుంచి మంత్రి ఈ సందర్భంగా సలహాలు, సూచనలు తీసుకున్నారు. అద్భుత పనితీరుతో ఉపాధ్యాయులందరికీ ఆదర్శంగా నిలిచారని ఆమెను ప్రశంసించారు.

54 మందికి 500కు పైగా మార్కులు

పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా ఐదేళ్ల పని చేసిన దుర్గాభవాని వృత్తి పట్ల నిబద్ధత చూపి విద్యార్థులను సమున్నతంగా తీర్చిదిద్దారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 54 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశాలు పొందారు. రాష్ట్రంలో మొదటిసారి ప్రభుత్వ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఈవెంట్ నిర్వహించారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ ద్వారా వాల్ ఆర్ట్స్, డ్యాన్స్ మ్యూజిక్ తరగతులు, కంప్యూటర్ శిక్షణ అందించారు. ఈ పాఠశాల వినూత్న ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచింది. అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు వారే వినూత్న పరిష్కారాలు కనుగొంటున్నారు. తడిచిన ధాన్యం ఆరబోసే యంత్రంతో పాటు పాఠశాలలో చెత్తను శుభ్రం చేసేందుకు పాత వస్తువుల నుంచి బ్లోయర్ తయారీ, ఆల్కహాల్ సెన్సింగ్ హెల్మెట్ వంటివి ఇక్కడి విద్యార్థులు రూపొందించారు.



రింగ్ రోడ్డులోని క్యూలైన్‌లో భక్తులు

తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. రోజూ కంపార్ట్‌మెంట్లు నిండిపోయి రింగ్ రోడ్డు వరకు భక్తులు క్యూలైన్‌లో వేచి ఉంటున్నారు. గత నెలలోనూ సాధారణం కంటే అధికంగా పది వేల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ నెలలోనూ సాధారణ రోజుల్లో సైతం భక్తుల రద్దీ ఉంటోంది. శుక్రవారం వారాంతం ప్రారంభం కావడంతో భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నారాయణగిరి షెడ్లు నిండిపోయి శిలాతోరణం వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీరికి దాదాపు 16గంటల్లో, రూ.300 టికెట్ల భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. క్యూలైన్‌లోని భక్తులకు శ్రీవారి సేవకుల ద్వారా అన్నప్రసాదం, పాలు, తాగునీరు అందిస్తున్నారు. గురువారం శ్రీవారిని 63,897 మంది దర్శించుకోగా, రూ.3.66 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

తితిదే ఈవో పేరుతో ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా

భక్తులు అప్రమత్తంగా ఉండాలి: తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో శ్యామలరావు పేరుతో ఫేస్‌బుక్‌లో గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ ఖాతా తెరిచారు. డబ్బు ఇవ్వాలంటూ ఆ నకిలీ ఫేస్‌బుక్ ఖాతా నుంచి భక్తులకు సందేశాలు పంపుతున్న విషయం తితిదే దృష్టికి వచ్చింది. ఇది పూర్తిగా మోసగాళ్ల చర్యగా గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. భక్తులు నకిలీ ఖాతాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి సందేశాలు వస్తే తితిదే విజిలెన్స్ విభాగం సెల్ నంబరు 98668 98630 లేదా టోల్‌ఫ్రీ నంబరు 18004254141కు ఫోన్ చేయాలని కోరారు. భక్తులు తితిదే అధికారిక వెబ్‌సైట్ www.tirumala.org లేదా సోషల్ మీడియా అధికారిక ఖాతాల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని విజ్ఞప్తి చేశారు.

గోదావరి మిగులు జలాలపై జగన్‌కు అవగాహన లేదు

- 45.72 మీటర్ల ఎత్తులోనే పోలవరం నిర్మాణం
- జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు. చిత్రంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: 'గోదావరి నుంచి సముద్రంలో కలిసే వరద నీటిలో 200 టీఎంసీలు తరలించాలనే ఆలోచనతోనే సీఎం చంద్రబాబు పోలవరం- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును ప్రతిపాదించారు. జగన్‌కు అవగాహన లేకుండా పొరుగు రాష్ట్రానికి మేలు జరిగేలా గోదావరిలో మిగులు జలాలు లేవని మాట్లాడుతున్నారు. ఈ ప్రాజెక్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ప్రైవేటు వ్యక్తులను కూడా భాగస్వాములను చేస్తాం' అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తుతో 2027 డిసెంబరు కల్లా పూర్తి చేస్తామన్నారు. శుక్రవారం ఆయన విశాఖ జిల్లా భీమిలిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. 'పోలవరం ప్రాజెక్టు ఎత్తుపై జగన్ తరచూ రాజకీయం చేస్తున్నారు. 2025 డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ పూర్తి చేస్తాం. 45.72 మీటర్ల ఎత్తులో నిర్మాణం పూర్తిచేసి 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేస్తాం. ఈ ఏడాది ఎడమ కాలువ ద్వారా నీటిని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం. 2027 డిసెంబరు నాటికి ఉత్తరాంధ్ర, రాయలసీమకు గోదావరి జలాలు తీసుకొస్తాం. వెలిగొండ ప్రాజెక్టును 2026కు పూర్తిచేసి ప్రకాశం జిల్లాకు అండగా నిలుస్తాం. హంద్రీ-నీవా ప్రాజెక్టును జగన్ నిలిపివేస్తే చంద్రబాబు పూర్తి చేసి రాయలసీమకు నీటిని అందించారు. ఉత్తరాంధ్రకు సుజల స్రవంతిని తీసుకొస్తాం. వంశధార-నాగావళి, నాగావళి-చంపావతి నదులను అనుసంధానం చేసి కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. జగన్‌కు తలకాయలు అయినా, మామిడి కాయలైనా ఒక్కటే, తొక్కించుకుంటూ పోతున్నారు. ప్రతిపక్ష హోదాలేని ఆయన రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు' అని మండిపడ్డారు.

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు క్షమాపణ చెప్పిన 'మెటా'

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: నటి బి.సరోజాదేవి మృతికి నివాళి అర్పిస్తూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఫేస్‌బుక్‌లో పెట్టిన కన్నడ సందేశాన్ని గూగుల్ ఆంగ్లంలో చేసిన అనువాదంలో దొర్లిన పొరపాటును మెటా సంస్థ అంగీకరించింది. తప్పును సరిచేసి, సిద్ధరామయ్యకు బేషరతుగా క్షమాపణలు చెబుతున్నట్లు ప్రకటించింది. 'కన్నుమూసిన సరోజాదేవికి నివాళి అర్పిస్తున్నాను..' అని కన్నడలో పెట్టిన సందేశానికి ముఖ్యమంత్రి కన్నుమూసినట్లుగా గూగుల్ ఆటో-ట్రాన్స్‌లేట్ టూల్ అర్థం చేసుకుంది. దీనిపై కన్నడిగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ అసంబద్ధమైన అనువాదానికి కారణమైన సమస్యను మేం పరిష్కరించాం. ఇలా జరిగినందుకు క్షమాపణలు కోరుతున్నాం' అని మెటా ప్రతినిధి స్పందించారు. సామాజిక మాధ్యమాల ప్లాట్‌ఫామ్‌లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అధికారిక కమ్యూనికేషన్ విషయంలో మరింత జాగ్రత్తలు అవసరమని సీఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు. కచ్చితత్వం వచ్చేంత వరకు కన్నడలోకి అనువదించే ఆటో-ట్రాన్స్‌లేషన్ ఫీచర్‌ను తాత్కాలికంగా నిలిపివేయాలని కర్ణాటక ప్రభుత్వం మెటాను కోరింది.

ఆమెతో మాట్లాడాలి.. నన్ను కలవనీయండి!

రష్యా మహిళను కలిసేందుకు ప్రియుడు విఫలయత్నం



డ్రోర్ గోల్డ్ స్టైనిన్

తుమకూరు, బెంగళూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉత్తర కర్ణాటక జిల్లా గోకర్ణ పరిధి రామతీర్థ అటవీ విభాగంలోని గుహలో రహస్యంగా జీవించిన రష్యా మహిళ నీనా కుటినా, ఆమె ఇద్దరు కుమార్తెలను తుమకూరు సమీపంలోని సంరక్షణ కేంద్రం(డిటెన్షన్ సెంటర్)లో ఉంచగా.. వారిని కలిసేందుకు నీనా ప్రియుడు డ్రోర్ గోల్డ్ స్టైనిన్ (38) విఫలయత్నం చేశారు. నీనాతో సహజీవనం చేసిన ఆయన ఇజ్రాయెల్ నుంచి గురువారమే బెంగళూరుకు వచ్చారు. శుక్రవారం తుమకూరు తాలూకాలోని ఫారినర్ డిటెన్షన్ సెంటర్‌లో నీనా, ఆమె కుమార్తెలను చూసేందుకు ప్రయత్నించగా.. నిబంధనల మేరకు అక్కడి అధికారులు నిరాకరించారు. దాంతో కిటికీలో నుంచి కనిపిస్తున్న ఆమెను సైగలతోనే డ్రోర్ పలకరించారు. అనంతరం డ్రోర్ మాట్లాడుతూ.. 'నీనా, నేను తొమ్మిదేళ్లుగా సహజీవనం చేస్తున్నాం. నీనా, పిల్లలతో తీసుకున్న పలు ఫొటోలూ నా దగ్గర ఉన్నాయి. పిల్లలను చదివించడానికి నేను సిద్ధమే. వారి కోసం ఎన్నో బహుమతులు తెచ్చా. అందులో దుస్తులూ ఉన్నాయి. వారికివ్వాలి. వారి యోగక్షేమాలు తెలుసుకోవాలి' అని పేర్కొన్నారు. అయితే వారుంటున్న కేంద్రం లోపలికి వెళ్లి మాట్లాడేందుకు తనను అధికారులు అనుమతించలేదని డ్రోర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఆమెతో మాట్లాడేందుకు కుదరదని అక్కడి సిబ్బంది స్పష్టం చేశారు. దాంతో విధిలేని పరిస్థితుల్లో డ్రోర్ బెంగళూరుకు తిరిగి వెళ్లారు. ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని మళ్లీ వస్తానని చెప్పారు.

24న స్వర్ణభారతి ట్రస్ట్‌లో ఆంగ్రూ స్నాతకోత్సవం

గుంటూరు(జిల్లాపరిషత్), న్యూస్‌టుడే: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవం ఈ నెల 24న విజయవాడకు సమీపంలోని ఆత్కూరు స్వర్ణభారతి ట్రస్ట్‌లో జరగనుందని వర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాపట్లలో నిర్వహించాల్సిన స్నాతకోత్సవాన్ని స్వర్ణభారతి ట్రస్ట్‌కు మార్చినట్లు వెల్లడించారు. విద్యార్థులు, ఆహ్వానితులు మార్పును గమనించి స్వర్ణభారతి ట్రస్ట్‌లో జరిగే స్నాతకోత్సవానికి హాజరు కావాలని కోరారు. వర్సిటీ గౌరవ కులపతి, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ విద్యార్థులకు పట్టాలు అందజేస్తారని వివరించారు.

ఏఎన్‌యూ విద్యార్థికి అమెరికా పురస్కారం



కృష్ణమూర్తిని అభినందిస్తున్న గంగాధర్ తదితరులు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగంలో డిప్లొమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సు చేసిన విద్యార్థి పోలిబోయిన కృష్ణమూర్తికి అమెరికా పురస్కారం లభించింది. ప్రఖ్యాత 'ఇమేజ్ కొలీగ్ సొసైటీ' నిర్వహించిన పోటీలకు.. ఒడిశా మారుమూల ప్రాంతంలోని బోండా గిరిజనుల జీవనశైలిపై తాను తీసిన ఫొటోలను కృష్ణమూర్తి పంపించారు. ఆ చిత్రాలు తుది పోటీలో నిలిచి 'హానర్ ఆఫ్ అసోసియేషన్' పురస్కారానికి ఎంపికైనట్లు ఆ సంస్థ ఛైర్మన్ టో నీలి తాజాగా ఈ మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ వీసీ ఆచార్య గంగాధర్.. కృష్ణమూర్తిని శుక్రవారం అభినందించారు.

నెల్లూరు జిల్లాలో ఓఎన్‌జీసీ చమురు అన్వేషణ

లింగసముద్రం, న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలంలో చమురు, సహజ వాయువు నిక్షేపాల కోసం ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) అన్వేషణ చేపట్టింది. రెండు రోజుల నుంచి మండలంలోని రాళ్లపాడు, చీమలపెంట, కొండాపురం మండలం కొత్తపేట ప్రాంతాల్లో సిబ్బంది 150 అడుగుల లోతు వరకు బోరు పాయింట్లు వేస్తున్నారు. పరిశోధన కోసం మరికొన్ని బృందాలు రానున్నట్లు చెబుతున్నారు. తనిఖీలు పూర్తయ్యాక నివేదికను ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులకు నివేదించనున్నారు.

ఈనాడు

సభాసమయం సద్వినియోగం కావాలి!

పార్లమెంట్‌లో అధికారపక్షం, విపక్షం నిర్మాణాత్మక చర్చలు జరుపుతూ; తమ నిత్యజీవిత సమస్యలకు పరిష్కారం చూపించాలని ప్రజలు ఆశిస్తారు. అందుకోసమే తమ ప్రతినిధులను వారు చట్టసభలకు పంపుతారు. ఆ మేరకు జనం ఆకాంక్షలు నెరవేరాలంటే- రాజకీయ విభేదాలకు అతీతంగా రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు దేశ విశాల ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడాలి. జనజీవన ప్రమాణాల పెంపే లక్ష్యంగా సభాసమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సర్కారు ప్రతిపాదించే బిల్లుల బాగోగులను తరచిచూస్తూ, వాటిపై తమ అభిప్రాయాలను నిర్భయంగా, నిష్పక్షపాతంగా వెల్లడించాలి. శాసన నిర్మాణ క్రతువులో ఎంపీలందరూ అలా చురుగ్గా భాగస్వాములైతేనే సరైన చట్టాలు రూపుదిద్దుకుంటాయి. ప్రభుత్వం, ప్రతిపక్షం పట్టువిడుపులతో పరస్పర సహకార ధోరణిలో వ్యవహరిస్తేనే ఎల్లుండి నుంచి ఆరంభమవుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఫలవంతమవుతాయి. విపక్షం లేవనెత్తే ప్రజోపయోగ అంశాలను చర్చకు స్వీకరించడంలో, ప్రశ్నలకు సూటిగా స్పష్టంగా సమాధానాలు ఇవ్వడంలో అధికారపక్షం రాజనీతిజ్ఞత కనబరచాలి. పిడివాదనలు, పసలేని విమర్శలతో భేటీలను అడ్డుకోకుండా ప్రతిపక్షం సంయమనంతో మెలగాలి. అప్పుడే ప్రజాస్వామ్య దేవాలయంగా పార్లమెంట్ ప్రతిష్ఠ తేజరిల్లుతుంది!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న సుంకాల సమరానికి ప్రతిగా అరుదైన లోహాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించింది. పాశ్చాత్య దేశాలకే కాదు, ఇండియా వంటి ఇతర దిగుమతిదారులకూ అది సమస్యాత్మకమైంది. ఆధునిక ఆర్థిక వ్యవస్థకు మూలాధారాలైన క్రిటికల్ మినరల్స్‌పై బీజింగ్ గుత్తాధిపత్యాన్ని తప్పించి, సరఫరా గొలుసులను సురక్షితం చేసుకునేందుకు భారత్ సహా పలు దేశాలు ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగా విదేశాల్లోనూ అరుదైన లోహాల అన్వేషణకు వీలుకల్పించే 'గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ)' సవరణ బిల్లు తాజా భేటీలలో పార్లమెంట్ ముందుకు రానుంది. సులభతర వాణిజ్యానికి అవసరమైన రెండో విడత సంస్కరణలతో రూపొందించిన 'జన్‌విశ్వాస్' బిల్లునూ ప్రభుత్వం ప్రవేశపెట్టబోతోంది. క్రీడాపాలనలో జవాబుదారీతనాన్ని, పారదర్శకతను పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుతోపాటు ఇంకొన్ని కీలక శాసన ముసాయిదాలకు ఆమోదముద్ర వేయించుకునేందుకు సర్కారు సమాయత్తమవుతోంది. పహల్గాం పైశాచికకాండ, ఆపరేషన్ సిందూర్, ఇండో-పాక్ యుద్ధాన్ని తానే ఆపానన్న ట్రంప్ ప్రకటనలు, బిహార్ ఓటర్ల జాబితాల్లో సవరణలకు సంబంధించి ప్రభుత్వంపై ప్రశ్నలవర్షం కురిపించాలని ప్రతిపక్షం తలపోస్తోంది. మాటలు కట్టుతప్పి, నిరసనలు వెల్లువెత్తి యథామాములుగా ఈసారీ సభాకాలం హరించుకుపోకూడదని జనభారతం అభిలషిస్తోంది!

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో చట్టసభలు ప్రజావాణిని వినిపించాలన్నది డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ హితవచనం. జీడీపీలో ప్రగతికి సమానంగా వృద్ధి చెందని తలసరి ఆదాయాలు, ఆహార ధాన్యాల దిగుబడులకు దీటుగా పెరగని రైతుల రాబడుల వంటివి పార్లమెంట్‌లో చర్చకొస్తే- సామాన్య జనానికి కాస్తయినా మేలు జరుగుతుంది. యువభారత భవిష్యత్తుకు భరోసానిచ్చేలా చదువులను ప్రక్షాళించడం, ఉపాధివేటలో నెగ్గుకొచ్చేలా నవతరానికి నైపుణ్యాలు మప్పడం, దేశంలో నానాటికీ విశృంఖలమవుతున్న లైంగిక నేరాలను అరికట్టడంపై ప్రజాప్రతినిధులు దృష్టిసారిస్తే యావద్దేశం హర్షిస్తుంది. అమెరికా, జర్మనీ, జపాన్, యూకే, కెనడాల్లో మాదిరిగా మన దేశంలోనూ చట్టసభలు ఏటా సమావేశమయ్యే రోజుల సంఖ్య అధికమైతే- ప్రజాసమస్యలపై గళమెత్తడానికి ప్రజాప్రతినిధులకు ఇతోధికంగా అవకాశాలు లభిస్తాయి. తద్వారా మన ప్రజాస్వామ్యం సమ్మిళితమై, దేశ సమగ్రాభివృద్ధికి దారులు విప్పారుతాయి!

జీవితంలో ఎప్పుడూ మరో ఛాన్స్ ఉంటుందన్న పాఠం చెబుతాయి ఆటలు. ఇవాళ బాగా ఆడకపోయినా, మరో రోజు మన సత్తా చూపించవచ్చన్న ఆశ ఉంటుంది. చేసిన తప్పు నుంచి పాఠం నేర్చుకుని మళ్లీ ఆ తప్పు చేయకుండా ఉంటే ఆటలైనా మరొకటైనా.. విజయం గ్యారంటీ.


– హర్షా భోగ్లే



అనుక్షణం భక్తుల కోసం...

మహావిష్ణువు వైకుంఠంలో, పరమేశ్వరుడు కైలాసంలో నివసిస్తారంటారు కానీ నిజానికి వారి నివాసం భక్తుల హృదయాల్లోనే. మన పురాణాలు ఎన్నో ఉదాహరణలతో భగవంతుడు భక్త ప్రియుడని ప్రబోధిస్తున్నాయి.

అంబరీషుడు మహా భక్తుడు. సర్వ కర్మలను హరి పరం చేసి పాలన సాగించాడు. ఏడాదిపాటు శ్రీహరి గురించి ద్వాదశీవ్రతాన్ని చేశాడు. వ్రతం పూర్తయ్యాక ఉపవాసానంతరం భోజనం చేయడానికి పూనుకున్నాడు. సరిగ్గా ఆ సమయంలో దుర్వాస మహర్షి అతిథిగా వచ్చాడు. మహారాజు ఆయనను భోజనానికి ఆహ్వానించగా, స్నానం చేసి వస్తానని నదికి వెళ్లాడు. మహర్షి రావడం ఆలస్యమైంది. ద్వాదశ ఘడియలు ముగుస్తుండటంతో అతిథికి పెట్టకుండా తాను తినకూడదు కనుక పండితుల సలహాపై శ్రీహరిని స్మరించి నీళ్ల పారాయణం చేస్తాడు. స్నానాదికాలు ముగించుకుని వచ్చిన దుర్వాసుడు తాను రాకుండానే రాజు ఆరగించాడని ఆగ్రహిస్తాడు. తన సిగలోని ఒక జడను సమూలంగా పెరికి దానితో కృత్యను సృష్టించి అంబరీషుడిపై ప్రయోగిస్తాడు. శ్రీహరి తన భక్తుణ్ని రక్షింపదలచి దుర్వాసుడి మాయను ఛేదించమని సుదర్శన చక్రాన్ని ప్రయోగిస్తాడు. అప్పుడా చక్రం ప్రళయంలా వచ్చి కృత్యను కాల్చివేసి ముని వెంట పడుతుంది. భయకంపితుడైన దుర్వాసుడు పరుగు పరుగున లోకాలన్నీ తిరిగి చివరికి వైకుంఠం వెళ్లి శ్రీహరిని శరణు కోరతాడు. భక్తుల ప్రేమ బంధానికి చిక్కిన తాను వారిని వదలిపెట్టనని చెప్పిన శ్రీహరి, వెళ్లి అంబరీషుణ్నే శరణు వేడమంటాడు. దుర్వాసుడు తిరిగి వచ్చి అలాగే చేస్తాడు. అంబరీషుడి ప్రార్థనతో విష్ణుచక్రం మరలిపోతుంది. ఆసక్తికరంగా సాగే అంబరీషోపాఖ్యానం భక్తికి మించిన శక్తి లేదని నిరూపిస్తుంది.



అంతర్యామి

బాణుడు శివ పూజా దురంధరుడు. అతడి కుమార్తె ఉష శ్రీకృష్ణుడి మనవడు అనిరుద్ధుణ్ని ప్రేమించింది. అనిరుద్ధుడు ఉషాదేవి అంతఃపురంలో కొంతకాలం గడిపాడు. ఉష గర్భవతి అవుతుంది. విషయం తెలుసుకున్న బాణాసురుడు అనిరుద్ధుణ్ని నాగపాశంతో బంధిస్తాడు. అతణ్ని విడిపించడానికి శ్రీకృష్ణుడు చతురంగ బలాలతో యుద్ధానికి వస్తాడు. పరమేశ్వరుడు తన భక్తుడైన బాణాసురుడి తరఫున యుద్ధరంగానికి వస్తాడు. ఆ సమయంలో శివ కేశవుల మధ్య భయంకరమైన యుద్ధం జరుగుతుంది. ముల్లోకాలకూ పూజ్యమైన బ్రహ్మాస్త్రాన్ని నిటలాక్షుడు ప్రయోగించగా శ్రీకృష్ణుడు దాన్ని చేత్తోనే తిప్పికొడతాడు. సమ్మోహనాస్త్రం ప్రయోగించి శంకరుణ్ని స్పృహ తప్పించి, బాణాసురుడి వేయి చేతులలో నాలుగింటిని వదిలి మిగిలిన అన్నింటినీ నరికేస్తాడు. పరమేశ్వరుడికి బాణుడంటే పరమ ప్రీతి. ఆ సమయంలో మహాశివుడు పురుష సూక్తంతో శ్రీకృష్ణుణ్ని స్తుతించగా- శివభక్తులలో అగ్రగణ్యుడైన బాణాసురుడు జరామరణాది భయాలు లేకుండా జీవిస్తాడని వరమిస్తాడు శ్రీకృష్ణుడు.

మనసా వాచా కర్మణా భగవంతుణ్ని నమ్ముకున్నవారికి ఆపదలు ఎదుర్కొనే శక్తిని ఆయనే అనుగ్రహిస్తాడు. సంసార సముద్రంలో మునిగి తేలుతూ విషయ వాంఛలకు లోబడి బాధపడేవారికి గోవింద గుణ కీర్తనం గట్టు చేర్చే తెప్ప వంటిదని భాగవతం బోధిస్తోంది.

– ఇంద్రగంటి నరసింహ మూర్తి

లెక్కలోకి రాని రెక్కల కష్టం!

అమ్మాయిగా పుడితే... ఇంటి పనుల్లో అమ్మకు సాయం చేయాల్సిందే. అమ్మాయికి శ్రీమతి హోదా వస్తే... బండెడు బరువు బాధ్యతలను మోయాల్సిందే. ఉద్యోగి హోదాలో ఉన్నా, గృహిణి అవతారమెత్తినా... ఇంటి పనులన్నీ నెత్తిన వేసుకోవాల్సిందే. ఇంతా చేసినా, ఇదంతా చెల్లింపులు లేని శ్రమే. గుర్తింపు దక్కని కష్టమే. ఎందుకీ అసమానత? 'ఆమె' రెక్కల కష్టం లెక్కలోకి రాదా?

మహిళల శ్రమ చెల్లింపులేని సేవగానే మిగిలిపోతోంది. ఈ విషయం కేంద్ర గణాంక, కార్యక్రమ అమలు శాఖ నిర్వహించిన తాజా 'టైమ్ యూజ్' సర్వేలో మరోసారి స్పష్టమైంది. ఈ అధ్యయనంలో దాదాపు లక్షా నలభై వేల ఇళ్లను పరిగణనలోకి తీసుకోగా చెల్లింపులేని సేవలు, పనుల్లో ఆడవారిదే అగ్రస్థానమని వెల్లడైంది. వంటపని, పిల్లల పెంపకం, పెద్దల సంరక్షణ, క్లీనింగ్ వంటివన్నీ మహిళల పనులే. నిరుడు వారు ప్రతిరోజూ దాదాపు అయిదు గంటలు ఇంటి పనిలో గడిపితే, పురుషులు అందుకు కేటాయించిన సమయం కేవలం 88 నిమిషాలేనని తేలింది. వేతనం లేని ఇంటి పనుల్లో 15-59 ఏళ్ల వయసు మహిళల వాటా ఎక్కువగా ఉంటోంది. పట్టణ మహిళలతో పోలిస్తే, గ్రామీణ ప్రాంత ఆడవారు ఇంటి పనులకు కేటాయించాల్సి వస్తున్న సమయం ఇంకా అధికం. నీళ్లు తేవడం, కట్టెలు సేకరించడం వంటివి వాళ్లకు అదనపు పనులు. ఇదంతా లెక్కకు అందని కష్టంగానే మిగిలిపోతుండటం విచారకరం!



శ్రమ విలువెంత?

నిరుడు శ్రామికశక్తిలో స్త్రీల వాటా 41.7శాతానికి చేరినప్పటికీ, కష్టానికి తగిన ప్రతిఫలం దక్కే సమయం మాత్రం ఆరు నిమిషాలే పెరిగినట్లు తెలుస్తోంది. 2023నాటి ఎస్‌బీఐ-ఎకోర్యాప్ నివేదిక ప్రకారం, చెల్లింపులు లేని మొత్తం శ్రమ విలువ సుమారు రూ.22.7లక్షల కోట్లు. ఇందులో గ్రామీణ ప్రాంతాల వాటా రూ.14.7లక్షల కోట్లు కాగా, పట్టణాలది ఎనిమిది లక్షల కోట్ల రూపాయలు. ఇది దేశ జీడీపీలో దాదాపు 7.5శాతమని ఆ నివేదిక విశ్లేషించింది. వాస్తవంలో ఈ మొత్తం ఇంకా ఎక్కువగానే ఉండొచ్చన్నది ఇతర సర్వేల అంచనా. మొత్తమ్మీద మహిళల శ్రమకు సరైన 'లెక్క' లేదన్నది నిజం. మహిళలు కుటుంబం కోసం కేటాయించే సమయంలో పురుషులు ఉద్యోగాలు, ఉపాధికి సంబంధించిన పనులు చేస్తున్నారు. ప్రతిఫలంగా ఆదాయాన్నీ పొందుతున్నారు. దాంతో చాలా కుటుంబాల్లో వారి మాటే చెల్లుతోంది. లింగ వివక్ష బలంగా ఉండటం వల్లే గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్ ప్రకారం- 148 దేశాల్లో ఇండియా 131వ స్థానానికి పరిమితమైంది. ఇది లింగ సమానత్వంలో మనమెంత వెనకున్నామనేది సూచిస్తోంది. ఈ అంతరాన్ని గణనీయంగా తగ్గించినప్పుడే ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం పెరుగుతుందని మెకిన్సీ నివేదిక చెబుతోంది. అప్పుడు జీడీపీలో స్త్రీల వాటా ఏకంగా 30శాతానికి పెరిగే అవకాశం ఉంటుందని అంచనా.


లోపం ఎక్కడుంది?

ఇంటిపనీ వంటపనే కాదు; పిల్లలు, పెద్దల సంరక్షణతో పాటు సామాజిక కట్టుబాట్లు, పని ప్రదేశాల్లో సరైన సదుపాయాలు లేకపోవడం, చేస్తున్న పనికి సరైన వేతనం లేకపోవడం వంటి ఎన్నో కారణాలతో మహిళలు నాలుగ్గోడలకే పరిమితం అవుతున్నారు. పైగా ఇంటిపని ఒత్తిడి వల్ల స్త్రీలు మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలనూ ఎదుర్కొంటున్నారు. వాటిని విస్మరించడం వల్ల దీర్ఘకాలంలో తీవ్రమైన కుంగుబాటుకు లోనవుతున్నారని అనేక సర్వేలు చెబుతున్నాయి. మరోవైపు, తమకు తెలియకుండానే పితృస్వామ్య వ్యవస్థకు మహిళలే సమర్థకులు అవుతున్నారన్న విమర్శలున్నాయి. సాంకేతికంగా ఎంత ముందడుగు వేస్తున్నా, వీళ్ల ఆలోచన తీరులో మార్పు రాకపోవడమే సమస్యగా మారుతోంది. కొడుకు, కోడలు ఇద్దరూ ఉద్యోగాలు చేయాలి. ఇంటిపని మాత్రం కొడుకు చేయకూడదు. అదంతా కోడలి బాధ్యతే అని భావించే మహిళల సంఖ్య ఇప్పటికీ తక్కువేమీ కాదు. చాలామంది అత్తలు ఒకప్పుడు అలాంటి పరిస్థితిని దాటేసి వచ్చినా, కోడలి విషయానికి వచ్చేసరికి వారి వైఖరిలో మార్పు ఉండటం లేదు. పిల్లల సంరక్షణకు ఇంట్లో ఎవరూ లేకపోతే ముందుగా ఉద్యోగం మానేయాల్సింది మహిళలే. అలా చదువుకున్న అమ్మాయిల్లో ఎంతోమంది ఇళ్లలోనే ఉండిపోవాల్సి వస్తోంది.

ఆలోచనల్లో మార్పు రావాలి

పురుషులతో పోలిస్తే మహిళల్లో మల్టీటాస్కింగ్ నైపుణ్యం అధికం. వారు ఏకకాలంలో ఎన్నో పనులను సమర్థంగా చక్కబెట్టగలరు. అలాంటి సామర్థ్యాలు ఎన్ని ఉన్నా, మహిళలు ఎక్కువ సమయం వంటింటికే కేటాయించాల్సి రావడంతో ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కాలేకపోతున్నారు. ఫలితంగా దేశ జనాభాలో 48శాతంగా ఉన్నప్పటికీ, జీడీపీలో మహిళల వాటా 18శాతానికే పరిమితమవుతోంది. ప్రపంచ సగటుతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఆర్థిక ప్రస్థానంలో మహిళలకూ సమాన అవకాశాలు కల్పిస్తే, మన జీడీపీ భారీగా పెరుగుతుందని ఎప్పటినుంచో అధ్యయనాలు మొత్తుకుంటున్నాయి. ఇదంతా సుసాధ్యం కావాలంటే- ముందు మహిళల ఆలోచనా విధానంలో మార్పు రావాలి. వంటపని త్వరగా పూర్తయ్యేలా చూసుకుంటూ సమయాన్ని ఆదా చేసుకోవాలి. ఎందుకంటే, నేటికీ సగటు భారతీయ మహిళ వారానికి 13.5 గంటలకు పైగా వంటగదిలోనే గడుపుతోంది. అంతర్జాతీయ సగటు ఆరు గంటలకన్నా ఇది రెట్టింపు సమయం. కాబట్టి, ఇంటి పనుల్ని మరింత సమర్థంగా చక్కబెట్టడంపై దృష్టి పెట్టాలి. మరీ ముఖ్యంగా కుటుంబ సభ్యుల మధ్య పని విభజన జరగాలి. ఉన్నతస్థాయి హోదాల్లో ఉండే మహిళలు ఇలాంటి మెరుగైన పద్ధతులను ఆచరించడం వల్లే వారి కెరియర్‌లో ఎదుగుదల సాధ్యమైందన్న సంగతిని గుర్తించాలి. ఈ విషయంలో మగవాళ్లూ తమ వంతుగా సహకరించాలి. పిల్లల సంరక్షణలో, ఇంటి పనుల్లో పురుషులు సాయం చేస్తే మహిళలు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోగలుగుతారు. అది కుటుంబానికీ ఉపయుక్తమే. సమయాన్ని సరైన రీతిలో వినియోగించుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికీ తోడ్పడవచ్చు.

– చెరుకూరి శాంతిశ్రీ



రూపాయితో మొదలై...

స్వీపరుగా చేరి బ్యాంకు చీఫ్ మేనేజర్ అయ్యారని ఎవరి గురించైనా చెబితే... సినిమా కథలు చెప్పొద్దు అంటారు కదా! సినిమాల్లో, కథల్లో తప్ప అలాంటివి నిజంగా జరగవని మనలో చాలామందికి గట్టి నమ్మకం. దాన్ని పటాపంచలు చేసే జీవిత కథ ఇది.

కావలికి చెందిన పద్దెనిమిదేళ్ల షేక్ రసూల్ 1983లో రోజుకు రూపాయి వేతనంపై నెల్లూరులోని పినాకిని గ్రామీణ బ్యాంకులో అటెండర్‌గా చేరారు. బ్యాంకు ఊడ్చి, తుడవడం, ఉద్యోగులు చెప్పిన పనులన్నీ చేయడం అతడి బాధ్యతలు. అప్పటికి సంక్షేమ హాస్టల్లో చదువుకుని పదో తరగతి పాసైన రసూల్ చిన్న చిన్న పనులు చేస్తూ తండ్రికి చేదోడుగా ఉండేవారు. అప్పుడే అటెండరు ఉద్యోగం గురించి తెలిసి, చేరారు. ఏడాది తిరిగేసరికి బ్యాంకు ఉద్యోగాల భర్తీ ప్రకటన వచ్చింది. క్లర్క్ కం క్యాషియర్ పోస్టుకు కనీస అర్హత పదో తరగతే. వెంటనే దరఖాస్తు చేశారు రసూల్. బ్యాంకు ఉద్యోగుల శిక్షణ, సూచనల సాయంతో పరీక్ష పాసై పర్మనెంట్ ఉద్యోగిగా చేరిపోయారు. రసూల్ జీవితంలో అదొక అద్భుత సన్నివేశం. ఫ్యాను కింద కుర్చీలో కూర్చుని చేసే ఉద్యోగం... ఆయన ఊహకందనిదే. ఆ ఉద్యోగం ఆయన కుటుంబ పరిస్థితులనే మార్చివేసింది. తండ్రికి అండగా నిలిచి తోబుట్టువులను చదివించగలిగారు.

మరోపక్క పదోన్నతికి వచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోలేదు. ప్రైవేటుగా బి.ఎ. చదివారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకర్స్ నిర్వహించే కోర్సును పూర్తిచేశారు. అంచెలంచెలుగా ఎదుగుతూ జనవరి 2025లో రిటైర్ అయ్యే నాటికి చీఫ్ మేనేజర్ హోదాలో రెండున్నర లక్షల జీతం తీసుకున్నారు. గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు అందుకునే అత్యున్నత పొజిషన్ అది! ఆయన 41 ఏళ్ల సుదీర్ఘ సర్వీసు కూడా ఆ బ్యాంకు చరిత్రలో ఓ రికార్డే. రసూల్ దంపతులకు ఇద్దరు పిల్లలు. ఒకరు ఈ-కామర్స్ సంస్థలో, మరొకరు ప్రభుత్వ వైద్యుడిగా పనిచేస్తున్నారు.

కెరీర్ ప్రారంభంలో ఉన్న యువతకు ఎటూ పాలుపోని సందర్భాలు ఎదురవుతుంటాయి. నిజానికి అలాంటివారు పర్సనాలిటీ డెవలప్‌మెంటనీ, కెరీర్ గైడెన్సనీ కోర్సులు చేయనక్కర లేదు, సక్సెస్ మంత్రాల కోసం, స్ఫూర్తినిచ్చేవారి కోసం ఎక్కడెక్కడో వెతకనక్కరలేదు. రసూల్ లాంటి విజేతలు మన చుట్టూనే ఎందరో ఉంటారు. సామాన్యుల్లోని ఆ అసామాన్యుల్ని గుర్తించి వారి నుంచి నేర్చుకోగలిగితే చాలు. అలా రసూల్ జీవితం ఒకటి కాదు, చాలా పాఠాలే చెబుతుంది. ఏ పనీ చిన్నది కాదు, ఒక ఉద్యోగంలో చేరితే అక్కడే ఆగిపోవాల్సిన అవసరమూ లేదు. అవకాశాలను అందిపుచ్చుకోవాలి, నిరంతరం మనల్ని మనం మెరుగుపరచుకుంటూ ముందుకు సాగాలి. అలాంటివారిని విజయం వెతుక్కుంటూ వస్తుందనడానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలి?

– బద్రి నర్సన్

మరిన్ని కోర్టులు...

దేశంలో కొంతకాలంగా కుటుంబ వివాదాలు, విడాకులు పెరుగుతున్నాయి. ఇండియాలో ప్రస్తుతం 914 ఫ్యామిలీ కోర్టులు పనిచేస్తున్నాయి. ఆస్తి, భరణం, పిల్లల కస్టడీ తదితరాలను త్వరగా పరిష్కరించడానికి వీటి సంఖ్య మరింతగా పెరగాల్సి ఉంది. అరుణాచల్ ప్రదేశ్, మిజోరం, మేఘాలయ, గోవా, చండీగఢ్, దాద్రా నగర్ హవేలీ, దమన్ దయ్యూ, లక్షద్వీప్‌లలో అవి ఒక్కటీ లేవు. ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నాటికి ఆయా రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఫ్యామిలీ కోర్టుల సంఖ్య ఎంతంటే...

ఉత్తర్ ప్రదేశ్	189
గుజరాత్	108
మధ్యప్రదేశ్	64
మహారాష్ట్ర	51
రాజస్థాన్	50
కర్ణాటక	41
తమిళనాడు	40
బిహార్	39
కేరళ	37
ఒడిశా	30
ఛత్తీస్‌గఢ్	27
తెలంగాణ	22
ఆంధ్రప్రదేశ్	16
పశ్చిమ్ బెంగాల్	6

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

ముచ్చెమటలు పట్టిస్తున్న ఏసీలు!

ఎయిర్ కండిషనర్లు (ఏసీలు) విద్యుత్తును ఎక్కువగా వాడటంతోపాటు అత్యధిక పరిమాణంలో వేడిని, కర్బన ఉద్గారాలను వాతావరణంలోకి విడుదల చేస్తాయి. దీనివల్ల పర్యావరణానికి హాని కలుగుతుంది. పెరిగే కరెంటు బిల్లులతో వినియోగదారులపై ఆర్థిక భారం పడుతుంది. ఈ నేపథ్యంలో ఏసీల ఉష్ణోగ్రత స్థాయులపై పరిమితులు విధిస్తే పర్యావరణానికి, వినియోగదారులకు మేలు జరుగుతుందని, విద్యుత్ డిమాండ్ తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఉత్పత్తి దశలోనే ఏసీల ఉష్ణోగ్రత స్థాయులు 20-28 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉండేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని మార్చాలని తయారీ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతోంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ విడుదల చేసింది. వీటిని త్వరలోనే అమలు చేస్తామని కేంద్ర విద్యుత్ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఇటీవల ప్రకటించారు.



వాతావరణ మార్పులతో రుతువులు గతి తప్పుతున్నాయి. అన్ని సీజన్లలో ఎండలు మండిపోతున్నాయి. నగరాలు ఉష్ణ ద్వీపాలుగా మారుతున్నాయి. ఫలితంగా ఇళ్లు, కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో ఏసీల వాడకం పెరుగుతోంది. విద్యుత్తుకు డిమాండ్ అధికమవుతోంది. ఈ క్రమంలో ఏసీల ఉష్ణోగ్రత స్థాయులపై పరిమితులు విధించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

పెరగనున్న గిరాకీ

సాధారణంగా ఏసీ యంత్రాల్లో 16 నుంచి 30 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రత స్థాయులు ఉంటాయి. 16-20 డిగ్రీల సెల్సియస్‌ల మధ్య ఉష్ణోగ్రత స్థాయులు అధిక చల్లదనాన్ని ఇస్తాయి. అయితే ఈ స్థాయిలో పని చేసినప్పుడు ఏసీలు ఎక్కువ కరెంటును వినియోగిస్తాయి. అత్యధిక పరిమాణంలో కర్బన ఉద్గారాలనూ వెలువరిస్తాయి. ఏసీ ఉష్ణోగ్రతలను 24 డిగ్రీల సెల్సియస్ దగ్గర సెట్ చేస్తే ఏడాదికి 20 బిలియన్ యూనిట్ల విద్యుత్తుతోపాటు, పది వేలకోట్ల రూపాయల దాకా ఆదా అవుతాయి. కర్బన ఉద్గారాలు ఏడాదికి 82 లక్షల టన్నుల మేర తగ్గే అవకాశం ఉంటుంది. దేశంలో నమోదయ్యే పీక్ పవర్ డిమాండ్‌లో ఏసీల వాటా 20 శాతం దాకా ఉందని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆర్థిక స్థితిగతుల మెరుగుదలతో ఏసీ యంత్రాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. దేశంలో ఏటా దాదాపు 1.4 కోట్ల ఏసీ ఉపకరణాలు అమ్ముడవుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈ విక్రయాలు 2030నాటికి 3 కోట్లకు పెరుగుతాయని అంచనా. పట్టణాల్లో 12.6శాతం, గ్రామాల్లో 1.2శాతం ఏసీలను వినియోగిస్తున్నట్లు సర్వేలో తేలింది. 2050 నాటికి దాదాపు 50శాతం ఇళ్లలో ఏసీలు ఉపయోగిస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ క్రమంలో భవిష్యత్తులో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి ఏసీల ఉష్ణోగ్రత స్థాయుల నియంత్రణ నిబంధనలు కీలకంగా మారతాయి. ఏసీ యంత్రాల్లో 18 డిగ్రీల సెల్సియస్‌కంటే దిగువ ఉష్ణోగ్రతలు అనారోగ్య హేతువని అధ్యయనాలు చాటుతున్నాయి. అల్ప ఉష్ణోగ్రత స్థాయులు అధిక రక్తపోటు, శ్వాస సంబంధిత సమస్యలకు దారితీస్తాయి. 18 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత స్థాయి ఆరోగ్యంగా ఉన్న యువతకు, మధ్య వయస్కులకు మంచిదని నిద్రపై చేసిన అధ్యయనాలు చెబుతున్నాయి. శిశువులు, వయోధికులకు 20 డిగ్రీల సెల్సియస్‌పైన మేలని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. బాగా చల్లగా ఉండే ఇళ్లలో నివసించేవారు తరచుగా కుంగుబాటు, ఆందోళన, ఒత్తిడి వంటి మానసిక వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని యూకేలో చేపట్టిన ఒక అధ్యయనం హెచ్చరిస్తోంది.

సాధారణంగా 23-24 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత స్థాయి అన్ని వయసుల వారికీ అనుకూలంగా, సౌకర్యంగా ఉంటుందని శారీరక, మానసిక ఆరోగ్యంపై ఏసీల ప్రభావాన్ని పరిశీలించిన పరిశోధకులు గుర్తించారు. దీన్ని దృష్టిలో ఉంచుకొనే ప్రభుత్వం ఏసీల నిబంధనలను రూపొందించింది. కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 20, 28 డిగ్రీలుగా ఉండాలని నిబంధనలు వివరిస్తున్నాయి.

నియంత్రణ అవసరమే...

ఇటలీ, స్పెయిన్, గ్రీస్, జపాన్ మొదలైన దేశాలు ఉష్ణోగ్రత స్థాయి నిబంధనల్ని రూపొందించి అమలు చేస్తున్నాయి. ఆయా దేశాలు 27 డిగ్రీల సెల్సియస్‌ను కనీస ఉష్ణోగ్రత స్థాయిగా నిర్ణయించాయి. ఏసీ యంత్రాల్లో సమస్యలు ఉంటే అధిక విద్యుత్ వినియోగానికి, కాలుష్యానికి దారితీస్తాయి. కర్బన ఉద్గారాల నిరోధానికి ఏసీలను తగిన వ్యవధిలో సర్వీసింగ్ చేయిస్తుండాలి. ఉపకరణాలకు సంబంధించి భద్రతా ప్రమాణాలు పాటించడం తప్పనిసరి. దేశంలో ఏసీ సర్వీసింగ్‌కు సుశిక్షితులైన నిపుణ శ్రామికుల కొరత ఉంది. వృత్తి విద్యా శిక్షణ సంస్థల్లో ఏసీ సర్వీసింగ్ కోర్సులు నిర్వహించాలి. ఇది ఉపాధి కల్పనకు తోడ్పడుతుంది. పర్యావరణహిత ఏసీల ఉత్పత్తి సాంకేతికతలను అభివృద్ధి పరచాలి. విద్యుత్ పొదుపు, పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్యం ప్రాధాన్యాంశాలుగా రూపొందించిన ఏసీల ఉష్ణోగ్రత స్థాయి నిబంధనలను స్వాగతించాల్సిందే. ఇవి కర్బన ఉద్గారాల నెట్ జీరో లక్ష్యాన్ని సాధించడంలో కీలక భూమిక నిర్వర్తిస్తాయి. పౌరులు, ప్రభుత్వాల సమష్టి కృషితోనే వీటి అమలు సాధ్యమవుతుంది.



పుల్లూరు సుధాకర్

పట్టణాభివృద్ధి వ్యవహారాల నిపుణులు

పాట మధురం!

హాయ్ ఫ్రెండ్స్..! మనం డాన్స్ చేయడానికి, పాటలు పాడటానికి చాలా ఆసక్తి చూపిస్తుంటాం కదా! కానీ ఓ నేస్తం మాత్రం చాలా భాషల్లో పాటలు పాడుతూ చక్కగా పియానో కూడా వాయిస్తోంది. ఇంతకీ తనెవరో తెలుసుకుందామా!

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన పూరె శ్రీష ఏడో తరగతి చదువుతోంది. అమ్మ స్వాతి గృహిణి.. నాన్న శ్రీనివాస్ డాక్టర్. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని కాన్‌బెర్రాలో ఉంటున్నారు. శ్రీషకు చిన్నప్పటి నుంచే పాటలు పాడటం అన్నా, పియానో వాయించడమన్నా చాలా ఇష్టమట. అందుకే తనకు నచ్చిన.. తెలుగు, హిందీ, కర్ణాటక, తమిళ భాషల్లోని పాటలను ఇంగ్లిష్‌లో రాసుకుని పాడటం ప్రాక్టీస్ చేస్తోంది. కళ్లకు గంతలు కట్టుకుని రెండు పియానోలపై పాటలను అద్భుతంగా వాయిస్తోంది. తనకు నాలుగేళ్లు ఉన్నప్పుడే మొదటి ప్రదర్శన ఇచ్చిందట తెలుసా నేస్తాలూ! ఆస్ట్రేలియాలో ఉండే మన భారతీయులు ఏ రాష్ట్రం వారైనా శ్రీషను ప్రదర్శనలకు ఆహ్వానిస్తుంటారు. తను కూడా చాలా తక్కువ సమయంలో వారి భాషల్లోని పాటలు సాధన చేసి పాడేస్తుంది. అలాగే తన ప్రతిభతో ఆస్ట్రేలియాలోని భారత హైకమిషన్ కార్యాలయంలో జరిగే మన స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల వేడుకల్లో ప్రదర్శనలిచ్చే అవకాశాలను దక్కించుకుంది. గత నాలుగేళ్లుగా అలా శ్రీష తన ప్రతిభను ప్రదర్శిస్తోంది. కళ్లకు గంతలు కట్టుకుని పియానోపై జాతీయగీతం, కొన్ని భక్తి పాటలను శ్రావ్యంగా పలికించడం మన నేస్తం ప్రత్యేకత. ఇంత ప్రజ్ఞాశాలి కాబట్టే ఇప్పటి వరకు 60కి పైగా అవార్డులు సొంతం చేసుకుంది. వచ్చే వారంలో ఓ మ్యూజిక్ అకాడమీ నిర్వహిస్తున్న కార్యక్రమాలలో ప్రదర్శన ఇచ్చేందుకు శ్రీష ఇటీవలే మన దేశానికి వచ్చింది.



హాయ్! బుజ్జీ!!



– నూకల నరేందర్‌రెడ్డి

నేనెవర్ని?

1. నాలుగు అక్షరాల పదాన్ని నేను. 'విల్లు'లో ఉంటాను. కానీ 'హల్లు'లో లేను. 'చాప'లో ఉంటాను కానీ 'చేప'లో లేను. 'అర'లో ఉంటాను కానీ 'అత్త'లో లేను. 'వీణ'లో ఉంటాను కానీ 'వీధి'లో లేను. నేనెవర్ని?
2. నేనో మూడక్షరాల పదాన్ని. 'గొప్ప'లో ఉంటాను కానీ 'కప్ప'లో లేను. 'చెడు'లో ఉంటాను కానీ 'చెల్లి'లో లేను. 'గురువు'లో ఉంటాను కానీ 'అరువు'లో లేను. ఇంతకీ నేనెవరినో తెలిసిందా?

జవాబులు: 1. విచారణ 2. గొడుగు

అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

వాస్తవ వినియోగానికి పనికొస్తుంది' అని పేర్కొన్నారు.

కేంద్ర లక్ష్యంలో మన వాటా అధికం

రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. 'భూ ఉపరితల వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు ప్రపంచ దేశాలు హరిత ఇంధనం వైపు అడుగులు వేస్తున్నాయి. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ తేవాలన్నది కేంద్రం లక్ష్యం. రాష్ట్రంలో సౌర, పవన, పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్రాజెక్టు (పీఎస్‌పీ), ఉత్పత్తుల ఎగుమతులకు పోర్టులు, గ్రీన్ హైడ్రోజన్ తయారీకి అవసరమైన నీరు పుష్కలంగా ఉండటం అనుకూలం. ఈ కారణంగా 160 గిగావాట్ల పునరుత్పాదక ప్రాజెక్టులు ఏర్పాటుకు వీలుగా పాలసీని తీసుకొచ్చాం. దీని ద్వారా రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ ఆలోచన. ఇతర రాష్ట్రాల్లో కొన్ని అంశాల్లో అనుకూలతలు.. కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి' అని విశ్లేషించారు.

లాజిస్టిక్ హబ్‌గా రాష్ట్రం

గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా వంటి ఉత్పత్తులు ఎగుమతి చేసేందుకు మనకు పోర్టు సదుపాయాలు ఉన్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. 'భవిష్యత్తులో ప్రతి 50 కి.మీ.లకు ఒక పోర్టు ఏర్పాటు చేస్తాం. దీంతో లాజిస్టిక్ హబ్‌గా రాష్ట్రం మారుతుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీ, నెడ్‌క్యాప్ భాగస్వామ్యంతో విశాఖపట్నంలో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటవుతోంది. గ్రీన్‌కో, హీరో ఫ్యూచర్స్, ఏఎం గ్రీన్ ఎనర్జీ సంస్థలు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి' అని సీఎం పేర్కొన్నారు.

ఎరువులు పోయి.. అమ్మోనియా వచ్చింది!

'1983లో తెదేపా హయాంలో కాకినాడలో నాగార్జున ఫెర్టిలైజర్స్ ఎరువుల తయారీ యూనిట్ ఏర్పాటుకు అనుమతిచ్చాం. ఇప్పుడు అదే యూనిట్‌ను టేకోవర్ చేసి అమ్మోనియా తయారీ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నట్లు గ్రీన్‌కో తెలిపింది. మార్పు ఎలా ఉంటుందనడానికి ఇదొక నిదర్శనం' అని చంద్రబాబు చెప్పారు.



నీతి ఆయోగ్ సభ్యుడు సారస్వత్‌ను సన్మానిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎస్ఆర్ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రీసెర్చ్) నారాయణరావు, ప్రో ఛాన్సలర్ సత్యనారాయణన్

రూ.51 వేల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు

- కృష్ణపట్నం, మచిలీపట్నంలలో ఏర్పాటు
- 10,500 మందికి ఉపాధి లక్ష్యం
- ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న యమ్మా, జేకేఎస్‌హెచ్ హై ఇన్‌ఫ్రా

ఈనాడు, అమరావతి: గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా తయారీ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో రూ.51 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు యూకేకు చెందిన యమ్మా, పోలండ్‌కు చెందిన జేకేఎస్‌హెచ్ అండ్ హై ఇన్‌ఫ్రా సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా 10,500 మందికి ఉపాధి లభిస్తుందని ప్రతిపాదించాయి. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన గ్రీన్ హైడ్రోజన్ సమిట్‌లో సంస్థ ప్రతినిధులు.. ప్రభుత్వం తరఫున నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్‌బాబు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.

- యమ్మా సంస్థ కృష్ణపట్నంలో రూ.16 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా తయారీ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఏటా మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా తయారీ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. దీని ద్వారా 5,500 మందికి ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొంది. సంస్థ తరఫున గాల్ బోగిన్ ఒప్పందంపై సంతకం చేశారు.
- జేకేఎస్‌హెచ్ అండ్ హై ఇన్‌ఫ్రా సంస్థ మచిలీపట్నంలో రూ.35 వేల కోట్ల పెట్టుబడితో ఏడాదికి 150 కేటీ (కిలో టన్నుల) గ్రీన్ హైడ్రోజన్, 600 కేటీ గ్రీన్ అమ్మోనియా తయారీ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. దీనిద్వారా 5 వేల మందికి ఉపాధి లభిస్తుందని సంస్థ పేర్కొంది. సంస్థ తరఫున ఐ.కె. శ్రీవాత్సవ ఒప్పందంపై సంతకం చేశారు.

భవిష్యత్తు గ్రీన్ హైడ్రోజన్‌దే

- గ్రీన్ హైడ్రోజన్ సమిట్-2025లో వక్తలు

ఈనాడు, అమరావతి: శిలాజ ఇంధన వనరులకు స్వస్తి పలికే సమయం ఆసన్నమైందని.. భవిష్యత్తు గ్రీన్ హైడ్రోజన్‌దేనని పలువురు అభిప్రాయపడ్డారు. రాజధాని అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన గ్రీన్ హైడ్రోజన్ సమిట్-2025లో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ఏడేళ్ల క్రితమే బీజం

– వీకే సారస్వత్, నీతిఆయోగ్ సభ్యులు



గ్రీన్ హైడ్రోజన్ ఆలోచన ఏడేళ్ల క్రితమే మొదలైంది. దాని ఉత్పత్తికి కేంద్రం లక్ష్యాలను నిర్దేశించి, నిధులు కేటాయించింది. ప్రస్తుత విద్యుత్తు ఉత్పత్తి ప్రక్రియలో కర్బన ఉద్గారాలు భారీగా విడుదలవుతున్నందున ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయాలి. 2047కల్లా వంద గిగావాట్ల అణువిద్యుత్తు ఉత్పత్తి చేయాలి. ఇథనాల్, మిథనాల్, అమ్మోనియా, హైడ్రోజన్ ద్వారా ఇంధన తయారీకి ప్రాధాన్యం పెరిగింది. పర్యావరణానికి ఎలాంటి హాని చేయనిది గ్రీన్ హైడ్రోజన్. హైదరాబాద్‌ను సిలికాన్ వ్యాలీగా మార్చిన చంద్రబాబు ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మార్చాలని కోరుతున్నా. హైడ్రోజన్ ఉత్పత్తి, రవాణా, నిల్వ, ఇంధన తయారీకి ఏపీలో మంచి అవకాశాలున్నాయి. పారిశ్రామికవేత్తలకు కొదవ లేదు. అమరావతిలో హైడ్రోజన్ సిలిండర్ల తయారీ, పరీక్షల యూనిట్ ఏర్పాటు చేయొచ్చు.

పెట్టుబడులతో ముందుకు రావాలి

– పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర సహాయ మంత్రి



దేశంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో 20 శాతం మన దగ్గరే తయారు కావాలనేది లక్ష్యం. ఈ ఉత్పత్తిని లాభదాయకంగా చేయొచ్చు. హరిత ఇంధనం తయారీ విషయంలో మనం అగ్రదేశాలతో పోటీపడాలి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున పెట్టుబడులతో ముందుకు రావాలి. 2040 నాటికి భారత్ ప్రపంచంలోనే అత్యధిక విద్యుత్తు వినియోగ దేశంగా మారనుంది. అందుకు తగ్గట్లుగా మనం ఇంధన వనరులు సమకూర్చుకోవాలి.

దేశంలోనే తొలిసారిగా తిరుపతిలో ప్రాజెక్టు

– విజయానంద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

దేశంలోనే తొలిసారిగా పారిశ్రామిక అవసరాల కోసం గ్రీన్ హైడ్రోజన్- ఎల్‌పీజీ కలిపి వినియోగించే ప్రాజెక్టును తిరుపతిలో హీరో ఫ్యూచర్ ఫెసిలిటీస్‌కి చెందిన రాక్‌మెన్ సంస్థ ఏర్పాటు చేస్తోంది. విశాఖ, కాకినాడల్లోనూ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు ఏర్పాటవుతున్నాయి. ఈ రంగంలో పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలు అందిస్తోంది. ప్రభుత్వం, విద్యావ్యవస్థ, పౌరసమాజం మధ్య సమన్వయం ఉంటేనే ఈ రంగంలో మంచి ఫలితాలొస్తాయి. దీనికి ఎస్ఆర్ఎంలో నిర్వహించిన సమిట్ ఒక ఉదాహరణ.

పరిశోధనలకు ఎస్ఆర్ఎం పెద్దపీట

– డాక్టర్ పి.సత్యనారాయణన్, ఎస్ఆర్ఎం ఏపీ ప్రో ఛాన్సలర్

క్లీన్ ఎనర్జీ రంగంలో ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించే లక్ష్యంతో ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీలో ఎనర్జీ ఇంజినీరింగ్ విభాగాన్ని ప్రారంభించాం. గ్రీన్ హైడ్రోజన్‌పై పరిశోధనలకు ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం పెద్దపీట వేస్తుంది. పరిశ్రమలకు సాంకేతిక సాయం అందించేందుకు సిద్ధంగా ఉంది.

హైదరాబాద్- విజయవాడ- విశాఖ మధ్య హైడ్రోజన్ రైల్

– ఆచార్య డి.నారాయణరావు, ఎస్ఆర్ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రీసెర్చ్)

వచ్చే రెండేళ్లలో విజయవాడ- విశాఖపట్నం మధ్య హైడ్రోజన్ పవర్‌తో నడిచే కారు.. మూడేళ్లలో హైదరాబాద్- విశాఖపట్నం మధ్య హైడ్రోజన్ పవర్ రైలును ప్రయోగాత్మకంగా నడిపే దిశగా పరిశోధన చేస్తున్నాం. ఇప్పటికే ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)తో చర్చించాం. ప్రభుత్వ సహకారంతో ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభించనున్నాం.

ఏపీ అనుకూల రాష్ట్రం

– ప్రణవ్ తంతి, సీఈఓ అండ్ ప్రెసిడెంట్, సినర్జెన్ గ్రీన్ ఎనర్జీ

గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమను స్థాపించడానికి ఆంధ్రప్రదేశ్ అత్యంత అనుకూలమైన రాష్ట్రం. ఇక్కడ అద్భుతమైన వనరులు ఉన్నాయి.

టీఆర్ఎఫ్‌పై ఉగ్ర ముద్ర

- అమెరికా కీలక నిర్ణయం
- పహల్గాంలో దాడికి తెగబడింది ఆ ముష్కర మూకే
- లష్కరే ముసుగు సంస్థగా దాన్ని పేర్కొన్న అగ్రరాజ్యం
- స్వాగతించిన భారత్

వాషింగ్టన్, దిల్లీ: పహల్గాం దాడికి సంబంధించి అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఆ మారణహోమానికి తెగబడిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)'ను ఉగ్రవాద సంస్థగా గుర్తించింది. టీఆర్ఎఫ్‌ను పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తయిబా ముసుగు సంస్థగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. తాజా పరిణామాన్ని భారత్ స్వాగతించింది. టీఆర్ఎఫ్‌పై ఉగ్ర ముద్రను సరైన సమయంలో వేసిన కీలక ముందడుగుగా అభివర్ణించింది. "అమెరికా జాతీయ భద్రతా ప్రయోజనాలను కాపాడేందుకు, ఉగ్రవాదంపై పోరాటానికి, పహల్గాం దాడికి న్యాయం చేయడానికి దేశాధ్యక్షుడు ట్రంప్ పిలుపునిచ్చారు. అందులో భాగంగానే టీఆర్ఎఫ్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థ (ఎఫ్‌టీవో)గా, ప్రత్యేక ముద్రపడిన అంతర్జాతీయ ఉగ్రవాది (ఎస్‌డీజీటీ)గా గుర్తిస్తున్నాం. ఉగ్రవాదంపై పోరులో వాషింగ్టన్ నిబద్ధతకు ఈ చర్యలు నిదర్శనం" అని రూబియో తెలిపారు. 2008 ముంబయి ఉగ్రదాడి తర్వాత భారత్‌లో సాధారణ పౌరులపై చోటుచేసుకున్న అతిపెద్ద దాడి పహల్గాం ఘటనేనని ఆయన గుర్తుచేశారు. భారత భద్రత దళాలపై గతంలో జరిగిన పలు దాడులకు టీఆర్ఎఫ్ బాధ్యత వహించిందని గుర్తుచేశారు.

ఉగ్రవాదాన్ని సహించకూడదు: భారత్

టీఆర్ఎఫ్‌పై అమెరికా ఉగ్ర ముద్ర వేయడాన్ని భారత్ హర్షించింది. "ఉగ్రవాదంపై పోరులో దిల్లీ, వాషింగ్టన్ మధ్య బలమైన సహకారానికి మరో నిదర్శనమిది. ఉగ్రవాదాన్ని ఎంతమాత్రమూ సహించకూడదు" అని విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది. ఉగ్రవాదంపై పోరాటంలో అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి ముందుకెళ్తామని చెప్పింది. విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ కూడా సోషల్ మీడియా వేదికగా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకొని జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. టీఆర్ఎఫ్ అధిపతి షేక్ సజ్జద్ గుల్‌ను పహల్గాం దాడికి ప్రధాన సూత్రధారిగా ఎన్ఐఏ గుర్తించింది.

ప్రాంతీయ సహకారం మరింత పెరగాలి: చైనా

టీఆర్ఎఫ్‌ను ఉగ్ర సంస్థగా అమెరికా ప్రకటించడంపై చైనా ఆచితూచి స్పందించింది. ఉగ్రవాదంపై పోరులో ప్రాంతీయ సహకారం మరింత పెంచుకుందామంటూ పిలుపునిచ్చింది. టీఆర్ఎఫ్ వ్యవహారంలో తాజా పరిణామాలపై విలేకరులు ప్రశ్నించగా చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ ఈ మేరకు స్పందించారు. పహల్గాం దాడిని తాము ఖండిస్తున్నట్లు చెప్పారు.

పాక్ పుట్టించిన సంస్థ

టీఆర్ఎఫ్ 2019లో ఆవిర్భవించింది. తొలుత ఆన్‌లైన్ సంస్థగా ప్రారంభమై.. ఆరు నెలలు గడిచేసరికి లష్కరే తయిబా సహా పలు సంస్థల ఉగ్రవాదులను చేర్చుకొని భౌతిక ముఠాగా రూపుదిద్దుకుంది. టీఆర్ఎఫ్ పుట్టుక వెనుక పాకిస్థాన్ హస్తం ఉంది. ఉగ్ర కార్యకలాపాల కారణంగా ఆ దేశాన్ని ఆర్థిక చర్యల కార్యదళం (ఎఫ్ఏటీఎఫ్) 2018లో 'గ్రే లిస్ట్'లో చేర్చింది. ఈ నేపథ్యంలో తమ దేశంలోని లష్కరే తయిబా నుంచి అంతర్జాతీయ దృష్టిని మరల్చేందుకు పాక్ నిఘా సంస్థ 'ఐఎస్ఐ'.. టీఆర్ఎఫ్‌ను సృష్టించింది. 2023లో భారత్ దీన్ని ఉగ్ర సంస్థగా గుర్తించింది.

పన్నులు ఎగ్గొట్టే మోసగాళ్లను నియంత్రించలేరా?

(మొదటి పేజీ తరువాయి)

అవార్డులతో సత్కరిస్తాం' అని పయ్యావుల ప్రకటించారు. విజయవాడ సమీపంలోని కుంచనపల్లిలోని రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం కమిషనర్లు, సంయుక్త కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లతో మంత్రి సమీక్షించారు. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్, వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ ఎ.కె. బాబు, రాష్ట్ర పన్నుల కమిషనర్ రమేష్, కార్యదర్శి కుమార్, ప్రత్యేక కమిషనర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు. 'ఏపీ ఆర్థికంగా పెద్ద సవాలును ఎదుర్కొంటోంది. రాష్ట్రాన్ని నడపడం అంత సలభంగా లేదు. ఎప్పుడో రాబడి సాధిస్తాం... ఏడాది చివరన ఫలితాలు చూపిస్తామంటే కుదరదు. ఇప్పటికే తొలి త్రైమాసికం పూర్తయింది. రాష్ట్రానికి ఎప్పటికప్పుడు ఫలితాలు కావాలి. ప్రతినెలా రాబడులు పెరగాలి. ఆ మేరకు కార్యాచరణ ప్రారంభించాలి' అని కేశవ్ పేర్కొన్నారు. పీయూష్‌కుమార్ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలోకి పెట్టుబడులు రావడం మొదలైంది. 82 కేంద్ర ప్రాయోజిత పథకాలు మొదలుపెట్టాం. పోలవరం ప్రాజెక్ట్, అమరావతి పట్టాలు ఎక్కించాం. తల్లికి వందనంతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఈ ఫలితాలూ త్వరలో కనిపిస్తాయి. అన్ని రెవెన్యూ రాబడి శాఖలూ పునరుత్తేజమవుతున్నాయి. డేటాను ఉపయోగించుకుని వాణిజ్య పన్నులశాఖ మంచి ఫలితాలు సాధించాలి' అని అన్నారు. కమిషనర్ ఎ.కె.బాబు మాట్లాడుతూ ఏఐ సాయంతో త్వరగా ఫలితాలు సాధించేందుకు ఏం చేస్తున్నారో వివరించారు. అత్యంత సూక్ష్మ డేటాను కూడా సర్కిళ్లకు పంపామని, వాటి ఆధారంగా నోటీసులు జారీ చేశామని గుర్తుచేశారు.

మిథున్‌రెడ్డికి ముందస్తు బెయిల్ నిరాకరణ

(మొదటి పేజీ తరువాయి)

తిప్పిపంపిన ముందస్తు బెయిల్ కేసు. అక్కడ వ్యతిరేకంగా తీర్పు రావడంతో మళ్లీ ఇక్కడికొచ్చాం. పార్లమెంటు ప్రారంభం కాబోతున్న సమయంలో ఎంపీగా ఉన్న పిటిషనర్‌ను అరెస్టు చేయాలనుకుంటున్నారు' అని తెలిపారు. దీంతో 'ఏ ప్రాతిపదికన మీకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని జస్టిస్ పర్దీవాలా ప్రశ్నించారు. సింఘ్వీ స్పందిస్తూ ఛార్జిషీట్ దాఖలు చేయబోతున్నట్లు వాళ్లు ట్రయల్ కోర్టుకు చెప్పారని కోర్టు దృష్టికి తెచ్చారు. 'మిమ్మల్ని అరెస్టు చేయకుండా ఛార్జిషీట్ ఎలా దాఖలు చేయగలుగుతారు?' అని జడ్జి ప్రశ్నించారు. దానికి సింఘ్వీ.. గత ఏడాది కాలంలో పిటిషనర్‌ను విచారణకు ఒకసారే పిలిచారని, అందువల్ల అరెస్టు చేయకుండానే విచారించి ఛార్జిషీట్ దాఖలు చేయవచ్చని బదులిచ్చారు. జస్టిస్ పర్దీవాలా స్పందిస్తూ.. 'ముందస్తు బెయిల్ మంజూరు చేసేలా మీ వాదనలు వినిపించండి' అన్నారు.

నిందితులందరివీ ఇలాంటి వాదనలే..

అనంతరం జస్టిస్ పర్దీవాలా.. మీ వాదనలేంటని రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని అడిగారు. 'ఈ కేసులో ఇతర నిందితులంతా ఇదివరకు ఇలాంటి వాదనలే వినిపించారు. వాటన్నింటినీ కోర్టు తిరస్కరించింది. ఈ కుంభకోణంలో ప్రధాన కుట్రదారు మిథున్‌రెడ్డే. అందువల్ల ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వరాద'ని కోరారు. ఇరువురి వాదనలు పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పర్దీవాలా.. మిథున్‌రెడ్డి పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించారు. మిథున్‌రెడ్డి న్యాయవాది సింఘ్వీ జోక్యం చేసుకుంటూ లొంగిపోవడానికి కొంత సమయం ఇవ్వాలని అడిగారు. జస్టిస్ పర్దీవాలా నవ్వుతూ 'టేక్ యువర్ టైం' అని వ్యాఖ్యానించారు. పిటిషనర్ ఎంపీ కాబట్టి కనీసం లొంగిపోవడానికి వారమైనా గడువు ఇవ్వండని సింఘ్వీ కోరగా 'మేమేమీ చెప్పం (విల్ నాట్ సే ఎనీథింగ్)' అంటూ విచారణ ముగించారు. అనంతరం సుప్రీం కోర్టు వెలువరించిన ఉత్తర్వుల్లో 'పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు, రికార్డులను పరిశీలించిన తర్వాత.. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోడానికి సహేతుకమైన కారణాలేవీ కనిపించలేదు. అందుకే పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నాం' అని పేర్కొంది.

- వైకాపా హయాంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా పని చేసిన కె.నారాయణస్వామికి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 21న విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

ఏ క్షణమైనా మిథున్‌రెడ్డి అరెస్టు!

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం ప్రధాన కుట్రదారుల్లో ఒకరు, ఈ కేసులో కీలక నిందితుడైన (ఏ-4) వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఏ క్షణమైనా అరెస్టయ్యే అవకాశం కనిపిస్తోంది. హైకోర్టు, సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టేయడంతో ఆయనపై అరెస్టు వారంట్ జారీ కోసం సిట్ అధికారులు శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో మెమో వేశారు. అయితే హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలకు సంబంధించి పూర్తి వివరాల్ని దానికి అనుబంధంగా సమర్పించాలని ఆదేశిస్తూ న్యాయాధికారి ఆ మెమో రిటర్న్ చేయటంతో.. వాటిని ఆఘమేఘాలపై సమర్పించారు. ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన మిథున్‌రెడ్డి ఎక్కడ ఉన్నారో గుర్తించేందుకు సిట్ ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఆయన విదేశాలకు పారిపోకుండా ఉండేందుకు సిట్ ఇప్పటికే లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ) జారీ చేసింది. ఆయన ఎక్కడ ఉన్నా పట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. మరోవైపు మిథున్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం సిట్ ఎదుట విచారణకు హాజరై.. లొంగిపోతారనే ప్రచారం జరుగుతోంది.

రాబోయే ఐదు రోజులు విస్తారంగా వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం ఉందన్నారు. ఆదివారం ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నామన్నారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చన్నారు. శుక్రవారం డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ప్రకాశం, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, కృష్ణా, పల్నాడు, అనకాపల్లి తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.

తెలుగు భాషా వికాసంపై లఘు చలనచిత్ర పోటీలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అమరావతి మూడో ప్రపంచ తెలుగు మహాసభలు-2026 సందర్భంగా తెలుగు భాషా వికాసంపై అంతర్జాతీయ లఘు చలనచిత్ర పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. తెలుగు భాష చరిత్ర, వైభవం, ఆంధ్ర సారస్వత దీప్తి, తెలుగు భాషా వికాసం, తెలుగు భాష రక్షణ-ప్రాచుర్యం అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. ఎంట్రీలు ఆగస్టు 14 లోపు asp.shortfilmcontest@gmail.com కు పంపాలన్నారు.

విజయవాడలో లులు మాల్

ఈనాడు, అమరావతి: విజయవాడ నగరానికి లులు మాల్ రానుంది. పండిట్ నెహ్రూ బస్టాండ్ (మెయిన్ బస్టాండ్)కు సమీపంలోని పోలీస్ కంట్రోల్ రూమ్ జంక్షన్ వద్ద ఉన్న గవర్నర్‌పేట-2 ఆర్టీసీ డిపో స్థలాన్ని ప్రభుత్వం ఇందుకు కేటాయించనున్నట్లు తెలిసింది. లులు ఇంటర్నేషనల్ లిమిటెడ్ విశాఖపట్నం, విజయవాడల్లో మాల్స్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ రెండు చోట్లా కలిపి రూ.1,222 కోట్ల పెట్టుబడులు పెట్టడంతోపాటు 1,500 మందికి ఉపాధి కల్పిస్తామని ప్రతిపాదించింది. దీంతో విజయవాడలో ఆ సంస్థ మాల్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపుపై ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) పరిశీలన చేసింది. చివరకు గవర్నర్‌పేట-2 డిపో ఉన్న స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా డిపో స్థలాన్ని తమకు ఇవ్వాలంటూ ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్ నుంచి ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావుకు ఇటీవల లేఖ వచ్చింది. దీనిపై ఏ నిర్ణయం తీసుకోవాలనేది ఆర్టీసీ యాజమాన్యం పరిశీలిస్తోంది. ఆ స్థలాన్ని లులు మాల్‌కు ఇవ్వాలంటూ ప్రభుత్వ పెద్దల నుంచి కూడా ఆర్టీసీ ఎండీకి సూచన వచ్చినట్లు సమాచారం.

5 ఎకరాల విస్తీర్ణంలో..

గవర్నర్‌పేట-2 డిపో సుమారు 5 ఎకరాల్లో ఉంది. ఇక్కడ గవర్నర్‌పేట-2తో పాటు, ఒకటో డిపోకి చెందిన బస్సులను ఉంచుతారు. 1, 2 డిపోల మేనేజర్ల కార్యాలయాలు కూడా ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడీ భూమి లులు మాల్ కోసం ఇస్తే, ప్రత్యామ్నాయంగా గొల్లపూడి సమీపంలో ఆర్టీసీకి 5 ఎకరాలు కేటాయించేలా ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే ఆ భూమికి సంబంధించిన వివరాలను ఆర్టీసీ యాజమాన్యానికి తెలియజేసింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం గురువారం జరగగా, అందులో లులు ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. దీంతో త్వరలోనే గవర్నర్‌పేట-2 స్థలాన్ని ఆ సంస్థకు కేటాయించనున్నట్లు ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ఈ స్థలంలోని కొంత భాగంలో గతంలో నగరపాలక సంస్థ ఐరన్ స్క్రాప్ మెటీరియల్‌తో రూపొందించిన బొమ్మలతో పార్క్ ఏర్పాటు చేసింది. దీనిని కూడా మాల్‌కు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

ఒకప్పటి బస్టాండ్..

ప్రస్తుత గవర్నర్‌పేట-2 డిపో ఉన్న ప్రదేశం.. ఒకప్పటి విజయవాడ బస్టాండ్‌గా ఉండేది. అక్కడే విజయవాడ-1 డిపో ఉండేది. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు పండిట్ నెహ్రూ బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. ఇది 1990లో ప్రారంభమైంది. విజయవాడ-1 డిపోని కూడా కొత్త బస్టాండ్ ఆవరణలోనే ఏర్పాటుచేశారు. దీంతో పాత బస్టాండ్ ఉన్న ప్రాంతాన్ని సిటీ బస్సుల కోసం.. గవర్నర్‌పేట-2 డిపోగా పేరు మార్చారు.

మా బావను వెంటాడుతున్న భాజపా ప్రభుత్వం

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

దిల్లీ: తన బావ రాబర్ట్ వాద్రాను పదేళ్లుగా భాజపా ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం వెంటాడుతూనే ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఓ భూ ఒప్పందానికి సంబంధించి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్న కేసులో రాబర్ట్ వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఛార్జిషీటు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపైనే శుక్రవారం రాహుల్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. దురుద్దేశంతో, రాజకీయ కక్షతో పెట్టిన ఈ కేసును ఎదుర్కొనేందుకు రాబర్ట్, ప్రియాంకల కుటుంబానికి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వీటిని తట్టుకునే ధైర్యం వారికి ఉందని.. నిజం ఎప్పటికైనా బయటపడుతుందని రాహుల్ పేర్కొన్నారు. హరియాణాలోని శికోహ్‌పుర్‌లో భూ ఒప్పందానికి సంబంధించి అక్రమాలకు పాల్పడినట్లు రాబర్ట్ వాద్రాపై ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఈడీ ఇప్పటికే పలుమార్లు ఆయనను విచారించింది. ఈ క్రమంలో ఆయనపై గురువారం అభియోగ పత్రాన్ని దాఖలు చేసింది.

లాలూపై విచారణ నిలిపివేతకు సుప్రీం నిరాకరణ

దిల్లీ: బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. భూమికి ఉద్యోగాల కుంభకోణం కేసులో ఆయనపై ట్రయల్ కోర్టులో జరుగుతున్న విచారణను నిలిపివేయడానికి జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం శుక్రవారం నిరాకరించింది. సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌పై విచారణను వేగవంతం చేయాలని దిల్లీ హైకోర్టును ఆదేశించింది. ఆర్జేడీ అధినేత ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి ఆయనకు మినహాయింపునిచ్చింది.



మీ భార్య శ్రమను గుర్తిస్తున్నారా?

ఆఫీసుల్లో మీ పనికి తగిన గుర్తింపు రావాలని, బాస్ మిమ్మల్ని అభినందించాలని మీరు కోరుకుంటారు కదా? మరి మీ భార్యకు మాత్రం అలాంటి కోరిక ఉండదా? ఇంటిని చక్కదిద్దడానికి ఆమె ఎంత శ్రమిస్తోందో ఎప్పుడైనా ఆలోచించారా? ఒక్కసారైనా ఆమెను మనస్ఫూర్తిగా అభినందించారా? ముందు ఆ పని చేశాకే మీ గుర్తింపు గురించి ఆలోచించండి.

– జేడ్ వార్షా, బడ్జెట్ స్ట్రాటజిస్ట్

కాంగ్రెస్, ఆర్జేడీలకు సొంత కుటుంబాలే ముఖ్యం

• బిహార్‌లో ప్రధాని మోదీ



మోతిహారీలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ, బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్

మోతిహారీ (బిహార్): పేదలు, సామాజికంగా అణగారిన వర్గాల పేరిట రాజకీయాలు చేసే కాంగ్రెస్, ఆర్జేడీలకు సొంత కుటుంబాలనే తప్ప ఇతర నేతలను పట్టించుకోని అహంకారమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బిహార్‌లో యూపీఏ కాలం నాటి ప్రతీకార రాజకీయాలకు తాము ముగింపు పలికామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి విరివిగా నిధులు కేటాయించడంతో మునుపెన్నడూ లేనంతగా ప్రగతిపథంలో ముందుకు పోతోందన్నారు. ఈ ఏడాది చివరలో ఎన్నికలు జరగనున్న బిహార్‌లో శుక్రవారం పర్యటించిన ప్రధాని రూ.7,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా తూర్పు చంపారణ్ జిల్లాలోని మోతిహారీలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ కాంగ్రెస్, ఆర్జేడీలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉద్యోగాల పేరుతో పేదల భూములు లాక్కొన్న ఆర్జేడీ సంకెళ్లను రాష్ట్ర ప్రజలు తెంచుకున్నారని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో 'బనాయేంగే నయా బిహార్.. ఫిర్ ఏక్‌బార్ ఎన్డీయే సర్కార్' అనే కొత్త నినాదాన్ని ఇచ్చి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. దేశవ్యాప్తంగా యువతకు ఉపాధి కల్పించేందుకు కేంద్రం రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెడుతుందన్నారు. కాంగ్రెస్, ఆర్జేడీల పాలనలో బిహార్ పేదలు పక్కాగృహాలకు నోచుకోలేదని, ఉన్న ఇళ్లకు వెల్ల వేసుకోవాలన్నా డబ్బుల కోసం కిడ్నాపులకు పాల్పడే దోపిడీ ముఠాల దృష్టిలో పడతామని భయపడేవారన్నారు. గత 11 ఏళ్లలో పీఎం ఆవాస్ యోజన కింద బిహార్‌లో 50 లక్షల ఇళ్లు కట్టినట్లు తెలిపారు. తూర్పు భారతం అభివృద్ధి చెందాలంటే 'వికసిత్ బిహార్' సాధించడం చాలా కీలకమని మోదీ అన్నారు.

దుర్గాపుర్ (పశ్చిమబెంగాల్): బుజ్జగింపు రాజకీయాల్లో మమతా బెనర్జీ ప్రభుత్వం అన్ని హద్దులను దాటేసినట్లు ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం చొరబాట్లను ప్రోత్సహించి బెంగాల్ ఆత్మగౌరవాన్ని, దేశ భద్రతను పణంగా పెడుతున్నారని విమర్శించారు.

బెంగాల్‌లో టీఎంసీ 'గూండా ట్యాక్స్'

బెంగాల్‌లో పెట్టుబడులను టీఎంసీ 'గూండా ట్యాక్స్' అడ్డుకుంటోందని అన్నారు. శుక్రవారం రాష్ట్ర పర్యటనలో రూ.5,400 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిశ్రామిక పట్టణం దుర్గాపుర్ సభలో మాట్లాడుతూ.. ముర్షిదాబాద్ లాంటి దాడులు జరిగేచోట, పోలీసులు పక్షపాత వైఖరి చూపేచోట పెట్టుబడిదారులు ఎలా వస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో భాజపాకు ఒక్క అవకాశమిస్తే పారిశ్రామికంగా దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతామన్నారు.

పుట్టినరోజు నాడే బఘేల్ తనయుడి అరెస్టు



జైపుర్: ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌ను ఆయన పుట్టినరోజు నాడే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు చేసింది. మద్యం కుంభకోణానికి సంబంధించి మనీలాండరింగ్ జరిగిందన్న ఆరోపణలను ఆయన ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో కొత్తగా ఆధారాలు దొరికే అవకాశం ఉందని వచ్చిన సమాచారంతో శుక్రవారం ఉదయం దుర్గ్ జిల్లాలోని భిలాయ్ పట్టణంలో ఉన్న చైతన్య నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది. ఆ సమయంలో చైతన్య సహకరించలేదని, దీంతో ఆయన్ను మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద ఈడీ అదుపులోకి తీసుకున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. బఘేల్ నివాసానికి భారీగా పార్టీ కార్యకర్తలు చేరుకున్నారు. ఆయన అరెస్టుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో భూపేశ్ బఘేల్ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2019-2022 మధ్య కాలంలో మద్యం కుంభకోణం చోటుచేసుకుంది. ఇందులో చైతన్య బఘేల్ కీలక పాత్ర పోషించారని, సిండికేట్లు దాదాపు రూ.2100 కోట్ల మేర లబ్ధిపొందాయని ఈడీ ఆరోపిస్తోంది. ఈ కేసులో 76 మందిపై కేసు నమోదు చేసిన ఈడీ ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకుంది. నిందితులకు చెందిన రూ.205 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. మరోవైపు చైతన్య అరెస్టు వ్యవహారం ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీని కుదిపేసింది. తన కుమారుడిని ఈడీ అరెస్టు చేయడంపై మాజీ సీఎం భూపేశ్ బఘేల్ స్పందించారు. ప్రతిపక్ష నాయకులే లక్ష్యంగా కేంద్రం ఈడీని ఉపయోగించుకుంటోందని ఆరోపించారు.

దిల్లీలోని 45 పాఠశాలలకు బాంబు బెదిరింపులు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ వరుస బాంబు హెచ్చరికలతో వణికింది. 45కు పైగా పాఠశాలలు సహా మూడు కళాశాలలకు శుక్రవారం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ వారంలో పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులు రావడం ఇది నాలుగోసారి. సమాచారం అందిన వెంటనే దిల్లీ పోలీసులతో పాటు.. బాంబు నిర్వీర్య దళాలు, అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగాయి. పాఠశాలల నుంచి విద్యార్థులను ఖాళీ చేయించాయి. అనుమానాస్పద వస్తువులేవీ దొరకలేదని ఓ పోలీసు అధికారి వెల్లడించారు.

పార్లమెంటు వ్యూహంపై కేంద్ర మంత్రుల చర్చ

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్న నేపథ్యంలో శుక్రవారం పలువురు కేంద్ర మంత్రులు దిల్లీలో సమావేశమయ్యారు. ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం ఖరారు, విపక్షాలను కట్టడి చేయడం తదితర అంశాల గురించి వారు చర్చించుకున్నట్లు తెలిసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసంలో జరిగిన భేటీలో హోంమంత్రి అమిత్ షా, ఆరోగ్యశాఖ మంత్రి జె.పి.నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భర్తతో శృంగారం నిరాకరించినా విడాకులు ఇవ్వొచ్చు

• స్పష్టంచేసిన బాంబే హైకోర్టు

ముంబయి: భర్తతో శృంగారానికి నిరాకరించినా.. వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని అనుమానిస్తూ మానసిక వేదనకు గురిచేసినా విడాకులు ఇచ్చేందుకు ఆ భర్త అర్హుడని బాంబే హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఓ మహిళ విడాకులకు సంబంధించి కుటుంబ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ వేసిన పిటిషన్‌ను గురువారం డివిజన్ బెంచ్ తోసిపుచ్చింది. ఆ జంటకు 2013లో వివాహమైంది, కానీ 2014 నుంచి వారిరువురూ వేర్వేరుగా నివసిస్తున్నారు. శృంగారానికి నిరాకరిస్తోందని, వేరే మహిళతో వివాహేతర సంబంధంలో ఉన్నట్లు అనుమానిస్తోందని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉద్యోగుల ముందు అవమానించి మానసిక వేదనకు గురిచేస్తోందని విడాకులు కోరుతూ 2015లో భర్త పుణెలోని కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. దీంతో విడాకులు మంజూరు చేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అనంతరం భార్య.. ఆ ఆదేశాలను బాంబే హైకోర్టులో సవాలు చేసింది. అత్తామామలు వేధిస్తున్నారని.. అయినా తన భర్త మీద ప్రేమ పోలేదని, వివాహ బంధాన్ని ఇలా అర్ధంతరంగా ముగించాలని అనుకోవడం లేదని, ప్రతి నెల రూ.లక్ష భరణం కింద ఇప్పించాలని పిటిషన్‌లో పేర్కొంది. జస్టిస్ రేవతి మోహితే, జస్టిస్ నీల గోఖలేలతో కూడిన డివిజన్ బెంచ్ మహిళ ప్రవర్తన ఆ వ్యక్తిని మానసిక వేదనకు గురి చేసేలా ఉందని తేల్చిచెప్పింది.

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోకి మసూద్ అజార్?

• పర్యాటక ప్రాంతాల్లో ఉగ్రనేత మకాం
• కదలికలపై భారత నిఘా వర్గాల కన్ను



ఇంటర్నెట్‌డెస్క్: నిషేధిత జైషే మహ్మద్ ముఖ్య అధినేత మసూద్ అజార్ ఎక్కడున్నాడో చెబితే సంతోషంగా అరెస్టు చేసి భారత్‌కు అప్పగిస్తామని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో ప్రకటించిన నేపథ్యంలో కరడుగట్టిన ఆ ఉగ్రవాది జాడను భారత నిఘా వర్గాలు గుర్తించాయి. మసూద్ తన అడ్డా అయిన బహవల్పూర్ నుంచి 1,000 కిలోమీటర్ల దూరంలోని గిల్గిత్ బాల్టిస్థాన్ ప్రాంతంలోకి మకాం మార్చినట్లు తెలుస్తోంది. కొన్నాళ్ల కిందటే స్కర్దూలోని సద్‌పారా రోడ్ ప్రాంతంలో అతడి కదలికలను పసిగట్టారు. ఆ ప్రదేశంలో రెండు మసీదులతో పాటు మదర్సాలు, చాలా ప్రైవేటు, ప్రభుత్వ అతిథి గృహాలున్నాయి. సరస్సులు, ఉద్యానవనాలతో కూడిన ఈ ప్రాంతానికి పర్యాటక ప్రదేశంగా పేరుంది. ఎవరికీ సందేహం రాదనే ఉద్దేశంతో, దాక్కునేందుకు ఉత్తమ ప్రదేశంగా సద్‌పారా రోడ్ ఏరియాను మసూద్ ఎంచుకొని ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అతను ఈ విధంగా స్థావరాలను మారుస్తూ తిరగడం ఇదే తొలిసారి కాదు. 2019లో పాకిస్థాన్‌లోని బాలాకోట్‌పై భారత్ మెరుపు దాడి తర్వాత తన మకాంను బహవల్పూర్ నుంచి పెషావర్‌కు మార్చాడు. జైషే సామాజిక మాధ్యమ ఖాతాలు నిఘా వర్గాలను తప్పుదోవ పట్టించేలా పలు పోస్టులు పెడుతున్నాయి. పాత ఆడియోక్లిప్‌ను రీసైకిల్ చేసి ఆన్‌లైన్ ద్వారా వ్యాప్తిలోకి తెస్తున్నాయి. అయినప్పటికీ నిఘా వర్గాలు నిరంతరంగా అతని కదలికలపై కన్నేసి ఉంచాయి.

విమాన ప్రమాద ఘటన.. రూ.500 కోట్లతో టాటా ట్రస్టు

దిల్లీ: అహ్మదాబాద్ విమాన ప్రమాద బాధితుల కోసం రూ.500 కోట్లతో ప్రత్యేక ట్రస్టును ఏర్పాటు చేస్తున్నట్లు టాటా గ్రూపు శుక్రవారం ప్రకటించింది. ఈ ట్రస్టుకు టాటా సన్స్ రూ.250 కోట్లు, దాతృత్వ కార్యకలాపాల కోసం ఏర్పాటైన టాటా ట్రస్ట్స్ రూ.250 కోట్లు సమకూరుస్తాయి. "అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారి సమీప బంధువులకు, మృతులపై ఆధారపడినవారికి, ప్రమాదంలో గాయపడినవారికి, దుర్ఘటన వల్ల ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా నష్టపోయిన ప్రభావిత వ్యక్తులకు ట్రస్టు తక్షణ సాయం అందించడంతోపాటు దీర్ఘకాలిక మద్దతు అందిస్తుంది" అని టాటా సన్స్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ట్రస్టు కార్యకలాపాలను ఐదుగురు ట్రస్టీలు నిర్వహిస్తారు. గతంలో టాటా సంస్థలో పనిచేసిన ఎస్.పద్మనాభన్, టాటా సన్స్ సంస్థకు చెందిన సిద్ధార్థ శర్మల్ని ట్రస్టీలుగా నియమించారు. మరో ముగ్గురిని త్వరలో నియమిస్తారు.

సుప్రీం తలుపు తట్టిన జస్టిస్ యశ్వంత్‌వర్మ

• త్రిసభ్య కమిటీ నివేదిక చెల్లనిదిగా పరిగణించాలని పిటిషన్



దిల్లీ: అధికారిక నివాసంలో భారీగా నగదు లభించిన వివాదంలో చిక్కుకున్న జస్టిస్ యశ్వంత్ వర్మ.. తనపై త్రిసభ్య విచారణ కమిటీ ఇచ్చిన దర్యాప్తు నివేదికను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. ఆయనను న్యాయమూర్తి పదవి నుంచి తొలగించేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించిన నేపథ్యంలో ఈ పిటిషన్ వేయడం గమనార్హం. ఈ కేసులో న్యాయ సూత్రాలను పాటించలేదని జస్టిస్ యశ్వంత్ వర్మ ఆరోపించారు. న్యాయమూర్తుల కమిటీ.. విచారణ ప్రారంభించే ముందు అధికారికంగా ఫిర్యాదు ఇవ్వలేదన్న అంశాన్ని ఆయన లేవనెత్తారు. తనను పూర్తిస్థాయిలో, పారదర్శకంగా విచారించకుండానే మాజీ సీజేఐ సంజీవ్‌ఖన్నా ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని విచారణ కమిటీని ఏర్పాటుచేశారన్నారు. ఆరోపణలను ఖండించడానికి, సాక్ష్యాలను విచారించడానికి తనకు ఈ త్రిసభ్య కమిటీ అవకాశం కల్పించలేదని జస్టిస్ వర్మ పేర్కొన్నారు. ఈ కమిటీ సమగ్ర దర్యాప్తు చేయడంలో విఫలమైందని ఆయన పేర్కొన్నారు. కమిటీ నివేదికను చెల్లనిదిగా పరిగణించాలని జస్టిస్ యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టును కోరారు. ఈ నెల 21 నుంచి జరిగే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన కోసం తీర్మానం ప్రవేశపెట్టేందుకు వీలుగా ఎంపీల సంతకాల సేకరణ ప్రక్రియను ఇటీవల చేపట్టారు. లోక్‌సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతామని ఇప్పటికే పార్లమెంట్ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.



ఏకే ఆంటోనీతో రాహుల్ భేటీ

తిరువనంతపురం, కొట్టాయం: కాంగ్రెస్ సీనియర్ నేత, రక్షణ శాఖ మాజీ మంత్రి ఏకే ఆంటోనీతో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ శుక్రవారం భేటీ అయ్యారు. 2022 నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్న ఆంటోనీతో తిరువనంతపురంలోని ఆయన నివాసంలో రాహుల్ మర్యాదపూర్వకంగా సమావేశమైనట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల మృతి చెందిన పార్టీ సీనియర్ నేతలు బాలకృష్ణన్ పిళ్లై, సీపీ పద్మరాజన్ కుటుంబసభ్యులను రాహుల్ పరామర్శించారు.

ఊమెన్ చాందీకి నివాళి

కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కొట్టాయం జిల్లాలోని పుత్తుపల్లిలో ఆయన సమాధి వద్ద రాహుల్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ.. ఊమెన్ చాందీ ఒక వ్యక్తి కాదని.. కేరళ రాజకీయాల్లో మహాశక్తి అని కొనియాడారు. రాజకీయంగా ఎన్నో దాడులు, ఆరోపణలను ఎదుర్కొన్నా.. రాష్ట్ర ప్రజల కోసం ఆయన తన ప్రాణాలను అర్పించారని పేర్కొన్నారు. అనంతరం ఊమెన్ చాందీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 12 మంది నిరుపేదలకు నూతన ఇళ్ల తాళాలను రాహుల్ అందజేశారు. 'స్మృతి సంగమం' అనే స్వచ్ఛంద సంస్థనూ ప్రారంభించారు.

పాత నేరాల చిట్టా విప్పితేనే బెయిలు

హైకోర్టులకు సుప్రీం ఆదేశం

దిల్లీ: బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునే నిందితులు తమ పాత నేరాల వివరాలు వెల్లడించాలన్న నిబంధనను విధిగా పాటించేలా చూడాలని సుప్రీంకోర్టు శుక్రవారం హైకోర్టుల్ని నిర్దేశించింది. ఒక హత్యాయత్నం కేసులో బెయిలు మంజూరుకు సంబంధించిన విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈమేరకు ఆదేశాలు వెలువరించింది. "ప్రతి హైకోర్టూ తన నిబంధనల్లో ఈ విషయాన్ని పొందుపరచాలని మేం భావిస్తున్నాం. బెయిల్ కోరే ప్రతి నిందితుడు తప్పనిసరిగా గతంలో తనపై నమోదైన క్రిమినల్ కేసులకు సంబంధించిన సమాచారం ఇచ్చేలా చూడాలి" అని ధర్మాసనం పేర్కొంది. తన పాత నేర వివరాలు తెలియజేయని ఒక నిందితుని బెయిలు పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

గుర్తింపులేని పార్టీల ఆదాయంలో 223% వృద్ధి

• 2022-23కు సంబంధించిన ఏడీఆర్ అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: దేశంలో ఎన్నికల సంఘం రికార్డుల్లో నమోదై ఉన్నప్పటికీ గుర్తింపులేని రాజకీయ పార్టీల ఆదాయం 2022-23 ఆర్థిక సంవత్సరంలో 223% వృద్ధి చెందిందని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. ఇవి 739 నమోదిత, గుర్తింపులేని పార్టీల (26.74%) వివరాలేనని తెలిపింది. మిగిలిన 2,025 పార్టీలు (73.26%) తమ ఆర్థిక లావాదేవీల రికార్డుల్ని బహిరంగపరచలేదని పేర్కొంది. గుర్తింపులేని రాజకీయ పార్టీల్లో అత్యధికం ఉత్తరప్రదేశ్, దిల్లీ, బిహార్‌లలో ఉన్నాయి. పంజాబ్‌లో మొత్తం 73 గుర్తింపులేని పార్టీలు ఉండగా, వాటిలో ఒక్కటీ తమ ఆడిట్ నివేదికల వివరాలను బహిర్గతం చేయలేదు. గుజరాత్‌లోని గుర్తింపులేని రాజకీయ పార్టీల మొత్తం ఆదాయం రూ.1158.115 కోట్లు. భారతీయ నేషనల్ జనతాదళ్ తన ఆదాయాన్ని రూ.576.458 కోట్లుగా చూపింది. రూ.20 వేలకు మించిన విరాళాలను పెద్ద విరాళాలుగా పరిగణిస్తారు. రూ 407.45 కోట్ల ఆదాయం కలిగివున్న న్యూ ఇండియా యునైటెడ్‌పార్టీకి అందిన విరాళాల్లో 100 శాతం పెద్ద విరాళాలేనని ఏడీఆర్ పేర్కొంది. ఎక్కువ ఆదాయం కలిగిన పార్టీల్లో అధిక భాగం 2015 తర్వాత ఏర్పడినవే. సత్యవాదీ రక్షక్ పార్టీ (2022), జన్ మన్ పార్టీ (2021), జన్ సేవక్‌క్రాంతి పార్టీ (2021), న్యూ ఇండియా యునైటెడ్ పార్టీ (2018) ఈ కోవకు చెందుతాయి.

అత్యధిక ఆదాయం భారతీయ నేషనల్ జనతాదళ్‌కు..


భారతీయ నేషనల్ జనతాదళ్ 2019-20 నుంచి 2023-24 వరకూ రూ.957.44 కోట్ల ఆదాయం పొందింది. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో ఈ పార్టీ ఆదాయం గణనీయంగా పెరిగింది. సత్యవాదీ రక్షక్ పార్టీకి 2022-23 సంవత్సరంలో రూ 85.67 కోట్ల మేర ఆదాయం పెరిగింది. 2023-24 సంవత్సరంలో ఆ పార్టీకి రూ.330 కోట్లకు పైగా ఆదాయం లభించింది. భారీగా విరాళాలు పొందడమే తప్ప ఏనాడూ ఎన్నికల్లో పోటీ చేయని ఇలాంటి పార్టీలపై నియంత్రణను బలోపేతం చేయాలని ఎన్నికల కమిషన్‌ను ఏడీఆర్ కోరింది. ఐదేళ్లకు పైగా క్రియాశీలంగా లేని పార్టీలను జాబితా నుంచి తొలగించాలని సిఫార్సు చేసింది. ఇలాంటి రాజకీయ పార్టీలు పన్ను మినహాయింపు పొందడానికి ముందు తమ ఆదాయ వివరాలను బహిర్గతం చేయాలన్న నిబంధన విధించాలని, ఆర్థిక స్టేట్‌మెంట్లు సమర్పించిన 24 గంటల్లోనే రాష్ట్రాల ఎన్నికల అధికారులు ఆ వివరాలను వెబ్‌సైట్లో అప్‌డేట్ చేయాలని కోరింది.



హరిద్వార్‌లో శివాభిషేకానికి గంగానదీ జలాలను సేకరించుకునేందుకు శుక్రవారం పెద్ద ఎత్తున నది ఒడ్డుకు చేరుకున్న కన్వారీలు

పేదలపై ఫీజుల భారం పడకుండా ఉన్న పథకాలేంటి?

• బీసీఐని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



దిల్లీ: న్యాయవిద్యను అభ్యసించేందుకు ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్(ఏఐబీఈ)ను రాసే పేద విద్యార్థులపై ఫీజుల భారం పడకుండా ఉన్న పథకాలేమిటో చెప్పాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ)ను సుప్రీంకోర్టు శుక్రవారం ప్రశ్నించింది. ఏఐబీఈ దరఖాస్తు కోసం జనరల్ ఓబీసీ విద్యార్థులకు రూ.3500, షెడ్యూల్డ్ తెగల వారికి రూ.2500ల అధిక ఫీజు వసూలు చేస్తున్నారని కుల్దీప్ మిశ్రా పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారించిన జస్టిస్ పి.ఎస్.నరసింహా, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్కర్‌ల ధర్మాసనం ఈ మేరకు ప్రశ్నించింది. "పేద విద్యార్థులకు సదుపాయాలు లేని వ్యవస్థ ఉండకూడదు. అవసరమైన వారికి ఫీజులు మినహాయించేలా, క్లిష్టంగా లేని నిబంధన ఉండాలి" అని సూచించింది. రెండు వారాల్లో ఈ అంశంపై సమాధానమివ్వాలని బీసీఐని కోరింది. నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్ఎల్‌యూ)ల్లో ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని హితవు పలికింది. న్యాయవిద్యను పూర్తిచేసేందుకు అధిక ఫీజుల కారణంగా విద్యార్థులు రుణాలు తీసుకుంటున్నారని పేర్కొంది.

'సిందూర్' దెబ్బకు నేటికీ కోలుకోని పాక్

ఇంటర్నెట్‌డెస్క్: పహల్గాం ఉగ్రదాడికి సమాధానంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పాకిస్థాన్‌పై తీవ్ర ప్రభావం చూపింది. ఆ దెబ్బకు పాకిస్థాన్ ఇప్పటికీ కోలుకోలేదు. ఆపరేషన్ పూర్తై రెండు నెలలు దాటినా.. రహీమ్ యార్ ఖాన్ వైమానిక స్థావరంలో భాగమైన ఒకే ఒక రన్‌వే ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. దాని మూసివేతను పాక్ ప్రభుత్వం మూడోసారి పొడిగించింది. ఆగస్టు 5 వరకు రన్‌వే మూతపడి ఉంటుందని పాకిస్థాన్ తాజాగా ప్రకటన విడుదల చేసింది. మే 10న భారత్ దాడి నేపథ్యంలో పాక్ జారీ చేసిన తొలి ప్రకటనలో ఆ వైమానిక స్థావరం వారం పాటు అందుబాటులో ఉండదని తెలిపింది.

భారతీయ గణితానికి కొరియాలో గౌరవం



ఈటీవీ భారత్: దక్షిణ కొరియా రాజధాని నగరం సియోల్‌లో జరుగుతున్న తూర్పు ఆసియా 9వ గణిత విద్యాసదస్సులో భారతీయ సంప్రదాయ గణిత పద్ధతులకు గుర్తింపు లభించింది. జులై 18 నుంచి 22 వరకు ఈ సదస్సు జరుగుతోంది. 'గణితంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల వైఖరిలో మార్పులు' అనే శీర్షికతో భారతీయ సంప్రదాయ గణిత పద్ధతులపై ఒక పరిశోధనా పత్రం ఈ ప్రదర్శనకు ఎంపికైంది. అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ సదస్సులో భారతదేశం తొలిసారిగా పాల్గొని రికార్డు సృష్టించింది. ఈ పరిశోధనా పత్రాన్ని తమిళనాడులోని ఆరోవిల్లేకు చెందిన శ్రీ అరబిందో అంతర్జాతీయ విద్యా పరిశోధన సంస్థ ఛైర్మన్ డాక్టర్ సంజీవ్ రంగనాథన్, ఆరోవిల్లె స్కూలు గణిత ఉపాధ్యాయురాలు పూవిజి సంయుక్తంగా రూపొందించారు. గుజరాత్ అదనపు ప్రధాన కార్యదర్శి, ఆరోవిల్లే ఫౌండేషను కార్యదర్శి డాక్టర్ జయంతి ఎస్.రవి వీరికి అండగా నిలిచారు. డాక్టర్ జయంతి రవికి హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో మెట్రాలజీ బోధించిన అనుభవముంది. భారత్ నుంచి ఈ సదస్సులో పాల్గొన్న డాక్టర్ సంజీవ్ రంగనాథన్, మ్యాథ్స్ టీచర్ పూవిజి తయారుచేసిన పరిశోధన పత్రం ఆధునిక విద్యలో సంప్రదాయ భారతీయ గణిత పద్ధతులను ఎలా ఉపయోగించుకోవచ్చో తెలియజేసింది.

ట్రంప్‌నకు దీర్ఘకాలిక సిరల సమస్య



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దీర్ఘకాలిక సిరల సమస్య (క్రానిక్ వీనస్ ఇన్‌సఫీషియెన్సీ-సీవీఐ)తో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయింది. కొంతకాలంగా కాళ్ల దిగువ భాగంలో, చీలమండ వద్ద వాపుతో ఆయన ఇబ్బందిపడుతున్నారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు. . సీవీఐని నిర్ధారించారు. అయితే పరిస్థితి భయపడాల్సినంత స్థాయిలో ఏమీ లేదని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పష్టం చేశారు. సాధారణ రక్తప్రసరణ రుగ్మతగా సీవీఐని పేర్కొన్నారు. 70 ఏళ్లు దాటినవారిలో ఇది సర్వసాధారణమని తెలిపారు. ప్రస్తుతం ట్రంప్ ఆరోగ్యంగానే ఉన్నారని, ఎలాంటి అసౌకర్యానికి గురవడం లేదని చెప్పారు. ఆయన ఆరోగ్యం విషయంలో పారదర్శకత కోసమే ఈ విషయాన్ని బహిర్గతం చేస్తున్నట్లు వెల్లడించారు. గుండె వైఫల్యం, కిడ్నీ వైఫల్యం, రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం, ధమనులు మూసుకుపోవడం వంటి సమస్యలేవీ ట్రంప్‌నకు లేవని స్పష్టం చేశారు. మరోవైపు- ట్రంప్ చేతి వెనక భాగంలో గాయం ఉన్నట్లు కనిపించిన ఫొటోలపై లీవిట్ స్పందించారు. అధ్యక్షుడు తరచూ కరచాలనం చేయడం, ఆస్పిరిన్ వాడటం వల్ల గాయంలాంటి ఆ సమస్య తలెత్తినట్లు చెప్పారు. సిరలు శరీర భాగాల నుంచి రక్తాన్ని గుండెకు తరలిస్తాయి. లోతైన సిరలు కాళ్ల భాగంలో ఉంటాయి. సీవీఐ బాధితుల్లో రక్తప్రసరణ సమస్యలు తలెత్తుతాయి. సిరల్లోని కవాటాలు సరిగ్గా పనిచేయకపోవడంతో రక్తం వెనక్కి ప్రవహించి కాళ్లలోని సిరల్లో పేరుకుపోతుంది. దీంతో దీర్ఘకాలంలో సమస్యలు ఉత్పన్నమవుతాయి.

చేతిలో రూ.160.. బిడ్డతో రష్యన్ మహిళ అదృశ్యం!

• దేశం దాటలేదని సుప్రీంకోర్టుకు తెలిపిన దిల్లీ పోలీసులు

దిల్లీ: బిడ్డతో పాటు భారత్‌లో ఉంటున్న ఓ రష్యన్ మహిళ ఆచూకీ ఇంకా అంతుచిక్కడం లేదు. వారు దేశం దాటి వెళ్లకుండా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఆమెకు రష్యన్ రాయబార కార్యాలయ అధికారులతో సంబంధం ఉందా..? దేశం దాటించేందుకు వాళ్లు ఏమైనా సాయం చేశారా? అన్న కోణంలో దర్యాప్తు చేయాలని విదేశీ వ్యవహారాల శాఖతో పాటు పోలీసులను ఆదేశించింది. ఆ రష్యన్ మహిళ చట్టపరమైన మార్గాల్లో దేశం విడిచి వెళ్లలేదని ఈ సందర్భంగా న్యాయస్థానానికి దిల్లీ పోలీసులు తెలియజేశారు. "వారి ఆచూకీ తెలుసుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. ఆమె బ్యాంకు ఖాతాలో కేవలం రూ.160 మాత్రమే ఉన్నాయి. చివరిసారిగా ఖాతా నుంచి రూ.250 విత్‌డ్రా చేశారు" అని దిల్లీ పోలీసుల తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. దర్యాప్తునకు రష్యన్ ఎంబసీ సహకరిస్తోందని, ఈ నెల 5న కాన్సులేట్‌కు ఆ మహిళ వచ్చి, ఆ తర్వాత గంటలోనే వెళ్లిపోయినట్లు తెలిసిందన్నారు. తన నుంచి విడిపోయిన రష్యన్ మహిళ వద్ద ఉన్న బిడ్డ సంరక్షణ కోసం భారత్‌కు చెందిన తండ్రి పోరాడుతున్నాడు. సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన ఆదేశాలను ఆమె పట్టించుకోలేదని ఇటీవల న్యాయస్థానం దృష్టికి తెచ్చాడు. ఈ నెల 7 నుంచి బిడ్డతో పాటు ఆమె ఆచూకీ తెలియడం లేదని, ఆమెను కోర్టు పరిధి నుంచి తప్పించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ నెల 4న రష్యన్ ఎంబసీ వెనుక ద్వారం నుంచి ఓ దౌత్యాధికారి ఆమెను లోపలికి తీసుకెళ్లినట్లు తెలుస్తోందన్నారు. వీటిని తీవ్రంగా పరిగణించిన సుప్రీం ధర్మాసనం.. తల్లీబిడ్డల ఆచూకీ వెంటనే కనుక్కోవాలని దిల్లీ పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు ఆమె పాస్‌పోర్టును స్వాధీనం చేసుకొని దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడరేవులను అప్రమత్తం చేయాలని స్పష్టం చేసింది.

వసుంధర

vasundhara@eenadu.in

పాదాధీరాసనం



మ్యాట్‌పైన ప్రశాంతంగా కాళ్లు చాచి కూర్చోండి. మెల్లగా రెండు కాళ్లను వెనక్కి మడిచి వజ్రాసనంలోకి రండి. చేతుల్ని ముందుకు చాపండి. ఇప్పుడు ఫొటోలో చూపినట్లు బాహుమూలల్లో ఉంచండి. బొటనవేళ్లు ఆకాశాన్ని సూచిస్తున్నట్టుగా ఉండాలి. ఇప్పుడు బాహుమూలల్లో ఒత్తిడి ఇంకొంచెం పెంచి... కళ్లు మూసుకొని శ్వాస పైన దృష్టి పెట్టండి. ఈ స్థితిలో 8-10 నిమిషాలు ఉండటానికి ప్రయత్నించండి. తర్వాత నెమ్మదిగా కాళ్లు చాచి విశ్రాంతి పొందండి.

ఉపయోగాలు: నాసికా రంధ్రాలు సమర్థవంతంగా పనిచేసేందుకు సాయపడి, ముక్కు దిబ్బడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందుల్ని పరిష్కరిస్తుంది. ఒత్తిడిని దూరం చేసి ప్రశాంతతను ఇస్తుంది.

జాగ్రత్తలు: ఉబ్బసం, అధిక జలుబు ఉన్నవాళ్లు డాక్టర్ సలహాతో చేయాలి. గర్భిణులు, అధిక రక్తపోటు ఉన్నవాళ్లు చేయకూడదు.

ఆహారం: తేనె, విటమిన్ 'సి' అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలుండే ఉల్లి, వెల్లుల్లి తీసుకోవాలి. పసుపు, అల్లం తప్పక వాడాలి.

కీళ్ల నొప్పులు తగ్గించే సంధిముద్ర



వజ్రాసనం, పద్మాసనం లేదా మామూలుగా కూర్చోండి. ఇప్పుడు నిదానంగా దీర్ఘశ్వాసలు తీసుకుంటూ, కుడి చేయి బొటనవేలి కొనను ఉంగరం వేలు కొనకు తాకించండి. ఎడమ చేయి బొటన వేలి కొనను మధ్య వేలి కొనకు తాకించండి. మృదువుగా ఒత్తి ఉంచి, మిగిలిన వేళ్లను నిటారుగా ఉంచండి. ఇప్పుడు కళ్లు మూసుకొని రెండు చేతులను మోకాళ్లపై ఆనించి ముద్ర పైపైపు ఉండే విధంగా సర్దుబాటు చేయండి. ప్రశాంతంగా శ్వాసమీద ధ్యాస పెట్టండి. ఇలా 10-15 నిమిషాలు సాధన చేయొచ్చు.

ఉపయోగాలు: కీళ్ల నొప్పుల్ని తగ్గిస్తుంది. ఆర్థరైటిస్ బాధితులు నిత్యం ఎదుర్కొనే అసౌకర్యాన్ని దూరం చేస్తుంది.

ఆహారం: యాంటీ ఆక్సిడెంట్లు, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు లభ్యమయ్యే ఆహారాలను తీసుకోవాలి. అలాగే బాదం, చియా, అవిసె గింజలు, పాలకూర, మొలకలు, తృణధాన్యాలను ఆహారంలో చేర్చండి. కాల్షియం, విటమిన్-డి లోపాలు లేకుండా జాగ్రత్తపడండి.



శిరీష
యోగ గురు

మీ మొక్కకి ఏమైంది?



ఇంటిని పచ్చదనంతో నింపేయాలని అనుకుంటాం. నర్సరీ నుంచి మొక్కలూ తెచ్చేస్తాం. తెచ్చిన ఓ వారం పాటూ బాగున్నా అవి కాస్తా తర్వాత చనిపోతుంటాయి. అసలు ఎందుకిలా అయ్యిందో తెలియక బాధ పడిపోతాం. అలాకాకుండా దాని సమస్యని అర్థం చేసుకోగలిగితే... చక్కగా పెంచుకోవచ్చు. అదెలాగంటారా?

- ఆకులు పసుపు రంగులోకి మారడం, వడలిపోవడం, మొక్క ఎదగకపోవడం వంటివి జరుగుతుంటే అది నైట్రోజన్ లోపంగా గుర్తించండి. పరిష్కారంగా కంపోస్ట్, ఆవు పేడ, కాఫీ గింజలు.. వంటివి ఉపయోగించొచ్చు.
- ముదురాకుపచ్చ, ఊదా రంగులోకి ఆకులు మారుతుంటే... వేరు బలం సరిపోకపోవడమే కారణం కావొచ్చు. ముఖ్యంగా ఫాస్ఫరస్ తగ్గడం వల్ల ఇలా జరుగుతుంది. కోడిగుడ్డు పెంకులు, చేప పొట్టు, బోన్‌మీల్ వంటివి అందిస్తే సమస్య తీరుతుంది.
- పత్రాల అంచులు గోధుమ రంగులోకి మారడం, కొమ్మలు బలహీనంగా ఉంటే పొటాషియం అవసరమని అర్థం చేసుకోవాలి. పండ్ల తొక్కలని మొక్క మొదట్లో వెయ్యాల్సి ఉంటుంది. అరటిపండు తొక్కలు, చెక్క బూడిద, కోడిగుడ్డు పెంకులు వంటివి వాడితే సరి
- అలానే ఐరన్, మెగ్నీషియం వంటి మైక్రో న్యూట్రియంట్స్ లోపించినప్పుడు ఆకుల మధ్య ఉండే ఈనెలు పసుపు రంగులోకి మారతాయి. ఎప్సమ్ సాల్ట్, సీవీడ్, బంగాళాదుంప పొట్టు, కంపోస్ట్... వంటివి తరచూ ఇస్తే మేలు.
- ఒక్కోసారి ఆకులు తెల్లగా పాలిపోయినట్టుగా కనిపిస్తాయి. అది సరైన ఎండ దొరకడం లేదని చెప్పడానికి నిదర్శనం. మొక్కని ఎండలోకి మారిస్తే సరిపోతుంది.
- ముట్టుకుంటే ఆకులు పెళుసుబారినట్లుగా ఉంటున్నాయా? దానర్థం మొక్కకి కావాల్సినంత నీరు లభించడం లేదని. రోజూ తగినన్ని నీళ్లు పోయండి.

చీడపీడలకీ చెక్ పెడదాం...

పై సమస్యలు కాకుండా మొక్కలకి తెగుళ్ల భయమూ ఎక్కువే. అందుకే, ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా ఆకులను జాగ్రత్తగా పరిశీలించాలి. ముఖ్యంగా వాటిపై రంధ్రాలు ఏర్పడినా, గుడ్లు ఉన్నా, సాలెపురుగు గూడు పట్టినా, ఆకులు ముడుచుకుపోవడం, వాడిపోవడం, పురుగులు కనిపిస్తే మిగిలిన మొక్కల నుంచి దాన్ని వేరు చేయండి. చీడపట్టిన పత్రాల్ని కత్తిరించి ఓసారి సర్ఫ్‌వాష్ చేయండి. ఆపై తగినంత ఎండ అందేలా చూడటంతో పాటు వేపనూనె పిచికారీ చేయండి. నీళ్లు పోయడం తగ్గించండి. ఆపై మొదళ్ల చుట్టూ మల్చింగ్ చేయాలి. దాంతోపాటు బేకింగ్ సోడా, బూడిద మట్టి, ఆకులపై చల్లాలి. అప్పుడు సమస్య తగ్గుముఖం పడుతుంది.



అవకాడో... ఈమధ్య వినిపిస్తోన్న పదం. మార్కెట్లలోనూ కనిపిస్తోన్న పండు. వీలైతే మహిళల్నీ పిల్లల్నీ ముఖ్యంగా గర్భిణుల్ని తీసుకోమని నిపుణులూ సూచిస్తోన్న ఔషధ ఫలం. ఎన్నో పండ్లు ఉండగా ఇదే ఎందుకంత ప్రత్యేకం..?

అమ్మకో అవకాడో!

సృష్టి ఎంతో గొప్పది. మనకోసమే అన్నట్లుగా మానవ అవయవాల్ని పోలిన పండ్లూ కూరగాయలెన్నో ఉన్నాయి. పరిశీలిస్తే వాటిల్లోని పోషకాలు ఆయా అవయవాల ఆరోగ్యానికెంతో తోడ్పడతాయి. అవకాడో (వెన్న పండు) కూడా ఆ కోవకే చెందుతుంది. పియర్స్ లేదా అండాకారంలో ఉండే ఈ పండు గర్భాశయాన్ని పోలి ఉంటే, అందులోని గింజ... శిశువుని తలపిస్తుంది. అంతేనా... తల్లి గర్భంలో శిశువు నవమాసాలు ఉన్నట్లే, ఈ పిందె... ఫలంగా రూపుదిద్దుకోవడానికి ఆరు నుంచి తొమ్మిది నెలలు పడుతుందట. కొన్ని రకాలైతే 12 నెలలకిగానీ పక్వానికి రావు. అందుకే అవకాడో మహిళల ఆరోగ్యానికీ ముఖ్యంగా గర్భిణులకి ఎంతో మేలు అంటున్నారు నిపుణులు. ఫిన్‌ల్యాండ్‌లో చేసిన ఓ పరిశోధనలో- అవకాడో తిన్న తల్లులకి పుట్టిన పిల్లల్లో ఫుడ్ అలర్జీలు తక్కువగా ఉన్నట్లు తేలింది.

లేత పచ్చ రంగు అవకాడో గుజ్జులో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, బి2, బి3, బి5, బి6, సి, ఇ, కె-విటమిన్లతోపాటు ఫోలిక్ ఆమ్లం, ఖనిజాలు... వంటి పోషకాలు పుష్కలం. ఇవన్నీ హార్మోన్ల సమతౌల్యానికీ పీసీఓడీ, మెనోపాజ్ సమస్యల నివారణకీ సంతానోత్పత్తికీ గర్భిణుల ఆరోగ్యానికీ దోహదపడతాయి.

పోషకాలు (వంద గ్రా.అవకాడోలో...)
శక్తి: 160 క్యాలరీలు
పిండిపదార్థాలు: 8.5 గ్రా.
ప్రొటీన్: 2 గ్రా.
అన్‌శాచ్యురేటెడ్ కొవ్వులు: 11.9 గ్రా.
శాచ్యురేటెడ్ కొవ్వులు: 2.2 గ్రా.
పీచు: 6.5 గ్రా.



- అవకాడోలోని బోరాన్, మెగ్నీషియం, ఫ్యాటీ ఆమ్లాలు గర్భాశయ సంకోచాలకు కారణమయ్యే ప్రోస్టాగ్లాండిన్ స్రావాన్ని అడ్డుకోవడంతో నెలసరిలో వచ్చే నొప్పులు తగ్గుతాయి. క్రమబద్ధమైన అండాల ఉత్పత్తికీ తోడ్పడతాయివి.
- గర్భంతో ఉన్నప్పుడు కలిగే వికారం, వాంతుల్నీ తగ్గించడంతోపాటు తల్లి పాలల్లో పోషకాల్ని పెంచుతుందీ ఫలం. నిద్రలేమినీ తగ్గిస్తుంది.
- అవకాడోలో సమృద్ధిగా ఉండే ఫోలిక్ ఆమ్లం గర్భస్థ శిశువు మెదడు, నాడీవ్యవస్థలో లోపాలు తలెత్తకుండా చూస్తుంది. ఒక్క అవకాడోలో రోజువారీ అవసరమైన ఫోలిక్ ఆమ్లం దాదాపు 41 శాతం ఉంటుంది. ల్యూటెన్, జియాజాంతిన్‌లు శిశువు కంటి ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- విటమిన్-ఇ గర్భస్థ పిండం ఆరోగ్యంగా పెరిగేందుకు వీలుగా గర్భాశయంలోని ఎండోమెట్రియల్ పొరను అభివృద్ధి చేస్తుంది.
- పొటాషియం గర్భిణుల్లో వచ్చే రక్తపోటుని నియంత్రిస్తే, యాంటీఆక్సిడెంట్లు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. అందుకే ఇది తల్లీబిడ్డలకెంతో మేలు.

అందరికీ మంచిదే!

మిగిలిన పండ్లలో మాదిరిగా చక్కెర కాకుండా అవకాడో నిండా కొవ్వులే. కానీ అవన్నీ ఎక్కువగా మోనో అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ కావడంతో అన్ని వయసులవాళ్లకీ అవకాడో మంచిదే. ఈ కొవ్వులు శరీరం విటమిన్లను శోషించుకునేలా చేస్తాయి. పైగా ఇందులోని అధిక పీచువల్ల ఆకలి తగ్గి, బరువు అదుపులో ఉంటుంది. అవకాడోలోని ఆరోగ్యకరమైన కొవ్వులు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి హృద్రోగ, జీర్ణ సమస్యల్నీ తగ్గిస్తాయి. మధుమేహాన్నీ నియంత్రిస్తాయి.

- విటమిన్-సి, ఇ, కెరోటినాయిడ్లు చర్మాన్ని అతినీలలోహిత కిరణాల నుంచి కాపాడతాయి. కాలిఫోర్నియా యూనివర్సిటీ చేసిన ఓ అధ్యయనంలో భాగంగా 27 -73 ఏళ్ల వయసులోని మహిళలు ప్రతిరోజూ ఎనిమిది వారాలపాటు అవకాడో తీసుకోగా... చర్మం మృదువుగా మారడంతోపాటు పిగ్మెంటేషన్ కూడా తగ్గిందట.

ఎలా తినాలి?

అన్ని పండ్లలానే నేరుగా లేదా సలాడ్స్‌తో కలిపీ తీసుకోవచ్చు. వెన్నలాంటి ఈ గుజ్జుని మయొనైజ్, బటర్‌లకు బదులుగా వాడొచ్చు. ఇందులోని కొవ్వులు మంచివే అయినా రోజువారీ అవసరమయ్యే క్యాలరీల్లో కొవ్వుల నుంచి 20 శాతమే వచ్చేలా చూసుకోవాలి. కాబట్టి వేపుళ్లు, డీప్ ఫ్రైలకు బదులుగా ఉడికించిన కూరల్లో రెండు అవకాడో ముక్కలు వేసుకుంటే వెన్న కలిసిన రుచి వస్తుంది. నూనె, నెయ్యిలకు బదులు ఇడ్లీ, దోశలమీదా ఒకటీ రెండు స్పూన్ల అవకాడో పేస్టుని అద్దుకుని తిన్నా మేలే. కాస్త మిరియాలపొడి, ఉల్లి, టొమాటో, వెల్లుల్లి, నిమ్మరసం, కొత్తిమీర కలిపీ చేసుకోవచ్చు. దీన్నే గ్వాకమోలి అంటారు. ఇదో మెక్సికన్ డిష్. గుడ్డు, ఆమ్లెట్, నాచోస్, బ్రెడ్‌తో తినొచ్చు.



- కోసిన వెంటనే తినడం మేలు. లేదంటే ఆక్సిడేషన్‌కు గురవడంతో లేత పసుపు నుంచి గోధుమ, నలుపు రంగులోకి మారిపోతుంది. అలాగని పాడైనట్లు కాదు. అందుకే సగానికి కోశాక వాటిమీద నిమ్మరసం పిండి, అప్పుడు గుజ్జు తీసి జిప్‌లాక్‌లో పెట్టి, ఫ్రిజ్‌లో భద్రపరచుకోవచ్చు.



డా. జానకీ శ్రీనాథ్, పోషకాహార నిపుణులు



ఊరిని చదివించాలనుంది!

మూడు పూటలా కడుపు నిండా తినడమే కష్టం. అలాంటిచోట చదువు అన్నమాటే ఊహించలేం. కొన్ని కిలోమీటర్లు వెళ్లి చదవాలన్న ఆలోచన సాధ్యమేనా? కానీ చేసింది సీత. ఈమెది తమిళనాడులోని కటచన్‌కొల్లి అనే గిరిజన గ్రామం. ఊళ్లో ఉండేదీ 120 కుటుంబాలే. పక్కన టీ తోటల్లో పనిచేసి జీవనం సాగిస్తారంతా. బడి బాట పట్టినా హైస్కూలుకి వచ్చేసరికి చదువు ఆపేసేవారే ఎక్కువ. పేదరికం ఒక కారణమైతే, ఊళ్లో కొనసాగించే అవకాశమూ లేదు. పైగా ఇంకొకరు పనిచేస్తే కడుపు నిండుతుందనే భావనే అందరిదీ. కానీ మిగతావాళ్లలా తనూ అదే పంథాలో సాగాలనుకోలేదు సీత. కానీ ఎనిమిదో తరగతి తరవాత చదవాలంటే 12 కి.మీ. ప్రయాణించాలి. కష్టం అన్నారంతా. సీత మాత్రం ఓ ఎన్‌జీఓ సాయం కోరింది. వాళ్ల హాస్టల్‌లో ఉచిత వసతి సంపాదించుకుని చదువు కొనసాగించింది. 'నాన్నకి టీబీ. అమ్మ సంపాదన మీదే ఆరుగురం బతకాలి. కానీ ఈ పరిస్థితి పూర్తిగా మారాలంటే చదువొక్కటే మార్గం. అందుకే అందరినీ ఎదురించి మరీ కొనసాగించా. సెలవుల్లో ఇంటికొచ్చినప్పుడు మాత్రం నేనూ టీ తోటల్లో పనికి వెళ్లేదాన్ని' అని గుర్తు చేసుకుంటుంది సీత. ఇంటర్, తరవాత సోషల్ వర్క్‌లో బ్యాచిలర్స్ చేసింది. పీజీ చెన్నైలో చదవాలనుకుంది తను. అది కుటుంబానికి మరింత భారం. అయినా పార్ట్‌టైమ్ జాబ్ చేస్తూ చదువుకుంది. 'బలంగా కోరుకుంటే ఆ ప్రకృతి కూడా సాయపడుతుంది అంటారు కదా! నా విషయంలో అదే జరిగింది. కాలేజీ యాజమాన్యం కూడా నాకు సాయమందించింది' అనే సీత ఇప్పుడు తన గ్రామానికి చేరుకుంది. తన తలరాతను మార్చుకుంది. ఇప్పుడు ఊరిని మార్చే పనిలో ఉంది. 'చిన్న గ్రామాల వాళ్లూ పెద్ద కలలు కనొచ్చు అని వాళ్లకి చూపిస్తా. మా గ్రామంలోని పిల్లల్ని విద్య దిశగా ప్రోత్సహిస్తా'నంటోంది 23ఏళ్ల సీత.

ప్రభుత్వ పాఠశాలల్లో... ఏఐ ట్యూటర్!



సౌమ్య



ఐఏఎస్ అధికారిణి సౌమ్యా ఝా విద్యార్థుల భవిష్యత్తును మార్చాలనుకున్నారు... రాజస్థాన్‌లో టోంక్ జిల్లాలో 'పఢాయ్ విత్ ఏఐ' ప్రారంభించి గత విద్యాసంవత్సరంలో 95 శాతం ఉత్తీర్ణత సాధించేలా చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పును తీసుకొచ్చారు.

రాజస్థాన్‌లోని టోంక్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సౌమ్యా ఝా ఓసారి క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. అందులో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారామె. అక్కడి విద్యార్థులతో మాట్లాడినప్పుడు విద్యార్థులు కంటున్న కలలకూ, వాస్తవిక పరిస్థితులకూ మధ్య తేడాను గుర్తించారు. 'వాళ్లంతా పెద్దయ్యాక డాక్టరవుతా, ఏఐలో రాణిస్తా, రోబోటిక్స్ ఇంజినీర్ అవుతా అంటూ తమ లక్ష్యాల గురించి చెప్పారు. కానీ, లెక్కలంటే భయంతో సైన్స్ రంగాలను ఎంచుకోవడానికి భయపడుతున్నారు. 'కొన్ని పాఠాలు కష్టంగా ఉంటున్నాయి. అర్థం కావడం లేదు'. అని కొంతమంది విద్యార్థులు చెప్పిన సమాధానం... నన్ను ఆలోచించేలా చేసింది. దీనికి కారణాలూ లేకపోలేదు. వివిధ పనులతో టీచర్లు సరిగా విధులకు హాజరవకపోవడం, విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లడం లాంటి కారణాలెన్నో. ముఖ్యంగా ఇక్కడ విద్య కంటే వ్యవసాయానికే ప్రాధాన్యత. దాంతో పాఠశాలకు ఎక్కువమంది గైర్హాజరవుతున్నారు. కొంతమంది చదువు మధ్యలోనే ఆపేస్తారు. ఇలాగే వదిలేస్తే వాళ్ల భవిష్యత్తు ఏమవుతుందో అని భయం వేసింది. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం వెతకాలనుకున్నా. విద్యార్థుల ఆశయాలకూ, విద్యకూ మధ్య ఉన్న కష్టాన్ని తొలగించాలనుకున్నా. ఇంటర్ వరకూ కష్టమైన పాఠ్యాంశాలను డిజిటల్ లర్నింగ్ ద్వారా చెప్పేందుకు ఏఐ ట్యూటర్‌ని తయారు చేశాం. అదే 'పఢాయ్ విత్ ఏఐ'. పదో తరగతి విద్యార్థులకు లెక్కలు, సైన్స్ వంటి కఠినమైన సబ్జెక్టుల్లో సహాయపడుతుంది. హిందీ, ఇంగ్లిష్ భాషల్లో పాఠాలను అందిస్తుంది. స్టూడెంట్‌కి అర్థమయ్యేలా రకరకాలుగా ఇది వివరిస్తుంది. వారికి ఎప్పుడు సందేహం వచ్చినా వెంటనే సమాధానం చెప్పేలా దీన్ని రూపొందించాం. టీచర్లు ఆన్‌లైన్‌లోనే ప్రాక్టీస్ టెస్టులు పెట్టడానికీ, వాళ్ల మార్కులను ట్రాక్ చేయడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. ఇందులో భాగంగా 353 ప్రభుత్వ పాఠశాలల్ని ఎంపిక చేశాం. విద్యార్థులకు డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేశాం. మొదటి ప్రయత్నంలోనే 95 శాతం ఫలితాలు అందుకున్నాం. ప్రస్తుతం ఈ కార్యక్రమం విజయవంతంగా నడుస్తోంది. 11 వేల మందికి పైగా విద్యార్థులు ఈ ఏఐ ట్యూటర్ ద్వారా కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా స్టూడెంట్స్‌లో లెక్కలంటే భయం పోయింది. మంచి మార్కులు తెచ్చుకుంటున్నారు. పఢాయ్ విత్ ఏఐ టెక్నాలజీ మాత్రమే కాదు, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా' అంటారు సౌమ్య.

> భారత్‌లోనే కాదు, చాలా దేశాల్లో మహిళలపైన ముందుగానే ఒక అభిప్రాయంతో ఉంటారు. దాన్ని పోగొట్టడం మొదటి సవాలు. పని ప్రదేశంలో రిస్కు తీసుకునేలా అమ్మాయిల్ని పెంచకపోవడం రెండో సవాలు. ఈ రెంటినీ అధిగమిస్తే మహిళలు కెరియర్‌లో తప్పక రాణించగలరు.
>
> \- పద్మజ రూపారెల్, సహ వ్యవస్థాపకురాలు ఇండియన్ ఏంజెల్ నెట్‌వర్క్



మీకు తెలుసా



శిశువులు తల్లి గర్భం నుంచి బయటకు రాగానే ఏడుస్తారని మనకు తెలుసు. నిజానికి కడుపులో ఉన్నప్పుడు కూడా వాళ్లు ఏడుస్తారట. అయితే, అది నిజమైన ఏడుపులా అనిపించదట. 20వారాలకల్లా ఏడ్చేందుకు కావాల్సిన మూమెంట్స్... అంటే నాలుక బయటపెట్టడం, నోటిని కదిలించటం, శ్వాసను నియంత్రించుకోవటం... వంటివి చేస్తారట. బేబీ చుట్టూ ఉమ్మనీరు ఉండటం, ఊపిరితిత్తుల్లో గాలి లేకపోవడం వల్ల ఆ శబ్దం బయటకు వినిపించదట. సింపుల్‌గా చెప్పాలంటే... పుట్టాక ఎలా ఏడవాలో లోపలే ప్రాక్టీస్ చేస్తారట.

నల్లానల్లని బ్యాగు... మీ దగ్గరుందా?



నలుపు రంగు అంటే ఒకప్పుడు కొంచెం వ్యతిరేకతే ఉండేది. అశుభమని భావించేవారూ లేకపోలేదు. కానీ ఫ్యాషన్ ప్రపంచంలోకి రండి. దాన్ని ఆత్మవిశ్వాసానికి చిరునామాగా చెబుతారు. అయినా నలుపు లేనిదెక్కడ? అందమైన అమ్మాయి జాలువారే కురులు, ఆ కంటిపాప రంగు, కళ్లకి ఆమె అద్దే కాటుక, మనల్ని జోలపాడే రాత్రి... అన్నీ ఆ వర్ణానివేగా! నిజానికి ఈ కాలం... అదేనండీ వర్షాకాలానికి సూచికగానూ దీన్నే చెబుతారు. ఆకాశమంతా నల్లని మబ్బులు కమ్మేసి వాటి నుంచి సన్నగా చినుకులు జాలువారుతోంటే అడపాదడపా మెరుపులు పలకరిస్తోంటే... ఆ దృశ్యం ప్రకృతి గీసిన చిత్రంలా తోయదూ? రోజంతా అలసిన శరీరానికి సేద తీరాల్సిన సమయమని గుర్తు చేసేదీ అదే! చల్లగాలి, నీలాకాశాన మబ్బులతో దోబూచులాడే చంద్రుడు, చుట్టూ నక్షత్రాలు... ఆ హాయిని మెచ్చని మనసూ ఉండదు. అది కావాలన్నా నలుపు ముసుగు తొడుక్కున్న రాతిరి రావాల్సిందే మరి. ఇంతటి ప్రాధాన్యమున్న నలుపును ఫ్యాషనిస్టులు మాత్రం వదులుతారా? వస్త్రాలు, యాక్సెసరీలు, బ్యాగుల రూపంలో మెరిపిస్తూనే ఉంటారు. అసలే వానల కాలం. మరకలు పడొద్దు, ఫ్యాషన్‌గా కనిపించాలనుకునేవారి ఎంపికా చాలావరకూ నలుపే. పైగా మన అమ్మాయిలకు అడుగు బయటపెట్టాలంటే వెంట బ్యాగు తప్పనిసరి. అత్యవసర వస్తువులను పెట్టుకోవడానికి అదేగా మనకున్న మార్గం మరి. కానీ దుస్తులతోపాటుగా ఇదీ నప్పాలంటున్న అమ్మాయిలే ఎక్కువ. అలాగని తారల్లా ప్రతి డ్రెస్సుకీ ఒకటి కొని పెట్టాలంటే కష్టం కదా! అందుకే చాలామంది ఎంపిక 'నలుపు' బ్యాగులే. టోటె, స్లింగ్, బకెట్, బ్యాక్‌ప్యాక్ అంతెందుకు దేశీ స్టైళ్లలోనూ బోలెడు దొరుకుతున్నాయి. పైగా 'టైమ్ లెస్', 'మిడ్‌నైట్ బ్లాక్' అంటూ వాటిని ట్రెండ్ చేస్తున్నారు కూడా. చేత పట్టుకున్నా, భుజానికే తగిలించినా సోఫిస్టికేటెడ్, ఎలిగెంట్, స్టైలిష్ అంటూ కితాబులూ ఇచ్చేస్తున్నారు. మరి మీ సంగతేంటి? మీ దగ్గరా ఉందా ఓ నల్లానల్లని బ్యాగు? అయితే ఈ మాన్‌సూన్ ట్రెండ్‌లో మీరూ భాగమైనట్టే!

నేటి ఫ్యాషన్



శోధిత

టీనేజర్లు... 'డోంట్ డిస్టర్బ్' వాడాల్సిందే!

పిల్లలు భవిష్యత్తులో ఇబ్బంది పడకూడదనీ, వాళ్లకు అన్ని నైపుణ్యాలూ నేర్పించాలన్నది తల్లిదండ్రుల ఆలోచన. దాంతో టీనేజ్ నుంచే వాళ్లకి డ్రైవింగ్ నేర్పిస్తుంటారు. ఆలోచన మంచిదే కావొచ్చు, కానీ ఈతరం పిల్లల్నీ, ఫోన్‌నీ విడదీయలేమన్నది తెలిసిందే. అయితే, ఆ అలవాటే కొన్నిసార్లు ప్రమాదాలకూ కారణం కావొచ్చంటున్నాయి అధ్యయనాలు. బ్రిగమ్ అండ్ విమెన్స్ హాస్పిటల్ సంయుక్తంగా జరిపిన అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. రోడ్డు ప్రయాణాల సమయంలో టీనేజర్లు కేవలం 80శాతం సమయం మాత్రమే రోడ్డుని చూస్తూ డ్రైవ్ చేస్తున్నారట. మిగతా 20శాతం ఫోన్ చూస్తున్నారట. ఇదే డ్రైవింగ్‌లో వాళ్లకు ఓ పెద్ద డిస్‌ట్రాక్షన్‌లా మారుతోందట. ఎంటర్‌టైన్‌మెంట్, మెసేజ్‌లు, నేవిగేషన్ కోసం ఈ సమయంలో ఫోన్ ఉపయోగిస్తున్నారట. అంతేకాదు, నేషనల్ హైవే ట్రాఫిక్ సేఫ్టీ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం.... గంటకు 88 కి.మీ. వేగంతో డ్రైవింగ్ చేసేటప్పుడు కేవలం 5 సెకన్లు ఫోన్ చూసినా చాలు... అది ఓ ఫుట్‌బాల్ ఫీల్డ్ మొత్తాన్ని కళ్లు మూసుకొని వాహనం నడిపిన దాంతో సమానమట. ఈ అలవాటు రోడ్డు ప్రమాదాలకూ కారణమవుతోందట. కాబట్టి, డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్‌ను కచ్చితంగా 'డోంట్ డిస్టర్బ్' మోడ్‌లోనో, అవుట్ ఆఫ్ రీచ్‌లోనో పెట్టుకోవాలని టీనేజర్లకు సూచిస్తున్నారు పరిశోధకులు.



బంగారం - వెండి



18న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,01,280	91,500	1,16,013
విజయవాడ	97,745	91,100	1,15,500
ప్రొద్దుటూరు	97,900	90,070	1,14,700
రాజమహేంద్రవరం	99,380	91,100	1,23,900
విశాఖపట్నం	99,020	91,100	1,20,000
తమిళనాడు	-----	91,100	1,25,000



పులి చారలు... సున్నిత రెక్కలు

మంచిర్యాల జిల్లా చెన్నూరు అటవీ శాఖ డివిజన్ పరిధిలోని కిష్టంపేట బీఆర్ అంబేడ్కర్ అర్బన్ పార్కులో అరుదైన మంకీ పజిల్ సీతాకోకచిలుకను గుర్తించారు. గతంలో మహారాష్ట్రలో కనిపించిన ఈ రకం సీతాకోకచిలుకను తెలంగాణలో గుర్తించడం ఇదే తొలిసారని జిల్లా అటవీశాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, శాస్త్రవేత్త డా.రంజాన్ విరాణి తెలిపారు. ఈ పార్కులో ఇప్పటికే 80 జాతుల సీతాకోకచిలుకలు ఉండటం గమనార్హం.

– న్యూస్‌టుడే, చెన్నూరు గ్రామీణం

పళ్లెంలో బలమెంతో ఫొటో చెప్పేస్తుంది!

ఆహారంలో పోషకాలుండాలని తెలుసు!
కానీ మనం తింటున్న దాంట్లో ఎంతున్నాయో తెలిసేదెలా?
పళ్లెంలో పెట్టుకున్న పదార్థాలను మీ ఫోన్‌తో ఒక్క ఫొటో తీయండి చాలు...
అందులో ప్రొటీనెంతో, కార్బో ఎంతో, ఇతర పోషకాలెంతో చెప్పేస్తుంది జననీమిత్ర యాప్!



మహిళలు.. గర్భిణులు రోజూ తీసుకునే ఆహారంలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్‌లు ఎన్ని ఉన్నాయో ఎలా తెలుసుకోవాలి? అన్నం.. పప్పు.. కూర.. పెరుగు.. మాంసాహారం తింటే సరిపోతుందా? లేదా ఇతర పదార్థాలు తీసుకోవాలా? ఈ ప్రశ్నలకు ఓ యాప్ సమాధానం చెప్పేస్తుంది. చాలామంది మహిళలు రక్తహీనత కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీన్ని పరిష్కరించేందుకు ఏఐజీ ఆసుపత్రి... ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డిజిటల్ టెక్నాలజీస్ ఇన్ హెల్త్‌కేర్ విభాగం సహకారంతో 'జననీ మిత్ర' యాప్ రూపొందించింది. కృత్రిమ మేధతో పనిచేసే ఈ యాప్ ప్రస్తుతం ప్రయోగదశలో ఉంది. రెండు, మూడునెలల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది.


– ఈనాడు, హైదరాబాద్

ప్లేటు ఏ ఆకారంలో ఉన్నా....



- ప్లేటు వృత్తాకారం, దీర్ఘచతురస్రం లేదా ఏ ఆకారంలో ఉన్నా అందులోని ఆహారపదార్థాలను గుర్తించేలా యాప్‌ను అభివృద్ధి చేశారు.
- ఆహార పదార్థాలను ఫొటో తీయగానే, ప్లేట్‌లో అవి ఆక్రమించిన ప్రాంతాన్ని సెకన్ల వ్యవధిలో విశ్లేషించి వివరాలను తెలియజేస్తుంది.
- ఇప్పటి వరకు వెయ్యికిపైగా ప్లేట్లలోని ఆహార పదార్థాలను యాప్ ద్వారా స్కాన్‌చేశారు. ఫలితాలను వైద్య, పోషకాహార నిపుణులతో విశ్లేషింపజేశారు.
- ప్రతి ప్లేటులోని ఆహార పదార్థాల వివరాలను 95శాతం కచ్చితంగా చెప్పిందని నిపుణులు తేల్చారు. దీంతో వందశాతం ఫలితాలు వచ్చేంత వరకూ అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

బహుళ ప్రయోజనాలు...



– పి.రాజా ప్రసాదరావు, సీఈవో డిజిటల్ టెక్నాలజీస్ హెల్త్‌కేర్, హైదరాబాద్

జననీమిత్ర యాప్ ద్వారా మహిళలు, గర్భిణులకు ఆరోగ్య సంరక్షణతో పాటు బహుళ ప్రయోజనాలు కలగనున్నాయి. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం 30 శాతం మంది మహిళలు, గర్భిణులు రక్తహీనతను తగ్గించుకునేందుకు మందులు వినియోగిస్తున్నారు. ఈ యాప్ అందుబాటులోకి వస్తే వారికి ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ పెరగడంతో పాటు మందుల వినియోగం తక్కువయ్యే అవకాశాలున్నాయి.



కెరటాల కుంచెకు తీరమే కాన్వాసు!

అలలు కుంచెలై.. కడలి ఒడ్డే కాన్వాసుగా మారితే ఎలా ఉంటుంది? ఇదిగో ఈ చిత్రంలో చూపించినట్లే కనువిందు చేస్తుంది. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పెదమైనవానిలంక తీరం శుక్రవారం కళాత్మకంగా కనిపించింది. తీరం వెంట ఉన్న నల్ల మట్టి పొరలు కెరటాలకు కరిగి, బంగారు వర్ణంలోని ఇసుక తిన్నెల్లో కలిసి ఇలాంటి విచిత్రం ఏర్పడింది. బీచ్‌కు వచ్చిన సందర్శకులు సహజ సిద్ధంగా ఏర్పడిన ఇలాంటి చిత్రాలను ఆసక్తిగా ఫొటోలు తీసుకున్నారు. – ఈనాడు, నరసాపురం



రహదారి పొమ్మంటే... అడవి తల్లి అక్కున చేర్చుకుంది!

రోడ్ల విస్తరణలో భాగంగా వాటి వెంబడి ఉన్న ఏళ్ల భారీ వృక్షాలను నరికేయాల్సి వస్తే మనసు అల్లాడుతుంది. ఇలాంటి వాటిని జాతీయ రహదారుల సంస్థ స్థలమార్పిడి (ట్రాన్స్‌లొకేషన్) ప్రక్రియతో బతికించే ప్రయత్నం చేస్తోంది. నాలుగేళ్ల క్రితం నిర్మల్ జిల్లా మీదుగా వెళుతున్న 61వ నంబరు జాతీయ రహదారి విస్తరణ చేపట్టారు. ఆ మార్గంలోని మామడ, దిమ్మదుర్తి, ఖానాపూర్ అటవీ ప్రాంతాల్లో 2,875 చెట్లను తొలగించింది. స్థలమార్పిడికి అవకాశమున్న 230 చెట్లను ఇతర ప్రాంతాలకు తరలించింది. టేకు, చెన్నాగి, ఇప్ప, తాని, మద్ది, రేల, దుంపిడి మొదలైన 51 చెట్లను మామడ బీట్‌లో నాటగా వాటిలో 32 చక్కగా చిగురించాయి. నల్దుర్తి, ఖానాపూర్ అటవీ ప్రాంతాల్లో స్థలమార్పిడి చేసిన వాటిలోనూ చాలావరకు బతికాయి. రహదారి పొమ్మంటే అడవి తల్లి వాటిని అక్కున చేర్చుకొని ప్రాణం పోసిందంటూ స్థానికులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. – న్యూస్‌టుడే, మామడ

కంకికి వెయ్యి గింజలు.. ఎకరానికి పది టన్నులు!

- **వరిలో కొత్త చరిత్ర దిశగా..**
- **ప్రస్తుత రకాలతో పోల్చితే రెట్టింపు ఉత్పత్తి!**



ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుతం రైతులు ఎకరం పొలంలో సాధారణ వరి వేస్తే కంకికి 150 నుంచి 200 గింజలు వస్తున్నాయి. మొత్తం 2 నుంచి 2.5 టన్నుల ధాన్యం వస్తోంది. గత ఏడాది అక్టోబరులో విడుదలైన డీఆర్ఆర్ ధాన్ 75, 76 రకాల్లో వరి కంకికి 450 నుంచి 500 గింజలు వస్తున్నాయి. 3.5 నుంచి 4.5 టన్నుల మేరకు ధాన్యం వస్తోంది. భారత వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్)లో దీనికి రెట్టింపు స్థాయిలో వరి కంకికి వెయ్యి గింజలతో ఎకరానికి పది టన్నుల మేరకు భారీ ఉత్పత్తి సాధించే దిశగా కొత్త వంగడం సిద్ధమవుతోంది. ప్రాథమికంగా ప్రయోగాలు పూర్తికాగా.. తుది ఫలితాల అనంతరం మరో రెండేళ్లలో ఈ రకం అందుబాటులోకి రానుంది. హైబ్రిడ్‌లో కాకుండా సంప్రదాయ రకాల కలయిక ద్వారా ఈ సంస్థ శాస్త్రవేత్తలు కొత్త రకాన్ని సృష్టిస్తున్నారు. తక్కువ కాలంలో సాగయ్యే సన్న రకంగా.. తెగుళ్లను తట్టుకునేలా.. గ్లూకోజ్ శాతం తక్కువ ఉండేలా దీన్ని రూపొందిస్తున్నారు.

చైనాను అధిగమించడమే లక్ష్యం
-ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు

కంకికి వెయ్యి గింజలతో ఎకరానికి పది టన్నులు పండే వరి వంగడం 2027 డిసెంబరు నాటికి అందుబాటులోకి తేవాలని సంకల్పించాం. దీనికి అనుగుణంగా పరిశోధనలు జరుగుతున్నాయి. కొత్త వంగడం వరిలో చరిత్ర సృష్టిస్తుంది. ప్రస్తుతం చైనాలో హైబ్రిడ్ వరి.. ఎకరానికి 6 టన్నులు వస్తోంది. మేం రూపొందిస్తున్న రకం దాన్ని అధిగమిస్తుంది. రైతులకు ఉత్పాదకతను, దేశానికి ఆహారభద్రతను రెట్టింపు చేస్తుంది. కొత్తరకం విత్తనోత్పత్తికీ అనుకూలం.

అలా ఎందుకు... ఇలా చేయొచ్చా?

- **ఖైదీల్లో సైన్స్‌పై జిజ్ఞాస**



రాజమహేంద్రవరం జైలులో సైన్స్ అవుట్‌రీచ్ నిర్వహిస్తున్న సీసీఎంబీ పరిశోధకుడు ఆదిత్య

'సెవెంత్ సెన్స్' సినిమాలో లెక్క ఒకరి డీఎన్ఏని ఇతరుల్లోకి ప్రవేశపెట్టడం సాధ్యమవుతుందా?
అంతరిక్షం నుంచి భూమి వాతావరణంలోకి ప్రవేశించి నేలపై పడిన ఉల్క అని చెప్పే రాయికి ఎందుకంత విలువ ఉంటుంది?
చెత్త నుంచి గ్యాస్ ఎలా తయారవుతుంది?

...ఈ ప్రశ్నలడిగింది విద్యార్థులు కాదు. జైలులోని ఖైదీలు. అమెరికాలోని కారాగారాల్లో నిర్వహించే సైన్స్ అవుట్‌రీచ్ కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని సీసీఎంబీలోని సైన్స్ అండ్ కమ్యూనికేషన్ల అవుట్‌రీచ్ అధికారి సోమ్‌దత్తా కరక్... రాజమహేంద్రవరం (ఆంధ్రప్రదేశ్), చర్లపల్లి జైళ్ల అధికారులకు లేఖలు రాశారు. రాజమహేంద్రవరం అధికారుల ఆహ్వానంతో తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారి ఖైదీల కోసం సైన్స్ అవుట్‌రీచ్ చేపట్టారు. "ఇప్పటివరకు మేం విద్యాసంస్థలు, గ్రామాలకు వెళ్లాం. పిల్లలు, రైతుల్ని కలుసుకున్నాం. ఖైదీలకు సైన్స్‌పై అవగాహన కల్పించడం ఇదే మొదటిసారి. మొత్తం 105 మంది ఖైదీలు హాజరయ్యారు. సినిమాలు చూసే, పత్రికలు చదివే అలవాటుతో వచ్చిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ముఖ్యంగా సైన్స్‌పై చాలా ఆసక్తి చూపించారు" అని సీసీఎంబీ పరిశోధకుడు ఆదిత్య 'ఈనాడు'తో తెలిపారు. –ఈనాడు, హైదరాబాద్

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఇస్రో సేవలు



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల ప్రణాళికల రూపకల్పనలో ఇస్రో సేవలను వినియోగించుకునేందుకు తితిదే సిద్ధమవుతోంది. కొన్నేళ్లుగా ముఖ్య వాహన సేవల్లో పాల్గొంటున్న భక్తుల సంఖ్యను తితిదే సుమారుగా లెక్కిస్తోంది. సెప్టెంబరు 24 ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే గరుడోత్సవం రోజున మాడవీధులు, బయట ఎంతమంది భక్తులు శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉందన్నది అత్యాధునిక శాటిలైట్ల ద్వారా గుర్తించి, సమాచారాన్ని తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. తద్వారా తగిన ఏర్పాట్లు చేయొచ్చని అధికారులు భావిస్తున్నారు.



సెర్బియాలోని నొవిశాడ్‌లో కార్బన్ ఫైబర్ ఇన్సోల్స్, హీల్స్‌తో చేతితో రూపొందించిన సరికొత్త పాదరక్షను ప్రదర్శిస్తున్న ఓ దుకాణదారు. వీటిని ఆర్టిజన్ పింగాణీ, బంగారంతో అలంకరించారు.

కంటెంట్ క్రియేటర్లకు యూట్యూబ్ 'హైప్'

ఇంటర్నెట్ డెస్క్: యూట్యూబ్‌లోకి కొత్తగా వచ్చినవారు వీడియోల రీచ్ కోసం నానా తంటాలు పడుతుంటారు. వ్యూయర్‌షిప్ పెంచుకునేందుకు వీరు చేయని ప్రయత్నం ఉండదు. ఇలాంటివారి కోసం యూట్యూబ్ కొత్త ఫీచరు తీసుకొచ్చింది. చేసిన వీడియోలు ఎక్కువ మందికి చేరేందుకు, ఎక్కువ వీక్షణలు పొందేందుకు 'హైప్' పేరిట కొత్త సదుపాయాన్ని భారత్‌లో అందుబాటులోకి తెచ్చింది. 500 నుంచి 5 లక్షల వరకు చందాదారులు కలిగిన క్రియేటర్ల కోసం 'హైప్' ఫీచరును యూట్యూబ్ ప్రవేశపెట్టింది. దీనికి అర్హత సాధించిన ఛానల్ దిగువభాగంలో ఆటోమేటిక్‌గా హైప్ అనే కొత్త బటన్ కనిపిస్తుంది. దీని మీద క్లిక్ చేస్తే కొన్ని వీడియో పాయింట్లు యాడ్ అవుతాయి. తద్వారా ఆ వీడియో ఎక్కువ మందికి చేరడానికి ఉపయోగపడుతుంది. ఒకసారి హైప్ పొందిన వీడియో.. పాయింట్ల ఆధారంగా టాప్-100 జాబితాలోకి చేరుతుంది. యూట్యూబ్‌లోని ఎక్స్‌ప్లోర్ ట్యాబ్‌లో హైప్ వీడియోల జాబితా కనిపిస్తుంది. చందాదారుల సంఖ్య తక్కువగా ఉన్న ఛానళ్లను సైతం ప్రోత్సహించే ఉద్దేశంతో యూట్యూబ్ కొన్ని బోనస్ పాయింట్లను కేటాయిస్తుంది. హైప్ పొందాలంటే ఆ వీడియో కనీసం ఏడు రోజుల్లోపు అప్‌లోడ్ అయ్యి ఉండాలి. వ్యూయర్స్ కూడా తాము చూసే వీడియోలకు హైప్ ఇవ్వొచ్చు. లైక్, షేర్ తరహాలో లైక్ బటన్ కింద ఉండే 'హైప్' బటన్‌ను క్లిక్ చేయొచ్చు. ఒక వారంలో మూడు ఫ్రీ హైప్‌లు ఇవ్వొచ్చు. వ్యూయర్స్ ఇచ్చిన హైప్ ద్వారా ఆ వీడియో లీడర్ బోర్డులో పైకి వస్తుంది. తద్వారా యూట్యూబ్ రెకమండేషన్‌లోనూ కనిపిస్తుంది.

దాత.. సర్కారు బడికి చేయూత



చక్కటి ఏకరూప దుస్తులు, మెడలో టై, కాళ్లకు బూట్లు ధరించి బస్సు ఎక్కుతున్న వీరంతా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు. ఇదే గ్రామానికి చెందిన కావేరి విత్తన సంస్థ ఎం.డి. గుండవరపు భాస్కర్‌రావు తన ఊరిని దత్తత తీసుకొని మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల భవనాన్ని కార్పొరేట్ స్థాయిలో ఆధునికీకరించారు. ప్రస్తుతం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కలిపి 800 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. సమీప ఐదు కి.మీ. పరిధిలోని గ్రామాల నుంచి వచ్చే 420 మంది పిల్లల కోసం మూడు బస్సులు ఏర్పాటు చేశారు. డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు, డీజిల్ కోసం దాత భాస్కర్‌రావు ప్రతినెలా రూ.1.50 లక్షలను వెచ్చిస్తున్నారు. విద్యార్థులకు ఏటా రెండు జతల ఏకరూప దుస్తులు, బ్యాగు, బెల్టు, టై అందిస్తున్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులను, ఆయాలను నియమించి, వారి వేతనాలనూ తనే చెల్లిస్తూ ఔదార్యాన్ని చాటుతున్నారు. – న్యూస్‌టుడే, భీమదేవరపల్లి

మీ చిన్నారులకు 'ఆరోగ్యభాగ్యం'..



ఈనాడు, హైదరాబాద్: పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే అతి పెద్ద ఆస్తి ఆరోగ్యమే. అందుకు దోహదం చేసే వాటిలో టీకాలది కీలకపాత్ర. సాధారణంగా షెడ్యూలు ప్రకారం తల్లిదండ్రులు పిల్లలకు టీకాలిప్పిస్తుంటారు. కొందరిలో అవగాహన లేమి, ఉపాధి కోసం వలసలు వెళ్లడం.. షెడ్యూలును మర్చిపోవడం ఇతరత్రా కారణాలతో కొన్నిసార్లు అవి తప్పిపోతుంటాయి. హైదరాబాద్‌లోని పిల్లల్లో ఇప్పటికీ కంఠసర్పి బయటపడుతోంది. సీజన్‌లో ఏటా నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో కంఠసర్పి, గవదబిళ్లల సమస్యలతో పిల్లలు చికిత్స కోసం చేరుతున్నారు. బాధితుల్లో 5 నుంచి 15 ఏళ్ల వయసులోపు పిల్లలే ఎక్కువ. ఇందులో 80-90 శాతం మంది గతంలో వ్యాధి నిరోధక టీకాలు తీసుకోని వారేనని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎప్పుడు.. ఏ టీకా వేయించాలనే అంశాన్ని మరోసారి గుర్తుచేసుకుందాం... ప్రతి బుధ, శనివారాల్లో పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో జాతీయ టీకా కార్యక్రమం కింద ఉచితంగా టీకాలు పొందే అవకాశం ప్రతి చిన్నారికి ఉంది. పిల్లలకు టీకాలు ఇప్పించడంలో అపోహలకు లోనుకావొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

క్రమం తప్పకుండా టీకాలు ఇలా..

- పుట్టిన శిశువుకు.. బీసీజీ(క్షయ), పోలియో(మొదటి డోసు), హెపటైటిస్ బి(మొదటి డోసు)
- **6, 10, 14 వారాలు:** పెంటావాలెంట్(డీపీటీ, హిబ్, హెపటైటిస్ బి), రోటావైరస్, పోలియో
- **6–9 నెలలు:** ఇన్‌ఫ్లుయెంజా
- **9 నెలలు:** ఎంఎంఆర్(మీజిల్స్, మంప్స్, రూబెల్లా), జేఈ(మెదడు వాపు వ్యాధి)
- **15 నుంచి 18 నెలలు:** డీపీటీ, పోలియో, ఎంఎంఆర్, జేఈ
- **5–6 సంవత్సరాలు:** డీపీటీ బూస్టర్, పోలియో బూస్టర్
- **10 సంవత్సరాలు:** టెటనస్, డిఫ్తీరియా బూస్టర్, హెచ్‌పీవీ(బాలికలకు)
- **16 ఏళ్లు:** టెటనస్, డిఫ్తీరియా బూస్టర్ డోసు




సౌరశక్తే చుక్కాని.. నింగిలోకి ఎగరనీ..

జెనీవా: సౌరశక్తితో ఎగిరే ఈ ప్రయోగాత్మక విమానం పేరు సోలార్‌స్ట్రాటోస్. దీనిని స్విస్ సాహసికుడు రాఫెల్ డొమ్జాన్ రూపొందించారు. శుక్రవారం స్విట్జర్లాండ్‌లోని అల్బైన్ గ్రామం వద్ద ప్రయోగ పరీక్షలో భాగంగా మాటర్‌హార్న్ పర్వత ప్రాంతంలో ఎగురుతూ కనిపించింది.

తాత... తండ్రి.. మనవడు.. ఒక హెర్క్యులస్!

మూడు తరాలకు దారి చూపిన సైకిల్



ఈ సైకిల్‌పై వెళుతుంటే తనకు తన తాత పైలం(భద్రం) చెబుతున్నట్లుగా... తండ్రి దారి చూపుతున్నట్లుగా ఉంటుందని కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రావికంటి సురేందర్ (62) చెబుతున్నారు. ఎందుకంటే ఈ సైకిల్‌కు 75 ఏళ్ల చరిత్ర ఉంది. సురేందర్ తాత శంకరయ్య 1950లో స్థానికంగా కిరాణా దుకాణం నిర్వహించేవారు. అప్పట్లో ఇంగ్లండ్ నుంచి హెర్క్యులస్ సైకిల్ తెప్పించుకున్నారు. శంకరయ్య తదనంతరం ఆయన కుమారుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు సాంబయ్య ఇదే సైకిల్‌పై జమ్మికుంట పరిధిలోని మోత్కులగూడెం, కేశవపూర్, ఆబాది జమ్మికుంట, వల్భాపూర్, సిరిసేడు, జమ్మికుంట పాఠశాలలకు వెళ్లేవారు. "నేను పార్ట్‌టైమ్ అధ్యాపకుడిగా చేరినప్పుడు 1990లో ఈ సైకిల్ నా చేతికి వచ్చింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 2002లో శాశ్వత ఉద్యోగం వచ్చినా దీన్ని వీడలేదు. జమ్మికుంట మండలం అంకుశాపూర్, రంగమ్మపల్లి, ఇల్లంతకుంట, హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లె పాఠశాలలకు దీనిపైనే రోజూ 12 కి.మీ. వెళ్లేవాడిని. 2020లో ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా ఇదే సైకిల్ వాడుతున్నా. చిన్నచిన్న మరమ్మతులు మినహా పెద్దగా మార్పులేమీ చేయలేదు" అని సురేందర్ వివరించారు. – న్యూస్‌టుడే, జమ్మికుంట



అన్నీ తెలిసినట్లు నటిస్తే మీకే చేటు

జ్ఞానసముపార్జనలో రెండు దశలుంటాయి. ఏదైనా ఓ విషయం మీకు తెలియకపోతే అది తెలియదని అంగీకరించడం మొదటి దశ. అంతటితో ఆగిపోకుండా ఆ విషయంపై అధ్యయనం చేసి సంపూర్ణ అవగాహన తెచ్చుకోవడం రెండో దశ. అలా కాకుండా, అన్నీ తెలిసినట్లు నటిస్తే ఎప్పటికీ మీ జ్ఞానం వృద్ధి చెందదు.

– విక్టోరియా రెపా, లీడర్‌షిప్ కోచ్


ఆసుపత్రుల్లో 'క్యూఆర్ కోడ్'



కొన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్నో సమస్యలున్నా పర్యవేక్షణ లోపంతో పరిష్కారానికి నోచుకోవు. వాటిని ఎవరి దృష్టికి తీసుకెళ్లాలి, తీసుకెళ్తే వారేమంటారో అని సామాన్యులు అలాగే నెట్టుకొస్తుంటారు. ఫలితంగా ఆ వ్యవస్థ మారదు.. కష్టాలూ తీరవు. ఏళ్లనాటి ఈ సమస్యకు కూటమి ప్రభుత్వం చక్కని దారి చూపింది. సర్కారీ ఆసుపత్రుల్లో గోడలకు అక్కడక్కడ క్యూఆర్ కోడ్‌లు అతికించింది. ఎవరైనా సరే సెల్‌ఫోన్‌తో దాన్ని స్కాన్ చేసి.. వచ్చే బాక్సులో సమస్య లేదా సలహా రాయొచ్చు. రాయరాని వారి కోసం ఐచ్ఛికాలూ ఇచ్చింది. ఆ సమస్యపై టిక్ చేస్తే సరి. ఇలా వచ్చే సలహాలు, సూచనలు, సమస్యలన్నీ నేరుగా 'apgovsurvey.com'లో నమోదవుతాయి. ప్రభుత్వం సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి, చర్యలు తీసుకుంటుంది. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను చిత్రంలో చూడొచ్చు.

– ఈనాడు, కాకినాడ

'టీవీ'క్షిస్తూ చెవులు రెక్కిస్తాయ్!



దిల్లీ: పెంపుడు కుక్కలకూ వ్యక్తిత్వం ఉంటుందా? వాటికీ టీవీ చూసే అలవాటు ఉంటుందా? అందులో వినిపించే శబ్దాలకు అవి స్పందిస్తాయా? ఈ ప్రశ్నలకు 'అవును' అనే సమాధానం చెబుతున్నారు అమెరికాలోని ఆబర్న్ విశ్వవిద్యాలయ పరిశోధకులు. భయపడే స్వభావం ఎక్కువగా ఉన్న పెంపుడు కుక్క టీవీలో వినిపించే కారు శబ్దానికీ, డోర్‌బెల్ మోతకూ స్పందించవచ్చని వారు పేర్కొన్నారు. ఈ మేరకు వారి అధ్యయన నివేదిక 'సైంటిఫిక్ రిపోర్ట్స్' అనే జర్నల్‌లో ప్రచురితమైంది. టీవీ వీక్షించే అలవాటు కుక్కలకు మెరుగైన, అర్థవంతమైన అనుభూతిని కలిగిస్తుందని, తెరపై జంతువులు కనిపించినప్పుడు కుక్కలు ఎక్కువగా స్పందిస్తాయని గుర్తించారు.

నీటి బుడగ కాదు.. జెల్లీ ఫిష్!



విశాఖలోని రుషికొండ బీచ్ సమీపంలోని సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకారులకు చేపలతో పాటు జెల్లీఫిష్‌లూ పడ్డాయి. వలను ఒడ్డుకు లాగాక.. అందులోని జెల్లీ ఫిష్‌లను సందర్శకులు ఆసక్తిగా గమనించారు. అవి మొత్తం పారదర్శకంగా ఉండటంతో ఇసుకపై ఓ నీటి బుడగలా కనిపించాయి. వాటి వల్ల ప్రయోజనం లేదని మత్స్యకారులు సముద్రంలోనే వదిలేశారు. కడలిలో లోతు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో తిరిగే జెల్లీలు.. ఆపద ఎదురైనప్పుడే తీరానికి సమీపంలోకి వచ్చి ఇలా వలలకు చిక్కుతాయని మత్స్యకారులు తెలిపారు. – న్యూస్‌టుడే, విశాఖపట్నం (సాగర్‌నగర్)

ఛాంపియన్

ఎనిమిదిలో నలుగురు మనోళ్లే

- క్వార్టర్స్‌లో హంపి, హారిక, దివ్య, వైశాలి
- ఫిడే మహిళల ప్రపంచకప్


హంపి


హారిక


వైశాలి


దివ్య

బటుమి (జార్జియా): ఈసారి ఫిడే మహిళల ప్రపంచకప్ చాలా విశిష్టం. భారత అమ్మాయిలదే హవా. తొమ్మిది మంది బరిలో దిగితే ఏకంగా నలుగురు క్వార్టర్ ఫైనల్స్ చేరారు. అందులో ఇద్దరు క్వార్టర్స్‌లో తలపడబోతుండడంతో ఒక సెమీస్ బెర్తు కూడా ఖాయమైంది. జోరు కొనసాగిస్తూ కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, దివ్య దేశ్‌ముఖ్, వైశాలి తుది ఎనిమిది జాబితాలో చోటు దక్కించుకున్నారు. శుక్రవారం టైబ్రేక్‌లో హంపి 2.5-1.5తో అలెగ్జాండ్రా కోస్టెనిక్ (స్విట్జర్లాండ్)ను ఓడించింది. టైబ్రేక్‌లో తొలి గేమ్ గెలిచిన హంపి.. రెండో గేమ్‌ను డ్రా చేసుకుని ముందంజ వేసింది. కేథరిన లాగ్నో (రష్యా)పై హారిక 3.5-2.5తో నెగ్గింది. టైబ్రేక్‌లో తొలి రెండు గేమ్‌లను హారిక, లాగ్నో పంచుకున్నారు. మూడో గేమ్ డ్రా కాగా.. నాలుగో గేమ్‌ను సొంతం చేసుకున్న హారిక విజయాన్ని అందుకుంది. దివ్య 2.5-1.5తో జిన్ జు (చైనా)పై పైచేయి సాధించింది. టైబ్రేక్‌లో తొలి గేమ్‌లో నెగ్గిన దివ్య.. రెండో గేమ్‌ను డ్రా చేసుకుంది. వైశాలి 4.5-3.5తో కమలిదెనోవా (కజకిస్థాన్) ఆట కట్టించింది. టైబ్రేక్‌లో తొలి నాలుగు గేమ్‌ల్లో వైశాలి, కమలిదెనోవా చెరో రెండు నెగ్గారు. ఐదో గేమ్ డ్రా కాగా.. ఆరో గేమ్‌ను వైశాలి సొంతం చేసుకుంది. క్వార్టర్స్‌లో సంగ్ యిన్గ్నిన్ (చైనా)తో హంపి.. జాంగ్యీ (చైనా)తో వైశాలి ఆడనున్నారు. మరో క్వార్టర్స్‌లో దివ్యతో హారిక తలపడనుంది. ఈ టోర్నీలో టాప్-3లో నిలిచిన ప్లేయర్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం పోటీ పడే ప్లేయర్లను నిర్ణయించే కాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధిస్తారు. ఈ టోర్నీలో భారత్ నుంచి నలుగురు ప్లేయర్లు క్వార్టర్స్ చేరడమిదే తొలిసారి.

సెమీస్‌లో అర్జున్


అర్జున్

లాస్‌వెగాస్: ఫ్రీస్టైల్ గ్రాండ్ స్లామ్ చెస్ టూర్‌లో భారత స్టార్ అర్జున్ ఇరిగేశి సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం క్వార్టర్‌ఫైనల్లో అతడు 1.5-0.5తో అబ్దు సత్తారోవ్ (ఉజ్బెకిస్థాన్)ను ఓడించాడు. సత్తారోవ్‌తో తొలి గేమ్‌ను డ్రా చేసుకున్న అర్జున్.. రెండో గేమ్‌లో నెగ్గి ముందంజ వేశాడు. సెమీస్‌లో లెవోన్ అరోనియన్ (ఆర్మేనియా)తో అర్జున్ తలపడనున్నాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద టైటిల్ రేసుకు దూరమయ్యాడు. క్వార్టర్స్‌లో అతడు 3-4తో ఫాబియానో కరువానా (అమెరికా) చేతిలో పోరాడి ఓడాడు. వీరిద్దరి మధ్య 10 గంటలకు పైగా.. ఏడు గేమ్‌లు జరిగాయి. ఒకటికి రెండుసార్లు ప్రజ్ఞానంద ఆధిక్యంలో నిలిచాడు. కానీ ఒత్తిడికి గురై ఆరు, ఏడు గేమ్‌లను చేజార్చుకుని ఓటమి వైపు నిలిచాడు. ఇతర క్వార్టర్స్‌లో అరోనియన్ 2.5-1.5తో నకమురు (అమెరికా)పై, హన్స్ నీమన్ (అమెరికా) 4-2తో సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్)పై నెగ్గారు. వర్గీకరణ పోరులో ప్రపంచ నం.1 మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) 2-0తో విదిత్ గుజరాతిపై విజయం సాధించాడు. ప్రజ్ఞానంద చేతిలో ఓడిన కార్ల్‌సన్ టైటిల్ రేసుకు దూరమైన సంగతి తెలిసిందే.

పంత్‌తో ఎలా?

ఆడినా కష్టమే.. ఆడకపోయినా కష్టమే

రిషబ్ పంత్.. ప్రస్తుతం భారత టెస్టు జట్టులో సూపర్ ఫామ్‌లో ఉన్న బ్యాటర్లలో ఒకడు. అండర్సన్-తెందుల్కర్ ట్రోఫీలో అత్యంత నిలకడగా ఆడుతున్న ఆటగాళ్లలోనూ అతనొకడు. 425 పరుగులతో సిరీస్‌లో రెండో అత్యధిక పరుగుల వీరుడిగా కొనసాగుతున్నాడు ఈ విధ్వంసక వికెట్ కీపర్. అలాంటి బ్యాటర్‌ను నాలుగో టెస్టులో ఆడించాలా వద్దా అని అయోమయానికి గురవుతోంది టీమ్‌ఇండియా. అతణ్ని ఆడించినా కష్టమే.. ఆడించకపోయినా కష్టమే అన్నట్లుంది పరిస్థితి.


రిషబ్ పంత్

మిగతా ఫార్మాట్లతో పోలిస్తే టెస్టుల్లో రిషబ్ పంత్ ఎంతో కీలకం. తన కెరీర్లో ఉత్తమ ప్రదర్శనలు ఎక్కువగా టెస్టుల్లో నమోదైనవే. ఆస్ట్రేలియాలో రెండుసార్లు టీమ్‌ఇండియా చరిత్రాత్మక సిరీస్ విజయాలు సాధించడంలో అతడి పాత్ర కీలకం. ఇంగ్లాండ్‌లోనూ మంచి రికార్డుతో ఈ పర్యటనకు వచ్చిన అతను.. ఈసారి మరింతగా రాణిస్తున్నాడు. 3 టెస్టుల్లో 2 శతకాలు, 2 అర్ధశతకాలతో అదరగొట్టాడు. అయితే మూడో టెస్టులో తొలి రోజు వికెట్ కీపింగ్ చేస్తుండగా.. బుమ్రా బంతి తగిలి అతడి ఎడమ చూపుడు వేలికి గాయమైంది. దీంతో ఆ రోజంతా మైదానానికి దూరమయ్యాడు. తర్వాతి రోజు బ్యాటింగ్‌కు వచ్చాడు. విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం విఫలమయ్యాడు. పంత్ బ్యాటింగ్ చేస్తుండగా అతడిని వేలి గాయం ఇబ్బంది పెట్టింది. అయినా ఓర్చుకుని ఆడాడు. ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ అతను వికెట్ కీపింగ్ చేయలేదు. ఈ మ్యాచ్ తర్వాత, నాలుగో టెస్టుకు ముందు 8 రోజుల విరామం వచ్చింది. అయినా సరే పంత్ వేలి గాయం పూర్తిగా మానే సంకేతాలు లేవని తెలుస్తోంది. అతను మాంచెస్టర్‌లో బ్యాటింగ్ మాత్రమే చేయగలడట. వికెట్ కీపింగ్ చేస్తే గాయం మానడం కష్టమవుతుంది. అందుకని అతణ్ని స్పెషలిస్టు బ్యాటర్‌గా ఆడించి, ధ్రువ్ జురెల్‌ను వికెట్ కీపర్ బ్యాటర్‌గా తీసుకోవాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది. జురెల్ కోసం తొలి మూడు టెస్టుల్లో విఫలమైన కరుణ్ నాయర్‌ను పక్కన పెట్టే అవకాశముంది. అయితే పంత్‌ను స్పెషలిస్టు బ్యాటర్‌గా తీసుకోవాలన్న నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ కోచ్, వ్యాఖ్యాత రవిశాస్త్రి దీన్ని తప్పుబడుతున్నాడు. వికెట్ కీపింగ్ చేస్తే గాయం తీవ్రత పెరుగుతుందంటే.. అతను ఫీల్డింగ్ చేస్తే ఇబ్బంది తలెత్తదా అని ఆయన ప్రశ్నిస్తున్నాడు. వికెట్ కీపింగ్‌లో గ్లోవ్స్ రక్షణ అయినా ఉంటుందని.. అవి కూడా లేకుండా ఫీల్డింగ్ చేస్తే చాలా కష్టమని ఆయన అభిప్రాయపడ్డాడు. పంత్ వికెట్ కీపింగ్ చేయలేని స్థితిలో అతణ్ని పక్కన పెట్టి, మరో బ్యాటర్‌ను ఎంచుకోవడమే మంచిదని ఆయన పేర్కొన్నాడు. రవిశాస్త్రి అభిప్రాయంతో చాలా మంది ఏకీభవిస్తున్నారు. పంత్ కీలక బ్యాటరే అయినప్పటికీ.. అతడి స్థానాన్ని భర్తీ చేయడం కష్టమే అయినప్పటికీ.. ప్రస్తుత పరిస్థితుల్లో తనను ఆడించకపోవడమే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ సిరీస్ తొలి మ్యాచ్‌లో ఆడించి, తర్వాత పక్కన పెట్టేసిన తమిళనాడు యువ బ్యాటర్ సాయి సుదర్శన్‌ను జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. కరుణ్‌కు మూడు టెస్టుల్లో అవకాశాలు ఇచ్చిన జట్టు యాజమాన్యం.. సుదర్శన్ విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరించింది. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన సుదర్శన్.. రెండో ఇన్నింగ్స్‌లో 30 పరుగులు చేసి పర్వాలేదనిపించాడు. మెరుగైన టెక్నిక్ ఉన్న అతడికి మరిన్ని అవకాశాలు ఇస్తే జట్టులో కుదురుకునే అవకాశముంది. మరి టీమ్ మేనేజ్‌మెంట్ నాలుగో టెస్టుకు తుది జట్టు ఎంపికలో ఎవరికి ఓటేస్తుందో చూడాలి మరి.

– ఈనాడు క్రీడావిభాగం


అదనపు బౌలర్‌ను తీసుకోవాలి


రహానె

ముంబయి: ఇంగ్లాండ్‌తో ఆఖరి రెండు టెస్టుల్లో భారత్ అదనపు బౌలర్‌తో బరిలో దిగాలని టీమ్‌ఇండియా ఆటగాడు అజింక్య రహానె సలహా ఇచ్చాడు. బుమ్రా, సిరాజ్, ఆకాశ్‌దీప్‌కు తోడు మరో రెగ్యులర్ పేసర్ అవసరం అన్న ఉద్దేశంతో అతడీ వ్యాఖ్యలు చేశాడు. నితీశ్ కుమార్ రెడ్డి ఉన్నా అతడు పార్ట్ టైమ్ బౌలర్. "మూడో టెస్టులో ఇంగ్లాండ్ గొప్పగా బౌలింగ్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోరు చేసే అవకాశాన్ని వదులుకుంది. రాబోయే టెస్టుల్లో టీమ్‌ఇండియా ఒక అదనపు బౌలర్‌ను తీసుకోవాలి. ఎందుకంటే టెస్టు గెలవాలంటే 20 వికెట్లు పడగొట్టాలి" అని రహానె పేర్కొన్నాడు.

2036 ఒలింపిక్స్‌లో టాప్-5 లక్ష్యం

కేంద్ర హోం మంత్రి అమిత్ షా


అమిత్ షా

దిల్లీ: 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా భారత్ సన్నాహాలు మొదలుపెట్టిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఇందుకోసం సుమారు 3,000 మంది క్రీడాకారులకు ఒక్కొక్కరికి నెలకు రూ.50,000 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. 2036 విశ్వ క్రీడల్లో టాప్-5లో నిలవడమే లక్ష్యంగా సాగుతున్నట్లు ఆయన చెప్పారు. శుక్రవారం ప్రపంచ పోలీస్, ఫైర్ క్రీడల్లో పాల్గొనే భారత బృందం సన్మాన కార్యక్రమంలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. "గత పదేళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యం లభించింది. క్రీడల బడ్జెట్‌ను ఐదు రెట్లు పెంచారు. 2036 ఒలింపిక్స్‌కు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సుమారు 3,000 మంది క్రీడాకారులకు నెలకు రూ.50,000 చొప్పున అందజేస్తోంది. ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా క్రీడాభివృద్ధికి కృషి చేస్తోంది. ఇలాగే సాగితే 2036 ఒలింపిక్స్ పతకాల పట్టికలో భారత్ టాప్-5లో నిలవగలదు" అని అమిత్ షా పేర్కొన్నారు.

బీసీసీఐకి 9,741 కోట్ల ఆదాయం

దిల్లీ: 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీసీసీఐ రికార్డు స్థాయిలో ఆదాయం ఆర్జించింది. రీడిఫ్యూజన్ నివేదిక ప్రకారం భారత క్రికెట్ బోర్డు రూ.9,741 కోట్లు సంపాదించింది. అందులో సింహభాగం ఐపీఎల్ ద్వారా లభించింది. మొత్తం ఆదాయంలో 59 శాతం వాటాతో ఐపీఎల్ రూ.5,761 కోట్లు రాబట్టింది. ఐపీఎల్ కాకుండా మిగతా ఈవెంట్ల మీడియా హక్కుల ద్వారా బోర్డుకు రూ.361 కోట్లు వచ్చాయి. భారత జట్టు పాల్గొనే టోర్నీల ద్వారా లభించిన మొత్తం ఇది. టీమ్‌ఇండియా మ్యాచ్‌ల హక్కులు వయాకామ్-18 దగ్గర ఉన్నాయి. 2023-27 కాలానికి గాను ఐపీఎల్ మీడియా హక్కుల్ని డిస్నీ స్టార్, వయాకామ్-18 సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

డ్యూక్స్ బంతుల నాణ్యతను సమీక్షిస్తాం

తయారీదారు ప్రకటన




లండన్: భారత్-ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో వినియోగిస్తున్న డ్యూక్స్ బంతుల నాణ్యతపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వాటి తయారీ సంస్థ బ్రిటిష్ క్రికెట్ బాల్స్ లిమిటెడ్ స్పందించింది. బంతుల నాణ్యతను సమీక్షించి మెరుగుపరచడానికి ప్రయత్నిస్తామని తెలిపింది. బంతిపై త్వరగా మెరుపు పోయి మృదువుగా తయారవుతుండడం.. స్వింగ్‌కు సహకరించకపోవడంతో ఇరు జట్లూ ఇబ్బంది పడ్డాయి. భారత్ అయితే బంతి మార్పు కోసం పదే పదే అంపైర్లను అడగడం చర్చనీయాంశంగా మారింది. ఆటగాళ్లతో పాటు మాజీలు సైతం ఈ బంతుల నాణ్యతపై సందేహాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తయారీ సంస్థ యజమాని దిలీప్ జజోడియా స్పందించాడు. "మేం దీన్ని సమీక్షిస్తాం. బంతి కోసం వాడే పదార్థాలతో సహా అన్నింటినీ పరిశీలిస్తాం. కొన్ని మార్పులు చేసి బంతిని మెరుగ్గా తీర్చిదిద్దే ప్రయత్నిస్తాం" అని అతను తెలిపాడు.

రెడ్‌బాల్ స్నూకర్‌కు అద్వాణీ

మనామా (బహ్రెయిన్): ప్రపంచ 6-రెడ్ బాల్ స్నూకర్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ పంకజ్ అద్వాణీ పోటీపడబోతున్నాడు. గతంలో మూడుసార్లు విజేతగా నిలిచిన పంకజ్.. శనివారం ఆరంభమయ్యే టోర్నీలోనూ ఫేవరెట్‌గా బరిలో దిగుతున్నాడు. అతడితో పాటు ఆదిత్య మెహతా, బ్రిజేశ్ దమానిలకు వైల్డ్‌కార్డ్ ఎంట్రీ లభించింది. ఈ టోర్నీలో కమల్ చావ్లా, పరాస్ గుప్తా, పుష్పేందర్ సింగ్, మల్కీత్‌సింగ్ కూడా పోటీలో ఉన్నారు. మాస్టర్స్ విభాగంలో మనన్ చంద్ర, విజయ్ నిచాని, రుబాష్ జైన్ పోటీపడుతున్నారు.

జడేజా.. అత్యంత విలువైన ఆటగాడు


గంభీర్

లండన్: లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టెస్టులో భారత జట్టును గెలిపించడం కోసం గొప్ప పోరాటమే చేశాడు రవీంద్ర జడేజా. అవతలి ఎండ్‌లో టెయిలెండర్లను కాచుకుంటూ, మరో ఎండ్‌లో ఒక్కో పరుగూ కూడగడుతూ జట్టును విజయానికి దగ్గరగా తీసుకెళ్లాడు. కానీ ఇంకో 23 పరుగులు చేస్తే గెలిచే స్థితిలో ఆఖరి వికెట్ పడిపోవడంతో నిరాశ తప్పలేదు. భారత్ ఓడినా జడ్డూ పోరాటం మాత్రం అందరినీ ఆకట్టుకుంది. అందుకే అతణ్ని జట్టులో అంతర్గతంగా సత్కరించారు. జడేజాను అత్యంత విలువైన ఆటగాడిగా పేర్కొంటూ కోచ్ గంభీర్, సహచరులు అతణ్ని కొనియాడారు. దీనికి సంబంధించిన వీడియోను బీసీసీఐ టీవీ పోస్ట్ చేసింది. 'అది అసాధారణ పోరాటం. చివరి రెండు టెస్టుల్లో జడ్డూ బ్యాటింగ్ మరో స్థాయికి చేరింది. తనను చాలా ఏళ్లుగా చూస్తున్నా. బ్యాటింగ్‌ను ఎంతో మెరుగుపరచుకున్నాడు. తన డిఫెన్స్ దుర్భేద్యంగా ఉంటోంది. ఇప్పుడు అసలైన బ్యాటర్‌లా కనిపిస్తున్నాడు" అని గంభీర్ పేర్కొన్నాడు.

బుమ్రా ఆల్ టైం గ్రేట్.. రోహిత్ లెజెండ్!


బ్రయాన్ లారా

దిల్లీ: టీమ్‌ఇండియా ఫాస్ట్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఆల్ టైం గ్రేట్ క్రికెటర్లలో ఒకడిగా అభివర్ణించాడు వెస్టిండీస్ దిగ్గజ బ్యాటర్ బ్రయాన్ లారా. ఇంగ్లాండ్ మాజీ ఆటగాళ్లు అలిస్టర్ కుక్, మైకెల్ వాన్, డేవిడ్ లాయిడ్, ఫిల్ టఫ్నెల్‌లతో కలిసి పాల్గొన్న ఒక పాడ్‌కాస్ట్‌లో తన దృష్టిలో ఆల్‌టైం గ్రేట్ క్రికెటర్లెవరో లారా వెల్లడించాడు. బుమ్రాతో పాటు ఆస్ట్రేలియా పేస్ దిగ్గజం గ్లెన్ మెక్‌గ్రాత్, ఆ జట్టు మాజీ వికెట్ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్, దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్‌లకు లారా ఈ జాబితాలో చోటిచ్చాడు. టీమ్‌ఇండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ, న్యూజిలాండ్ మాజీ సారథి కేన్ విలియమ్సన్, పాకిస్థాన్ పేసర్ షహీన్ అఫ్రిది.. మాజీ ఆటగాళ్లు క్రిస్ గేల్, కెవిన్ పీటర్సన్‌లను 'లెజెండ్స్'గా లారా అభివర్ణించాడు.

కివీస్‌కు రెండో విజయం


కాన్వే 59*

హరారే: ముక్కోణపు టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ అదరగొడుతోంది. ఆ జట్టు వరుసగా రెండో విజయాన్ని సాధించింది. శుక్రవారం కివీస్ 8 వికెట్ల తేడాతో ఆతిథ్య జింబాబ్వేను చిత్తు చేసింది. మొదట జింబాబ్వే 7 వికెట్లకు 120 పరుగులే చేసింది. మదెవెర్ (36), బెనెట్ (21) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. మ్యాట్ హెన్రీ (3/26) ప్రత్యర్థిని కట్టడి చేయడంలో కీలకపాత్ర పోషించాడు. ఓపెనర్ డెవాన్ కాన్వే (59 నాటౌట్; 40 బంతుల్లో 4×4, 2×6) మెరుపులతో న్యూజిలాండ్ 13.5 ఓవర్లలోనే రెండు వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. రచిన్ రవీంద్ర (30), మిచెల్ (26 నాటౌట్) కూడా రాణించారు. జింబాబ్వేకు ఇది వరుసగా రెండో ఓటమి. ఫైనల్ అవకాశాలు నిలవాలంటే ఆ జట్టు తర్వాతి మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌పై నెగ్గక తప్పదు.

భారత్‌కు కాంస్యం

దిల్లీ: ప్రపంచ యూత్ టీమ్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ మెరిసింది. ఇటలీలో ముగిసిన ఈ టోర్నీలో భారత అండర్-31 జట్టు కాంస్య పతకం సాధించింది. 'బోర్డ్ ఎ మ్యాచ్' ఈవెంట్లో 24 జట్లు బరిలో దిగగా.. భారత అండర్-31 జట్టు మూడో స్థానంలో నిలిచింది. అండర్-16 టీమ్ సెమీఫైనల్లో ఫ్రాన్స్ చేతిలో భారత్ ఓడింది. అండర్-21, అండర్-26 జట్లు క్వార్టర్స్ చేరుకోవడంలో విఫలమయ్యాయి.

భారత్ శుభారంభం


తన్వి శర్మ

సోలో (ఇండోనేసియా): ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన గ్రూపు-డి పోరులో భారత్ 110-69తో శ్రీలంకను చిత్తుచేసింది. బీడబ్ల్యూఎఫ్ ప్రవేశపెట్టిన నూతన పాయింట్ల విధానం ప్రకారం మ్యాచ్ జరిగింది. కొత్త పద్ధతి ప్రకారం మొదట 110 పాయింట్లు సాధించే జట్టు మ్యాచ్‌లో విజేతగా నిలుస్తుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో విష్ణు కోడె- రేషిక జోడీ 11-5తో కెనెత్- ఐసురి జంటపై.. మహిళల డబుల్స్‌లో అట్టనాయకె- సిథమి డిసిల్వా జోడీపై గాయత్రి రావత్- మానస రావత్ జంట విజయం సాధించాయి. సింగిల్స్‌లో సిథులి రణసింఘెపై ప్రపంచ జూనియర్ నంబర్‌వన్ తన్విశర్మ గెలుపొందింది. పురుషుల డబుల్స్‌లో పమిత్- థిదస జంటపై భవ్య ఛాబ్రా-లాల్రమ్‌సంగా జోడీ నెగ్గింది. సగం మ్యాచ్‌లు ముగిసేసరికి భారత్ 55-31తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మిగతా మ్యాచ్‌ల్లోనూ ఏకపక్షంగా విజయాలు నమోదు చేసిన భారత్ 110-69తో ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. శనివారం గ్రూపు-డి రెండో పోరులో యూఏఈతో భారత్ తలపడనుంది. ఆదివారం హాంకాంగ్‌తో పోటీపడనుంది.

సిరీస్‌పై గురి

ఇంగ్లాండ్‌తో భారత మహిళల రెండో వన్డే నేడే

మధ్యాహ్నం 3.30 నుంచి


దీప్తిశర్మ
స్మృతి మంధాన

లండన్: టీ20 సిరీస్‌లో చరిత్రాత్మక విజయాన్ని అందుకుని, మూడు వన్డేల సిరీస్‌లోనూ బోణీ కొట్టిన భారత మహిళల జట్టు.. ఇప్పుడు సిరీస్‌పై గురి పెట్టింది. శనివారమే రెండో వన్డే. తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్ సత్తా చాటారు. స్మృతి మంధాన, ప్రతీక రావల్, హర్లీన్ డియోల్ కూడా తమ వంతు పాత్ర పోషించారు. రెండో వన్డేలోనూ వీరిపై ఎక్కువ ఆశలే ఉన్నాయి. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ గాడిలో పడాలని జట్టు కోరుకుంటోంది. తొలి మ్యాచ్‌లో ఆమె 17 పరుగులే చేసింది. బౌలింగ్‌లో సీనియర్లు రేణుక సింగ్, పూజ వస్త్రాకర్ లేకపోయినా తెలుగమ్మాయి అరుంధతిరెడ్డితో పాటు క్రాంతి గౌడ్, స్నేహ్ రాణా రాణించారు. మొదటి మ్యాచ్‌లో ఎక్కువ వికెట్లు తీయకపోయినా చక్కటి బౌలింగ్‌తో ఆకట్టుకున్న స్పిన్నర్ శ్రీచరణి నుంచి జట్టు మరింత మెరుగైన ప్రదర్శనను ఆశిస్తోంది. రాధ యాదవ్, దీప్తి కూడా బంతితో అదరగొడితే హర్మన్‌ప్రీత్ బృందాన్ని అడ్డుకోవడం ఇంగ్లాండ్‌కు పెద్ద సవాలే. అలా అని సొంతగడ్డపై ఆ జట్టును తక్కువ అంచనా వేస్తే భారత్‌కు కష్టమే. గెలవాలంటే కెప్టెన్ నాట్ సీవర్, సోఫీ డంక్లీ, బ్యూమాంట్‌లను కట్టడి చేయాలి. బౌలింగ్‌లో సోఫీ ఎకిల్‌స్టోన్ నుంచి ప్రమాదం పొంచి ఉంది.

ప్రతీకకు జరిమానా


ప్రతీక

దుబాయ్: భారత మహిళల క్రికెట్ జట్టు ఓపెనర్ ప్రతీక రావల్‌కు జరిమానా పడింది. ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో క్రమశిక్షణ నియమావళిని ఉల్లంఘించడంతో ఆమె మ్యాచ్ ఫీజులో ఐసీసీ 10 శాతం కోత విధించింది. ఒక అయోగ్యత పాయింట్ కూడా ఖాతాలో చేరింది. 18వ ఓవర్లో లారెన్ ఫైలర్, 19వ ఓవర్లో సోఫీ ఎకిల్‌స్టోన్‌ను ప్రతీక భుజంతో ఢీకొంది. "పరుగు తీసే క్రమంలో ప్రతీక.. ప్రత్యర్థి బౌలర్లను ఢీకొంది. నివారించదగ్గ పరిస్థితి ఉన్నా ఆమె ఇలా చేయడంతో జరిమానా పడింది" అని ఐసీసీ తెలిపింది. "ప్రత్యర్థి ప్లేయర్లను ఢీకొట్టడంలో ఎలాంటి దురుద్దేశం లేదు. పరుగు చేసే ప్రయత్నంలో అలా జరిగింది" అని ప్రతీక వివరణ ఇచ్చింది. మరోవైపు తొలి వన్డేలో స్లో ఓవర్‌రేట్ కారణంగా ఇంగ్లాండ్ జట్టుపై కూడా ఐసీసీ అయిదు శాతం జరిమానా విధించింది.



ఎత్తయిన పర్వత శ్రేణులు, విశాలమైన మైదానాలు, పీఠభూములు, తీరప్రాంతాలు, ఎడారులు, ద్వీపాలతో భారత భౌగోళిక నిర్మితి చాలా వైవిధ్యంగా ఉంటుంది. ఉత్తరాన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన హిమాలయ పర్వతాలు ఉంటే, వాటికి దిగువన గంగా-సింధు మైదానాలు విస్తరించి ఉన్నాయి. దక్షిణాన దక్కన్ పీఠభూమి ఉంది, దీనికి తూర్పు, పడమరల్లో తూర్పు, పశ్చిమ కనుమలు సరిహద్దులుగా ఉన్నాయి. మొత్తం విస్తీర్ణంలో ఒక సగం భూభాగంతో, మరో సగం సముద్రంతో అనుసంధానమై విలక్షణంగా ఉంటుంది. భూమి ఉత్తరార్ధ గోళంలో, ఆసియా ఖండానికి దక్షిణంలో అత్యధిక జనాభాతో, అతి పెద్ద దేశంగా ఉన్న ఈ విశిష్ట భూభాగం భౌగోళిక విశేషాలపై పోటీ పరీక్షార్థులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలి. విస్తీర్ణం, తీరరేఖ, ప్రాదేశిక జలాల పరిధి, ప్రామాణిక కాలమానం మొదలైన గణాంకాలను, ఇతర వివరాలను తెలుసుకోవాలి.

వైవిధ్య స్వరూపాల ద్వీపకల్పం!

భారతదేశ భౌగోళిక నిర్మితి

భారత్ భౌతిక, సాంఘిక, సాంస్కృతిక వైవిధ్యాలతో విస్తారమైన భూభాగాన్ని కలిగి ఉంటుంది. దేశ క్షేత్రీయ అమరిక, ఉనికి, పొరుగు దేశాలతో సరిహద్దులు, సముద్ర తీరం, వివిధ దీవులను పరిశీలిస్తే ఒక ఖండానికి ఉండే లక్షణాలన్నీ కనిపిస్తాయి. అందుకే భారతదేశాన్ని 'ఉపఖండం' అంటారు. చారిత్రకంగా గమనిస్తే ఒకప్పటి అవిచ్ఛిన భూభాగంలో నేటి పాకిస్థాన్, భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్, శ్రీలంక, మాల్దీవులు ఉపఖండం భాగాలే. మూడు వైపుల్లో నీరు (సముద్రం) ఒక వైపు భూభాగం ఉండటం వల్ల 'ద్వీపకల్పం'గా కూడా భారత్‌ను వ్యవహరిస్తారు. నాలుగు వైపుల్లో నీరుండే ప్రాంతాన్ని ద్వీపం అంటారు. సింధూనది పేరు మీదుగా దేశం పేరు స్థిరపడిందని చెబుతారు. దేశంపై దండయాత్ర చేసిన గ్రీకులు సింధూనదిని 'ఇండస్' అని పలికేవారు. ఇండస్ నది పరీవాహక ప్రాంతాల్లో ఉండేవారిని ఇండోయిలు/ ఇండియన్స్ అని పిలిచేవారు. తద్వారా దేశానికి 'ఇండియా' అనే పేరు వచ్చినట్లు తెలుస్తోంది.

భూగోళంలో ఉత్తరార్ధ గోళంలో, ఆసియా ఖండంలో దక్షిణ భాగంలో భారతదేశం ఉంటుంది. జనాభా పరంగా ప్రపంచంలో మొదటి స్థానం, భూభాగ పరంగా 7వ స్థానంలో ఉంది. ప్రపంచ భూభాగంలో భారత్ వాటా 2%. వైశాల్యపరంగా చూస్తే 3.28 మిలియన్ చదరపు కిలోమీటర్లు. ఉత్తర- దక్షిణాలుగా పొడవు 3,214 కిలోమీటర్లు; తూర్పు-పడమరలుగా 2,933 కిలోమీటర్లు. 8°.4' నుంచి 37°.6' ఉత్తర అక్షాంశం; 68° 7' నుంచి 97° 25' తూర్పు రేఖాంశాల మధ్య ఉంది. దేశ తూర్పు, పడమర సరిహద్దుల మధ్య సమయంలో 2 గంటల వ్యత్యాసం ఉంటుంది.


గుజరాత్ తీరం


కేప్ కెమరూన్

◆ దేశ తూర్పు సరిహద్దుగా అరుణాచల్‌ప్రదేశ్, పడమర సరిహద్దుగా గుజరాత్‌లోని సౌరాష్ట్ర, ఉత్తరాన లద్దాఖ్ (ఇందిరా కల్), దక్షిణాన ప్రధాన భూభాగంలో కేప్ కెమరూన్, దీవుల పరంగా గ్రేట్ నికోబార్ దీవుల్లోని ఇందిరా పాయింట్.


ఇందిరా పాయింట్

భూగోళంలోని ఉత్తరాన ఉన్న కర్కటరేఖ దేశ మధ్య భాగం నుంచి వెళుతోంది. ఈ రేఖ గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, త్రిపుర, మిజోరాం రాష్ట్రాల మీదుగా వెళుతోంది.

◆ భారతదేశానికి పశ్చిమ భూసరిహద్దులో పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, చైనా (టిబెట్); ఉత్తరాన నేపాల్, భూటాన్; తూర్పున బంగ్లాదేశ్, మయన్మార్ ఉన్నాయి. దక్షిణాన సముద్ర సరిహద్దుల్లో శ్రీలంక, మాల్దీవులు ఉన్నాయి. భారతదేశ అంతర్జాతీయ భూసరిహద్దు 15,200 కిలోమీటర్లు. ఇది పశ్చిమం, వాయవ్యం నుంచి ఉత్తరాన ఈశాన్య భాగం వరకు ఉంటుంది. దేశానికి అత్యధిక పొడవైన భూసరిహద్దు బంగ్లాదేశ్‌తో, అతి తక్కువ భూసరిహద్దు అఫ్గానిస్థాన్‌తో ఉంది.

దేశంలో ప్రస్తుతం 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం 29వ రాష్ట్రంగా 2014లో ఏర్పడగా, 2019 అక్టోబరులో జమ్ము-కశ్మీర్ రాష్ట్రాన్ని జమ్ము-కశ్మీర్, లద్దాఖ్‌లుగా వేరు చేసి రెండింటినీ కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చారు. దాంతో రాష్ట్రాల సంఖ్య 28కి తగ్గింది. ప్రస్తుతం కేంద్ర పాలిత ప్రాంతాలు (8). అవి.. 1) అండమాన్, నికోబార్ దీవులు 2) చండీగఢ్ 3) దాద్రానగర్ హవేలి, డామన్- డయ్యు, 4) దిల్లీ 5) జమ్ము-కశ్మీర్, 6) లద్దాఖ్ 7) లక్షదీవులు 8) పుదుచ్చేరి.

◆ విస్తీర్ణపరంగా పెద్ద రాష్ట్రాలు రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర. చిన్న రాష్ట్రం గోవా. మూడు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి. (కరైకల్ - తమిళనాడు, యానాం - ఆంధ్రప్రదేశ్, మహె - కేరళ)

◆ భూపరివేష్టిత రాష్ట్రాలు (సముద్ర తీర రేఖ లేని రాష్ట్రాలు) మొత్తం అయిదు. అవి.. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఝార్ఖండ్, హరియాణా. దేశంలో అత్యధిక రాష్ట్రాలతో(8) సరిహద్దులున్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్. అతి తక్కువ రాష్ట్రాలతో (1) సరిహద్దు ఉన్నవి సిక్కిం, మేఘాలయ.

◆ భారతదేశ ప్రామాణిక కాలాన్ని 82 1/2 డిగ్రీల తూర్పు రేఖాంశం ఆధారంగా నిర్ణయించారు. ఇది గ్రీన్‌విచ్ రేఖ కంటే 5 గంటల 30 నిమిషాల ముందు ఉంటుంది. భారత కాలప్రామాణిక రేఖ పుదుచ్చేరి; ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల మీదుగా వెళుతుంది.


అండమాన్, నికోబార్ దీవులు

దేశ పటాన్ని పరిశీలిస్తే సగ భాగం భూభాగంతో, సగభాగం సముద్ర సరిహద్దుతో విభజించినట్లుగా ఉంటుంది. భారత సముద్ర తీర ప్రాంతం ప్రధాన భూభాగానికి 6,100 కిలోమీటర్లు ఉండగా అండమాన్-నికోబార్, లక్షదీవులు లాంటి దీవులతో కలిపి 7,517 కిలోమీటర్ల తీరరేఖ ఉంది. ప్రపంచంలో తీరరేఖల పరంగా భారత్ 18వ స్థానంలో ఉంది. పొడవైన తీరరేఖ ఉన్న రాష్ట్రాలు గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు. అతితక్కువ తీరరేఖ ఉన్నవి గోవా, పశ్చిమ బెంగాల్. దేశంలో మొత్తం 9 రాష్ట్రాలకు తీరరేఖ ఉండగా, అందులో తూర్పు తీరాన 4, పశ్చిమతీరాన 5 రాష్ట్రాలున్నాయి. 4 కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా సముద్ర తీరం ఉంది. దేశంలో తీరరేఖ ఉన్న జిల్లాలు 73. మూడు సముద్రాల తీరరేఖ ఉన్న రాష్ట్రం తమిళనాడు. భారతదేశ ప్రాదేశిక జలాల పరిధి 12 నాటికల్ మైళ్లు (తీరం నుంచి), వాణిజ్య హక్కు ఉన్న జలాల పరిధి 200 నాటికల్ మైళ్లు.

ముఖ్యాంశాలు

◆ ప్రపంచ జనాభాలో భారత్ మొదటి స్థానంలో ఉంది. ప్రపంచ భూవిస్తీర్ణంలో ఏడో స్థానంలో ఉంది. ◆ దేశంలో మొత్తం రాష్ట్రాలు 28, కేంద్రపాలిత ప్రాంతాలు 8. ◆ కర్కటరేఖ 8 రాష్ట్రాల నుంచి పోతుంది. ◆ భారత కాలమానంలో తూర్పు, పడమర చివర ప్రాంతాల మధ్య తేడా 2 గంటలు. ◆ దేశ ఉత్తర చివరి ప్రాంతం ఇందిరా కల్ (లద్దాఖ్). ◆ దేశ దక్షిణ చివరి ప్రాంతం ఇందిరా పాయింట్ (నికోబార్ దీవులు). ◆ దేశ అంతర్జాతీయ భూసరిహద్దు రేఖ పొడవు 15,200 కి.మీ.లు. ◆ దేశ అంతర్జాతీయ సముద్ర తీర రేఖ పొడవు 7,517 కి.మీ.లు (దీవులతో కలిపి). ◆ మూడు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి. ◆ దేశంలో అత్యధిక రాష్ట్రాలతో సరిహద్దు ఉన్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్. ◆ భారత ప్రామాణిక కాల రేఖ 82 1/2 డిగ్రీల తూర్పు రేఖాంశం. ◆ దేశంలో అంతర్జాతీయ సముద్రతీర రేఖ ఉన్న రాష్ట్రాలు 9. ◆ మూడు సముద్రాల తీరరేఖ ఉన్న రాష్ట్రం తమిళనాడు. ◆ దేశ ప్రాదేశిక జలాల పరిధి 12 నాటికల్ మైళ్లు.

మాదిరి ప్రశ్నలు

1. విస్తీర్ణంలో భూభాగపరంగా భారతదేశం ప్రపంచంలో ఎన్నో స్థానంలో ఉంది?
   1) మొదటి 2) రెండో 3) ఐదో 4) ఏడో
2. ప్రస్తుతం మన దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సంఖ్య?
   1) 29 రాష్ట్రాలు, 10 కేంద్రపాలిత ప్రాంతాలు
   2) 29 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు
   3) 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలు
   4) 28 రాష్ట్రాలు, 9 కేంద్రపాలిత ప్రాంతాలు
3. మన దేశంలో కర్కటరేఖ ఎన్ని రాష్ట్రాల ద్వారా వెళుతుంది?
   1) 5 2) 8 3) 12 4) 15
4. మన దేశంలో ఏ రాష్ట్రం మూడు సముద్రాల తీర రేఖ కలిగి ఉంది?
   1) కేరళ 2) తమిళనాడు 3) గుజరాత్ 4) ఆంధ్రప్రదేశ్
5. భారత్‌తో అతి పొడవైన భూ సరిహద్దు ఉన్న దేశం?
   1) చైనా 2) పాకిస్థాన్ 3) అఫ్గానిస్థాన్ 4) బంగ్లాదేశ్
6. కింది వాటిలో భూపరివేష్టిత రాష్ట్రం కానిది?
   1) అస్సాం 2) తెలంగాణ 3) హరియాణా 4) మధ్యప్రదేశ్

సమాధానాలు

1-4; 2-3; 3-2; 4-2; 5-4; 6-1.



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

కరెంట్ అఫైర్స్

■ బ్రిక్స్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (బీఆర్ఐసీఎస్ సీసీఐ) నూతన ఛైర్మన్‌గా ఇటీవల ఏ భారతీయుడు బాధ్యతలు స్వీకరించారు? (ఈయన కేఆర్ చావ్లా అండ్ కో అడ్వకేట్స్ సంస్థ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ పార్టనర్‌గా ఉన్నారు.)
జ: హర్వంష్ చావ్లా



మాదిరి ప్రశ్నలు

■ భారత ప్రభుత్వం ఇటీవల ఏ ప్రముఖ క్రీడాకారుడికి టెరిటోరియల్ ఆర్మీలో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదాను ప్రదానం చేసింది? (ఈయన టోక్యో ఒలింపిక్స్‌లో జావెలిన్ త్రో లో స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. ఇప్పటికే భారత సైన్యంలో సుబేదార్ మేజర్ పదవిలో ఉన్నాడు.)
జ: నీరజ్ చోప్రా

■ అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు? (సమాజంలో కుటుంబాలు పోషించే ముఖ్యమైన పాత్రను గుర్తించడానికి 1994లో ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది.)
జ: మే 15


■ ఏ రాష్ట్రంలోని జెవార్‌లో సెమీ కండక్టర్ అసెంబ్లీ, ప్యాకేజింగ్ ప్లాంట్‌ను రూ.3,706 కోట్ల వ్యయంతో నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది?
జ: ఉత్తర్‌ప్రదేశ్

మరింత సమాచారం

పిల్లల్లో సరైన పెరుగుదలకు పోషణ్ అభియాన్!

ఆరోగ్య సాంకేతికత

పుట్టినప్పటి నుంచి మరణించే వరకు మానవాళి ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను గుర్తించి పరిష్కరించగలిగే పరిజ్ఞానమే ఆరోగ్య సాంకేతికత. అనారోగ్యాన్ని తగ్గించి జీవన కాలాన్ని, నాణ్యతను మెరుగుపరిచేందుకు అభివృద్ధి చేసిన మందులు, టీకాలు, పరికరాలు, పద్ధతులు తదితరాలన్నీ ఇందులో భాగమే. రకరకాల వ్యాధులు, వాటికి కారణాలతో పాటు నివారణ మార్గాలు, అందుకు ప్రభుత్వాలు పాటిస్తున్న విధానాలు, ఆరోగ్యసంరక్షణ రంగంలో ప్రపంచవ్యాప్తంగా అమలు చేస్తున్న కార్యక్రమాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వివిధ అంటువ్యాధుల ప్రభావాలు, వాటి వాహకాలు, జన్యు సంబంధ, జంతువుల ద్వారా వ్యాపించే పలు రుగ్మతల గురించి తెలుసుకోవాలి.



1. కింది వాటిలో నేషనల్ హెల్త్ మిషన్‌కు సంబంధించి సరైన వాక్యం ఏది?
   ఎ) నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ దీనిలో భాగంగా ఉంటుంది.
   బి) నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ దీనిలో భాగంగా ఉంటుంది.
   సి) ఇది సాంక్రమిక, అసాంక్రమిక వ్యాధుల గురించి ఉద్దేశించింది.
   డి) దీన్ని 2017న ప్రారంభించారు.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి 3) సి, డి 4) బి, సి
2. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ముఖ్య లక్ష్యాలు ఏమిటి?
   ఎ) ప్రసవ సమయంలో మరణాల రేటు తగ్గించడం.
   బి) నవజాత శిశువుల మరణాల రేటు తగ్గించడం.
   సి) జన్యు, క్రోమోజోముల వ్యాధుల నియంత్రణ.
   డి) మహిళల్లో రక్తహీనతను తగ్గించడం.
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, డి 4) సి, డి
3. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా కింది ఏ వ్యాధుల సంక్రమణను తగ్గించడానికి లేదా నివారించడానికి దృష్టి సారించారు?
   ఎ) క్షయ బి) కుష్ఠు సి) మలేరియా డి) బోదకాలు ఇ) కాలాఅజార్
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి, డి, ఇ 3) సి, డి, ఇ 4) ఎ, డి, ఇ
4. నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ కింది వాటిలో దేనికి సంబంధించింది?
   ఎ) మురికివాడల్లో నివసించే, పేద ప్రజల ఆరోగ్యం కోసం.
   బి) వలస వెళ్లేవారు, వీధిబాలలు, ఇళ్లులేని వారి ఆరోగ్యంపై ఎక్కువ దృష్టి సారించడం.
   సి) వాహకాల నియంత్రణ, పరిశుద్ధమైన సాగునీరు, పరిశుభ్రత లాంటివాటిపై దృష్టి సారించడం.
   డి) పట్టణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం.
   1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, బి, సి, డి
5. కింది వాటిలో ఏవి జాతీయ పోషకాహార కార్యక్రమాల్లో భాగంగా లేవు?
   ఎ) నేషనల్ అయోడిన్ డెఫిషియన్సీ డిజార్డర్ కంట్రోల్ ప్రోగ్రాం.
   బి) నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ ఫ్లోరోసిస్.
   సి) నేషనల్ విటమిన్-ఎ ప్రోగ్రాం.
   డి) నేషనల్ జింక్ పోషణ్
   1) ఎ, సి 2) బి, సి 3) సి, డి 4) ఎ, బి
6. నేషనల్ ఐరన్ ప్లస్ ఇనిషియేటివ్‌కు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) ఈ కార్యక్రమంలో భాగంగా ఇనుము, ఫోలిక్ ఆమ్ల మాత్రలు పంపిణీ చేస్తున్నారు.
   బి) ఈ కార్యక్రమం రక్తహీనతను తగ్గించడానికి ఉపయోగపడుతుంది.
   1) ఎ సరైంది, బి సరికాదు.
   2) బి సరైంది, ఎ సరికాదు.
   3) ఎ, బి లు సరైనవి. 4) ఎ, బి లు సరికావు.
7. కింది వాక్యాల ఆధారంగా సరైన సమాధానాన్ని గుర్తించండి.
   ఎ) మిషన్ ఇంద్రధనుష్.
   బి) యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం
   1) ఎ, బి లు రెండూ ఒకే అంశానికి చెందినవి.
   2) ఎ, బి లు రెండూ వేర్వేరు అంశాలు.
   3) 'బి' వ్యాక్సిన్లకు సంబంధించింది, 'ఎ' వ్యాధుల నిర్ధారణకు సంబంధించింది.
   4) ఎ సరైంది, బి సరికాదు.
8. కింది వాటిలో భారతదేశంలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలు?
   ఎ) జాతీయ క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమం
   బి) జాతీయ కుష్ఠువ్యాధి నియంత్రణ కార్యక్రమం
   సి) జాతీయ వాహకాల ద్వారా కలిగే వ్యాధుల నియంత్రణ కార్యక్రమం
   డి) జాతీయ డయేరియా నియంత్రణ కార్యక్రమం
   ఇ) జాతీయ డీసెంటరి నియంత్రణ కార్యక్రమం
   1) ఎ, బి, ఇ 2) ఎ, బి, సి 3) బి, సి, డి 4) సి, డి, ఇ
9. హెల్త్ మిషన్‌లో భాగంగా భారతదేశం ఏ వైరల్ వ్యాధుల నియంత్రణ కార్యక్రమాలను చేపడుతుంది?
   ఎ) పల్స్ పోలియో ప్రోగ్రాం
   బి) నేషనల్ రేబిస్ కంట్రోల్ ప్రోగ్రాం
   సి) నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ప్రోగ్రాం
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
10. భారతదేశంలో అంటువ్యాధులు కాని వాటికి ఏ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?
    ఎ) నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం
    బి) నేషనల్ లెప్రసీ కంట్రోల్ ప్రోగ్రాం
    సి) నేషనల్ గాయిటర్ కంట్రోల్ ప్రోగ్రాం
    డి) ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం
    1) ఎ, సి, డి 2) బి, సి, డి 3) బి, సి 4) సి, డి
11. కింది వాక్యాలను పరిశీలించండి.
    ఎ) కలరా బి) మెదడువాపు సి) టైఫాయిడ్ డి) డెంగీ
    పై వాటిలో ఏవి సరైన జతలు?
    1) కలరా - డెంగీ 2) కలరా - టైఫాయిడ్
    3) మెదడు వాపు - కలరా
    4) టైఫాయిడ్ - మెదడు వాపు
12. కింది వాటిలో కలరా వ్యాధికి సంబంధించి సరైన వాక్యాలను గుర్తించండి.
    ఎ) ఇది బ్యాక్టీరియా వల్ల వస్తుంది.
    బి) నీరు, ఆహారం ద్వారా వ్యాప్తి చెందుతుంది.
    సి) నీళ్ల విరేచనాల రూపంలో రోగి నీటిని నష్టపోతాడు.
    డి) దీనికి వ్యాక్సిన్ లేదు.
    1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, బి, సి
13. క్షయ వ్యాధికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
    ఎ) ప్రపంచ ఆరోగ్య సంస్థ దీన్ని 2030 వరకు నివారించాలని నిర్ణయించింది.
    బి) 'డాట్స్' (DOTS) అనే కార్యక్రమం ఈ వ్యాధి నియంత్రణకు ఉద్దేశించింది.
    సి) ఇది బ్యాక్టీరియా వల్ల కలుగుతుంది.
    డి) దగ్గడం, తుమ్మడం వల్ల ఇది వ్యాపిస్తుంది.
    1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
14. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
    ఎ) లెప్రసీ వ్యాధి బ్యాక్టీరియాల వల్ల కలుగుతుంది.
    బి) డాప్సోన్, రిఫాంపిసిన్ అనే ఔషధాలు కుష్ఠు వ్యాధి చికిత్సకు వాడతారు.
    సి) 2027 వరకు ఈ వ్యాధి వ్యాప్తిని నియంత్రించాలని భావిస్తున్నారు.
    1) ఎ, బి 2) ఎ, బి, సి 3) బి, సి 4) ఎ, సి
15. కొడవలి కణ రక్తహీనత గురించి కింది వాటిలో సరైన వాటిని గుర్తించండి.
    ఎ) ఇది జన్యుసంబంధ వ్యాధి.
    బి) దీన్ని 2047 వరకు నివారించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
    సి) ఇది గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది.
    డి) దీనికి ఔషధాలతో చికిత్స చేసి నివారించవచ్చు.
    1) ఎ, బి 2) బి, డి 3) ఎ, డి 4) ఎ, బి, సి
16. ఫైలేరియాసిస్‌కు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
    ఎ) ఇది ఆడనాఫిలస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుంది.
    బి) దీన్ని 'ఏనుగు కాలు' లేదా 'బోదకాలు' అని అంటారు.
    సి) దీనికి యాంటీ బ్యాక్టీరియల్ ఔషధాలను వాడతారు.
    డి) దీన్ని 2025 వరకు నివారించాలని నిర్ణయించారు.
    1) ఎ, బి 2) బి 3) డి 4) బి, సి



సైన్స్ అండ్ టెక్నాలజీ

17. కింది వాహకాల ద్వారా వ్యాపించే వ్యాధులను సరైన క్రమంలో అమర్చండి.
    ఎ) మలేరియా 1) ఎడిస్ దోమ
    బి) బోదకాలు 2) ఆడ ఎనాఫిలస్ దోమ
    సి) గన్యా 3) ఆడ క్యూలెక్స్ దోమ
    డి) కాలాఅజార్ 4) శాండ్ ఫ్లై
    1) ఎ-1, బి-3, సి-4, డి-2 2) ఎ-4, బి-3, సి-2, డి-1
    3) ఎ-2, బి-3, సి-1, డి-4 4) ఎ-4, బి-2, సి-3, డి-1
18. బర్డ్ ఫ్లూ గురించి కింది వాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
    ఎ) దీన్ని 'ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా' అని కూడా అంటారు.
    బి) దీనివల్ల ఎక్కువమంది చనిపోతున్నారు.
    సి) ఇది ఒకరి నుంచి మరొకరికి దగ్గడం వల్ల వ్యాపిస్తుంది.
    1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఏదీకాదు
19. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
    ఎ) కాలాఅజార్ వ్యాధిని 'బ్లాక్ ఫీవర్' అని కూడా అంటారు.
    బి) ఇది లీష్మానియా అనే ప్రోటోజోవా జీవి వల్ల కలుగుతుంది.
    సి) ఇది శాండ్ ఫ్లై అనే కీటకం ద్వారా వ్యాపిస్తుంది.
    1) ఎ, బి, సి 2) బి, సి 3) ఎ, బి 4) ఎ, సి
20. 'పోషణ్ అభియాన్' అనే కార్యక్రమం గురించి సరైన వాక్యాలను గుర్తించండి.
    ఎ) దీన్ని 'నేషనల్ న్యూట్రిషన్ మిషన్' అని అంటారు.
    బి) ఇది చిన్నపిల్లలు, యువతులు, గర్భిణులకు సంబంధించింది.
    సి) పిల్లల్లో పెరుగుదల సరిగా ఉండేలా చూడటం, రక్తహీనతను తగ్గించడం దీని ఉద్దేశం.
    1) ఎ, సి 2) బి, సి 3) ఎ, బి 4) ఎ, బి, సి
21. 'నేషనల్ డీ వార్మింగ్ డే' గురించి సరికాని వాక్యాలు ఏవి?
    ఎ) ఇది పొట్టలోని నులిపురుగుల నిర్మూలనకు ఉద్దేశించింది.
    బి) దీన్ని సంవత్సరానికి రెండుసార్లు పాటిస్తున్నారు.
    సి) ఇది మహిళలకు మాత్రమే సంబంధించింది.
    డి) ఈ కార్యక్రమంలో భాగంగా యాంటీబయాటిక్స్ ఇస్తున్నారు.
    1) ఎ, బి 2) సి, డి 3) ఎ, డి 4) బి, డి
22. స్వైన్ ఫ్లూ గురించి కింది వాక్యాలను పరిశీలించి, సరైన వాటిని ఎన్నుకోండి.
    ఎ) H_1N_1 ఇన్‌ఫ్లూయెంజాను 'స్వైన్ ఫ్లూ' అంటారు.
    బి) ఇది దగ్గడం, తుమ్మడం ద్వారా వ్యాపిస్తుంది.
    సి) స్వైన్ ఫ్లూ వ్యాధి శ్వాస వ్యవస్థను ప్రభావితం చేస్తుంది.
    డి) ఈ వ్యాధికి వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు.
    1) ఎ, బి, సి, డి 2) సి, డి 3) బి, సి 4) ఎ, డి
23. కింది వాటిలో సరికాని దాన్ని గుర్తించండి.
    ఎ) నిఫా వైరస్ గబ్బిలాల నుంచి మానవులకు సంక్రమిస్తుంది.
    బి) జంతువుల నుంచి మానవులకు సోకే వ్యాధులను 'జునోటిక్ వ్యాధులు' అంటారు.
    సి) నిఫా వైరస్ ఇటీవల కేరళలో కొందరికి సోకింది.
    డి) నిఫా వైరస్ ఒకరి నుంచి మరొకరికి సంక్రమించదు.
    1) ఎ 2) బి 3) సి 4) డి
24. అంటువ్యాధులు ఒకరి నుంచి మరొకరికి ఏ విధంగా వ్యాపిస్తాయి?
    ఎ) దగ్గడం, తుమ్మడం ద్వారా
    బి) కలుషిత నీటి ద్వారా
    సి) స్పర్శ ద్వారా
    డి) దోమ కాటు ఇ) దుస్తుల ద్వారా
    1) ఎ, బి, సి 2) బి, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి, ఇ



రచయిత: డాక్టర్ బి.నరేశ్

సమాధానాలు

1-1; 2-3; 3-2; 4-4; 5-3; 6-3; 7-1; 8-2; 9-4; 10-1; 11-2; 12-4; 13-4; 14-2; 15-4; 16-2; 17-3; 18-3; 19-1; 20-4; 21-2; 22-1; 23-4; 24-4.

చారిత్రక సంతకం చల్లపల్లి కోట!


ఎత్తయిన స్తంభాలు, శిల్పాలతో ఆకట్టుకుంటున్న హాల్


లోపలి భాగంలో విశాలమైన సమావేశ మందిరం


కోట ముఖ ద్వారం


చల్లపల్లి వాసులకు సమయం తెలిపే గంట ఇదే..




రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని పదిలపర్చుకున్న చల్లపల్లి రాజావారి కోట రాజసం ఇప్పటికీ ఆకట్టుకుంటోంది. దేవరకోట సంస్థానానికి రాజధానిగా వెలుగు వెలిగిన చల్లపల్లి గ్రామంలోని ఈ వారసత్వ సంపద నాటి సంప్రదాయానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ఎత్తయిన స్తంభాలతో ఠీవీగా కనిపించే కోటలో ఒక్కో పిల్లరు వద్ద ఉన్న రాతి శిల్పాలు రాచదర్పాన్ని ప్రతిబింబిస్తున్నాయి. చూపు తిప్పుకోనివ్వని శిల్పాలు, పింగాణీ జాడీలు, అరుదైన గృహోపకరణాలు ఎన్నో మనల్ని ఆ నాటి కాలానికి తీసుకెళ్తాయి. 20 ఎకరాలలో భారీ బురుజులు, భవంతులు, వందల ఏళ్లనాటి భారీ వృక్షాలతో ప్రాంగణం అలరారుతోంది. ముఖద్వారం దగ్గరి కంచు గంట చల్లపల్లి వాసులకు గడియారంలా మారింది. నేటికీ గంటగంటకూ ఆ గంటను కొడుతుంటారు. అరుదైన సంపదను ఇంకా అభివృద్ధి చేస్తే పర్యాటక కేంద్రంగా విలసిల్లి, స్థానికుల ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అప్పుడప్పుడూ కోటలో పురావస్తు ప్రదర్శనలు జరుగుతున్నా.. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేపడితే పర్యాటక క్షేత్రంగా రాణిస్తుంది.

- విజయవాడ నుంచి 60 కి.మీ. దూరంలో ఉన్న కోటకు వెళ్తే.. అక్కడికి దగ్గర్లోని కూచిపూడి నృత్య కళాక్షేత్రం, మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రం, పెదకళ్లేపల్లిలోని శ్రీదుర్గా నాగేశ్వరస్వామి ఆలయాలనూ చూడొచ్చు. ఇవన్నీ అక్కడికి గరిష్ఠంగా 15 కి.మీ. పరిధిలోనే ఉంటాయి.
- ఎన్నో చారిత్రక అంశాలను పదిలపర్చుకున్న ఈ కోటను 1860లో చల్లపల్లి సంస్థానాన్ని పరిపాలించిన యార్లగడ్డ వంశీయులు నిర్మించారు. ఇక్కడి నుంచే దేవరకోట సంస్థానాన్ని 20 మంది జమీందారులు పాలించారు. వారిలో మొదటి జమీందారు యార్లగడ్డ గుర్వనీడు(1576-1607). ఈ అపురూప నిర్మాణాన్ని అంకినీడు ప్రసాద్ బహద్దూర్ అనే జమీందారు హయాం(1846 -1875)లోనే కట్టించారు. ఈయన కుమారుడైన యార్లగడ్డ శివరామప్రసాద్ బహద్దూర్ 23 ఏళ్లకే 1929లో పరిపాలనా పగ్గాలు చేపట్టి జమీందారీ వ్యవస్థ రద్దయ్యే వరకూ పాలించారు. ఆయన కుమారులు మల్లికార్జునప్రసాద్, అంకినీడు ప్రసాద్, పద్మనాభ ప్రసాద్. వీరిలో అంకినీడు ప్రసాద్ 1967లో మచిలీపట్నం నుంచి ఎంపీగా ఎన్నికై సేవలందించారు. వీరి వారసులు తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఉంటున్నారు. ఇప్పటికీ చల్లపల్లి కోటకు వచ్చి వెళుతుంటారు.

- ఈనాడు, కృష్ణా; న్యూస్‌టుడే, చల్లపల్లి

ఛార్జిషీట్ వేశాక.. వైకాపా నేతల్ని ఎండగట్టండి



మద్యం కుంభకోణంలో వాళ్లప్పుడు పక్కా ఆధారాలతో దొరికారు

పార్టీ ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంపై విచారణకు ఇబ్బంది కలగకూడదన్న కారణంతో ఇప్పటి వరకు పార్టీ నాయకులెవర్నీ దానిపై మాట్లాడొద్దని చెప్పామని, ఛార్జిషీట్ దాఖలైన తర్వాత.. కుంభకోణంలో వైకాపా నాయకుల ప్రమేయాన్ని జాతీయ స్థాయిలో ఎండగట్టాలని తెదేపా ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. మద్యం కుంభకోణంలో వైకాపా నాయకులు పక్కా ఆధారాలతో దొరికారన్నారు. ఈ నెల 21 నుంచి జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, లేవనెత్తాల్సిన అంశాలపై చర్చించేందుకు చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. 'పార్లమెంట్ సమావేశాల్లో రైతులకు మద్దతు ధర, నదీజలాలు, పారిశ్రామికీకరణ వంటి అంశాల్ని లేవనెత్తాలి. వాటిపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల్ని వివరిస్తూ, కేంద్రం నుంచి ఆశిస్తున్న సాయం గురించి చెప్పాలి' అని చంద్రబాబు ఎంపీలకు సూచించారు.

[illegible] ఎంపీలుగా మిగిలిపోవాలనుకోవద్దు

'ఎంపీలు ప్రజలతో మమేకమై, వారి ఆకాంక్షల మేరకు పని చేయాలి. అనవసర విషయాల్లో జోక్యం వద్దు. వన్ టైం ఎంపీలుగా మిగిలిపోవాలనుకోవద్దు. మామిడి గుజ్జు పరిశ్రమలకు జీఎస్టీ తగ్గింపు అంశాన్ని కేంద్రంతో మాట్లాడాలి. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ఏర్పాటు, జనాభా నిర్వహణ, పీ4 వంటి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వినూత్న ప్రాజెక్టులు, కార్యక్రమాల్ని సమయానుకూలంగా పార్లమెంటులో వివరించాలి' అని పేర్కొన్నారు.

విషయ పరిజ్ఞానంతో మాట్లాడండి

ఎంపీలు విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని చెబుతూ.. జల వివాదాలపై ఇటీవల దిల్లీలో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం గురించి చంద్రబాబు ప్రస్తావించారు. 'తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. దేవాదుల, కాళేశ్వరం, కల్వకుర్తి ప్రాజెక్టులను మీరే అభివృద్ధి చేశారు. ఇప్పుడు వాటికి నీళ్లివ్వం అంటే ఎలా అని ప్రశ్నించారు. దానికి నేను చట్టంలో ఏముందో స్పష్టంగా వివరించాను. వారి దగ్గర సమాధానం లేదు. తెలంగాణ సీఎం రేవంత్ జోక్యం చేసుకుని వారికి తెలంగాణ ప్రయోజనాలు ముఖ్యమన్నారు. నాకు తెలుగు జాతి ప్రయోజనాలు ముఖ్యమని చెప్పాను. సబ్జెక్టుపై పూర్తి అవగాహన ఉండబట్టే దీటుగా జవాబివ్వగలిగాను' అని వివరించారు.

పార్లమెంట్‌లో ఎంపీల పనితీరు బాగుంది

'పార్లమెంట్‌లో మన ఎంపీల పనితీరు బాగుంది. పార్లమెంట్ సభ్యుల హాజరులో దేశ వ్యాప్త సగటు 85 శాతం ఉండగా తెదేపా సభ్యులు 86.2 శాతంతో అగ్రస్థానంలో ఉన్నారు. చర్చల్లో పాల్గొనడం, ప్రశ్నలు అడగటంలోనూ తెలుగుదేశం ఎంపీలు తొలి స్థానంలో నిలిచారు' అని ప్రశంసించారు. 'ఎంపీలకు శాఖల వారీగా బాధ్యతలు అప్పజెప్పాం. మీకు కేటాయించిన విభాగాలకు సంబంధించిన సమస్యలు, పెండింగ్ అంశాలపై కేంద్ర మంత్రులతో నిరంతరం మాట్లాడాలి. జలజీవన్ మిషన్, ఆరోగ్య మిషన్ వంటి పథకాలపైనా దృష్టి పెట్టి అదనపు నిధుల సాధనకు కృషి చేయాలి' అని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పాల్గొన్నారు.

స్థానిక రాజకీయాల్లో వేలు పెట్టొద్దు

రాజకీయాంశాలు, రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చిన పథకాలు, కార్యక్రమాలపై పార్టీ ఎంపీల్లో చాలామంది సరిగ్గా స్పందించడం లేదని సీఎం ఈ భేటీలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీలు తమ పరిధి దాటి వ్యవహరించవద్దని, ఏ శాసనసభ నియోజకవర్గంలోనూ స్థానిక రాజకీయాల్లో వేలు పెట్టవద్దని స్పష్టం చేశారు.

పంచాయతీల పునర్ వర్గీకరణకు ముందడుగు

గ్రేడ్లు మూడుకు తగ్గింపు

మరో ప్రత్యేక గ్రేడ్ ఏర్పాటుకు ప్రతిపాదన



ఈనాడు, అమరావతి: జనాభా ఆధారంగా గ్రామ పంచాయతీల పునర్ వర్గీకరణకు ముందడుగు పడింది. ప్రస్తుతం ఉన్న ఐదు గ్రేడ్లను మూడుకు తగ్గించడం, మరో ప్రత్యేక గ్రేడ్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలపై ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం సమావేశమయ్యారు. ఆ ప్రతిపాదనలకు వారు ఆమోదించడంతో ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు అధికారులు తెలిపారు. 2008లో ఆదాయం ఆధారంగా పంచాయతీలను వర్గీకరించడంతో పరిపాలన, ప్రజలకు సేవలపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం పంచాయతీల పునర్ వర్గీకరణకు పంచాయతీరాజ్‌శాఖ అదనపు కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. జనాభా ఆధారంగా పునర్ వర్గీకరణకు ఈ కమిటీ చేసిన ప్రతిపాదనలపై కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇప్పటికే చర్చ జరిగింది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులనూ అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఓఎస్‌డీ వెంకటకృష్ణ, పంచాయతీరాజ్‌శాఖ అదనపు, ఉప కమిషనర్లు సత్యనారాయణ, నాగార్జునసాగర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రస్తావించిన పలు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.

గ్రేడ్ల ప్రతిపాదనలిలా..


స్పెషల్ గ్రేడ్: గిరిజనేతర ప్రాంతాల్లో 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉండి, ఏటా రూ.కోటి కంటే ఎక్కువ ఆదాయం కలిగిన పంచాయతీలు. 5 వేల కంటే ఎక్కువ జనాభా కలిగిన గిరిజన ప్రాంత పంచాయతీలు.

గ్రేడ్-1: 4 వేల నుంచి 5 వేల జనాభా, రూ.50 లక్షల నుంచి కోటి వార్షికాదాయం కలిగి మండల కేంద్ర పంచాయతీలు. గిరిజన ప్రాంతాల్లో 3 వేల నుంచి 5 వేల జనాభా గల పంచాయతీలు.

గ్రేడ్-2: 2 వేల నుంచి 4 వేల జనాభా, గిరిజన ప్రాంతాల్లో 1,500 నుంచి 3 వేల జనాభాగల పంచాయతీలు.

గ్రేడ్-3: 2 వేల లోపు జనాభా, గిరిజన ప్రాంతాల్లో 1,500 లోపు పంచాయతీలు.

వర్షా'కాలం మారుతోంది'!



'నైరుతి'పై వాతావరణ మార్పుల ప్రభావం

పెరుగుతున్న రుతుపవనాల వ్యవధి

ఈనాడు, విశాఖపట్నం: వర్షాకాలం ఎన్ని నెలలని అడగ్గానే.. 'నాలుగు' అని ఎవరైనా ఠక్కున చెప్పేస్తారు. కానీ కొన్నేళ్లుగా వర్షాకాలం దాదాపు ఐదు నెలలపాటు ఉంటోంది. దేశంలో వ్యవసాయానికి మూలాధారమైన నైరుతి రుతుపవనాల ఆగమనం, ఉపసంహరణ తేదీల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఏటికేడు రుతుపవనాల వ్యవధి మారుతోంది. 1971-2020 మధ్యకాలానికి సంబంధించి భారత వాతావరణ విభాగం శాస్త్రవేత్తల అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఈ కాలంలో నైరుతి సీజన్ దశాబ్దానికి సగటున 1.6 రోజుల చొప్పున పెరగడం గమనార్హం. దేశంలో నైరుతి రుతుపవనాల సగటు కాలం 10 రోజుల వ్యత్యాసంతో 139 రోజులుగా గుర్తించారు. ఇది 1972లో అత్యల్పంగా 118 రోజులు కాగా.. 1974లో అత్యధికంగా 158 రోజులు. ఈ పెరుగుదలకు వాతావరణ మార్పులు దోహదం చేస్తున్నాయని నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు, వర్షాకాలం పెరిగినట్లు కనిపించినా.. వర్షాలు ఆశాజనకంగా ఉండడం లేదు. అయితే కుండపోత, లేకుంటే వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయి.

75 శాతం వర్షం నైరుతిలోనే..

దేశ వార్షిక వర్షపాతంలో 75 శాతం 'నైరుతి' సీజన్‌లో నమోదవుతుంది. సాధారణంగా రుతుపవనాలు ఏటా జూన్ 1న కేరళను తాకుతాయి. వాతావరణ శాస్త్రపరంగా జులై 8 నాటికి దేశమంతటా విస్తరిస్తాయి. జూన్ 1 నుంచి సెప్టెంబరు 30 మధ్యలో కురిసే వర్షాన్ని రుతుపవన వర్షపాతంగా పరిగణిస్తారు. 'నైరుతి' సాధారణం కంటే ముందుగానే కేరళను తాకే సంవత్సరాల్లో జూన్ 1కి ముందు నుంచి, అక్టోబరులో ఉపసంహరణ ప్రకటించే వరకు రుతుపవన వర్షాలు కురుస్తాయి.

- నైరుతి రుతుపవనాలు దాదాపుగా 13 రోజుల వ్యత్యాసంతో 71 రోజుల్లోనే దేశమంతటా విస్తరిస్తున్నాయి. ఈ 71 రోజుల్లో దేశ వార్షిక వర్షపాతంలో 49 శాతం వర్షం కురుస్తుంది. రుతుపవనాల ఆగమనం, విస్తరించే తేదీలు.. పంటల దిగుబడిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.
- గణాంకపరంగా 'నైరుతి' ఉపసంహరణ తేదీల్లో గణనీయమైన పెరుగుదల కనిపిస్తోంది. వాయవ్య భారతం నుంచి సెప్టెంబరు 17 తర్వాత వాటి నిష్క్రమణ ప్రారంభమవుతుంది. సాధారణంగా అక్టోబరు 15 నాటికి పూర్తిగా దేశం నుంచి నిష్క్రమించాల్సి ఉండగా.. సగటు తేదీ అక్టోబరు 18గా ఉంది.
- ఉపసంహరణ ఆలస్యం కావడం వల్ల రుతుపవనాల వ్యవధి పెరుగుతోంది. తొలిసారిగా 1984లో అక్టోబరు 3న వేగంగా దేశం నుంచి 'నైరుతి' నిష్క్రమించగా.. 2010లో అక్టోబరు 29న వెనక్కి మళ్లాయి.

పంటల దిగుబడిపై ప్రభావం..

నైరుతి ఆగమనం, ఉపసంహరణ తేదీలతో పాటు పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే 'ఎల్‌నినో' రుతుపవన వర్షపాతాన్ని ప్రభావితం చేస్తోంది. నైరుతిలో వర్షాలు తగ్గడానికి ఎల్‌నినో, అధిక వర్షాలకు లానినా కారణమవుతున్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. లానినా ఏర్పడితే దేశం నుంచి రుతుపవనాలు ఆలస్యంగా నిష్క్రమిస్తున్నట్లు అధ్యయనాల్లో తేలింది. 1901 నుంచి 2015 మధ్యలో 23 ఏళ్ల దేశంలో లోటు వర్షపాతం నెలకొనగా.. అందులో 13 ఏళ్లు ఎల్‌నినో కారణంగా జరిగింది. ఉపసంహరణ ఆలస్యమైతే.. దేశంలో నైరుతి, ఈశాన్య రుతుపవనాల వర్షపాతంపై ప్రభావం పడుతోంది. వర్షపాతంలో వైవిధ్యం కారణంగా దేశమంతటా వర్షాధార వ్యవసాయ ఆహార ధాన్యాల దిగుబడి ప్రభావితమవుతోంది. నైరుతి వర్షాలు, రబీ దిగుబడికి మధ్య సంబంధం తక్కువే. కానీ ఉపసంహరణ ఆలస్యమైతే రబీలో విత్తనాలు వేసేందుకు పరిస్థితులు అనుకూలంగా మారతాయి.

పాలమూరు ప్రాజెక్టులను అడ్డుకోకండి



రాయలసీమ ప్రాజెక్టును రద్దు చేసి ఉదారత ప్రదర్శించండి

చంద్రబాబుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

ఈనాడు, మహబూబ్‌నగర్: 'రెండు రాష్ట్రాలు సమానంగా అభివృద్ధి చెందాలనే మీ ఆలోచన నిజమైతే రోజుకు మూడు టీఎంసీల చొప్పున తరలించే రాయలసీమ ప్రాజెక్టును రద్దు చేసి ఉదారత ప్రదర్శించండి' అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. 'పాలమూరు-రంగారెడ్డి, డిండి, భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సహకరించండి. మా పాలమూరు బిడ్డలు మిమ్మల్ని గుర్తు చేసుకుంటారు' అని అన్నారు. ఆయన శుక్రవారం తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జటప్రోలులో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. వడ్డీలేని రుణాలకు సంబంధించిన రూ.344 కోట్ల చెక్కును స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు. సభలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును ఉద్దేశించి మాట్లాడుతూ.. ''పాలమూరు-రంగారెడ్డి, డిండి తదితర ప్రాజెక్టులను అడ్డుకోకండి. నాడు పాలమూరు జిల్లాను దత్తత తీసుకున్నట్లు చెప్పారు. బాధ్యతగా ఉండి, మమ్మల్ని బతకనివ్వండి. మా ప్రాజెక్టులను పూర్తి చేసుకోనివ్వండి. మా విజ్ఞప్తులను వినకపోతే పోరాటం చేసి సాధించుకునే శక్తి ఉంది. ఆ పోరాటానికి నాయకత్వం వహించే బాధ్యత నేనే తీసుకుంటా. మీరు సీఎంగా ఉన్నప్పుడే భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వచ్చాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పనులు ప్రారంభమయ్యాయి. పదేళ్లలో కేసీఆర్ కట్టకపోతే, మీరు అడ్డుకోవడం న్యాయమా'' అని ప్రశ్నించారు.

సైబర్ నేరాల నియంత్రణకు చట్ట సవరణ

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు!

అసెంబ్లీ పిటిషన్స్ కమిటీ నిర్ణయం

గతేడాది రూ.30 వేల కోట్ల దోపిడీ జరిగిందని ఆందోళన



ఈనాడు, అమరావతి: 'ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమింగ్ యాప్‌ల తయారీదారులు, వాటిని ఆన్‌లైన్ లోడింగ్ చేస్తున్నవారిని మొదట్లోనే నియంత్రించాలి. ఇందుకోసం ఇప్పుడున్న చట్టాలను మరింత బలోపేతం చేసేందుకు కొన్ని సవరణలు చేయాలి. వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి చట్టసవరణ బిల్లును సిద్ధం చేయాలి. తర్వాత ఆ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి' అని అసెంబ్లీ పిటిషన్స్ కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. శుక్రవారం కమిటీ ఛైర్మన్, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు కొణతాల రామకృష్ణ, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, గురజాల జగన్‌మోహన్‌లతో కలిసి ఉప సభాపతి విలేకర్లతో మాట్లాడారు. 'గతేడాది జరిగిన సైబర్ నేరాల్లో 4 శాతం మాత్రమే నమోదయ్యాయి. అందులోనే రూ.960 కోట్ల మోసం జరిగింది. రిజిస్టర్ కాని నేరాలనూ కలిపితే గతేడాదే సుమారు రూ.25 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్ల వరకు మోసం జరిగిందని అంచనా. వీటి నియంత్రణకు ఐటీ, పోలీసు శాఖలు సమన్వయంతో చట్టసవరణ బిల్లును సిద్ధం చేయాలని ఆదేశించాం. వచ్చే సంవత్సరానికి ఈ నేరాలను కనీస స్థాయికి నియంత్రించాలి. దీన్ని స్పీకర్ ద్వారా ప్రభుత్వానికి సిఫార్సు చేయబోతున్నాం' అని తెలిపారు.

ప్రభుత్వానికి కమిటీ సిఫార్సులు

- ప్రతి జిల్లాలో ఒక సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి.
- సైబర్ నేరాలను గుర్తించేందుకు వీలుగా ఐటీ ప్రొఫెషనల్స్‌ను పోలీసు విభాగానికి అనుసంధానం చేయాలి.
- ఆన్‌లైన్ యాప్‌లు వినియోగించాలంటూ ప్రకటనలు చేసిన సినిమా నటులతోనే వాటిని ఉపయోగించరాదని తిరిగి ప్రకటనలు చేయించి, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి తీసుకురావాలి.

డిజిటల్ అరెస్ట్ అనేది లేదు

'సైబర్ నేరగాళ్లు తాము అధికారులమంటూ ఫోన్లు చేసి 'మీరు డిజిటల్ అరెస్ట్'లో ఉన్నారని బెదిరించి లొంగదీసుకుంటున్నారు. మీకు ఓటీపీ వస్తుంది చెప్పండి లేదా లింక్ వస్తుంది ఓపెన్ చేయండి అని అడుగుతున్నారు. ఓటీపీ చెప్పినా, ఆ లింక్‌ను తెరిచినా బ్యాంకు ఖాతా ఖాళీ చేసేస్తున్నారు. డిజిటల్ అరెస్ట్ అనేది లేనే లేదు. ఇలా ఎవరు ఫోన్ చేసినా స్పందించవద్దు. ఏదైనా సైబర్ మోసం బారిన పడితే టోల్ ఫ్రీ నంబరు 1930 కు ఫోన్ చేసి కేసు పెట్టాలి. యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయన్సర్లు ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేసేవారిని అరెస్ట్ చేస్తాం' అని రఘురామ తెలిపారు. నకిలీ లోన్, బెట్టింగ్ యాప్‌లు ఒకటి బ్యాన్ చేస్తే, పేరు మార్చి మరొకటి తెస్తున్నారని.. ఇప్పటికే 167 యాప్‌లను రద్దు చేస్తే, మరో 800 పుట్టుకొచ్చాయని పల్లా శ్రీనివాసరావు వివరించారు.

పేదలకు నివాస యోగ్యం!

చురుగ్గా ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియ

ఇప్పటివరకు 1.17 లక్షల దరఖాస్తులు

ఈనాడు, అమరావతి: ఇళ్లు లేని పేదలకు పట్టాల పంపిణీపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాల్లో లబ్ధిదారులు, ఇంటి స్థలాల గుర్తింపు ప్రక్రియ సమాంతరంగా కొనసాగుతోంది. తొలి విడత కింద ఎంపికైన అర్హులకు వీలైనంత తొందరగా ఇంటి పట్టాలను అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జగన్ పాలనలో అస్తవ్యస్తంగా రూపొందించి లబ్ధిదారులకు కేటాయించకుండా వదిలిన లేఅవుట్లలను గుర్తించి కొత్త లబ్ధిదారులకు సర్దుబాటు చేయడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా 6.53 లక్షల ప్లాట్లు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. రెండు సంవత్సరాల్లోగా ఇంటి పట్టాల పంపిణీ పూర్తి చేసి, నిర్మాణాలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వైకాపా హయాంలో స్థలాలు పొందిన వారు వెనక్కు ఇచ్చినట్లయితే.. అటువంటి వారికి సదరు లేఅవుట్లలోని ఖాళీ స్థలాల్లో సర్దుబాటు చేయనున్నారు.

కృష్ణా జిల్లా నుంచి అత్యధికంగా 14 వేల దరఖాస్తులు

ఇళ్ల పట్టాల కోసం గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ఇప్పటి వరకు 1.17 లక్షల దరఖాస్తులు అందాయి. వాటి పరిశీలన సంయుక్త కలెక్టర్ల ఆధ్వర్యంలో కొనసాగుతోంది. 17 వేల దరఖాస్తులను పరిశీలించగా.. అందులో కేవలం వెయ్యి వరకు మాత్రమే అర్హత సాధించగా, ఐదు వేల దరఖాస్తులు తిరస్కరణను గురయ్యాయి. కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాల్లో అత్యధికంగా 11 నుంచి 14 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. కర్నూలు, కాకినాడ, విజయనగరం, ప్రకాశం, ఏలూరు, పశ్చిమగోదావరి, పల్నాడు, కోనసీమ జిల్లాల్లో 5 వేల చొప్పున దరఖాస్తులు అందాయి. కడప, తిరుపతి, శ్రీకాకుళం, చిత్తూరు, అనంతపురం జిల్లాల వారీగా పరిశీలిస్తే వచ్చిన దరఖాస్తులు రెండు వేలలోపే ఉన్నాయి. అతి తక్కువగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 332 దరఖాస్తులు అందాయి.

జగన్ పాలనలో గందరగోళం!

- వైకాపా హయాంలో ఇళ్ల పట్టాల పంపిణీ గందరగోళంగా జరిగింది. అప్పుడు ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో 41 వేల మందిని కూటమి ప్రభుత్వం అనర్హులుగా ప్రకటించింది. ఇప్పుడు ఆ సంఖ్య 50 వేలు దాటబోతోంది. ఇంకా 1.87 లక్షల లబ్ధిదారుల వివరాలు పరిశీలించాల్సి ఉంది.
- రాష్ట్రంలోని 10,410 గ్రామాల్లో మొత్తం 37,295 లేఅవుట్లు వేశారు. వీటిల్లో 24,88,669 ప్లాట్లను సిద్ధం చేశారు. అందులో 16,507 లేఅవుట్లలో మాత్రమే 100 శాతం ప్లాట్లను, 7 వేల లేఅవుట్లలో 5 శాతం ప్లాట్లనే లబ్ధిదారులకు కేటాయించినట్లు కాగితాలపై ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4,972, కోనసీమ- 344, అనకాపల్లి- 283, ఏలూరు- 179, నెల్లూరు- 172, ప్రకాశం- 112, శ్రీసత్యసాయి- 172, కడప- 117 అన్నమయ్య-113, అనంతపురం జిల్లాలోని 101 లేఅవుట్లలో 5% ప్లాట్లనే లబ్ధిదారులకు కేటాయించారు.

ప్రిన్సిపల్ మందలించారని రైలు కిందపడిన విద్యార్థిని

తెగిపోయిన రెండు కాళ్లు

బాపట్ల, న్యూస్‌టుడే: విద్యార్థులందరీ ముందు ప్రిన్సిపల్ మందలించారని ఓ విద్యార్థిని రైలు కిందపడి ఆత్మహత్యాయత్నం చేయగా.. ఆమె రెండు కాళ్లు తెగిపోయాయి. ఈ దుర్ఘటన బాపట్ల జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల పట్టణానికి చెందిన ఓ విద్యార్థిని సూర్యలంక కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి చదువుతోంది. ఆమె సరిగా చదవటం లేదని, మార్కులు తక్కువగా వచ్చాయని రెండు రోజుల కిందట ప్రిన్సిపల్ మందలించారు. సహచర విద్యార్థుల ముందు ప్రిన్సిపల్ తన మీద కోప్పడ్డారని మనస్తాపానికి గురైన సదరు విద్యార్థిని రెండ్రోజులుగా కేంద్రీయ విద్యాలయానికి వెళ్లటం లేదు. దీంతో ఆమె తల్లి.. నాన్నను విద్యాలయానికి పంపించి మాట్లాడిస్తానని, శనివారం నుంచి తరగతులకు వెళ్లాలని సర్దిచెప్పారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం పట్టణంలోని దర్గా సమీపంలోకి వెళ్లిన ఆ బాలిక రైలు కింద కాళ్లు పెట్టి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనలో ఆమె రెండు కాళ్లు తెగిపోయాయి. వెంటనే ఆమెను ప్రాంతీయ ఆసుపత్రికి, అక్కడి నుంచి గుంటూరుకు తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

అబూజ్‌మడ్‌లో భీకర కాల్పులు

- ఆరుగురు మావోయిస్టుల మృతి
- మృతదేహాలు స్వాధీనం చేసుకున్న బలగాలు

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్‌లో భీకర కాల్పులు జరిగాయి. నారాయణ్‌పూర్ జిల్లాలోని దట్టమైన అడవుల్లో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే నిఘావర్గాల సమాచారంతో నారాయణ్‌పూర్, దంతెవాడ, బస్తర్, కొండగావ్ జిల్లాల నుంచి సీఆర్పీఎఫ్, డీఆర్‌జీ, ఎస్టీఎఫ్‌తో పాటు జిల్లా సంయుక్త బలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. మధ్యాహ్నం నుంచి మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య అక్కడి అడవుల్లో భారీగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. అనంతరం ఆ ప్రాంతాన్ని పరిశీలించగా.. లభ్యమైన ఆరుగురు మావోయిస్టు మృతదేహాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఎదురుకాల్పుల ఘటనను బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ ధ్రువీకరించారు. ఘటనా ప్రాంతం నుంచి ఏకే-47, ఎస్ఎల్ఆర్ రైఫిల్స్, పేలుడు పదార్థాలు, ఇతరత్రా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇంకా ఎదురుకాల్పులు జరుగుతున్నట్లు తెలిపారు. మావోయిస్టులు కొండ ప్రాంతాల్లో దాక్కొని కాల్పులు జరుపుతుండటంతో పాటు ఆ ప్రాంతంలో ఆపరేషన్ సవాలుగా మారిందని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ కాల్పుల్లో చనిపోయిన వారిలో మావోయిస్టు కీలక నేతలు ఉన్నట్లు తెలుస్తోంది.

డయాఫ్రం వాల్ ఎప్పటికి నిర్మిస్తారు?

- మీరు చెప్పిన సమయానికి అవుతుందా?
- నిధులున్నా ఎందుకు బిల్లుల పెండింగ్?
- పోలవరంపై కేంద్ర జల్‌శక్తి కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ సమీక్ష

ఈనాడు, అమరావతి: 'పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ నిర్మాణం 2025 డిసెంబరు నాటికి పూర్తి చేయగలరా..? ఇప్పటికే అనుకున్న ప్రకారం నిర్మాణ పనులు జరగడం లేదు.. అవి లక్ష్యానికి భిన్నంగా ఉన్నాయి. ఎప్పటికి పూర్తిచేయగలరో స్పష్టంగా చెప్పండి' అని కేంద్ర జల్‌శక్తి కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు పురోగతిపై ఆమె దిల్లీలో శుక్రవారం సమీక్షించారు. ఏపీ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, పునరావాస కమిషనర్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్ర జలసంఘం, ఇతర కేంద్ర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. పనుల పరిస్థితితో పాటు ఆర్థిక పెండింగ్ బిల్లుల చెల్లింపు అంశాలపైనా ఆమె సమీక్షించారు. '2025 డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నామని ఈఎన్సీ తెలిపారు. ఇప్పటికే 5,000 స్క్వేర్ మీటర్ల మేర పనులు వెనుకబడి ఉన్నారని, ఎప్పటికి పూర్తిచేయగలరో స్పష్టంగా చెప్పాలని ఆమె అడిగారు. 2025 డిసెంబరు నాటికి పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తామని, వర్షాకాలంలోనూ పనులు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నామని ఈఎన్సీ తెలిపారు. లేనిపక్షంలో 2026 ప్రారంభానికి డయాఫ్రం వాల్ పనులు పూర్తి చేయగలమని వెల్లడించారు.

ప్రాజెక్టు నిర్మాణ షెడ్యూలు మళ్లీ స్పష్టంగా ఇవ్వండి

ప్రాజెక్టు నిర్మాణ షెడ్యూల్లు పక్కాగా రూపొందించి, మళ్లీ ఇవ్వాలని దేబశ్రీ ముఖర్జీ సూచించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ షెడ్యూలుకు సంబంధించిన అన్ని అంశాలూ పరిగణనలోకి తీసుకుని 20 రోజుల్లో దాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రైమావేరా సాఫ్ట్‌వేర్‌తో పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఆ షెడ్యూలును కేంద్ర జల సంఘానికి సమర్పిస్తే.. వారు పది రోజుల పాటు పరిశీలించి అవసరమైన మార్పులు సూచిస్తారని, నెల రోజుల్లో సమగ్ర షెడ్యూలు తన వద్దకు చేరాలని ఆదేశించారు. గ్యాప్-1 ప్రధాన డ్యాం పనులు 2025 నవంబరు నుంచే ప్రారంభించాలని సూచించారు. ఇసుక రీచ్‌లో మొదట పనులు చేస్తామని, నల్లమట్టి రీచ్‌లో డీ సాయిల్ మిక్సింగ్ పూర్తయిన తర్వాత చేపడతామని వెల్లడించారు. ప్రాజెక్టు నాణ్యత మాన్యువల్ రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని దేబశ్రీ ముఖర్జీ స్పష్టం చేశారు. బట్రెస్ డ్యాం నిర్మాణ పనులు ఆలస్యం అవుతున్న వైనంపై ప్రశ్నించారు. ఆగస్టు నెలాఖరుకు బట్రెస్ డ్యాం నిర్మాణం పూర్తిచేస్తామని అధికారులు పేర్కొన్నారు.

పునరావాస నిధులు చెల్లించండి

పునరావాసానికి సంబంధించి కేంద్రం రూ.1,000 కోట్లు ఇచ్చేందుకు ఆస్కారం ఉందని కేంద్ర జలశక్తి కార్యదర్శి పేర్కొన్నారు. అయితే.. ఇప్పటికే రాష్ట్రం వద్ద రూ.2,200 కోట్ల కేంద్రం నిధులున్నాయని, వెంటనే వాటిని చెల్లించాలని సూచించారు. పనులకు సంబంధించిన బిల్లులు ఎంత మొత్తం పెండింగులో ఉన్నాయని ప్రశ్నించారు. రూ.300 కోట్ల వరకు ఇవ్వాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. వాటిని చెల్లించాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాస్తామని దేబశ్రీ ముఖర్జీ చెప్పారు.




ఐఎన్ఎస్ నిస్తార్‌ను జాతికి అంకితం చేసిన అనంతరం నామఫలకం వద్ద రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్‌సేథ్. చిత్రంలో నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి, ఈఎన్‌సీ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంఢార్కర్, షిప్‌యార్డు సీఎండీ కమొడోర్ హేమంత్ ఖత్రి తదితరులు ◆ ఐఎన్ఎస్ నిస్తార్ నౌక

నౌకాదళ రక్షణ వ్యవస్థలో 'ఐఎన్ఎస్ నిస్తార్' మరో మైలురాయి

రక్షణ శాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్

విశాఖపట్నం(సింధియా), న్యూస్‌టుడే: భారత నౌకాదళ రక్షణ వ్యవస్థలో డైవింగ్ సపోర్ట్ వెసెల్ 'ఐఎన్ఎస్ నిస్తార్' ప్రవేశం మరో మైలురాయని రక్షణ శాఖ సహాయమంత్రి సంజయ్‌సేథ్ అభిప్రాయపడ్డారు. హిందుస్థాన్ షిప్‌యార్డు నిర్మించిన ఈ నౌక భారత నౌకాదళానికి మరింత బలాన్ని చేకూరుస్తుందన్నారు. శుక్రవారం విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో నిస్తార్ నౌకను సంజయ్‌సేథ్ జాతికి అంకితం(కమిషనింగ్) చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మనిర్భర్ భారత్ నినాదం స్ఫూర్తితో పూర్తిగా దేశీయ సాంకేతికతను వినియోగించి దీన్ని తయారు చేశామన్నారు. జలాంతర్గాములను రక్షించే సామర్థ్యం కలిగి ఉండడం నిస్తార్ ప్రత్యేకత అని వెల్లడించారు. నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి మాట్లాడుతూ.. షిప్‌యార్డులో తొలి నౌక 'జల ఉష' నుంచి 'ఐఎన్ఎస్ నిస్తార్' వరకు చేపట్టిన నిర్మాణాలు దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసేవన్నారు. ఈ సందర్భంగా ఆయన హిందుస్థాన్ షిప్‌యార్డు విశిష్టతను తెలుగులో వివరించడం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఈఎన్‌సీ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంఢార్కర్, షిప్‌యార్డు సీఎండీ కమొడోర్ హేమంత్ ఖత్రి తదితరులు పాల్గొన్నారు.



జానెడు రొయ్యకు బారెడు మీసం!

విశాఖలోని సాగర్‌నగర్ సమీప సముద్రంలోని రాళ్లపై వెరైటీ రొయ్య పిల్లలు కనిపించాయి. వాటి మీసాలు 2 అడుగుల నుంచి 4 అడుగుల పొడవు ఉన్నాయి. వీటిని 'ఆల్ రొయ్యలు' అంటారని స్థానిక మత్స్యకారులు తెలిపారు. సముద్రంలో రాళ్ల మధ్య జీవించే ఈ రొయ్యలు వేడి ఎక్కువగా ఉంటే ఇలా బండలపైకి చేరుతుంటాయన్నారు. శుక్రవారం కనిపించినవన్నీ పిల్లలే.. కానీ, వాటి పొడవైన మీసాలు స్థానికులను ఆకర్షించాయి. ఇవి కిలో కంటే ఎక్కువ బరువు పెరుగుతాయని, రుచిగా ఉంటాయని మత్స్యకారులు చెబుతున్నారు. కేజీ రూ.1200 నుంచి రూ.1,500 వరకు ధర పలుకుతాయని, మీసాలు పొడవున్న వాటికి డిమాండ్ ఉంటుందన్నారు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం (సాగర్‌నగర్)

సాంకేతిక నైపుణ్యంతో మెరుగైన వైద్యసేవలు

- గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణులు నాగేశ్వరరెడ్డి

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యం సొంతం చేసుకుంటే, వృత్తిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చేందుకు అవకాశం ఉంటుందని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి సూచించారు. విశాఖపట్నంలోని ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ)లో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన 'శతాబ్ది అలూమ్నీ భవనం' అప్పగింత కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నాగేశ్వరరెడ్డి 'గొప్ప డాక్టర్ కావడం ఎలా' అనే అంశంపై మాట్లాడారు. రోగులకు అత్యవసర వైద్యం అందించే సమయంలో సాంకేతిక నైపుణ్యాలు అవసరమవుతాయని పేర్కొన్నారు. వైద్యులు నిరంతరం కొత్త అంశాలు నేర్చుకుంటూ, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం అమెరికన్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ అధ్యక్షులు డాక్టర్ ప్రబీర్‌రాయ్ చౌదరికి 'డాక్టర్ టి.రవిరాజు ఎక్సలెన్స్ అవార్డు' ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధి తీవ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. భవనం అప్పగింతకు సంబంధించిన పత్రాలను క్యాబ్ ఛైర్మన్ టి.రవిరాజు, ఏఎంసీ ప్రిన్సిపల్ కేవీఎస్ఎం సంధ్యాదేవి మార్చుకున్నారు. అంతకుముందు ప్రొఫెసర్ బ్రహ్మయ్యశాస్త్రి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కేజీహెచ్ పర్యవేక్షక అధికారి ఐ.వాణి, పూర్వ ప్రిన్సిపాళ్లు టి.రాధ, పీవీ.సుధాకర్, ఇ.పెదవీర్రాజు, వైద్యులు గిరినాథ్, ఎస్‌కేఈ.అప్పారావు, ఆర్.శశిప్రభ, ఆదినారాయణ, కూటికుప్పల సూర్యారావు, బి.ఉదయ్ కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి. చిత్రంలో వైద్యులు సంధ్యాదేవి, పెదవీర్రాజు, ప్రబీర్‌రాయ్ చౌదరి, టి.రవిరాజు, టి.రాధ, పీవీ సుధాకర్

అంతర్జాతీయ హిస్టరీ ఒలింపియాడ్‌కు విశాఖ విద్యార్థి అభినవ్‌రెడ్డి



విశాఖపట్నం (మధురవాడ, తగరపువలస), న్యూస్‌టుడే: ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో నేటి నుంచి 27 వరకు జరగనున్న 'అంతర్జాతీయ హిస్టరీ ఒలింపియాడ్‌'లో విశాఖలోని ఓక్రిడ్జ్ పాఠశాలకు చెందిన 12 ఏళ్ల కె.అభినవ్‌రెడ్డి ప్రతిభ చాటనున్నాడు. ప్రపంచవ్యాప్తంగా 76 మంది పాల్గొనే ఈ పోటీల్లో భారత్ నుంచి ఇద్దరు ఎంపికవగా వారిలో అభినవ్‌రెడ్డి ఒకరు కావడం విశేషం. చిన్ననాటి నుంచి చరిత్రపై మక్కువతో పఠనాన్ని పెంచుకున్నాడు. రీజనల్, జాతీయ స్థాయిలో జరిగిన ఆన్‌లైన్ పోటీల్లో అభినవ్‌రెడ్డి విజేతగా నిలిచాడు. దీంతో ఇంటర్నేషనల్ విభాగంలో అంతర్జాతీయ హిస్టరీ ఒలింపియాడ్ పోటీలకు అర్హత సాధించాడు.

సినీనటుడు ఫిష్ వెంకట్ కన్నుమూత



హైదరాబాద్, న్యూస్‌టుడే: సినీనటుడు మంగలంపల్లి వెంకటేష్(53) కన్నుమూశారు. హైదరాబాద్ చందానగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో కిడ్నీ సంబంధిత వ్యాధికి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 11 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. ముషీరాబాద్‌లో చేపల వ్యాపారం చేసేవారు. సినిమాల్లో అవకాశం రావడంతో ఫిష్ వెంకట్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. తెలంగాణ యాసలో పలికే సంభాషణలతో ఎంతో మందిని ఆకట్టుకున్నారు. దాదాపు 100 సినిమాల్లో హాస్యనటుడిగా, విలన్‌గా నటించి తనదైన ముద్ర వేశారు.

అమరావతిని ఆదర్శ హరిత రాజధానిగా తీర్చిదిద్దుతాం

విజయవాడ సిటీ: అమరావతిని దేశంలోనే అత్యంత ఆదర్శ హరిత రాజధానిగా తీర్చిదిద్దాలనేది తమ లక్ష్యమని సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. రాజధాని అమరావతిని హరిత రాజధానిగా నిర్మించేందుకు సీఐఐ-ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ), సీఆర్డీఏ ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్‌పై విజయవాడలో శుక్రవారం కార్యశాల నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. "రాజధానిలోని ప్రతి ప్రాజెక్టులో సుస్థిరాభివృద్ధి పద్ధతులు అనుసరిస్తున్నాం. నెట్ జీరో విధానాలతో అమరావతిలో నిర్మించిన సీఆర్డీఏ కార్యాలయం దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుంది. అమరావతి నిర్మాణంలో ఐజీబీసీ భాగస్వామ్యం ఎంతో కీలకం. అమరావతి మాస్టర్ ప్లాన్‌కు 2018లోనే ఐజీబీసీ గ్రీన్ సిటీ ప్లాటినం రేటింగ్ లభించింది. దేశంలోనే మొదటిసారిగా డిజైన్ దశలోనే ఈ రేటింగ్ సాధించిన నగరంగా అమరావతి నిలిచింది" అని పేర్కొన్నారు. ఐజీబీసీ అమరావతి చాప్టర్ ఛైర్మన్ మేకా విజయసాయి, సీఆర్డీఏ ఇంజినీర్లు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

అల్లర్ల కేసులో ఏ19గా పేర్ని కిట్టు

- మచిలీపట్నంలో హోం మంత్రి పర్యటనలో గలాటా
- 19 మంది వైకాపా నాయకులపై కేసు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: మచిలీపట్నంలో హోం మంత్రి పర్యటనలో అల్లర్లకు ప్రయత్నించిన 19 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో ఏ19గా మాజీ మంత్రి పేర్ని నాని కుమారుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)ని చేర్చారు. మచిలీపట్నంలోని కరగ్రహారం వద్ద పోలీస్ శిక్షణ కేంద్రం (డీటీసీ) శంకుస్థాపన కార్యక్రమానికి హోం మంత్రి అనిత, మంత్రి కొల్లు రవీంద్ర హాజరయ్యారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నా వైకాపా నాయకులు మంత్రి కొల్లు రవీంద్ర ఇంటికి సమీపంలో ర్యాలీగా వెళ్లి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన చిత్రాలను కాళ్లతో తొక్కారు. తెదేపా నేత బొడ్డు శ్రీనివాస్, కూటమి నేతల ఫిర్యాదు మేరకు మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కార్పొరేటర్లు వాణి కుసుమ, బందెల కవిత సహా 19 మందిపై కేసు నమోదైంది. వీరిలో మేకల సుబ్బన్న, గూడవల్లి నాగరాజు, నోబుల్ థామస్, కొలుసు హరిబాబు, తుమ్మలపల్లి జగన్నాథరావు, బాబావలీ, తిరుమలశెట్టి వరప్రసాద్‌లను పోలీసులు అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. అయితే నిందితులకు 41ఏ నోటీసులివ్వకుండా అరెస్టు చేశారంటూ మేజిస్ట్రేట్ వారికి రిమాండ్ తిరస్కరించారు.

ప్రత్యేక విభాగం ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

మచిలీపట్నం పర్యటనలో వైకాపా అల్లర్లకు దిగుతుందని పసిగట్టడంలో జిల్లా పోలీసు ప్రత్యేక, నిఘా విభాగాల అలసత్వంపై హోం మంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో విధుల్లో స్పెషల్ బ్రాంచ్ వైఫల్యం, తదితర కారణాలతో కృష్ణా జిల్లా పోలీస్ ప్రత్యేక విభాగం ఇన్‌స్పెక్టర్ వాసంశెట్టి శ్రీనివాస్‌రావును సస్పెండ్ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉప్పాడ తీరంలో కోత నివారణకు శాశ్వత చర్యలు

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ ప్రాంతంలో తీరప్రాంత కోత నివారణ కట్టడాల నిర్మాణానికి రూ.323 కోట్లతో పనులు చేసే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. ఈ దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం రాబోతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని జాతీయ డ్యాం భద్రతా అథారిటీ ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించే క్రమంలో ఉన్నట్లు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "గత ఐదేళ్లలో ఏడాదికి 1.23 మీటర్ల చొప్పున సముద్ర తీరం కోసుకుపోతోంది. ఇంతవరకు మొత్తం 12 మీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చేసింది. తీరప్రాంత కోత నివారణ కట్టడాల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర హోంశాఖ పరిధిలోని జాతీయ డ్యాం భద్రతా అథారిటీకి సమర్పించింది" అని పవన్‌కల్యాణ్ తెలిపారు.

సింగిల్ మేజర్ సబ్జెక్టులోకి మారేందుకు దరఖాస్తుల స్వీకరణ

ఈనాడు, అమరావతి: డిగ్రీలో అమలు చేయనున్న సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలోకి కళాశాలలు మారేందుకు అవకాశం కల్పిస్తూ ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి స్వల్ప మార్పులతో సింగిల్ మేజర్ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. అందులో భాగంగా ఎయిడెడ్, ప్రైవేట్ ఎయిడెడ్ కళాశాలలు సబ్జెక్టులను మార్చుకునేందుకు ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించింది. ఇప్పటికే డబుల్ మేజర్ విధానంలోకి మారేందుకు కళాశాలలు రూ.5 వేల చొప్పున చెల్లించినందున మరోసారి చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారం నుంచి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పింది. దరఖాస్తులు సమర్పించేందుకు ఈ నెల 24 చివరి గడువని, అపరాధ రుసుము రూ.2 వేలతో 27 వరకు, రూ.5 వేలతో 30 వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొంది. దరఖాస్తుల పరిశీలన 25 నుంచి 31 వరకు ఉంటుందని, షరతులతో కూడిన ప్రొవిజనల్ ప్రొసీడింగ్స్‌ను ఆగస్టు 1న జారీ చేస్తామని వెల్లడించింది.



ఈ నాలుగు విషయాలను ఎప్పుడూ ఆపకండి

1. వైఫల్యాలు వెక్కిరించినా మిమ్మల్ని మీరు విశ్వసించడాన్ని ఆపకండి.
2. నిరాశాజనక పరిస్థితుల్లోనూ కలలు కనడం ఆపొద్దు.
3. ఎన్ని తిరస్కారాలు ఎదురైనా మిమ్మల్ని మీరు ప్రేమించడం మానకండి.
4. బతుకుబాటలో కష్టాలు చుట్టుముట్టినా జీవించడాన్ని ఆపకండి.

– మనోజ్ అరోడా, రచయిత

ఆపరేషన్ బుడమేరు.. ఆదిలోనే వదిలేశారు!

- కాగితాలు దాటని ఆక్రమణల తొలగింపు
- మొత్తం 380 ఎకరాల కబ్జా
- విజయవాడలో రూ.800 కోట్ల విలువైన 80 ఎకరాలు పరాధీనం




విజయవాడ న్యూరాజరాజేశ్వరీనగర్ వద్ద బుడమేరులో ప్రస్తుతం పెరిగిన కబ్జాలు ★ సింగ్‌నగర్‌లో ఆక్రమణలతో కుచించుకుపోయిన బుడమేరు కాలువ

ఈనాడు, అమరావతి: నిరుడు విజయవాడను వణికించిన బుడమేరు వరద ముంపును ఇంకా నగరవాసులు మరిచిపోలేదు. ఈ విపత్తుకు భారీ వర్షాలు, ఊహించని వరదలతో పాటు బుడమేరు ఆక్రమణలు కూడా ప్రధాన కారణమని ప్రభుత్వం అప్పట్లో గుర్తించింది. ఆపరేషన్ బుడమేరు చేపట్టి ఆక్రమణల అంతు చూస్తామని నేతలు ప్రకటించారు. ఆక్రమణలు గుర్తించి, జాబితా కూడా సిద్ధం చేశారు. అక్కడితోనే ఆపరేషన్ ఆగిపోయింది. ఒక్క ఆక్రమణా తొలగించిన దాఖలా లేదు. ఇప్పుడు వర్షాకాలం వచ్చింది.. మళ్లీ వరద ముంచుకొస్తే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతోంది. నగరంలోని జక్కంపూడికాలనీ నుంచి సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీనగర్ మీదుగా ఎనికేపాడు టన్నెల్ వరకు దాదాపు 80 ఎకరాల బుడమేరు వాగు స్థలాలు ఆక్రమణల్లో ఉన్నాయి. ఈ స్థలాల్లో 3,100 భవనాలు నిర్మించారు. వీటిలో పదుల సంఖ్యలో అపార్ట్‌మెంట్లు, ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, దుకాణాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎకరం స్థలం విలువ సగటున రూ.10 కోట్లు.. ఆ లెక్కన ఆక్రమించిన స్థలాల విలువ రూ.800 కోట్లు అని అంచనా. పాత ఆక్రమణలను తొలగించడం పక్కన పెడితే ఈ ఏడాది కాలంలో కొత్త కబ్జాలనూ అధికారులు అడ్డుకోకపోవడం గమనార్హం.

మేలుకోకుంటే ముప్పు తప్పదు

ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు మేల్కొని బుడమేరు వాగు వెడల్పు అన్ని ప్రాంతాల్లో 50 నుంచి 120 మీటర్లు ఉండేలా ఆక్రమణలు తొలగించాలి. బుడమేరుకు సమాంతరంగా పాముల కాలువ నుంచి ఉన్న వాగు కబ్జాలతో కనుమరుగైపోయింది. దీన్ని పునరుద్ధరిస్తే కొంత వరద ముప్పు తప్పుతుంది. చాలాచోట్ల గట్టు బలహీనంగా ఉంది. దాన్ని పటిష్ఠ పరచాలి. పూర్తిస్థాయిలో ఆక్రమణలు ఒకేసారి తొలగించడం సాధ్యం కాకుంటే దశల వారీగానైనా తొలగించకపోతే భవిష్యత్తులో వచ్చే ప్రమాదాలకు మూల్యం చెల్లించక తప్పదు.

గతేడాది ప్రభుత్వ సర్వేలో గుర్తించిన వివరాలు

- బుడమేరు పరీవాహక ప్రాంతం: 2,930 ఎకరాలు
- వాస్తవంగా బుడమేరు వెడల్పు: 50 నుంచి 120 మీటర్లు
- మొత్తం ఆక్రమణలకు గురైన భూమి: 380 ఎకరాలు
- ఇందులో సేద్యం చేస్తున్న పొలాలు: 260 ఎకరాలు
- నిర్మాణాలు చేసిన ప్రాంతం: 80 ఎకరాలు
- మొత్తం భవన నిర్మాణాలు: 3,100
- పట్టా భూముల్లో గుర్తించిన ఆక్రమణలు: 40 ఎకరాలు



'జీవితం ఒక ఉత్సవం.. నా బతుకు కథ' పుస్తకం ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్. చిత్రంలో ప్రశాంత్, లక్ష్మయ్య, బుద్ధప్రసాద్, విజయ్‌కుమార్, జస్టిస్ బి.కృష్ణమోహన్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఇండ్ల రామసుబ్బారెడ్డి, మనోహర్‌నాయుడు

బహుముఖ ప్రజ్ఞాశాలి బీవీ పట్టాభిరామ్

- మంత్రి సత్యకుమార్ యాదవ్

గవర్నర్‌పేట (విజయవాడ), న్యూస్‌టుడే: జీవితంలో విభిన్న పాత్రలు పోషించిన వారు బహు అరుదని, అలాంటి వారిలో డాక్టర్ బీవీ పట్టాభిరామ్ ఒకరని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పట్టాభిరామ్ రచించిన 'జీవితం ఒక ఉత్సవం.. నా బతుకు కథ' అనే పుస్తకాన్ని శుక్రవారం విజయవాడలో ఆయన వివిధ రంగాల ప్రముఖులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెజీషియన్‌గా, హిప్నాటిస్ట్‌గా, సైకాలజిస్ట్‌గా విభిన్న పాత్రలు పోషించిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆయన అని కొనియాడారు. దేశంలో 15 కోట్ల మంది మానసిక రుగ్మతలతో బాధ పడుతున్నా, క్లినికల్ సైకాలజిస్ట్‌ల కొరత ఎంతో ఉందని తెలిపారు. ఈ మధ్య సినిమా డైలాగు 'రప్పా రప్పా..' అంటే తప్పేముంది అని అంటున్నారని, ఎవరైనా సమాజాన్ని ప్రభావితం చేసే పనులు చేయాలే తప్ప విధ్వంసకర ఆలోచనలను రేకెత్తించేలా వ్యవహరించకూడదని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ మాట్లాడుతూ.. పట్టాభిరామ్ రాసిన పుస్తకాలు ఎంతోమందిని ఆకట్టుకున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో కూడా ఆయన పుస్తకాలకు గిరాకీ ఉందని అన్నారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ పట్టాభిరామ్ జీవిత కథను, పుస్తకాలను పాఠ్యాంశాలుగా పెడితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఎమెస్కో అధినేత విజయ్‌కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో విజయవాడ పుస్తక మహోత్సవ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మయ్య, మనోహర్‌నాయుడు, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, పట్టాభిరామ్ తనయుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ది క్రూరమైన మనస్తత్వం

- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మంత్రి వంగలపూడి అనిత



ఈనాడు, అమరావతి: 'జగన్ రెడ్డిది క్రూరమైన మనస్తత్వం. అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఒకలా.. ఓడిపోయిన తర్వాత మరోలా క్రూరత్వం చూపుతున్నారు. మహిళలే లక్ష్యంగా దాడులు, మురికి వ్యాఖ్యలు చేయిస్తున్నారు' అని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, హోం మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర తెలుగు మహిళ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటి అమలుచేస్తుంటే.. వాటికి అడ్డుతగలడానికి వైకాపా కుట్ర పన్నుతోంది. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయి అడ్డాగా మారిస్తే కూటమి ప్రభుత్వం ఈగల్ టీంను నియమించి ఉక్కుపాదం మోపింది.' అని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వాస్తవాలను వివరించాలని కార్యకర్తలను కోరారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 'మహిళలను కించపరిచిన వారు పుట్టగతులు లేకుండా పోతారు. వాళ్లు రాజకీయంగా ఎంతటి శక్తిమంతులైనా ప్రజల తీర్పునకు తలొగ్గక తప్పదు' అని అన్నారు.

రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తా: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

'గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై ప్రశ్నించే హక్కు ఎమ్మెల్యేగా నాకు ఉంది. నా ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నన్ను వ్యక్తిగతంగా టార్గెట్ చేశారు. చెల్లెలి వరస అవుతానని కూడా చూడకుండా ప్రసన్నకుమార్‌రెడ్డి నాపై సభ్యసమాజం సిగ్గుపడేలా మురికి వ్యాఖ్యలు చేశారు' అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై త్వరలో రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

భేదాభిప్రాయాలున్నా.. చర్చలతో పరిష్కరించుకుంటాం

- ఎంపీ పురందేశ్వరి

తాళ్లపూడి, న్యూస్‌టుడే: మూడు రాజకీయ పార్టీలతో కూడిన కూటమిలో చిన్న చిన్న భేదాభిప్రాయాలు సహజమేనని, ఎప్పటికప్పుడు చర్చించుకొని వాటిని పరిష్కరిస్తూ ముందుకెళ్తామని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడిలో శుక్రవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కూటమిలో భేదాభిప్రాయాలపై విలేకరులు ప్రస్తావించగా ఆమె పైవిధంగా స్పందించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం రూ.వేల కోట్లు నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

ట్రక్కుల పరిశ్రమను ఏపీలో నెలకొల్పండి

- ఆనంద్ మహీంద్రాకు లోకేశ్ వినతి

ఈనాడు, అమరావతి: మహీంద్రా ట్రక్కుల తయారీ పరిశ్రమను ఏపీలో నెలకొల్పాలని మహీంద్రా గ్రూపు అధినేత ఆనంద్ మహీంద్రాను మంత్రి నారా లోకేశ్ కోరారు. మహీంద్రా బృందానికి ఆతిథ్యం ఇచ్చి.. రాష్ట్రంలో ఉన్న విస్తృత అవకాశాల గురించి వివరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మహీంద్రా కంపెనీ మార్కెట్‌లోకి విడుదల చేసిన కొత్త ట్రక్కుపై తెలుగులో రూపొందించిన వాణిజ్య ప్రకటనను ఆనంద్ మహీంద్రా తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేయగా దాన్ని లోకేశ్ రీపోస్టు చేశారు. 'మీ తెలుగు ప్రకటన బాగుంది. ట్రక్కులకు ఏపీలో అతి పెద్ద మార్కెట్ ఉంది. రాష్ట్రంలో మీరు పరిశ్రమను ఏర్పాటు చేస్తే మా ఆటోమోటివ్ ఎకోసిస్టమ్‌కు ఉపయుక్తంగా ఉంటుంది' అని పేర్కొన్నారు.

27 నుంచి ఉద్యోగులకు శాఖాపరమైన పరీక్షలు

ఈనాడు, అమరావతి: ఉద్యోగులకు శాఖాపరమైన పరీక్షలు ఈ నెల 27 నుంచి ఆగస్టు 1 వరకు జరగనున్నాయి. పరీక్షలు రాసేందుకు ఏపీపీఎస్సీ జారీచేసిన నోటిఫికేషన్‌ను అనుసరించి 41,418 మంది ఉద్యోగులు దరఖాస్తు చేశారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన 18 జిల్లా కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ నెల 22 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి వీలు కల్పించనున్నట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజబాబు తెలిపారు.

క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ డైరెక్టర్‌గా రోనాల్డ్ రాస్

ఈనాడు, అమరావతి: ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్‌ను అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ కంపెనీలో డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. అంతకుముందు దీన్ని కంపెనీల చట్టం కింద ఏర్పాటు చేయగా.. అప్పుడు కూడా వివిధ శాఖల కార్యదర్శులు, ప్రత్యేక కార్యదర్శులను డైరెక్టర్లుగా ప్రభుత్వం నియమించింది. ● కృష్ణా నదీ యాజమాన్య బోర్డులో ఫైనాన్స్ డైరెక్టర్‌గా పి.శ్రీరామిరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం సంయుక్త సంచాలకుడి (జాయింట్ డైరెక్టర్)గా ఉన్న ఆయనకు తాజాగా పదోన్నతి కల్పించి కృష్ణా బోర్డులో డైరెక్టర్‌గా నియమించింది.

యూరప్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ఈనాడు, అమరావతి: యూరప్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ తెలిపింది. నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ(ఓంక్యాప్), యూరేషియా స్టాఫింగ్ సొల్యూషన్స్ సంయుక్తగా నియామకాలు చేపట్టాయి. మెకానికల్ డిజైన్ ఇంజినీర్లు, ఫ్యాక్టరీ మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలు కల్పించనున్నారు. మెకానికల్ డిజైన్ ఇంజినీర్‌కు బీఈ, బీటెక్ అర్హత కాగా.. ఈ ఉద్యోగాలు బల్గేరియాలో ఉన్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ వెల్లడించింది. ఫ్యాక్టరీ మెకానికల్, ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు డిప్లొమా లేదా ఐటీఐ చదివినవారు అర్హులు కాగా.. ఈ ఉద్యోగాలు అల్బేనియాలో ఉన్నట్లు పేర్కొంది. అభ్యర్థులు https://naipunyam.ap.gov.in ద్వారా ఈ నెల 23లోపు దరఖాస్తులు సమర్పించాలని, ఇతర వివరాలకు ఫోన్ నంబరు 99888 53335లో సంప్రదించాలని సూచించింది.


విజయ్ సేల్స్
నమ్మకం ముఖ్యం
www.vijaysales.com
మళ్ళీ స్కూల్‌కి
మొబైల్ | ల్యాప్‌టాప్ | యాక్సరీస్
PAVILION, VICTUS, SPECTRE, OMEN, ENVY
• Cashback Upto Rs. 15000/-*
• Fossil Watch @ Rs. 999/-*
• 1st Year ADP @ Rs. 999/-*
Lenovo
LENOVO GAMING YOGA SERIES SLIM 5 & FLEX 5, LOQ
• Cashback / Exchange Bonus Upto Rs. 10000/-*
• 2 Year Warranty + 2 Year Premium Care + 1 Year ADP @ Rs. 1999/-*
• Upto 24 Months EMI Option
DELL Technologies
INSPIRON, INSPIRON GAMING, ALIENWARE, XPS
• Cashback Upto Rs. 10000/-*
• Dell Stereo Headset @ Rs. 999/-*
• Canon Printer @ Rs. 1999/-*
acer
ASPIRE, SWIFT, SPIN, NITRO PREDATOR
• Cashback upto Rs. 5000/-*
• Free Gaming Monitor*
• 2 Year Gaming Warranty @ Rs. 1999/-*
ASUS
ROG, STRIX, ZENBOOK, TUF GAMING, ZEPHYRUS DUO
• Cashback upto Rs. 3000/-*
• Gaming Warranty Srarting @ Rs. 999/-*
• Asus Wireless Mouse @ Rs. 99/-*
MacBook Air
Sky high performance with
M4 Starting from ₹79,900*
M2 Starting from ₹67,300*
STUDENT GET UPTO 10% OFF*
Exchange bonus Up to ₹10,000*
iPhone 16 (128 GB)
10% OFF*
DISCOUNT ₹8,700*
CASHBACK ₹4,000*
PRICE ₹79,900
EMI Starting at ₹2,967
OnePlus Nord 5
Light Speed. Night Legend.
Starting from ₹29,749*
₹2,250 Instant Discount
SBI card RBL BANK
*T&C Apply.
oppo
Reno14 Series 5G
AI Portrait Camera
Available Now
Starting from ₹37,999
ColorOS
SAMSUNG
Galaxy Z Fold7 | Z Flip7
Galaxy AI
Pre-order now
Get benefits worth ₹12000*
Buy 256GB. Get 512GB.
విజయ్ సేల్స్
ఓపెన్ బాక్స్ సేల్
ఓపెన్ బాక్స్ స్టాక్ క్లియరెన్స్ మరియు మరెన్నో
డిస్‌ప్లే • ఆఖరి పీస్
60%* వరకు తగ్గింపు
సేల్ పొడిగించబడింది
*నియమ నిబంధనలు వర్తిస్తాయి.
DEAL OF DAY
VISE 55 (139 cm) 4K QLED powered by webOS Hub
PRICE ₹90,000
OFFER PRICE ₹37,990
ZERO DOWN PAYMENT | EMI ₹4,749 x 8 Months
SANSUI 75 (190 cm) 4K QLED Google TV
PRICE ₹1,69,900
OFFER PRICE ₹81,990
DOWN PAYMENT ₹16,398 | EMI ₹8,199 x 8 Months
SAVINGS 37% OFF
SONY 5.1 CH SOUNDBAR HT-S20R
PRICE ₹23,990
OFFER PRICE ₹14,990
UPTO 59% OFF
AIR CONDITIONER
1.5T 3 STAR INVERTER STARTING AT ₹28,990
1.5T 5 STAR INVERTER STARTING AT ₹33,990
LG Godrej LLOYD VOLTAS HITACHI
SAVINGS 33% OFF
LG FROST FREE REFRIGERATOR 272 Litres
CASHBACK ₹2,500
PRICE ₹41,899
OFFER PRICE ₹27,990*
SAVINGS 26% OFF
IFB FRONT LOAD WASHING MACHINE 8 Kg
PRICE ₹47,080
CASHBACK UPTO ₹2,000
OFFER PRICE ₹34,990*
SAVINGS 45% OFF
Godrej TOP LOAD WASHING MACHINE 8 Kg
PRICE ₹34,400
CASHBACK UPTO ₹1,500
OFFER PRICE ₹18,990
UPTO 60% OFF
UPGRADE YOUR KITCHEN
SAVINGS 38% OFF
BLUE STAR NORMAL AND COLD WATER DISPENSER
PRICE ₹14,600
OFFER PRICE ₹8,990
UPTO 60% OFF
IT & MOBILE ACCESSORIES
boAt Marshall noise PORTRONICS BOSE JBL
For special discounts on corporate and builder enquiries, please email us at b2b@vijaysales.com
UPTO ₹10,000/- INSTANT DISCOUNT & CASHBACK ON CREDIT CARD / DEBIT CARD & PAPER FINANCE ON
HDFC BANK | AMERICAN EXPRESS | ONECARD | IDFC FIRST BANK
YES BANK | DBS BANK | VISA CANARA
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
ఆంధ్ర ప్రదేశ్ | హైదరాబాద్ | వరంగల్ | ముంబయి | పూణే | అహ్మదాబాద్ | సూరత్ | వడోదర | ఢిల్లీ | గురుగ్రామ్ | నోయిడా | ఇందిరాపురం | ఫరీదాబాద్ | ఘజియాబాద్
SCAN FOR STORES
విజయవాడ - ఎం జి రోడ్ రజనీ కుమార్ - 96665 03755 ప్రసన్న - 70362 15153
విజయవాడ - ఎన్‌టిఆర్ సర్కిల్ ఈశ్వర్ - 88866 53042 చక్రపాణి - 91333 16947
రాజమండ్రి - జె ఎల్ ఎన్ రోడ్ గౌతం - 91549 03693 కిరణ్ - 87120 32657
రాజమండ్రి - ఇన్నిస్‌పేట్ సతీష్ - 88866 74548 నారాయణ - 73373 76253
తిరుపతి - ఎం ఆర్ పల్లి కిరణ్ - 99482 28111 విజయ్ కుమార్ - 87126 35822
తిరుపతి - లీలా మహల్ వేణు - 73373 76215 వెంకటేష్ - 91543 85029
కాకినాడ - అపోలో హాస్పిటల్ ప్రక్కన శివ గంగాధర్ - 91543 16627 నాగశ్రీ - 73373 76220
వైజాగ్ - దొండపర్తి రమేష్ - 99482 41112 కిరణ్ కుమార్ - 91549 03528
Scan to Shop Online www.vijaysales.com
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fees and other charges is applicable as per Financier Bank. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance company. Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. Upto 60% off on select brands and models only. *Cashback Applicable Select Banks & Cards

పేదల భవితకు బంగారుబాట పీ4

- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- మార్గదర్శులకు క్యాంపు కార్యాలయంలో విందు

ఈనాడు, అమరావతి: పేదల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకే పీ4 కార్యక్రమమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో అట్టడుగున ఉన్న 20 శాతం పేదలను ఆర్థికంగా, సామాజికంగా పైకి తేవాలనేదే తన సంకల్పమని పేర్కొన్నారు. పీ4 కార్యక్రమంలో భాగంగా పేదలకు సాయం చేసేందుకు ముందుకు వచ్చిన మార్గదర్శులకు శుక్రవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ఆయన విందు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఇప్పటి వరకు 5 లక్షల బంగారు కుటుంబాలు, 47,000 మంది మార్గదర్శులు నమోదు చేసుకున్నారు. ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చేయాలి. ఇందుకు సంపన్నులు, కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి రావాలి. గేట్స్ ఫౌండేషన్ ఈ విషయంలో స్ఫూర్తిగా నిలుస్తుంది' అని పిలుపునిచ్చారు. 'ముఖ్యమంత్రిగా ఇటీవలి వరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టినా.. పీ4 అనేది నా మనసుకు దగ్గరగా ఉన్న కార్యక్రమం. రాష్ట్రంలో పేదరికం లేకుండా చేసేందుకే నా కృషి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు మార్గదర్శులు చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు, ప్రణాళిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

హాజరైన మార్గదర్శులు: శ్రీనిరాజు, రవి సన్నారెడ్డి (శ్రీసిటీ), అనిల్ చలమలశెట్టి (గ్రీన్‌కో), డాంగ్‌లీ (కియా మోటార్స్), పీపీ కృష్ణారెడ్డి (మేఘా ఇంజినీరింగ్), ఏవీ రంగరాజు (ఎన్‌సీసీ), వీవీఎన్ రావు (జీఎంఆర్), సజ్జన్‌కుమార్ గోయెంకా (జయరాజ్ ఇస్పాత్ లిమిటెడ్), దొరైస్వామి (బ్రాండిక్స్), సతీష్‌రెడ్డి (రెడ్డి ల్యాబ్స్), సుచిత్ర ఎల్ల (భారత్ బయోటెక్), జయకృష్ణ (అమరరాజ), శ్రీనివాసరావు (బీఎస్సార్), పూజా యాదవ్ (హీరో మోటార్స్ కార్పొరేషన్), విక్రమ్ నారాయణరావు (లాయడ్ హెల్త్‌కేర్), ఇంద్రకుమార్ (అవంతి ఫీడ్స్), శివప్రసాద్ (హెచ్‌సీఎల్), గురు (సెల్‌కాన్ మొబైల్స్), మాధవ్ (రిలయన్స్), పీవీ వెంకట రమణారావు (రామ్‌కో), ఎం.శ్రీనివాసరావు (జెమిని ఎడిబుల్స్).


26 నుంచి రాష్ట్రవ్యాప్త పర్యటన

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



మాట్లాడుతున్న మాధవ్, చిత్రంలో పరశురామరాజు

విశాఖపట్నం(పెదవాల్తేరు), న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడానికి తన వంతు పాత్ర పోషిస్తానని, అందులో భాగంగా ఈ నెల 26నుంచి రాష్ట్రవ్యాప్త పర్యటనకు శ్రీకారం చుడుతున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. విశాఖలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముందుగా రాయలసీమ జిల్లాలు, అనంతరం ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో పర్యటిస్తానని పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు పాల్గొన్నారు.



అన్యిహాసియో.. ఓతోకే జినేయో..!

కె-ట్రెండ్స్‌కు ఫిదా!

కొరియా నుంచి వీస్తున్న మధురగాలి..
తెలుగు యువ హృదయాలను మైమరిపిస్తోంది!
కె-పాప్ ధ్వనులు గుండెల్లో మార్మోగుతుంటే.. కుర్రకారు ఉర్రూతలూగుతోంది!
చూపులు కె-బ్యూటీపై.. చిత్తం కె-డ్రామాలపై!
కొరియన్ వంటల్లోని కొత్త రుచి.. అందిస్తోంది వారికి నూతన అనుభూతి!
సంస్కృతుల స్నేహానికి కొత్త మజిలీ ఇది!



మన తెలుగు రాష్ట్రాల్లో కొరియన్ ట్రెండ్స్‌పై ఆసక్తి పెరుగుతోంది. కొరియన్ల ఆహార పదార్థాలు, వేషభాషలు, సినిమాలు.. ఇలా అన్నిటినీ మన వాళ్లు ఇష్టపడుతున్నారు. రెస్టారెంట్లు, దుస్తుల షాపులు పెరుగుతున్నాయి. యువత ల్యాప్‌టాప్‌లలో కొరియన్ సీరీస్‌లు పెరుగుతున్నాయి. ఇంతలా కొరియన్ల ఆహారం, అభిరుచులు తెలుగువారికి నచ్చేస్తున్నాయంటే.. వారికీ మనకు సంస్కృతుల మధ్యనున్న కొంత సారూప్యత కూడా కారణం.

బియ్యంతో ఆహారం... మనకు దగ్గరగా...



- గిమ్‌బాప్: ఆ దేశ ఫేమస్ ఫుడ్. సీవీడ్ (నాచు మొక్క)ను రోల్ మాదిరి తయారుచేసి దాని మధ్యలో అన్నం, కూరగాయలు స్టఫ్ చేస్తారు. పుట్టగొడుగు, గుడ్డు, పీత, కోడి మాంసంతో దాన్ని తయారు చేయవచ్చు.
- జాప్‌చాయ్: ఇదో ముఖ్యమైన డిష్. నూడిల్స్‌లో ఒక రకం. రేమన్, జజంగ్‌మ్యాన్ అనే ఫ్లేవర్‌లలో అందిస్తారు.
- టక్‌బోక్: రైస్ కేక్‌తో దీన్ని చేస్తారు. కొరియన్లకు ఇష్టమైంది.
- ట్వీగమ్: వేయించిన వెజ్, నాన్‌వెజ్‌లతో కూడిన ఆహార పదార్థాలు చవులూరిస్తాయి.



- బంగ్యేపపాంగ్: చేప ఆకారంలో ఉండే పేస్ట్రీ ఇది. దీంతో పాటు కొరియాలో ఇళ్లల్లో తయారు చేసి తాగే శీతలపానీయాలు కూడా ఇస్తారు.



- బిబిమ్ బాప్: దీన్ని మిక్స్‌డ్ అన్నంగా చెప్పొచ్చు. ఒక గిన్నెలో అన్నం, కూరగాయ ముక్కలు, చికెన్, ప్రాన్స్‌తో వడ్డిస్తారు.

దుస్తులు కూడా...



- ప్రపంచంలోనే ఫ్యాషన్, బ్యూటీ ట్రెండ్లకు దక్షిణ కొరియా పెట్టింది పేరు. ఆ దేశ ప్రజల విభిన్నమైన దుస్తులను తెలుగు యువత ఫాలో అవుతోంది.
- ఓవర్‌సైజ్డ్ ప్యాంట్స్, స్లిమ్ ప్యాంట్స్, షర్ట్స్, లేయర్డ్ షర్ట్స్, మోనోక్రోమ్ లుక్, టర్టిల్ నెక్ విత్ ఓవర్ కోట్ వంటి ట్రెండీ దుస్తుల్లో మన వాళ్లు కనిపించడానికి ఇష్టపడుతున్నారు.
- యువతులకు షార్ట్‌ర్యాప్ డ్రెస్, ఫెమైన్ బ్లౌస్, షార్ట్ స్కర్ట్స్, డిస్ట్రెస్డ్ జీన్, ట్రెంచ్ కోట్, వైడ్ లెగ్ ప్యాంట్, ఓవర్ సైజ్డ్ పుల్‌ఓవర్, రిబ్బన్ స్లిమ్ డ్రెస్, కొరియన్ గౌన్లు, పెన్సిల్ కట్ డ్రెస్సులకు క్రేజ్ పెరుగుతోంది.
- చిన్నపిల్లల దుస్తులు, హ్యాండ్‌బ్యాగులు, హెడ్‌ఫోన్లు, ఉడెన్ స్టోరేజ్ బాక్సులు, వాల్ హ్యాంగింగ్స్, ఫొటో ఫ్రేమ్‌లు, సాఫ్ట్‌టాయ్స్ కొంటున్నారు. గోళ్లరంగులు, మేకప్ కిట్లకూ బోలెడు డిమాండ్ ఉంది.

వినోదమూ ఉంది...

కొరియన్ వెబ్‌సిరీస్‌లకు తెలుగు రాష్ట్రాల్లో మంచి ఆదరణ ఉంది. యువత అత్యధిక సంఖ్యలో వీటిని వీక్షిస్తున్నారు.

- ఫేస్‌బుక్ ఎనలటిక్స్ ప్రకారం.. కొరియన్ సంగీతం, డ్రామాలు, ప్రేమ కథలను ఇష్టపడుతున్న వారి సంఖ్య క్రమేణా భారత్‌లో పెరుగుతోంది.
- ఇక బీటీఎస్ (బ్యాంగ్‌టన్ సోనియాండన్)కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేదు.

- హైదరాబాద్‌లోని పంజాగుట్ట, మాదాపూర్, హిమాయత్‌నగర్ సైబరాబాద్‌లో కేవలం కొరియన్ బ్రాండ్లకు చెందిన షాపింగ్‌మాళ్లు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి.

- ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లా పెనుగొండ వద్ద కియా కార్ల పరిశ్రమ పరిసరాల్లో కొరియన్ రుచులు పంచే రెస్టారెంట్లు ఉన్నాయి. ఇక్కడ రెండొందల మంది వరకు కొరియన్లు నివసిస్తున్నారు.



- విశాఖ నగరంలో 'సుయ్‌సుయ్' పేరుతో ఓ రెస్టారెంట్‌ను తెరిచారు. ఇద్దరు కొరియన్ అక్కాచెల్లెళ్లు నిర్వహిస్తున్న ఈ హోటల్‌లో వారాంతాల్లో టేబుల్ కావాలంటే రెండు నుంచి మూడు గంటలు నిరీక్షించాల్సిందే.

ఇంతకూ అన్యిహాసియో.. ఓతోకే జినేయో..! అంటే ఏంటి అనుకుంటున్నారా?

ఈ మాటలకు అర్థం హలో... బాగున్నారా? అని... కొరియన్ భాషలో మర్యాదపూర్వక ఆహ్వానమిది.

- ఈనాడు, విశాఖపట్నం





EENADU Vol: 51, Issue: 340 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు అమరావతి
ఎన్టీఆర్

కొన్ని తీసుకోండి.. మిగతావి కొనుక్కోండి

విజయవాడ కొత్త ఆసుపత్రిలో సరిపడాలేని మందులు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే



విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి సోమవారం నుంచి శనివారం వరకు సుమారు 2800 ఓపీ ఉంటుంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. ముఖ్యంగా గ్యాస్ట్రో, ఆర్థో, జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, కంటి విభాగాలకు వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఆయా రోగులకు వైద్యులు రాసే మందుల్లో కొన్నే కౌంటర్లలో సిబ్బంది ఇస్తున్నారు. మిగతావి బయట కొనుక్కోవాలని సూచిస్తున్నారు. లేదంటే.. ఇచ్చినవి వాడాక మళ్లీ రావాలని చెబుతున్నారు. వైద్యులు రాసిన మందులు పూర్తిగా ఇవ్వడం లేదని రోగులు చాలాకాలంగా ఫిర్యాదులు చేస్తున్నా ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించడానికి చొరవ చూపడం లేదనే విమర్శ ఉంది.

జనరిక్ దుకాణం వద్ద కిటకిట

ముఖ్యంగా వృద్ధులు బీపీ, షుగర్ మందులు నిత్యం వేసుకోవాలి. లేదంటే అవి అదుపులో ఉండవు. వారికి నెలకు సరిపడా మందులు ఇవ్వాల్సిన సిబ్బంది.. వారానికి ఇచ్చి మళ్లీ రావాలని తిప్పుతున్నారు. దూరం నుంచి వస్తున్నామని, నెలకు సరిపడా మందులు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నా.. పట్టించుకోవడం లేదని, ఒకవేళ వారం తరువాత వచ్చినా వరుసలో నిల్చోలేక ఇబ్బంది పడుతున్నామని రోగులు వాపోతున్నారు. ☛ ఆసుపత్రి ఆవరణలోనే జనరిక్ మందుల దుకాణం ఉంది. ఆసుపత్రిలో లేని మందులు అక్కడ దొరుకుతున్నాయి. జనరిక్ అంటేనే తక్కువ ధరకు మందులు లభించాలి. కానీ అక్కడ రోగులను దోచేస్తున్నారని, ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు.

వారానికోసారి వస్తున్నా..

నేను బీపీ, షుగర్ మందుల కోసం వారానికోసారి ఆసుపత్రికి వస్తున్నాను. నెలకు సరిపడా ఇవ్వాలని అడుగుతున్నా.. సిబ్బంది పట్టించుకోవడం లేదు. చేసేదేమీ లేక యూపీహెచ్‌సీకి వెళ్తున్నాను. అక్కడా కొన్ని ఉండడం లేదు. ప్రైవేటు మందుల దుకాణంలో కొనుక్కోవాల్సి వస్తోంది.

- అప్పారావు, విజయవాడ

పరిశీలించి చర్యలు తీసుకుంటా

మందులు నెలకు సరిపడా ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాను. అయినా ఇవ్వడం లేదనే విషయాన్ని పరిశీలిస్తాను. దాదాపు అన్ని మందులు లభ్యమవుతున్నాయి. ఏవి లేవో పరిశీలించి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం. జనరిక్ మందుల దుకాణాన్ని ఓసారి పరిశీలించి చర్యలు తీసుకుంటాను.

- ఏవీ రావు, సూపరింటెండెంట్, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రులు

భారత సంస్కృతి, సంప్రదాయాలు అమోఘం



లాసాల్లే పాఠశాలలో ఫ్రాన్స్ విద్యార్థులు

కీసర(కంచికచర్ల), న్యూస్‌టుడే : ఫ్రాన్స్ దేశానికి చెందిన రీమ్స్ పట్టణంలోని సెయింట్ లాసాల్లే అధ్యాపకులు, విద్యార్థులు కీసర సమీపంలోని బీజేటీ కళాశాల, సెయింట్ లాసాల్లే పాఠశాలను శుక్రవారం సందర్శించారు. కల్చరల్ ఎక్స్ఛేంజి కార్యక్రమంలో భాగంగా ఈ సందర్శన జరిగింది. భారత సంస్కృతి, సంప్రదాయాలకు ఫ్రాన్స్ అధ్యాపకులు, విద్యార్థులు ముగ్ధులయ్యారని బ్రదర్ అంటోని తెలిపారు. దుగ్గిరాల ప్రకాష్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆహార కల్తీ.. అపరాధ రుసుం విధింపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విజయవాడ కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ కోర్టులో శుక్రవారం ఆహార కల్తీ కేసులపై జేసీ ఎస్. ఇలక్కియా విచారణ నిర్వహించారు. 8 కేసులకు సంబంధించి రూ.3.39 లక్షల అపరాధ రుసుం విధించారు. ఆహార తనిఖీ అధికారి ఎన్.రమేష్‌బాబు, సహాయ ఆహార నియంత్రణ అధికారి బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్జున అవార్డీ జ్యోతిసురేఖకు సన్మానం



జ్యోతిసురేఖను సత్కరిస్తున్న సీవీఎన్ భాస్కర్‌రావు, ఎంవీ తిలక్, చిత్రంలో ప్రియాంక, సురేంద్ర

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆర్చరీలో అద్భుత ప్రతిభ కనబరిచి దేశానికి గర్వంగా నిలిచిన అర్జున అవార్డీ వెన్నం జ్యోతి సురేఖను రాష్ట్ర స్థాయి బ్యాంకర్స్ కమిటీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ విజయవాడ జోన్ జీఎం (ఫీల్డ్) సీవీఎన్ భాస్కర్‌రావు, విజయవాడ రీజియన్ హెడ్ ఎంవీ తిలక్ శుక్రవారం తాడేపల్లిలోని ఆమె నివాసంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-4లో మూడు విభాగాల్లో తలపడిన ఆమె రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించడంతో పాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా సీవీఎన్ భాస్కర్‌రావు మాట్లాడుతూ జ్యోతి సురేఖ అద్భుత విజయాలు దేశ కీర్తిని అంతర్జాతీయంగా పెంచుతున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో సురేఖ తండ్రి సురేంద్ర, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రియాంక పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్య సాధనకు నీతిఆయోగ్ కృషి



అరవింద్ విర్మానీని సత్కరిస్తున్న ఛాంబర్ సభ్యులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఆర్థిక వ్యవస్థలో ప్రజలను భాగస్వామ్యం చేయడం ద్వారా వికసిత్ భారత్ లక్ష్య సాధనకు నీతి ఆయోగ్ కృషి చేస్తోందని.. నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ అరవింద్ విర్మానీ అన్నారు. శుక్రవారం గాంధీ నగర్‌లోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ కార్యాలయంలో అధ్యక్షుడు గద్దం బాల వెంకట రవికుమార్ అధ్యక్షతన ఛాంబర్ సభ్యులు, వ్యాపార, వాణిజ్య వర్గాల ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో చదువుకున్న యువతలో వివిధ రంగాలకు అవసరమైన నైపుణ్యం కొరవడిన విషయం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. విద్యతో పాటు నైపుణ్యం పెంచుకొని మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసుకుంటేనే పురోగతి ఉంటుందని చెప్పారు. అందరూ ఏఐ గురించి గొప్పగా చెబుతున్నారని, దానికంటే ముందు మౌలిక సౌకర్యాలను కల్పించుకోవడం, నైపుణ్యాల పెంపు ఎంతో అవసరమని అన్నారు. జీఎస్టీకి ముందు, తరువాత ఎదుర్కొంటున్న సమస్యలను సభ్యులు ఆయన వద్ద ప్రస్తావించారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఆయన చెప్పారు. నీతి ఆయోగ్ ఏర్పాటు, విధి విధానాలు, లక్ష్యాలను వివరించారు. అనంతరం విర్మానీని ఛాంబర్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఛాంబర్ ఉపాధ్యక్షులు వీవీకే నరసింహారావు, దర్శి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ శ్రీకాంత్, కోశాధికారి తమ్మన శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు ఈమని దామోదర్, బాలకిషన్ లోయ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు చర్యలు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో లక్ష్మీనరసింహం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,792 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 295 కేంద్రాల్లో 1,200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నట్టు డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తెలిపారు. వాటిని మరో సారి పరిశీలించిన అనంతరం హేతుబద్ధీకరణకు ప్రతిపాదనలు రూపొందించనున్నట్టు పేర్కొన్నారు. ఎలాంటి తప్పులు లేని కచ్చితమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పక్షాలు పూర్తి సహకారం అందించాలని కోరారు. నగరంలోని కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఆయా పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. ఎదుపాటి రామయ్య (తెదేపా), డి.వి.కృష్ణ (సీపీఎం), కాకాని తరుణ్ (భాజపా), పి.డేనియల్ (బీఎస్పీ), జి.సురేష్ (కాంగ్రెస్), వై.ఆంజనేయరెడ్డి (వైకాపా), కలెక్టరేట్ ఎన్నికల విభాగ డిప్యూటీ తహసీల్దార్ ఎ.ఎస్.ఆర్.గోపాలరెడ్డి పాల్గొన్నారు.

వైకాపా నాయకులను తరిమేందుకు ప్రజలు సిద్ధం

ఎంపీ కేశినేని శివనాథ్



భవానీపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ శివనాథ్

భవానీపురం, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమాన్ని వైకాపా ప్రభుత్వ హయాంలో ఏమాత్రం పట్టించుకోలేదని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. భవానీపురం 41వ డివిజన్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెడుతున్నారని తెలిపారు. వైకాపా నాయకులు ఇంటింటికీ వస్తే తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్ కేవలం విలేకరుల సమావేశాలకు మాత్రమే పరిమితం అయ్యారని పేర్కొన్నారు. ఆ సమావేశాల్లో పోలీసులను రౌడీలుగా చిత్రీకరించి మాట్లాడటం జగన్ వక్రబుద్ధికి నిదర్శనమన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాసరావు, నాయకులు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, గన్నె ప్రసాద్, ఖాదర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో జీ రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ -180, చికెన్ స్కిన్‌లెస్ - 205. **అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 109, 117, 128 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 520 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: గవర్నర్‌పేటలో ఈ నెల 16న జరిగిన జంట హత్యల కేసులో నిందితుడు జమ్ము కిషోర్ (42)ను గవర్నర్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఆ వివరాలను ఏసీపీ పావన్‌కుమార్, సీఐ నాగమురళి వెల్లడించారు. విజయనగరానికి చెందిన వెంకటరావు, విజయవాడకు చెందిన రాజు, వించిపేటకు చెందిన రౌడీషీటర్ జమ్ము కిషోర్ కేటరింగ్ మేస్త్రీ రాము వద్ద పనులు చేసేవారు. మేస్త్రీ తన వద్ద పనిచేసే వారి కోసం డీటీరావు లైనులో గది అద్దెకు తీసుకున్నారు. ఆ ఇద్దరితో పాటు కిషోర్ కూడా భార్యతో గొడవ పడి ఆ గదిలో ఉండేవాడు. ముగ్గురి మధ్య గదిలో చోటు, డబ్బుల విషయమై గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో కిషోర్‌ను గది నుంచి పంపేయాలని రాజు, వెంకటరావు నిర్ణయించుకున్నారు. ఆ విషయం తెలిసిన కిషోర్ వారితో గొడవ పడేవాడు. ఎలాగైనా వారిని అడ్డు తొలగించుకోవాలని కత్తి తీసుకొచ్చి గదిలో దాచి ఉంచాడు. 16వ తేదీ మధ్యాహ్నం అతను వచ్చే సరికి గదిలో రాజు, వెంకటరావులతో పాటు నాగరాజు, బాషా కూడా ఉండటంతో గొడవ పెరిగింది. తాను పడుకునేందుకు చోటులేదంటూ కత్తి తీసుకుని పొడవడంతో వారిదద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. తరువాత రైలులో సికింద్రాబాద్ పారిపోగా.. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని అరెస్టు చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ పావన్‌కుమార్, సీఐ నాగమురళి ఇతర అధికారులు

మృతదేహాల అప్పగింత.. వెంకటరావు తల్లిదండ్రులు బుధవారం రాత్రే విజయవాడ రాగా... ఆ తరువాత రోజు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అప్పగించారు. విజయవాడకు చెందిన రాజు వివరాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. గురువారం రాజు సోదరుడు అప్పలనాయుడు తన సోదరుడి మృతదేహాన్ని గుర్తించారు. రాజుకి పదేళ్ల కిందట వివాహం జరగ్గా... భార్య నుంచి విడిగా ఉంటున్నాడు. రాజుకు నలుగురు సోదరులు, నలుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. శుక్రవారం వారంతా మార్చురీ వద్దకు వచ్చి కన్నీరుమున్నీరుగా విలపించారు. రాము మేస్త్రీ రూ.20 వేలు ఇవ్వాలని తమ సోదరుడు చెప్పాడని, అది కూడా హత్యకు కారణం కావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. నిందితుడిని సకాలంలో అరెస్టు చేసిన సౌత్ ఏసీపీ పావన్‌కుమార్, సీఐ నాగమురళి, సిబ్బందిని సీపీ రాజశేఖరబాబు అభినందించారు.

బదిలీ అయినా రిలీవ్ చేయలేదని మనస్తాపం

ఆత్మహత్య లేఖ రాసి అదృశ్యమైన ఇరిగేషన్ ఏఈఈ

ఎమ్మెల్యే కొలికపూడి, ఉన్నతాధికారుల వల్లేనని ప్రస్తావన



కిషోర్ (పాత చిత్రం)


ఈనాడు - అమరావతి: 'నా చావుకు జలవనరుల శాఖ ఈఈ గంగయ్య, డీఈఈ ఉమాశంకర్, ఈఎన్‌సీ బి.శ్యామ్‌ప్రసాద్, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావులే కారణమని' తిరువూరులో జలవనరుల శాఖ ఉద్యోగి కిశోర్ ఆత్మహత్య లేఖ రాసి అదృశ్యం కావటం శుక్రవారం కలకలం రేపింది. తాను బదిలీ అయినా రిలీవ్ చేయకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు లేఖలో పేర్కొనడం చర్చనీయాంశమైంది. ఇప్పటి వరకు ఏఈఈ ఆచూకీ దొరకలేదు.

'నాకు జలవనరుల శాఖ సాధారణ బదిలీల్లో ఎన్ఎస్‌సీ ఓ అండ్ ఎం గౌరవరం సెక్షన్‌కు బదిలీ అయింది. ఈఈ, డీఈఈ, ఈఎన్‌సీ... ఎమ్మెల్యే కొలికపూడితో కలిసి బదిలీ ఆపేలా రాజకీయం చేశారు. మా మామయ్య పార్టీ నాయకుడని జగ్గయ్యపేట ఎమ్మెల్యే తాతయ్య.. ఈఎన్‌సీకి చెప్పినా ఫలితం లేకపోయింది. ఒక దళిత ఉద్యోగిగా నాకు జరిగిన అన్యాయం ఇంకెవరికీ జరగకుండా చర్యలు తీసుకోవాలి. సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, మంత్రి పీఏ బొట్టు శ్రీనివాసరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని' లేఖలో రాశారు.

☛ ఆత్మహత్య లేఖ రాసి జలవనరుల శాఖ ఉద్యోగుల ఇరిగేషన్ ఉద్యోగుల వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. లేఖపై రక్తపు మరకలను పోలిన ఎర్రటి మరకలు ఉండడంతో కిశోర్ అదృశ్యంపై కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో బదిలీ కావడంతో స్థానికంగా అద్దెకు ఉండే ఇల్లు ఖాళీ చేశారు. శుక్రవారం ఉదయం ఏఈఈ కిశోర్‌ను ఆయన మామయ్య తన కారులో దించి వెళ్లారు. మధ్యాహ్నం 2.45 గంటలకు తన కార్యాలయం నుంచి నడుచుకుంటూ బయటకు వెళ్లారు. లేఖను చూసి అప్రమత్తమైన జలవనరుల శాఖ అధికారులు తిరువూరు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. కిశోర్ ఫోన్ నెంబరు లొకేషన్ చూడగా.. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజార వద్ద మధ్యాహ్నం 3.15 గంటలకు చివరిసారిగా ట్రేస్ అయింది. ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ చేశారు. ఆత్మహత్య లేఖలో కిశోర్ పేర్కొన్న పేర్లను అతని మామయ్య ఆనందరావు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు.

ధర వరలు

వంకాయలు-22/25, టమాట-32, బెండ-20, పచ్చిమిర్చి-74, కాకర-32, బీర-24/20, క్యాబేజీ-22, క్యారెట్-30/42, దొండ-26, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-25, గోరు చిక్కుళ్లు-28, దోస-15, సొర-8/10, పొట్ల-20/25, అరటికాయ-8/7, చామదుంప-30, అల్లం-60, మునగ-7/6, బీట్‌రూట్-30, కీరదోస-48, బీన్స్-86, క్యాప్సికం-86, నిమ్మ (డజను)-18/24, (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **-ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**


ఎటుచూసినా ఇంతే..

ఔను నిజమే.. పీఎన్‌బీఎస్ ప్రాంగణమే!

ఎక్కడైనా రహదారులపై గుంతలు ఉంటే ఆర్టీసీ బస్సులు బస్సుల్లో ప్రయాణికులు డ్రైవర్లు చెబుతారు. అయితే రోజూ వందల సంఖ్యలో బస్సులు, వేల మంది ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉండే పండిట్ నెహ్రూ బస్టాండ్ ఆవరణలో దారులన్నీ బీటలు వారి కనిపిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు చేరుతోంది. అవరణలో నడవాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు ఎక్కే చోట, దిగే చోట అంతా బీటలు వారి దారి కంగిపోయి ఉంది.

-ఈనాడు అమరావతి

వర్షం.. హర్షం


చెరువులా మైలవరం బైపాస్

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా అంతటా వర్షం కురిసింది. తిరువూరు, జగ్గయ్యపేట నియోజకవర్గాలు, విజయవాడలో వర్ష తీవ్రత ఎక్కువగా ఉంది. గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా.. గంపలగూడెం 44.2, విజయవాడ గ్రామీణ 39.4, విజయవాడ ఉత్తరం 34.6, విజయవాడ తూర్పు 34.4, విజయవాడ సెంట్రల్, పశ్చిమ 34.2, విస్సన్నపేట 31, జగ్గయ్యపేట 29.8, ఎ.కొండూరు 26.4, తిరువూరు, చందర్లపాడు 26.2, వత్సవాయి 12.2, జి.కొండూరు 9.2, ఇబ్రహీంపట్నం 9, కంచికచర్ల 7.6, రెడ్డిగూడెం 5.8, నందిగామ 5.6, వీరులపాడు 4.2, మైలవరంలో 2.4 మిల్లీమీటర్ల మేర వర్షం పడింది. జిల్లాలో మొత్తం 448.8 మి.మీ. వర్షం పడగా.. సగటు వర్షపాతం 22.44 మి.మీ.గా ఉంది.

స్థాయి మరిచి.. సమస్యలు విడిచి

జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలకు ఛైర్‌పర్సన్, సభ్యుల డుమ్మా



వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న సీఈవో కన్నమనాయుడు.. వైకాపా సభ్యులు రాకపోవడంతో ఖాళీగా కుర్చీలు

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జడ్పీ ఛైర్‌పర్సన్ అనుమతి మేరకు శుక్రవారం జడ్పీలో నిర్వహించిన స్థాయీ సంఘ సమావేశాలకు ఛైర్‌పర్సన్‌తో పాటు ఆయా స్థాయీ సంఘాల సభ్యులు గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది. ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్వహించే సమావేశాల్లో పాల్గొనేందుకు కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన అధికారులు ఉదయాన్నే జడ్పీ సమావేశ మందిరానికి చేరుకున్నారు. ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన నిర్వహించాల్సిన ప్లానింగ్, ఆర్థికం(1వ స్థాయి), గ్రామీణాభివృద్ధి(2వ స్థాయి), విద్యా, వైద్య సదుపాయాలు (4వ స్థాయి), పనులు(7వ స్థాయి), వైస్‌ఛైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి అధ్యక్షతన చేపట్టాల్సిన వ్యవసాయం(3వ స్థాయి), ఉంగుటూరు జడ్పీటీసీ సభ్యురాలు దుట్టా సీతారామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించాల్సిన స్త్రీ సంక్షేమం, రక్షణ(5వ స్థాయి), వైస్ ఛైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు అధ్యక్షత నిర్వహించాల్సిన సాంఘిక సంక్షేమం(6వ స్థాయి) సమావేశాలకు అధ్యక్షులతో పాటు సభ్యులు హాజరవ్వకపోవడంతో కోరం లేక వాయిదా వేస్తున్నట్లు జడ్పీ సీఈవో కన్నమనాయుడు ప్రకటించారు. 6వ స్థాయీ సంఘ సభ్యుడిగా ఉన్న తెదేపాకు చెందిన జడ్పీటీసీ సభ్యులు అర్జా వెంకటనగేష్ ఒక్కరే సమావేశానికి హాజరుకావడంతో కోరం లేక వాయిదా వేస్తున్నట్లు స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలు పణంగా పెట్టి రాజకీయాలా?

వైకాపా పాలకపక్షంగా ఉన్న జడ్పీలో కేవలం ఇద్దరే తెదేపా సభ్యులు ఉన్నారు. జిల్లాలోని ప్రజల సమస్యలు, ఇతర ఇబ్బందుల గురించి స్థాయీ సంఘ సమావేశాల్లో విస్తృతంగా చర్చించి తగు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉంది. ప్రస్తుతం రైతులు సాగునీరు, ఎరువుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి. వీటన్నింటిని సమీక్షించే బాధ్యతతో ఛైర్‌పర్సన్ ఇష్టానుసారం స్థాయీ సంఘ సమావేశాలు ఏర్పాటు చేశారు. ఇటీవల గుడివాడలో నిర్వహించిన వైకాపా సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లే సందర్భంలో తనపై దాడి చేశారని ఆరోపిస్తూ స్థాయీ సంఘ సమావేశాలకు ఛైర్‌పర్సన్‌తో సభ్యులు మొహం చాటేశారు. కేవలం తమ రాజకీయాల కోసం స్థాయీ సంఘ సమావేశాలను వాడుకోవడంపై పలువురు అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యయప్రయాసలకోర్చి వచ్చిన తమ విలువైన సమయాన్ని వృథా చేయడం ఎందుకంటూ వారు చర్చించుకున్నారు. మొత్తం మీద ప్రజా సమస్యలను చర్చించాల్సిన విషయంలో ఛైర్‌పర్సన్, పాలకవర్గ సభ్యులు వ్యవహరించిన తీరు వేలెత్తి చూపించేలా చేసింది.

నిధుల ప్రసాదం.. సేవల ప్రాభవం



ఈనాడు, అమరావతి

★ రూ.100 కోట్లు ఇస్తే అపురూపమే.. ★ ప్రసాద్ పథకం అమలుకు అడుగులు

'దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు.. "ప్రసాద్" పథకం కింద నిధులు రప్పించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ.100 కోట్లు కేటాయించాలని కేంద్రాన్ని కోరుతున్నారు. ఆ నిధులతో ఏఏ సౌకర్యాలు కల్పించనున్నారనే రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. ప్రసాద్ నిధులు త్వరలో దుర్గగుడికి రానున్నట్లు సమాచారం. ఇటీవల దుర్గగుడి అభివృద్ధిపై సమీక్షలోనూ చర్చించారు. ఎంపీ కేశినేని చిన్ని కూడా ఇప్పటికే.. కేంద్రానికి పలుమార్లు 'ప్రసాద్' నిధుల కోసం నివేదించారు.'



ఏటా కోటిన్నరకు పైగా భక్తులు.. దుర్గగుడికి సాధారణ రోజుల్లో నిత్యం 30 వేలు, శుక్ర, శని, ఆదివారాల్లో 50 వేల మందిపైగా భక్తులు వస్తున్నారు. దసరా 10 రోజుల్లో కనీసం పది లక్షల మంది, భవానీ దీక్షలకు మరో 5 లక్షల మంది వస్తారు. ఏటా కోటిన్నర మందిపైగా భక్తులు దుర్గగుడిని సందర్శిస్తున్నారు.

ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో మాదిరిగా.. వైష్ణోదేవి, తిరుపతి, కేదార్‌నాథ్, శబరిమల సహా ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో భక్తుల కోసం ఉన్న ఉత్తమ విధానాలను దుర్గగుడిలో అమలు చేసేలా పీపీటీని సిద్ధం చేసి కేంద్రానికి ప్రాథమికంగా నివేదించారు. ఆధ్యాత్మిక, ఆర్థిక, పర్యావరణ, సాంకేతికత.. అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుని.. ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు నివేదించారు.

అంతటా ఆధునిక విధానం..

మురుగన్ స్ఫూర్తితో: పళని మురుగన్ ఆలయ పరిసరాల్లో వృద్ధులు, దివ్యాంగుల కోసం ఉన్న ఎకోఫ్రెండ్లీ ట్రాన్స్‌పోర్ట్, వైష్ణోదేవి ఆలయంలోని రియల్ టైం మోనిటరింగ్ చేతి బ్యాండ్‌లు, క్యూలైన్ల నిర్వహణ, నగదు రహిత లావాదేవీలు, దర్శనం స్లాట్ నోటిఫికేషన్లు, ఇంద్రకీలాద్రిపై నుంచి భక్తులు కృష్ణా నదిని వీక్షించేలా ప్రత్యేక హిల్ పాడ్స్, కేదార్‌నాథ్ ఆలయంలో మాదిరిగా.. పండగల వేళ తాత్కాలిక ఏర్పాట్లు చేయనున్నారు.



దుర్గమ్మ ప్రసాదం ఎక్కడికైనా: పళని ఆలయం మాదిరిగా.. దుర్గమ్మ ప్రసాదాన్ని ప్రపంచంలోని భక్తులకు ఎక్కడికి కావాలంటే అక్కడికి సరఫరా.. కృష్ణా నదిలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని పరిచయం చేస్తూ.. ప్రత్యేకంగా ఫ్లోటింగ్ రెస్టారెంట్ ఏర్పాటు.

తిరుమల తీరుగా: ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్)తో 1500 ఏళ్ల ఆలయ చరిత్రను వీక్షించేలా ఏర్పాటు, ప్రత్యేక డ్రోన్ ఫోటోగ్రఫీ జోన్‌లు, తిరుపతి మాదిరిగా.. దర్శనాల బుకింగ్, విరాళాల సేకరణ, ప్రత్యక్ష క్యూలైన్ అప్‌డేట్‌లు, గైడెడ్ టూర్లు, ఇతర సమాచారం లైవ్‌లో ఎప్పటికప్పుడు అందించేలా ప్రత్యేక యాప్ రూపకల్పన, ప్రసాదాల తయారీలో పారదర్శకత పెంచేందుకు బ్లాక్‌చైన్ సాంకేతికత అమలును అందుబాటులోకి తేనున్నారు.



కేదార్‌నాథ్, శబరిమల తరహాలో: కృత్రిమ మేధ (ఏఐ)తో అనుసంధానించి జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ, వ్యర్థాల వర్గీకరణ, పురాతన నీటి నిర్వహణ వ్యవస్థల పునరుద్ధరణ, కేదార్‌నాథ్, శబరిమలలో అమలు చేస్తున్నట్లు.. గ్రీన్ ఎనర్జీ ఇంటిగ్రేషన్ విధానం అమలు.

పూరీ ఆలయంలో రీతిన: భక్తుల ఆరోగ్య భద్రతకు పూరీ జగన్నాథ్ ఆలయంలో మాదిరిగా ప్రత్యేక ఏర్పాట్లు. టెలీమెడిసిన్, మొబైల్ మెడికల్ యూనిట్లు, వేసవిలో డీహైడ్రేషన్ నుంచి భక్తులు బయటపడేలా.. సౌర నీటి ఏటీఎంలు, ఆక్సిజన్ పార్లర్ల ఏర్పాటు.

పాతవి ఏలండి... కొత్తవి ఏవండి..?!

చౌక దుకాణాల పునర్విభజనలో జాప్యం

ఈనాడు - అమరావతి: చౌక దుకాణాల పునర్విభజన ప్రక్రియ కొలిక్కి రావడం లేదు. ఈప్రక్రియ పూర్తి చేస్తే కొత్త దుకాణాల ఏర్పాటుతో పాటు.. శాశ్వత డీలర్లు కూడా అందుబాటులోకి వస్తారు. త్వరలో కొత్త కార్డులు ఇవ్వనున్న నేపథ్యంలో ప్రక్రియ వేగంగా పూర్తి చేయాల్సి ఉన్నా కదలడం లేదు. దీంతో దూరాభారం, రేషన్ సరఫరాలో జాప్యంతో కార్డుదారులకు ఇబ్బందులు తప్పేలా లేవు.



* **102 కొత్త దుకాణాలు...:** ఉమ్మడి జిల్లాలో 11,12,800 రేషన్ కార్డులు ఉన్నాయి. వైకాపా పాలనలో ప్రజా పంపిణీ వ్యవస్థను భ్రష్టు పట్టించారు. అధికార బలంతో చౌక దుకాణాల్లో బియ్యం దందా చేశారు. కూటమి సర్కారు ప్రజాపంపిణీ వ్యవస్థను చక్కదిద్దేందుకు చౌక దుకాణాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభించింది. 800 కార్డులు ఉన్న చౌక దుకాణాలను పునర్విభజించి కొత్త దుకాణాలు పెట్టాలనేది ఆలోచన. ఈ లెక్కన 102 కొత్త దుకాణాలు రానున్నాయి.

422 మంది కొత్త డీలర్లు: వైకాపా హయాంలో డీలర్లు చేసిన అడ్డగోలు దందాలపై కూటమి సర్కారు చర్యలు తీసుకుంది. రెండు జిల్లాల్లో 129 మందిపై 6ఏ కేసులు పెట్టగా.. కొందరిని తొలగించారు. ఇంత జరిగినా ఇంకా వైకాపా నాయకుల అనుచరులు డీలర్లుగా ఉన్నారు. అక్రమాలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల్లో 319 దుకాణాలకు డీలర్లు లేక వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఈ ఖాళీలను భర్తీ చేసి.. కొత్తగా మరో 103 మంది డీలర్లను నియమించాలి.

అంశం	ఎన్టీఆర్	కృష్ణా
రేషన్ కార్డులు	5,90,211	5,22,589
దుకాణాలు	957	1,059
కొత్తగా ఏర్పడేవి	78	24
తాత్కాలిక డీలర్లతో	82	237
ఈ ఏడాది 6ఏ కేసులు	66	63

ఆలస్యం ఎందుకు?: ఉమ్మడి కృష్ణాలో 1200పైగా కార్డులున్న దుకాణాలు 80 ఉంటాయి. కొత్త కార్డులు ఇస్తే మరింత మంది పెరుగుతారు. కార్డులు పెరిగే కొద్దీ దుకాణాలు చాలా దూరంగా ఉంటున్నాయి. ఎక్కువ కార్డులతో డీలర్లపై ఒత్తిడి.. రేషన్ ఇవ్వడం ఆలస్యం అవుతోంది. ఫలితంగా లబ్ధిదారులకు అవస్థలు తప్పవు. పునర్విభజన ప్రక్రియకు మండల, డివిజన్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించినా పురోగతి లేదు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తదుపరి ప్రక్రియ నిర్వహిస్తామనీ డీఎస్వోలు పాపారావు, మోహన్ బాబు తెలిపారు.



అదరహో..



పటమట, న్యూస్‌టుడే: స్వర్ణ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ప్రముఖ డిజైనర్లు రూపొందించిన విభిన్న వస్త్రాలను మోడల్స్ ధరించి క్యాట్ వాక్ చేశారు. జేడీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ డిగ్రీ, డిప్లొమా చేస్తున్న విద్యార్థులు ఈ షోలో పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యం

ఇంద్రకీలాద్రి: భక్తుల రద్దీ దృష్ట్యా మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ అధికారులకు సూచించారు. ఇంద్రకీలాద్రిపై శుక్రవారం అధికారుల సమావేశంలో ఈవో మాట్లాడుతూ.. గత 15 రోజులుగా భక్తులు శుక్ర, శని, ఆదివారాల్లో 65 వేలకు పైగా అమ్మవారి దర్శనం చేసుకుంటున్నారన్నారు. దసరాను దృష్టిలో ఉంచుకొని దుర్గాఘాట్, ఘాట్ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, మంచినీటి సరఫరా మరుగుదొడ్లు, వికలాంగులు, వృద్ధులకు బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈఈ రంగారావు, ఏసీ రంగారావు, ఏఈవోలు చంద్రశేఖర్, రమేష్ బాబు, వెంకటరెడ్డి, గంగాధర్, తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

క్వాంటం వ్యాలీతో మారనున్న రాష్ట్ర రూపురేఖలు



జాబ్‌మేళా ప్రారంభిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు.. హాజరైన అభ్యర్థులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి దార్శనికతకు ప్రతిరూపమైన క్వాంటం వ్యాలీతో రాష్ట్రంతోపాటు దేశ ముఖచిత్రం మారబోతోందని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. కేశినేని ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సిద్ధార్థ ఆడిటోరియంలో శుక్రవారం మెగా ఉద్యోగమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ ఎంటర్‌ప్రెన్యూర్ దిశగా అడుగులేయాలని సూచించారు. విజయవాడ అంటేనే ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌నకు మారుపేరని, ఇక్కడి నుంచే ఎంతోమంది ఉన్నత స్థానాలకు ఎదిగారని పేర్కొన్నారు. రూ.500లతో ఓ చిరుద్యోగిగా కెరీర్ ప్రారంభించి స్వయంకృషితో ఎంటర్‌ప్రెన్యూర్‌గా, రాజకీయనేతగా ఎదిగిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఓ రైతు కుటుంబంలో జన్మించి ఐఏఎస్‌గా ఎదిగిన జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందడుగు వేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ వైబ్రెంట్ విజయవాడలో ప్రతిభకు కొదవలేదని, అవకాశాలను అందిపుచ్చుకొని యువత కెరీర్ పరంగా ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లో ఎన్టీఆర్ వికాస ద్వారా ఉద్యోగమేళాలు నిర్వహిస్తున్నామని, నిరుద్యోగులు రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో పెద్ద పెద్ద సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ మేకా రమేశ్ మాట్లాడారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, జిల్లా ఉపాధికల్పన అధికారి మధుభూషణ్ రావు, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి సలహా కమిటీ ఛైర్మన్ రఘురామరాజు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

197 మందికి కొలువులు..

ఈ జాబ్‌మేళాకు 1128 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 197 మంది ఎంపికయ్యారు. 466 మంది రెండో రౌండ్ ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు.

ఇరుకు దారి.. ఇక్కట్ల మారి!

ఈనాడు, అమరావతి

★ గడ్డర్లను పీకేసి మరీ విచ్చలవిడిగా రాకపోకలు
★ కేదారేశ్వరపేట మార్కెట్ తరలించాలని గగ్గోలు

'విజయవాడ నగరపాలిక ఆధ్వర్యంలో కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌ను నున్న తరలించేందుకు అధికారుల బృందం అధ్యయనం చేసింది. కానీ.. ఆ తర్వాత ఏ కదలికా లేదు. కలెక్టర్, నగరపాలికకు విద్యాసంస్థలు, కాలనీ సంఘాల నుంచి కొన్నాళ్లుగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇరుకు సందుల్లోంచి భారీ లారీలు వచ్చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయనీ.. రద్దీ వేళల్లో ట్రాఫిక్‌తో తల్లడిల్లుతున్నామని వాపోతున్నారు. ఇరుకైనచోట వందల మంది వ్యాపారులతో మార్కెట్ నిర్వహణ.. రహదారులనూ ఆక్రమించడంపై.. స్థానికులు ధ్వజమెత్తుతున్నారు.

పదేళ్లుగా కాలయాపనే... పదేళ్లుగా మార్కెట్‌ను తరలిస్తామని కాలయాపన చేస్తున్నారనీ, నున్నలో ప్రత్యామ్నాయ మార్కెట్‌ను 23 ఎకరాల్లో సిద్ధం చేసినా.. ఎందుకు తరలించడం లేదని ప్రశ్నిస్తున్నారు. జనావాసాల మధ్యలోని కేదారేశ్వరపేట మార్కెట్‌ను ఆనుకుని కేవలం 25 అడుగుల రహదారి ఉంది. ఈ దారిలోనే ఒకవైపు కళాశాలలు, విద్యాసంస్థలు, మరోవైపు ఆసుపత్రులు, ఆలయం, సచివాలయం ఉన్నాయి. దీంతో వేల వాహనాలు ఇటే తిరుగుతుంటాయి. ఇదేసమయంలో మార్కెట్ కోసం భారీ కంటైనర్లు, డీసీఎంలు వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం వేల మంది విద్యార్థులు వచ్చి వెళ్లే ఈ ప్రాంతంలో ఇలా కంటైనర్లు, డీసీఎంలు, మినీ వ్యాన్లతో.. భయంగా ఉండాల్సి వస్తోందని ప్రభాస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు విన్నవించారు.


గతంలో రహదారిపై గడ్డర్లు వేసిన ప్రాంతం ఇదే..

గడ్డర్లను వేయడంతోనే అదుపు... జనవాసాల మధ్యలోని మార్కెట్‌కు వచ్చే భారీ వాహనాల నుంచి ప్రమాదాలను నివారించాలని స్థానికులు ఆందోళనలు చేపట్టారు. దీంతో ఆలయ సమీపంలో 25 అడుగుల రహదారిపై ఇనుప గడ్డర్లను నగరపాలిక ఆధ్వర్యంలో వేశారు. కానీ.. వైకాపా హయాంలో కొందరు గడ్డర్లను.. రాత్రికిరాత్రి కోసి పక్కన పడేశారు. అప్పటి వైకాపా ఎమ్మెల్యే.. గడ్డర్లను పీకేసిన వారికి వత్తాసు పలికారు. దీంతో అధికారులూ నిస్సహాయులయ్యారు. ప్రస్తుతం ప్రమాదాలు పెరిగిన వేళ.. మార్కెట్‌ను ఆనుకుని దేవాలయం ఎదురుగా, ప్రభాస్ కళాశాల పక్కనే ఉన్న దారులకు గడ్డర్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

అరాచకానికి కొమ్ము.. ఆధారాలన్నీ వమ్ము..!

డాక్టర్ శ్రీహరి హత్య కేసులో ముఖ్యాంశాల విస్మరణ ★ ప్రధానమైనవి చేజిక్కించుకోవడంలో పోలీసుల వైఫల్యం

ఈనాడు - అమరావతి,
ఈనాడు డిజిటల్ - మచిలీపట్నం


డాక్టర్ శ్రీహరి

వైకాపా హయాంలో సంచలనం సృష్టించిన డాక్టర్ కోట శ్రీహరి హత్య కేసులో అప్పట్లో పోలీసులు ఉద్దేశపూర్వకంగా విస్మరించిన అంశాలు ఇప్పుడు బయటకు వస్తున్నాయి. సీఐడీ ప్రాథమిక విచారణలో చాలా లోపాలు.. దర్యాప్తు సరిగా సాగలేదని తేలింది. అవనిగడ్డలో 2020 నవంబరు 27న అర్ధరాత్రి వైద్యుడు దారుణహత్యకు గురయ్యారు. ఇంట్లోని సీసీ కెమెరాల డీవీఆర్ కూడా గల్లంతైంది. ఈ ఘటనలో నాటి ప్రజాప్రతినిధి, అతని అనుచరులు ఉన్నారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. దీంతో పోలీసులూ నేతలకు అనుకూలంగా దర్యాప్తు నీరుగార్చేలా వ్యవహరించారు. ఘటనాస్థలికి వచ్చిన నాటి ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ, ఎలాంటి ఆధారాలు దొరకలేదనడం అనుమానాలకు తావిచ్చింది. ఫలితంగా దోషులు తప్పించుకోగా.. నాలుగేళ్లుగా కేసు మిస్టరీగానే మిగిలింది.

కావాలనే వదిలేశారా?: కూటమి ప్రభుత్వం కొలువుదీరాక అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్.. ఈ కేసు పునర్విచారణకు తీవ్రంగా ప్రయత్నించారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కేసును సీఐడీకి అప్పగించాలని నిర్ణయించారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ బుద్ధప్రసాద్.. డాక్టర్ హత్యోదంతంపై మాట్లాడారు. రెండు నెలల కిందట సీఐడీ అధికారులతో కలిసి ఆ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్ అవనిగడ్డలో డాక్టర్ ఇంటికెళ్లి పరిశీలించారు. శ్రీహరి కుమారుడు డాక్టర్ ప్రవీణ్‌తో చర్చించారు. తర్వాత సీఐడీ అధికారులు పలుమార్లు అవనిగడ్డ వెళ్లి స్థానికులు, పోలీసులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఇటీవల ప్రాథమిక విచారణ పూర్తి చేసి నివేదిక రూపొందించారు. ✱ నాటి ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, డీఎస్పీ మహబూబ్ బాషా, సీఐ రవికుమార్‌లు దర్యాప్తు సరిగా చేయలేదనీ, పలు అంశాలను పరిగణించలేదని అభిప్రాయపడ్డారు. అవనిగడ్డ, సమీప ప్రాంతాల్లో నేరస్థుల కదలికలపై నిఘా పెట్టలేదు. వారి సీడీఆర్‌లను పూర్తిగా విశ్లేషించలేదని గుర్తించారు. ✱ హత్యకు ఆరు నెలల ముందే గుర్తుతెలియని వ్యక్తి వైద్యుడి ఇంట్లోకి ప్రవేశించి.. నగదు, బంగారం చోరీ చేశాడు. అతడి ఆనవాళ్లు సీసీ కెమెరాల్లో అస్పష్టంగా ఉన్నాయి. ఇంటి వెనక చెట్టెక్కి దాని మీదుగా ఇంట్లోకి చొరబడినా.. పోలీసులు పరిగణించలేదు. శ్రీహరి కుటుంబం ఆగంతకుడి ఆధారాలు ఇచ్చినా లెక్కలోకి తీసుకోలేదు. హత్య జరిగిన రోజూ నిందితుడు ఇలాగే చెట్టెక్కి ఇంట్లోకి ప్రవేశించాడు. రెండు ఘటనల్లో ఒకరే పాల్గొన్నట్లు ఉన్నా ఆ దిశగా దర్యాప్తు సాగలేదు.

వైకాపా నేతలతో వ్యాపార వివాదాలు

✱ శ్రీహరికి వైకాపా నేతలతో వ్యాపార వివాదాలు ఉన్నాయి. వైకాపా నేతలపై శ్రీహరి కుమారుడు అనుమానాలు వ్యక్తం చేసినా.. ఆ దిశగా దర్యాప్తు సాగలేదు. నేతలనూ పోలీసులు పిలిచి విచారించిన పాపాన పోలేదు. ✱ నిత్యం ఆసుపత్రిలో ఉండే నర్సు.. హత్య జరిగిన రోజు లేదు. ఆమెను పోలీసులు ప్రశ్నించలేదు. హత్య గురించి తొలుత ఆసుపత్రి సిబ్బంది.. వైద్యుడి కుటుంబం, పోలీసులకు కాక నాటి ప్రజాప్రతినిధికి తెలిపారు. ఆయన అనుచరులతో ఘటనాస్థలికి వచ్చాకే.. పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఇప్పుడు ఆధారాలు కష్టమేనా?... ఘటన జరిగి.. నాలుగున్నరేళ్లు. దర్యాప్తులో తప్పటడుగులతో.. కీలక ఆధారాలు గల్లంతయ్యాయనీ, ఇప్పుడు నిందితుల ఆనవాళ్లు దొరికేది కష్టమేనని ప్రాథమిక నివేదికలో పొందుపరిచారు. ఆసుపత్రిలో ఏళ్లుగా పనిచేసిన నర్సు, ఆమె కుటుంబంపై సీఐడీ అధికారులు నిఘా పెట్టారు. ప్రాథమిక నివేదిక మేరకు.. సీఐడీకి అప్పగిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడే వీలుంది. తర్వాత కృష్ణా పోలీసుల నుంచి దస్త్రాలు స్వాధీనం చేసుకోనున్నారు.

భారీ వర్షాలు.. ఈదురుగాలుల హెచ్చరిక

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ, విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శుక్రవారం కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి అవగాహన కల్పించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో 24 గంటల పాటు పని చేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రాణ, పశు నష్టం జరగకుండా చూడాలని తెలిపారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడితే.. వెంటనే సాధారణ స్థితికి తెచ్చేందుకు అవసరమైన సామగ్రి ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. చెట్లు విరిగి రోడ్లపై పడితే తక్షణమే తొలగించాలని, నీళ్ల నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది అందుబాటులో ఉండి, ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే తహసీల్దార్ కార్యాలయాలకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కాలువలకు 13,051 క్యూసెక్కులు

ఎన్టీఆర్ కలెక్టరేట్: ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు శుక్రవారం 13,051 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 9,039, కృష్ణా పశ్చిమ 4,012 క్యూసెక్కులు సరఫరా చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాలువకు 4,401, ఏలూరు కాలువకు 1,302, బందరు కాలువకు 1,893, కేఈబీ (దివిసీమ) కాలువకు 1,443 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఇబ్రహీపట్నం గ్రామీణం 9773300487 గొల్లపూడి 8008574638



★దుగ్గిరాలపాడు గ్రామంలో నెలల తరబడి కాలువల్లో పూడిక తీయక పోవడంతో మురుగు పారక దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురించగా స్పందించిన కార్యదర్శి హరికృష్ణ సిబ్బందితో శరవేగంగా కాలువలు పూడిక తీయించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు



★ స్థానిక పంచాయతీ పరిధిలోని గ్రంథాలయం వెనుక బీసీ కాలనీలోని డ్రెయినేజీలో పూడిక, తూడుకాడ పెరిగి మురుగు నీటి పారుదల సక్రమంగా జరగడంలేదని స్థానికులు తెలిపిన సమస్యపై పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు స్పందించారు. శుక్రవారం సిబ్బందిని పంపి కాలువలో శుభ్రం చేయించారు. -న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

స్పందనకు వందనం

రహదారికి మరమ్మతులు



వెల్లటూరు గ్రామంలో ఉన్నత పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారి చిన్నపాటి వాన పడినా బురదకయ్యగా మారి విద్యార్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడుతోందని తల్లిదండ్రులు ఆవేదన చెంది న్యూస్‌టుడే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యపై 'చినుకు పడితే.. బురదే' అనే కథనం గత నెల 29వ తేదీన ప్రచురితమైంది. దీంతో స్పందించిన కార్యదర్శి మురళి విరిగిన ఇటుక ముక్కలతో రహదారి మెరక చేసి చదును చేయించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: విద్యుత్తు నూతన లైన్ల నిర్మాణం నేపథ్యంలో తోటమూల విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలోని తోటమూల రింగ్ సెంటరు నుంచి మధిర రోడ్డు వరకు శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, గోసవీడు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ కొమ్ము వాసు శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కళాకారుల సమస్యల పరిష్కారానికి వినతి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ప్రదర్శన బకాయిలు, పెన్షన్లు, గుర్తింపు కార్డులు సహా కళాకారుల సమస్యలు పరిష్కరించాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం శ్రీరాంపురం గ్రామంలో మండల కళాకారుల సమావేశం సీనియర్ కళాకారుడు వి.వెంకటరత్నం అధ్యక్షతన జరిగింది. జిల్లా అధ్యక్షుడు జి.వి.రంగారెడ్డి పాల్గొని మాట్లాడుతూ..సమస్యల పరిష్కారం కోసం కళాకారులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో డి.ఏసుపాదం, ఎస్.వెంకటేశ్వర్లు, సిహెచ్.విక్టర్, ముత్తయ్య, భూషణం, సునీత డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈసీఈ విద్యార్థులకు కార్యశాల

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ 6వ సెమిస్టర్ విద్యార్థులకు శుక్రవారం హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ అండర్ ఏఐసీటీఈ సంకల్ప్ అంశంపై కార్యశాల నిర్వహించారు. హెచ్‌పీసీ విశిష్టత, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.అప్పారావు, విభాగాధిపతి మూర్తి, కోఆర్డినేటర్ అనిల్‌రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వహణలో చిత్తశుద్ధి అవసరం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించేందుకు చిత్తశుద్ధితో వ్యవహరిద్దామని మధ్యాహ్న భోజన పథక జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మలారాణి అన్నారు. కొండపల్లి పురపాలికలోని జిల్లా పరిషత్, ఎంపీపీ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని టీం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వం విద్యార్థులకు రుచికరమైన, పోషక కరమైన భోజనం ఇవ్వాలన్న సంకల్పంతో సన్న బియ్యాన్ని అందిస్తుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయుల కూడా దృష్టి సారించి సక్రమంగా అన్ని అమలుచేసేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమణ, కోఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుసుకుని.. భారం దించుకుని

విద్యుత్తు లోడు క్రమబద్ధీకరణతో రూ.2,06,18,200 రాబడి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, (గుంటుపల్లి), న్యూస్‌టుడే

విజయవాడ రూరల్ డివిజన్ పరిధిలో వినియోగదారులు విద్యుత్తు లోడు క్రమబద్ధీకరణ పథకం ద్వారా రూ.2,06,18,200 చెల్లించి తాము వాడుకున్న అదనపు విద్యుత్తు లోడు భారాన్ని దించుకున్నారు. పరిమితికి మించి విద్యుత్తును వాడుతూ అపరాద రుసుములకు గురవుతున్న వారి కోసం ఆ శాఖ ఈ పథకాన్ని తీసుకొచ్చింది. మార్చి 1 నుంచి జూన్ 30 వరకు రాయితీ సౌకర్యం కల్పించింది. పట్టణ వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించగా గ్రామాల్లో అంతంత మాత్రం గానే ఉంది. మొత్తం మీద ఎక్కువ సంఖ్యలో వినియోగదారులు వాడుతున్న విద్యుత్తుకు అనుగుణంగా అదనపు లోడుకు నగదు చెల్లించి క్రమబద్ధీకరించుకున్నారు. రూరల్ డివిజన్‌లోని చిల్లకల్లు, ఇబ్రహీంపట్నం, మైలవరం, నందిగామ సబ్ డివిజన్ పరిధిలో 10,138 మంది వినియోగదారులు 16696.2 కిలోవాట్ల అదనపు విద్యుత్తు వినియోగానికి రూ.2,06,18,200 చెల్లించినట్లు అధికారులు తెలిపారు.

సబ్‌డివిజన్	కనెక్షన్లు	అదనపులోడు (కి.వా)	చెల్లించిన సొమ్ము(రూ.)
చిల్లకల్లు	2,364	4,291	52,86,600
ఇబ్రహీంపట్నం	3,686	5,767.74	71,32,500
మైలవరం	1,625	2,965.46	36,69,550
నందిగామ	2,463	3,672	45,29,550

పెరిగిన వినియోగానికి అనుగుణంగా

పదేళ్ల కిందట ఇళ్లల్లో ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం అంతంత మాత్రంగానే ఉండేది. దానికి అనుగుణంగా అప్పట్లో విద్యుత్తు కనెక్షన్లు తీసుకునేవారికి 0.5 నుంచి 2.0 కిలో వాట్ సామర్థ్యం గల మీటర్లను మంజూరు చేసేవారు. కొన్నేళ్లుగా ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీ తదితర ఎలక్ట్రికల్ పరికరాల వినియోగం పెరుగుతూ వస్తోంది. ఎవరి ఇంట్లో ఎంత వినియోగం జరుగుతుందో విద్యుత్తుశాఖకు నిర్దిష్ట సమాచారం లేక సరైన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయలేకపోతున్నారు. ఫలితంగా తరచూ లోవోల్టేజీ, హైవోల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క అధికారుల తనిఖీ సమయాల్లో అదనపు లోడు వినియోగానికి అపరాద రుసుం చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో దాన్ని క్రమబద్ధీకరించడంతో పాటు నాణ్యమైన విద్యుత్తు సరఫరా అందించాలన్న లక్ష్యంతో ఆ శాఖ 50 శాతం రాయితీ సౌకర్యం కల్పించింది. దీని ప్రకారం ఒక్క కిలోవాట్‌కు రూ.1250 చొప్పున వసూలు చేశారు. ప్రస్తుతం నగదు సమకూరడంతో అవసరమైన చోట్ల విద్యుత్తు నియంత్రికల ఏర్పాటు వేగవంతం కానుంది.



నాణ్యమైన విద్యుత్తుకు అవకాశం

అదనపులోడును క్రమబద్ధీకరించుకోవడం వల్ల వినియోగదారులకు అపరాధ రుసుముల భారం తప్పడంతోపాటు నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు అవకాశం ఉంటుంది.
- వసంతరావు, డివిజనల్ ఇంజినీరు

క్షయ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: టీబీ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకే చికిత్స విధానంపై క్యాంపెయినింగ్‌ను ప్రభుత్వం నిర్వహిస్తుందని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ అన్నారు. టీబీ యూనిట్ ఇబ్రహీంపట్నం ఆధ్వర్యంలో చికిత్సపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..గతంలో కన్నా టీబీపై ప్రజల్లో కొంత అవగాహన కలిగిందన్నారు. ప్రభుత్వం కూడా దాదాపు అన్ని పీహెచ్‌సీల పరిధిలో వ్యాధికి సంబంధించి మందులు అందుబాటులో ఉంచిందన్నారు. నిర్దేశిత కాలంలో కోర్స్‌ను వాడితే పూర్తిగా నయం అవుతుందని చెప్పారు. అనంతరం యూనిట్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు.

తెదేపా గ్రామ అధ్యక్షుడి ఎంపిక

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు జి.కొండూరు తెదేపా గ్రామ పార్టీ అధ్యక్షుడిగా పజ్జూరు విజయ్‌ను ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నుకున్నారు. గొల్లపూడి ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను తెదేపా నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన విజయ్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పజ్జూరు రవికుమార్, ఉయ్యూరు వెంకటనరసింహారావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీవోలకు ఒకరోజు శిక్షణ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల నెల వారీ ప్రణాళికలపై ఎస్‌హెచ్‌జీ వీవోలకు అవగాహన ఉండాలని జిల్లా డీపీఎం అమ్మిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఎస్‌హెచ్‌జీ వీవో, జీపీలకు మండల స్థాయి ప్రణాళికలపై అవగాహన కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లాగిన్స్ క్రియేట్ చేయడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం శోభన్‌బాబు, 27 గ్రామ సంఘాల అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాలపై ఆరా

మైలవరం, న్యూస్‌టుడే: స్థానికంగా ఉన్న పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం రైతు సంఘం నాయకులు సందర్శించి, ఎరువుల విక్రయాలపై ఆరా తీశారు. యూరియా కావాలంటే కాంప్లెక్స్ ఎరువులు కొనాలంటూ షరతులు పెడుతుండడం సరికాదని నాయకులు వ్యాపారులతో ప్రశ్నించగా..తాము అలా చేయడం లేదని వ్యాపారులు బదులిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పీవీ ఆంజనేయులు, రావుల సుబ్బారావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడి.. పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో టి.కె.వి.రమణ, పక్కన అధికారులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో చెత్త సేకరణ విధానంపై ఎంపీడీవో టి.కె.వి.రమణ ఆరా తీశారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయంలో గ్రామీణ సంపద స్థాపన ప్రణాళిక 2025-26 సంవత్సరానికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో తడి, పొడిచెత్తను వేరు చేసి ఇవ్వాలని తెలిపారు. ఉపాధిహామీ పథకం ఏపీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..ఉద్యాన పంటలు మామిడి, జామ, దానిమ్మ, కొబ్బరి, మునగ, ఆయిల్ పామ్ తోటలు సాగుచేసి రైతులు లబ్ధిపొందాలని సూచించారు. వెలుగు ఏపీఎం బి.రామకృష్ణ, ఎంఎస్ అధ్యక్షురాలు కె.శిరీష, సీసీలు మణి, సుందరమ్మ, రత్నావలి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఎరువులను నల్లబజారులో విక్రయించి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో కావూరి చైతన్య దుకాణదారులను హెచ్చరించారు. శుక్రవారం జి.కొండూరులోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రతి రోజు స్టాకు బోర్డు నిర్వహణ చేపట్టాలని, ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఆదేశించారు. రికార్డులు తనిఖీలు చేసి, నిల్వలు పర్యవేక్షించారు. అనంతరం స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి మెనూ అమలు తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తెలుత గడ్డమణుగులోయలో క్వారీలను సందర్శించి అనుమతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఏవో సూరిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఆర్డీవో చైతన్య

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: ప్రజలపై పెను భారం మోపేలా ఉన్న విద్యుత్తు స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించొద్దని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మరో విద్యుత్తు పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు, ప్రజలపై విద్యుత్తు భారాలు ఆపాలంటూ రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. సమావేశంలో మండల కార్యదర్శి సుధాకర్, నాయకులు వెంకటరెడ్డి, సుబ్బారావు, రమేష్, ఇసాక్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రెడ్డిగూడెం పీహెచ్‌సీ డాక్టర్లు మణిబాబు, కె.కీర్తిలు సూచించారు. శుక్రవారం డ్రైడే -ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలో 12 గ్రామ సచివాలయ పరిధిలో పర్యటించారు. అన్నేరావుపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రమణ, డిప్యూటీ ఎంపీడీవో పి.ప్రభాకరరావు, కూనపరాజుపర్వ గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొని వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

రామచంద్రాపురం (ఎ.కొండూరు), న్యూస్‌టుడే: స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా మండలంలోని గ్రామాల్లో శుక్రవారం సచివాలయం ఉద్యోగులు, ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలపై మందును పిచికారీ చేశారు. మలేరియా, డెంగీ తదితర వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.



ఎ.కొండూరు: సచివాలయ ఉద్యోగుల ప్రదర్శన

గుంతల మార్గం..అవస్థలే నిత్యం



కట్టుబడిపాలెం కవులూరు గ్రామాల మధ్యలో ఆర్అండ్‌బీ రహదారి గుంతలతో చెరువును తలపిస్తోందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వానకే గుంతల నిండా నీరు చేరి ప్రయాణానికి నానా తంటాలు పడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఆయా గ్రామాల మధ్య ఉన్న ఓ కంపెనీలోకి నిత్యం తిరిగే భారీ వాహనాల కారణంగా రహదారి దుస్థితికి చేరిందని వాపోతున్నారు. రహదారి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు కంపెనీ యాజమాన్యాన్ని కోరినా ప్రయోజనం లేకుండా పోయిందని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు రహదారి అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు

పట్టించుకోండి.. పరిశుభ్రంగా ఉంచండి



ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ క్రీడా మైదానం నిర్వహణ పర్యవేక్షణ లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. కొన్ని సందర్భాల్లో ఇటు బందారులు మిగుల పద్ధులు, మరి కొన్ని సార్లు ప్లాస్టిక్ వ్యర్థాలు, మరో సందర్భాల్లో పశువుల వ్యర్థాలతో నిండిపోతున్నాయి. దీని వల్ల క్రీడాకారులు, వాకింగ్ కోసం వచ్చే విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత నెల చివర్లో ఈ మైదానం పర్యవేక్షణ చేసే ఈడీ ఉద్యోగ విరమణ చేయడంతో మైదానం బాధ్యతలు మరొకరు చూస్తున్నారు. అప్పటినుంచి నిర్వహణ అగమ్యగోచరంగా తయారైంది. ఇకనైనా ఎన్టీటీపీఎస్ యాజమాన్యం దీనిని పట్టించుకుని శుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. - ఇబ్రహీంపట్నం,న్యూస్‌టుడే

ముంచెత్తిన వాన..



ఎండలతో అల్లాడుతున్న జనాలకు ఉపశమనం కలిగేలా.. వర్షపు జల్లుల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న అన్నదాతల ఆశ తీరేలా శుక్రవారం మైలవరంలో వర్షం ముంచెత్తింది. దాదాపు గంటసేపు ఏకధాటిగా కుంభవృష్టిని తలపించేలా పడిన వానతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారి నుంచి అంతర్గత మార్గాల వరకు మోకాలి లోతున నీరు నిలిచిపోయాయి. ఈ ఏడాదికే భారీ వర్షమని భావిస్తుండగా, చెరువులకూ నీరు చేరుతుందని కర్షకులు ఆశపడుతున్నారు. -న్యూస్‌టుడే, మైలవరం

పడుతూ..లేస్తూ ప్రయాణాలు



కందులపాడు గ్రామ శివారు చేగిరెడ్డిపాడు సమీపంలో ఆర్అండ్‌బీ రహదారి మోకాలి లోతు గుంతలు ఏర్పడి రాకపోకలకు వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఈ మార్గం నుంచే మైలవరం నియోజకవర్గ ప్రజలు నిత్యం విజయవాడ వెళుతుంటారు. మోకాలి లోతు గుంతలు ఉండటంతో ద్విచక్ర వాహనదారులు పడుతూ లేస్తూ తంటాలు పడుతున్నారు. మరోవైపు తరచు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు

దాతల సేవలు ఆదర్శనీయం



గుంటుపల్లి ఖాజీ పేటలో కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



విస్సన్నపేట : చంద్రుపట్ల తండాలో కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నాయకులు

గుంటుపల్లి (ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే: గత ఐదేళ్ల విధ్వంస పాలనను కూటమి ప్రభుత్వం వికాసం దిశగా నడిపిస్తోందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గుంటుపల్లిలో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన చెరుకూరి సుబ్బారావు కుటుంబ సభ్యులు రూ.18లక్షలతో సమకూర్చిన మహాప్రస్థానం వ్యాను, నదీతీరంలో చెరుకూరి రాయుడు కుటుంబ సభ్యులు రూ.18 లక్షలతో నిర్మించిన మహాప్రస్థానం భవనాన్ని, మాజీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్ నిధులైన రూ.6.5 లక్షలతో గ్రామ పంచాయతీ కొనుగోలు చేసిన ట్రాక్టరును ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామానికి చెందిన ఇద్దరికి ముఖ్య మంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.05 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతలు తమకున్న సంపదలో గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించే సంప్రదాయాన్ని కొనసాగించాలని కోరారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని మరికొందరు ముందుకు రావాలని సూచించారు. పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చెరుకూరి వెంకట తిరుమలరావు, సర్పంచి కవిత, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు పెదర్ల రవి, మండల శాఖ అధ్యక్షుడు రాజశేఖర్, పార్టీ నాయకులు నర్రా వాసు, సూరిబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం మండలాల్లో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కూటమి అందించిన సంక్షేమ, అభివృద్ధి కరపత్రాలను పంపిణీ చేశారు. గంపలగూడెం మండలం చింతలనర్వ, చెన్నవరంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటా పర్యటించి సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. చింతలనర్వ బడిలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి..పిల్లలతో కలిసి అన్నం తిన్నారు. తిరువూరు పట్టణం 8వ వార్డులో, మండలంలోని పెద్దవరంలో తెదేపా నాయకులు ఇంటింటా పంపిణీ చేశారు.

'మాపై నిర్లక్ష్యం తగదు'



సీఐటీయూ నాయకులు, పుర ఇంజినీరింగ్ కార్మికుల నినాదాలు

కొండపల్లి, న్యూస్‌టుడే: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వెతలు ప్రభుత్వం పట్టించుకోవాలని సీఐటీయూ వర్కర్స్ యూనియన్ మేస్త్రీ వాసు అన్నారు. కొండపల్లి చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద ఆరో రోజు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో కార్మికులు జీవిస్తున్నారని..కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతూ సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మహేష్, శ్రీను, అప్పలరాజు, డి.రాజు, శివరామకృష్ణ, నోజు, తిరపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వంటావార్పుతో ఆందోళన

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలో పురపాలిక ఇంజినీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మె శుక్రవారం కొనసాగింది. వీరితో పాటు పురపాలిక పారిశుద్ధ్య కార్మికులు కూడా తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు, ఇంజినీరింగ్ కార్మికుల ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించి తమ ఆవేదనను వ్యక్తపరిచారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఎప్పటి నుంచో కోరుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వాపోయారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, నాయకులు ఎ.రవి, బి.శ్రీనివాసరావు, ఎస్.వీరభద్రం పాల్గొన్నారు.

వీధి కుక్క దాడిలో 12 మందికి గాయాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని పలు వీధుల్లో ఓ కుక్క 12 మందిని గాయపరిచింది. కుక్కకాటుకు గురైనవారంతా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి యాంటీ రేబీస్ టీకా వేయించుకున్నారు. కుక్క స్వైరవిహారంతో శుక్రవారం ఉదయం పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మూకుమ్మడిగా ఆ శునకాన్ని గ్రామ వెలుపలకు తరిమేసినట్లు తెలిసింది. విస్సన్నపేటలో కుక్కల బెడద తొలగించాలని ప్రజలు పంచాయతీ అధికారులను కోరారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గొల్లమండల(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని గొల్లమండల గ్రామ శివారులో సుమారు 40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కృష్ణ శుక్రవారం తెలిపారు. నాలుగు రోజులుగా సదరు వ్యక్తి గొల్లమండలలో మతిస్థిమితం లేకుండా తిరుగుతూ వేరే భాషలో మాట్లాడుతూ కనిపించినట్లు గ్రామస్థులు తెలిపారన్నారు. మృతుడు ఒడిశా లేదా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు చెప్పారు. మృతుడి ఆచూకీ తెలిస్తే తమకు సమాచారమివ్వాలని కోరారు. మృతదేహాన్ని తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి పంచాయతీ సిబ్బందితో అంత్యక్రియలు చేసే ఏర్పాట్లు చేస్తామన్నారు.

డివిజనల్ పంచాయతీ కార్యాలయ ఉద్యోగిని అదృశ్యం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: విజయవాడ బీసెంట్ రోడ్డులోని డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో పని చేసే గజ్జల లక్ష్మి (40) గురువారం నుంచి కనిపించడం లేదంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు గవర్నర్‌పేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వెలగలేరు గ్రామానికి చెందిన లక్ష్మి గతంలో ముత్యాలంపాడులో సచివాలయ కార్యదర్శిగా చేశారు. 4 నెలల కిందట డిప్యూటేషన్‌పై బీసెంట్ రోడ్డులోని డివిజనల్ పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. ఈ నెల 17న ఇంటి నుంచి కార్యాలయానికి వెళ్లారు. ఆమెను తీసుకువచ్చేందుకు సాయంత్రం 5 గంటల సమయంలో కుమారుడు కార్యాలయం వద్దకు వెళ్లగా కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త సుబ్బారావు ఫిర్యాదు చేశారు.

పొలానికి అడ్డం తిరిగారని ఇంటి నుంచి..

మైలవరం: దీర్ఘకాలంగా సాగుచేస్తున్న భూమి తమదంటూ బంధువులు అడ్డం తిరగడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన ఉదంతంపై కేసు నమోదైనట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. తోలుకోడుకు చెందిన చల్లా ఆదియ్య, కోటేశ్వరరావు(65) అన్నదమ్ములు. కోటేశ్వరరావు ప్రస్తుతం కుటుంబంతో వెల్వడంలో నివసిస్తుండగా, గతంలో ఆదియ్యకు తోలుకోడులో ప్రభుత్వం ద్వారా వచ్చిన అసైన్డ్ భూమిని సోదరుని అనుమతితో చాలా కాలంగా సాగుచేస్తున్నాడు. తాజాగా తోలుకోడులో భూముల రీసర్వేలో భాగంగా బుధవారం నిర్వహించిన గ్రామసభకు వచ్చిన ఆదియ్య కుమారుడు కొండలరావు, ఇతర వారసులు రెవెన్యూ రికార్డుల్లో తమ తండ్రి ఆదియ్య పేరే ఉందని, అది తమ భూమేనని చెప్పారు. అధికారులు కూడా రికార్డుల్లో పేరు ఉన్నట్లు ధ్రువీకరించారు. దాంతో గతంలోనే అన్న వద్ద నుంచి కొన్న భూమికి అడ్డు పడుతున్నారన్న ఆవేదనతో తన తండ్రి శుక్రవారం మధ్యాహ్నం బైకుపై ఇళ్లు వదిలి వెళ్లాడని కోటేశ్వరరావు కుమారుడు పుల్లారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మల్లేల(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని మల్లేలకు చెందిన గుంజి మారేశ్వరరావు (37) విద్యుత్తు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..గురువారం రాత్రి వర్షం కురుస్తున్న సమయంలో ఇంటి వద్ద ఉన్న మోటారు తీగ తగిలి విద్యుత్తు ప్రసరణ జరగడంతో మారేశ్వరరావు మృతి చెందాడు. అతడి భార్య సుగుణ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఉచిత వైద్య సేవలు మీ సొంతం



యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న వైద్యసిబ్బంది

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం)లో భాగంగా 14 అంకెల ప్రత్యేక సంఖ్యతో కూడిన ఆయుష్మాన్ హెల్త్ ఖాతా(ఏబీఏ) గుర్తింపు కార్డులను ప్రజలకు ప్రభుత్వం అందిస్తోంది. ఇందు కోసం వివరాలను అభా యాప్‌లో ఆరోగ్య సిబ్బంది నమోదు చేస్తున్నారు. తద్వారా ప్రజలు తమ ఆరోగ్య సంబంధిత సమాచారం డిజిటల్ రూపంలో నిల్వ ఉంటుంది. ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామీణ మండలం పరిధిలోని గ్రామస్థుల వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు.

గ్రామాల్లో ఇంటింటి సర్వేలు

ఏబీఏ కార్డుల కోసం ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో తిరిగి ఇంటింటి సర్వే చేస్తున్నారు. వ్యక్తిగత వివరాలతోపాటు గతంలో ఏమైనా ఆరోగ్య సమస్యలున్నాయా, ఎక్కడైనా వైద్యం చేయించుకున్నారా, ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉంది, రక్తపోటు, మధుమేహం వ్యాధులు ఉన్నాయా తదితర వివరాలు సేకరించి యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఆన్‌లైన్ చేసిన తర్వాత వచ్చే ప్రత్యేక సంఖ్యను వారికి అందిస్తున్నారు. ఈ సంఖ్యతో మీ సేవా కేంద్రాల ద్వారా కార్డులు పొందవచ్చునని, ఇకపై చికిత్సకు సదరు కార్డును తీసుకెళ్లాలని అవగాహన కల్పిస్తున్నారు. ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 14,336 ఇళ్లలో 13,455 గృహాలకు సర్వే పూర్తి చేశారు. 33,059 జనాభాకు 25,431 మంది వివరాలు యాప్‌లో పొందుపరిచారు. మిగిలిన వారిలో 5,495 మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు సర్వే గణాంకాలు తెలుపుతున్నాయి.

ఎక్కడైనా వినియోగించుకోవచ్చు

పీహెచ్‌సీ పరిధిలో ఇప్పటికే ఏబీఏ యాప్ ద్వారా 97 శాతం మంది వివరాలు నమోదు చేశాం. కార్డులను మీ సేవా కేంద్రాలు, సచివాలయాల ద్వారా పొందుతున్నారు. కార్డు లేకున్నప్పటికీ ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకున్నవారు ఏదైనా వైద్య సేవలు పొందాలంటే ఆరోగ్యశ్రీ కౌంటరు వద్ద ఉండే ఆరోగ్య మిత్రకు తెలిపితే చాలు వైద్య సేవలు ఉచితంగా అందుతాయి. - **నారాయణరావు, సీహెచ్‌వో, ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ**



ఫ్రాన్స్‌లోని నాంటెస్‌లో లొయిరి నదిపై నిర్మించిన తేలియాడే డేటా కేంద్రం. ఇది సౌరశక్తితో పనిచేస్తుంది. నదీ జలాలతో చల్లదనాన్ని గ్రహిస్తుంది. డెన్వ్-ఆర్ అనే సంస్థ దీన్ని రూపొందించింది.

నేటి ఇండియా కూటమి భేటీకి టీఎంసీ

- హాజరుకావటం లేదన్న ఆప్

దిల్లీ: విపక్ష ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు శనివారం సాయంత్రం సమావేశం కానున్నాయి. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ భేటీకి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ హాజరవుతారని ఆ పార్టీ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో దేశంలోని రాజకీయ పరిస్థితులపై కూటమి పార్టీల నేతలు చర్చించుకోనున్నారు. వివిధ అంశాలపై భాగస్వామ్యపక్షాలు ఏకాభిప్రాయ సాధించడంతో పాటు కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకునబెట్టేలా కలిసికట్టుగా నడవాలనే అభిప్రాయానికీ రానున్నారు. ఇండియా కూటమిలో తాము భాగస్వాములుగా లేమని, ఈ భేటీకి హాజరుకావడం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలు తెలిపారు.

అభిశంసన తీర్మానంపై సంతకాలు చేస్తాం: జైరాం

దిల్లీ: లోక్‌సభలో జస్టిస్ యశ్వంత్‌వర్మపై తీసుకురానున్న అభిశంసన తీర్మానానికి కాంగ్రెస్ మద్దతిస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ వెల్లడించారు. రాష్ట్రపతి, ప్రధానికి లేఖరాసి మాజీ సీజేఐ జస్టిస్ సంజీవ్‌ఖన్నా బలవంతంగా మమ్మల్ని ఒప్పించారని ఆయన వ్యాఖ్యానించారు.

మహారాష్ట్రలోని ఇస్లాంపుర్ ఇక ఈశ్వర్‌పుర్


- పేరు మారుస్తూ ప్రభుత్వం ఆదేశాలు

ముంబయి: మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాలో ఇస్లాంపుర్ పేరును ఈశ్వర్‌పుర్‌గా మారుస్తున్నట్లు శుక్రవారం ప్రభుత్వం ప్రకటించింది. గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని, కేంద్ర ఆమోదం కోసం దీన్ని పంపుతామని మంత్రి ఛగన్ భుజ్‌బల్ తెలిపారు. పేరు మార్చాలని హిందుత్వ సంస్థ శివ్ ప్రతిష్ఠాన్ ఇటీవల కలెక్టర్ కార్యాలయానికి వినతిపత్రం సమర్పించిన నేపథ్యంలో ఫడణవీస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

రష్యా సైనికులపై విష ప్రయోగం?

ఇంటర్నెట్ డెస్క్: ఉక్రెయిన్‌పై సుదీర్ఘకాలంగా పోరు సాగిస్తున్న రష్యన్ సైనికులకు కొత్త గుబులు పట్టుకుంది. ఇటీవల యుద్ధరంగంలో ఉన్న నలుగురు సైనికులు తోటి సిబ్బంది కళ్లముందే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. విషం కలిపిన నీళ్లను తాగడం వల్లే వారు మృతి చెందినట్లు తెలిసింది. ఈ నీళ్లు తాగిన చాలా మంది సైనికుల ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. రష్యా ఆక్రమిత దొనెట్స్క్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 'అవర్ వాటర్' పేరుతో ఉన్న ఈ నీళ్ల బాటిళ్లు మానవతా సాయం కింద ఈ ప్రాంతానికి వచ్చినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. క్రిమియాలోని సిమఫెరోపోల్ నుంచి వీటిని పంపించినట్లు గుర్తించారు. ఈ బాటిళ్లను ఎవరు పంపారు? యుద్ధరంగంలోని జవాన్ల చేతికి ఎలా వచ్చాయి? వారిలో ఎవరు విషం కలిపారన్న కోణంలో దర్యాప్తు జరుపుతున్నట్లు క్రెమ్లిన్ వర్గాలు వెల్లడించాయి. ఈ మరణాలు ఉక్రెయిన్ కుట్ర ఫలితంగానే సంభవించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


ఇద్దరు సీఎంలను అరెస్టు చేసిన అధికారి రాజీనామా



కపిల్‌రాజ్

దిల్లీ: గత సంవత్సరం ఇద్దరు ముఖ్యమంత్రుల అరెస్టును పర్యవేక్షించిన మాజీ ఈడీ అధికారి కపిల్‌రాజ్ ప్రభుత్వోద్యోగానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల రీత్యా ఆయన రాజీనామా చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆయన రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించారని ఆర్థిక శాఖ గురువారం ప్రకటించింది. ఆయన రాజీనామా ఈ నెల 17 నుంచి అమలులోకి వచ్చినట్లు తెలిపింది. దిల్లీ మద్యం పాలసీ కేసులో 2024 మార్చి 21న అప్పటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు సమయంలో కపిల్‌రాజ్ అక్కడే ఉన్నారు. అదేవిధంగా గతేడాది జనవరిలో భూ కుంభకోణం కేసుకు సంబంధించి ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అరెస్టునూ కపిల్‌రాజ్ స్వయంగా పర్యవేక్షించారు. 45 సంవత్సరాల కపిల్‌రాజ్ 2009 బ్యాచ్ ఇండియన్ రెవెన్యూ సర్వీసు అధికారి. ఎనిమిదేళ్ల పాటు డిప్యుటేషన్‌పై ఈడీకి ఆయన సేవలు అందించారు. ఉద్యోగానికి రాజీనామా చేసే నాటికి జీఎస్టీ నిఘా విభాగానికి అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్నారు.

పీకే పక్కటెముకకు గాయం



ప్రశాంత్ కిశోర్

పట్నా: ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) గాయపడ్డారు. ఆరా జిల్లాలో 'బద్లావ్ సభ'కు ముందు రోడ్‌షో నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఆయన పక్కటెముక భాగంలో దెబ్బ తగిలింది. రోడ్‌షో సమయంలో ప్రజలతో కరచాలనం చేసేందుకు కారులోంచి బయటకు వంగిన సమయంలో ఇది జరిగినట్లు నేతలు చెబుతున్నారు. దీంతో ఆయన్ను హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పట్నాకు తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. పక్కటెముకలకు దెబ్బ తగలడంతో ప్రశాంత్ కిశోర్ నొప్పితో బాధపడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

నిమిష ప్రియను రక్షించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటాం

- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం



దిల్లీ: యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న భారతీయ నర్సు నిమిష ప్రియను దేశానికి సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తోందని అత్యున్నత న్యాయస్థానానికి శుక్రవారం కేంద్రం తెలిపింది. నిమిష ప్రియ మరణశిక్ష తాత్కాలికంగా నిలిచిపోయిందని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనానికి తెలిపింది. ఈ సందర్భంగా బాధితుడి కుటుంబాన్ని కలిసి చర్చించేందుకు ఓ ప్రతినిధి బృందాన్ని యెమెన్‌కు కేంద్రం పంపాల్సిందిగా పిటిషనర్ సంస్థ 'సేవ్ నిమిష ప్రియ-ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' తరఫు న్యాయవాది కోరారు. ఈ కేసులో తమవైపు నుంచి చర్యలు కొనసాగుతున్నాయని కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి తెలిపారు. 'ప్రస్తుతానికి ఉరిశిక్ష నిలిపివేశారు. ఇప్పుడు బాధిత కుటుంబం నుంచి క్షమాపణ పొందాలి. ఆ తర్వాత బ్లడ్‌మనీ(క్షమాధనం) గురించి చర్చించాలి'' అని ఆ న్యాయవాది పేర్కొన్నారు. బాధితుడి కుటుంబంతో చర్చించడానికి యెమెన్ వెళ్లేందుకు ప్రభుత్వ ప్రతినిధి బృందంతో పాటు పిటిషనర్ సంస్థ నుంచి ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులతో పాటు.. కేరళకు చెందిన ఓ మత పండితుడిని కూడా అనుమతించాలని కోరారు. యెమెన్‌కు వెళ్లడం అంత సులువు కాదని, దీని గురించి ప్రభుత్వాన్ని సంప్రదించాల్సిందిగా ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను వచ్చే నెల 14కు వాయిదా వేసింది.

నిబద్ధత కాదు.. మీ నుంచి చర్యలను ఆశిస్తున్నాం

- ప్రత్యేక కోర్టుల ఏర్పాటుపై కేంద్రానికి సుప్రీంకోర్టు స్పష్టీకరణ



దిల్లీ: జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ), చట్ట విరుద్ధ కార్యకలాపాల నివారణ(ఉపా), తదితర ప్రత్యేక చట్టాల కింద నమోదైన కేసులను విచారించేందుకు న్యాయస్థానాలను ఏర్పాటు చేయకపోవడంపై కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ప్రభుత్వం నుంచి నిబద్ధతను కాదు చర్యలను ఆశిస్తున్నామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. ఇలాగే పరిస్థితి కొనసాగితే నిందితులను కోర్టులు బలవంతంగా బెయిల్‌పై విడుదల చేయాల్సి వస్తుందని పేర్కొంది. 2019లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఐఈడీ పేలుడులో 15మంది రాష్ట్ర పోలీసులు మృతిచెందిన ఘటనలో మావోయిస్టు సానుభూతిపరుడు కైలాశ్ రామచంద్రానీ దాఖలు చేసిన బెయిల్ అభ్యర్థనను విచారిస్తూ సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. విచారణ జరపడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని రామచంద్రానీ దాఖలు చేసిన పిటిషన్‌ను మార్చి 17న తిరస్కరించిన విషయాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తుచేసింది. ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయడంలో ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే.. రానున్న విచారణలో రామచంద్రానీ బెయిల్ అభ్యర్థనను పరిగణించాల్సి ఉంటుందని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ రాజ్‌కుమార్ బాస్కర్‌కు ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టు ప్రతిపాదనలపై నిర్ణయం తీసుకునేందుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వానికి చివరి అవకాశం ఇస్తున్నామని తెలిపింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

బ్రెజిల్ మాజీ అధ్యక్షుడి కాలికి నిఘా యంత్రం

- ఆయన కదలికలను పర్యవేక్షించాలని న్యాయస్థానం ఆదేశం



జైర్ బోల్సొనారో

సావో పాలో: బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో కాలి చీలమండకు ఎలక్ట్రానిక్ పర్యవేక్షక పరికరాన్ని అమర్చి ఆయన కదలికల్ని గమనించాలని దేశ సుప్రీంకోర్టు ఆదేశించింది. 2022లో వామపక్ష నేత లూయిజ్ ఇనాసియో లులా డసిల్వా విజయం సాధించినప్పుడు ఆ ఎన్నికలు రద్దు చేసి తిరుగుబాటు చేసేందుకు కుట్ర పన్నారని బోల్సొనారో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మాజీ అధ్యక్షుడు రాత్రిపూట ఇల్లు విడిచి వెళ్లకూడదని.. విదేశీ రాయబారులతో మాట్లాడరాదని.. విదేశాల రాయబార కార్యాలయాలు సందర్శించ కూడదని కోర్టు ఆదేశించింది. అలాగే మాజీ అధ్యక్షుడు సోషల్ మీడియా వినియోగించరాదని, తన కుమారుడు ఎడ్వర్డో బోల్సొనారోతో పాటు సుప్రీంకోర్టు విచారణ ఎదుర్కొంటున్న ఇతర నిందితులతోనూ మాట్లాడకూడదని ఆజ్ఞాపించింది. కోర్టు ఆదేశం మేరకు తన కాలికి ఎలక్ట్రానిక్ పర్యవేక్షక యంత్రాన్ని అమర్చుకుంటూ ''ఈ ఆదేశం నాకు జరిగిన తీవ్ర అవమానం'' అని బోల్సొనారో వ్యాఖ్యానించారు. బ్రెజిల్ పార్లమెంటు సభ్యుడైన ఎడ్వర్డో ప్రస్తుతం అమెరికాలో తలదాచుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఆయనకు సత్సంబంధాలున్నాయి. తన మిత్రుడైన బోల్సొనారో పట్ల బ్రెజిల్ న్యాయవ్యవస్థ అన్యాయంగా వ్యవహరించిందని ఈ సందర్భంగా ట్రంప్ వ్యాఖ్యానించారు.

దేశంలో 9 శాతం అదనంగా వర్షపాతం

దిల్లీ: దేశంలో ఈ ఏడాది ఇప్పటివరకూ రుతుపవన ప్రభావం కారణంగా 9 శాతం అదనంగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అన్ని ప్రాంతాల్లో వర్షపాతం ఒకేలా లేదని స్పష్టమవుతోంది. ఝార్ఖండ్, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు లద్దాఖ్ వంటి ప్రాంతాల్లో సాధారణం కన్నా చాలా ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఈశాన్యం, దక్షిణాది ప్రాంతాల్లో వర్షాలు మామూలు కన్నా తక్కువగా కురిశాయని గణాంకాలు తెలియజేస్తున్నాయి. గత నెల 1 నుంచి ఈ నెల 16 వరకూ దేశంలో 331.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణంగా ఈ సమయానికి నమోదయ్యే వర్షపాతం కన్నా ఇది 9 శాతం ఎక్కువ.

తిరోగమన ఆచారాల నుంచి మహిళలకు స్వేచ్ఛనిద్దాం

- ఆరెస్సెస్ అధిపతి మోహన్ భాగవత్

పుణె: తిరోగమన సంప్రదాయాలు, కట్టుబాట్ల నుంచి మహిళలకు స్వేచ్ఛ కల్పించాల్సిన అవసరం ఉందని ఆరెస్సెస్ అధిపతి మోహన్ భాగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని శోలాపుర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ''మహిళా సాధికారత దేశ నిర్మాణంలో కీలకం. పురుషులు చేయలేని పనులు కూడా చేసే శక్తిని ఆ దేవుడు మహిళలకు ఇచ్చాడు. స్త్రీలను ఉద్ధరిస్తామని పురుషులు చెప్పుకోవడం అవివేకం. మహిళలు ఏం చేయాలనుకుంటున్నారో దాన్ని చేయనిద్దాం. తిరోగమన సంప్రదాయాలు, కట్టుబాట్ల నుంచి వారికి విముక్తి కల్పించి శక్తినిద్దాం'' అని అన్నారు.

కన్నతల్లిని ఇంట్లో బంధించి చిత్రహింస



ఈటీవీ భారత్: హరియాణాలోని కైథల్ జిల్లా చందన గ్రామంలో ఓ కుమారుడు దివ్యాంగురాలైన కన్నతల్లిని ఇంట్లో బంధించి చిత్రహింసలకు గురిచేశాడు. ఇంటికి తాళం వేసి భోజనం, నీళ్లు ఇవ్వకుండా క్రూరంగా ప్రవర్తించాడు. బాధిత మహిళ సహాయం కోసం కేకలు వేయడంతో ఇరుగు పొరుగువారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని ఆమెను రక్షించారు. తీవ్ర నీరసంతో ఉన్నందున వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని, దాదాపు తొమ్మిది రోజుల నుంచి ఆహారం తీసుకోలేదన్నారు. ఈమె భర్త రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ''రాత్రిపూట స్నేహితులతో కలిసి మద్యం తాగుతూ నన్ను కర్రతో కొట్టేవాడు. పక్కింట్లో ఉంటున్నవారు గేటు కింద నుంచి ఆహారం ఇచ్చేందుకు ప్రయత్నించినా అడ్డుకునేవాడు'' అని ఆమె హీనస్వరంతో పోలీసులకు తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాజా నగరంలో కొనసాగుతున్న దాడులతో నిర్వాసితులైన పాలస్తీనియన్లు ఏర్పాటు చేసుకున్న గుడారాలు

ఈయూవి ద్వంద్వ ప్రమాణాలు

- రష్యా ఇంధన సరఫరాలపై ఆంక్షలకు భారత్ స్పందన

దిల్లీ: ఏకపక్షంగా విధించే ఆంక్షలను తాము సమర్థించబోమని భారత విదేశీ వ్యవహారాల శాఖ ఐరోపా సమాజానికి స్పష్టం చేసింది. రష్యా గ్యాస్, చమురు వ్యాపారాన్ని దెబ్బతీస్తామన్న ఈయూ హెచ్చరికలపై భారత్ వెంటనే స్పందించింది. ఈయూ తన ప్రకటనలో భారత్‌లోని వాడినార్ చమురు శుద్ధి కర్మాగారాన్నీ ప్రస్తావించింది. ఈ రిఫైనరీలో రష్యాకు చెందిన రోస్‌నెఫ్ట్ ఇంధన సంస్థ ప్రధాన వాటాదారు. దేశ పౌరుల ప్రాథమిక అవసరాలను తీర్చేలా ఇంధన భద్రత కల్పించాల్సిన బాధ్యత భారత్‌కు ఉందని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. తన సొంత ఇంధన అవసరాలకు ఒక విధంగా, ఇతరుల అవసరాల పట్ల మరో విధంగా వ్యవహరించడం ఈయూకి తగదని పేర్కొన్నారు.

గాజా కేథలిక్ చర్చిపై దాడి తప్పే

- ట్రంప్‌నకు నెతన్యాహు సంజాయిషీ

వాషింగ్టన్: గాజాలోని ఏకైక కేథలిక్ చర్చిపై దాడి చేసి తప్పు చేశామని ఇజ్రాయెల్ అంగీకరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడుతూ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు తప్పు అంగీకరించారని వైట్‌హౌస్ వెల్లడించింది. ''గాజాలోని కేథలిక్ చర్చిపై దాడి చేయడం ఇజ్రాయెల్ చేసిన తప్పేనని ట్రంప్‌కు నెతన్యాహు తెలిపారు'' అని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ వెల్లడించారు. ''గాజాలోని ఏకైక చర్చిపై జరిగిన దాడిపై విచారం వ్యక్తం చేస్తున్నాం. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నాం'' అని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం కూడా ఒక ప్రకటనలో తెలిపింది.

తొక్కిసలాటలో 19 మంది మృతి

కాగా అంతకుముందు గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంలో గాజా మానవతా నిధి (జీహెచ్‌ఎఫ్) ఆహార పంపిణీ కేంద్రం వద్ద జరిగిన తొక్కిసలాటలో 19 మంది మృతిచెందారు. మరొకరు కత్తిపోట్లకు గురై మరణించారు. హమాస్ మిలిటెంట్ గ్రూపు భయాందోళనలను సృష్టించడంతోపాటు తప్పుడు సమాచారం ఇవ్వడంతో ఈ తొక్కిసలాట జరిగిందని జీహెచ్ఎఫ్ ఆరోపించింది.

లా ఎన్‌ఫోర్స్‌మెంట్ శిక్షణ కేంద్రంలో పేలుడు

- అమెరికాలో ముగ్గురి మృతి

లాస్ ఏంజెలెస్: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం లాస్ ఏంజెలెస్‌లో ఉన్న లా ఎన్‌ఫోర్స్‌మెంట్ శిక్షణ కేంద్రంలో జరిగిన పేలుడులో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మృతులను ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సభ్యులుగా గుర్తించారు. శిక్షణలో భాగంగా ఈ పేలుడు సంభవించినట్లు అధికారులు పేర్కొన్నారు.

ట్రంప్ నిధుల కోత నిర్ణయానికి అమెరికా చట్టసభల ఆమోదం



వాషింగ్టన్: అమెరికాలో పబ్లిక్ బ్రాడ్ క్యాస్టింగ్ కార్పొరేషన్ (సీపీబీ)కి 110 కోట్ల డాలర్లు, వివిధ దేశాలలో సహాయ కార్యక్రమాలకు 800 కోట్ల డాలర్ల కేటాయింపును రద్దుచేయాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన విన్నపాన్ని అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) దిగువ సభ శుక్రవారం ఆమోదించింది. ఎగువ సభ సెనెట్ గురువారమే ఆమోదం తెలిపింది. రెండు సభల్లో ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ సభ్యుల అభ్యంతరాలను తోసిపుచ్చి పాలక రిపబ్లికన్లు ఆమోదముద్ర వేశారు. లాభాపేక్ష లేకుండా పనిచేసే సీపీబీ ప్రభుత్వ నిధులతో నడుస్తోంది. సీపీబీ ఈ నిధులలో మూడింట రెండు వంతులను 1500 స్థానిక రేడియో,టీవీ స్టేషన్లకు పంచుతోంది. వీటిలో అమెరికా మూలవాసుల రిజర్వేషన్ ప్రాంతాల్లోని స్టేషన్లూ ఉన్నాయి. అలాస్కాలోని రేడియో స్టేషన్ కేవలం వార్తల ప్రసారమే కాదు, సునామీ, భూకంపం, అగ్నిపర్వత విస్ఫోటనాల గురించి కూడా ముందుగా హెచ్చరిస్తోంది. నిధుల కోత వల్ల అదంతా దెబ్బతింటుంది. ఇక అమెరికా అందించే విదేశీ సహాయం శరణార్థులకు, ప్రకృతి విపత్తుల బాధితులకు ఆశ్రయం, ఆహారం, తాగు నీటి సరఫరాకు, వైద్య చికిత్సలకు ఉపకరిస్తోంది. ఈ సహాయాన్ని తగ్గించడం వల్ల అమెరికా ఖాళీచేసే నాయకత్వ స్థానాన్ని చైనా భర్తీ చేస్తుందని డెమోక్రాట్లు ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల మిగిలే సొమ్మును అమెరికా పౌరుల కోసం ఉపయోగిస్తామని ట్రంప్ సర్కారు చెబుతోంది.

మసూద్ ఉగ్ర నేపథ్యం ఇదీ..

ఇంటర్నెట్‌డెస్క్: నిషేధిత జైషే మహ్మద్ ముష్కర ముఠా అధినేత మసూద్ అజార్ జాడను భారత నిఘా వర్గాలు గుర్తించిన నేపథ్యంలో అతడి ఉగ్రచరిత్ర మరోసారి తెరపైకి వచ్చింది. ఆ వివరాలివీ..

- ✦ మసూద్ అజార్‌ను భారత్, అమెరికా, ఐక్యరాజ్య సమితి ఉగ్రవాదిగా ప్రకటించాయి.
- ✦ భారత దర్యాప్తు విభాగాల కస్టడీలో ఉన్న మసూద్‌ను విడిపించుకునేందుకు ఉగ్రవాదులు 1999 డిసెంబరు 24న ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేశారు.
- ✦ విడుదలైన వెంటనే జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థను మసూద్ అజార్ ఏర్పాటు చేశాడు.
- ✦ 2001లో భారత పార్లమెంటుపై జరిగిన ఉగ్రదాడిలో మసూద్ అజార్ పాత్ర ఉంది.
- ✦ 2016లో భారత్‌లోని పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై ఉగ్రదాడికి సూత్రధారి మసూద్ అజార్.
- ✦ 2019లో జమ్మూకశ్మీరులోని పుల్వామాలో ఆర్మీ కాన్వాయ్‌పై జరిగిన ఉగ్రదాడికి సూత్రధారి మసూద్. ఈ ఘటనలో 40 మంది భారత సైనికులు అమరులయ్యారు.



పశ్చిమబెంగాల్‌లో పశ్చిమ మేదినీపుర్ జిల్లా ఝార్‌గ్రామ్‌లోని బాన్సతొలా సమీపంలో రైలు ఢీకొని మరణించిన ఏనుగు

రైలు ఢీకొని మూడు ఏనుగుల మృతి

- పశ్చిమబెంగాల్‌లో ఘటన

ఝాడ్‌గ్రామ్: పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిద్నపుర్ జిల్లాలో శుక్రవారం జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలు ఓ ఏనుగుల గుంపును ఢీకొట్టింది. గురువారం రాత్రి జరిగిన ఈ దుర్ఘటనలో మూడు ఏనుగులు మృత్యువాతపడ్డాయి. ఇందులో రెండు గున్న ఏనుగులు ఉన్నాయి. బాంసాటాల్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలను ఏనుగుల గుంపు దాటుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

బెట్టింగ్‌లపై నిషేధం కోరిన వ్యాజ్యాలన్నీ సుప్రీంకోర్టుకు

- బదిలీకి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం

దిల్లీ: భావి పరిణామాలను అంచనా వేసే వ్యాపార వేదికలు బెట్టింగ్‌ను, జూదాన్నీ ప్రోత్సహిస్తున్నాయి కాబట్టి ఆ వేదికలను నిషేధించాలంటూ వివిధ హైకోర్టుల్లో దాఖలైన నాలుగు ప్రజాహిత వ్యాజ్యాలను (పిల్) తనకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ వేదికలను అభిప్రాయ వ్యాపార వేదికలు (ఒపీనియన్ ట్రేడింగ్ ప్లాట్ ఫామ్స్) అంటారు. క్రీడలు, ఎన్నికలు, క్రిప్టో కరెన్సీ వంటి రంగాలలో భావి ఫలితాలు ఎలా ఉంటాయో అంచనా వేస్తూ డబ్బును పందెం కాయడానికి ఈ వేదికలు తోడ్పడుతున్నాయి. చట్టవిరుద్ధంగా బెట్టింగ్, జూదాలకు పాల్పడుతున్నాయి కాబట్టి ఈ వేదికలను నిషేధించాలంటూ రెండు వ్యాజ్యాలు బాంబే హైకోర్టులో, మరో రెండు గుజరాత్, ఛత్తీస్‌గఢ్ హైకోర్టుల్లో దాఖలయ్యాయని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి తెలిపారు. గుజరాత్, ఛత్తీస్‌గఢ్ వ్యాజ్యాలను బాంబే హైకోర్టుకు బదిలీచేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరారు. ఆయన వినతిని తోసిపుచ్చుతూ మొత్తం నాలుగు ప్రజాప్రయోజన వ్యాజ్యాలను తామే విచారిస్తామని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం తెలిపింది. ఈ వ్యాజ్యాలకు సంబంధించిన రికార్డులు, రిట్ పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానానికి బదలీచేయాలని హైకోర్టులను ఆదేశించింది.

ప్రాణాంతక వ్యాధులున్న ఖైదీల విడుదలకు ఉమ్మడి నియమాలు రూపొందించాలి: సుప్రీంకోర్టు

జైలు నిబంధనలు రాష్ట్రాల వారీగా వేర్వేరుగా ఉంటాయని, అయితే ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీలను విడుదల చేయడానికి ఉమ్మడి నియమాలు రూపొందించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఖైదీలను, 70 ఏళ్లకు పైగా ఉన్నవారిని జైలు నుంచి విడుదల చేయాలని కోరుతూ నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వేసిన పిటిషన్‌పై ఈ మేరకు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం మార్గదర్శకాలు జారీ చేసింది.


మథుర కృష్ణాలయం వ్యాజ్యంలో అలహాబాద్ హైకోర్టు కీలక ఆదేశం

ప్రయాగ్‌రాజ్: మథురలో శ్రీకృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా మసీదు వివాదంలో హిందూ పక్షం ఇంతవరకు దాఖలు చేసిన 18 దావాలలో 17వ నంబరు దావాయే మిగిలిన వాటికీ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పరిగణించాలని కోరిన దరఖాస్తును అలహాబాద్ హైకోర్టు శుక్రవారం అనుమతించింది. మిగిలిన దావాలపై స్టే ఇచ్చి, 17వ దావాపై కోర్టు ఇచ్చే తీర్పును అందరికీ వర్తింపజేయాలని ముస్లింల తరఫు న్యాయవాది తస్లీమా నసీం కోరారు. తదుపరి విచారణను హైకోర్టు ఆగస్టు 22కు వాయిదా వేసింది. మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్ మథురలో కృష్ణుడి ఆలయాన్ని కూలగొట్టి షాహీ ఈద్గా మసీదు నిర్మించారని, ఈ మసీదును తొలగించి కృష్ణ మందిర నిర్మాణానికి అనుమతివ్వాలని హిందూ పక్షం హైకోర్టును కోరుతోంది.

రైతు నుంచి రూ.కోటి లంచం డిమాండ్.. నార్కోటిక్స్ అధికారి అరెస్టు

దిల్లీ: మాదకద్రవ్యాల కేసులో ఇరికించకుండా ఉండాలంటే రూ.కోటి లంచం ఇవ్వాలంటూ ఓ రైతును డిమాండ్ చేసిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ అధికారిని శుక్రవారం సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. మధ్యప్రదేశ్‌లోని నిమచ్‌లో పనిచేస్తున్న అధికారి మహేందర్ సింగ్‌ను రూ.3 లక్షలు లంచం తీసుకుంటుండగా అదుపులోకి తీసుకున్నామని, అతని అనుచరుడు జగ్‌దీష్ మెనారియాను కూడా అరెస్టు చేశామని అధికారులు తెలిపారు. ''ఓ రైతు పొలంలో 400 కిలోల నల్లమందును మహేందర్ సింగ్ స్వాధీనం చేసుకున్నారు. రైతు దగ్గరకు మెనారియాను పంపి.. రూ.కోటి లంచం ఇవ్వాలని, లేదంటే క్రిమినల్ కేసులో ఇరికిస్తానంటూ అతని ద్వారా సింగ్ బెదిరించారు. దీంతో ఆ రైతు మాకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే రూ.44 లక్షలు చెల్లించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు'' అని సీబీఐ అధికారులు తెలిపారు.

ఛంగూర్ బాబా రెడ్ డైరీలో నేతల పేర్లు.. ఈడీ నిఘా



లఖ్‌నవూ: చట్టవిరుద్ధంగా మతమార్పిళ్లకు పాల్పడిన కేసులో ఇటీవల అరెస్టయిన ఛంగూర్ బాబా అలియాస్ జమాలుద్దీన్ వద్ద రూ.106 కోట్లమేర విదేశీ నిధులు ఉన్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో జరిపిన సోదాల్లో బయటపడిన రెడ్ డైరీ కలకలం రేపుతోంది. ఈ డైరీలో పలువురు రాజకీయ నాయకులు, మాజీ అధికారుల పేర్లు ఉన్నట్లు సమాచారం. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో వీరంతా ఛంగూర్ బాబా నుంచి ఆర్థికసహాయం పొందినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. దీంతో ఈ డైరీపై ఏటీఎస్‌తోపాటు స్పెషల్ టాస్క్‌ఫోర్స్, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బలరాంపుర్‌లో మతమార్పిడి రాకెట్‌ను ఛేదించిన పోలీసులు.. ఇటీవల లఖ్‌నవూలోని ఓ హోటలులో ఛంగూర్ బాబాతోపాటు నీతూ అలియాస్ నస్రీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. జులై 17న యూపీలోని ఉత్రౌలాలో 12 చోట్ల, ముంబయిలో రెండుచోట్ల ఏకకాలంలో దాడులు జరిపిన ఈడీ.. ఛంగూర్ బాబా, అతడి సన్నిహితులకు చెందిన 22 బ్యాంకు ఖాతాల్లో రూ.60 కోట్లమేర జమ అయినట్లు శుక్రవారం వెల్లడించింది. ఇందులో భారీ మొత్తాలు విదేశాల నుంచి వచ్చాయని గుర్తించినట్లు తెలిపింది.

ఝార్ఖండ్‌లో కొనసాగుతున్న మావోయిస్టుల వేట

- 55 మంది నక్సల్స్‌పై రూ.8.45 కోట్ల రివార్డు

రాంచీ: ఝార్ఖండ్ పోలీసులు 55 మంది మావోయిస్టుల కోసం భారీ ఎత్తున వేటాడుతున్నారు. వారి ఆచూకీ తెలిపితే రూ 8.45 కోట్ల నగదు ఇస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. సీపీఐ (మావోయిస్టు)కి చెందిన ఈ 55 మందిలో నలుగురు అగ్ర నాయకులపై తలా కోటి రూపాయల రివార్డు ఉంది. మావోయిస్టుల ఏరివేత కోసం గత ఆరు నెలలుగా చేపట్టిన గాలింపు చర్యల్లో భాగంగా 197 మంది అరెస్టయ్యారు. 10 మంది మావోయిస్టులు తమకు తాముగా లొంగిపోయారు. 17 మంది ఎదురుకాల్పుల్లో హతమయ్యారు. మావోయిస్టులు లూటీ చేసిన 31 తుపాకులతో సహా మొత్తం 113 ఆయుధాలను, పెద్దఎత్తున మందుగుండు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈనాడు సినిమా

మరింత ఫిట్‌గా...



ప్రభాస్

కొత్త సినిమాలకి ముందు హీరోల లుక్స్ మారిపోతుంటాయి. అప్పటి వరకూ చేస్తున్న పాత్రల నుంచి బయటికొచ్చి... కొత్త సినిమాల్లోని పాత్రలకి తగ్గట్టుగా, దర్శకుల సూచనల్ని అనుసరిస్తూ కథానాయకులు ప్రత్యేకంగా సన్నద్ధం అవుతుంటారు. అందుకోసం ఫిట్‌నెస్ ట్రైనర్లు, స్టైలిస్ట్‌ల సహాయం కూడా తీసుకుంటూ నెలలకొద్దీ సమయం వెచ్చిస్తుంటారు. జిమ్‌లో చెమటోడుస్తూ, దర్శకుడు కోరుకున్న లుక్‌లోకి వచ్చేవరకూ వాళ్ల కసరత్తులు కొనసాగుతూనే ఉంటాయి. లుక్స్ విషయంలో దర్శకులు, కథానాయకులు అంత పక్కాగా ఉంటారు. అగ్ర కథానాయకుడు ప్రభాస్ కూడా ఇప్పుడు ఆ ప్రయత్నాల్లోనే ఉన్నట్టు స్పష్టమవుతోంది. ఆయన ఇదివరకటితో పోలిస్తే ఇప్పుడు మరింత ఫిట్‌గా, కనిపిస్తున్నారు. నెలలపాటు యూరప్‌లో గడిపిన ప్రభాస్, ఇటీవలే తిరిగి 'ది రాజాసాబ్' సెట్‌కి వచ్చారు. చాలా రోజుల తర్వాత ఇటీవలే ఆయన బయట జరిగిన కొన్ని వేడుకల్లో కెమెరా కంట పడ్డారు. ఆ సందర్భంగా ప్రభాస్ తాజా లుక్ అందరినీ ఆకర్షించింది. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట్' సినిమా కోసమే ఆయన కొత్త లుక్‌తో సిద్ధమైనట్టు తెలుస్తోంది. సెప్టెంబరు నెలలోనే 'స్పిరిట్' సినిమా పట్టాలెక్కనుంది. ఇందులో ప్రభాస్ పోలీసుగా సందడి చేయనున్న సంగతి తెలిసిందే. పోలీసు పాత్ర అంటే ఫిట్‌గా కనిపించాల్సిందే. 'ది రాజాసాబ్'లో కూడా ప్రభాస్ స్టైలిష్ అవతారంలో, ఆయన మునుపటి లుక్‌ని గుర్తు చేయనున్నారు. ఇప్పటికే బయటికొచ్చిన ప్రచార చిత్రాలు ఆ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి.

ఒక చూపుతో పుట్టిందే... వింతగా గుండెలో చేరిందే



రామ్, భాగ్యశ్రీ

తనలోని భావుకతని బయటికి తీసుకొచ్చాడు కథానాయకుడు రామ్ పోతినేని. 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా కోసం ఆయన కలం చేతపట్టి ప్రేమ గీతాన్ని రాశారు. 'నువ్వుంటే చాలే...' అంటూ సాగే ఆ పాట శుక్రవారం విడుదలైంది. వివేక్ - మెర్విన్ స్వరపరిచిన ఈ పాటని, అనిరుధ్ ఆలపించారు. 'ఒక చూపుతో నాలోనే పుట్టిందే... ఏదో వింతగా గుండెలో చేరిందే' అంటూ సాగే ఈ పాట మంచి మెలోడీగా హృదయాల్ని హత్తుకొంటోంది. రామ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఉపేంద్ర ముఖ్యభూమిక పోషించారు. మహేశ్‌బాబు.పి దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఒక మంచి ప్రేమ పాటతో ప్రచారం మొదలు పెట్టడం ఆనందంగా ఉందని, ఇందులో రామ్ - భాగ్య శ్రీ జోడీ మధ్య కెమిస్ట్రీ, పాట మరింతగా ఆకట్టుకుంటుందని సినీ వర్గాలు తెలిపాయి. రావు రమేశ్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సిద్ధార్థ నుని, కూర్పు: శ్రీకర్‌ప్రసాద్, ప్రొడక్షన్ డిజైన్: అవినాశ్ కొల్లా.

గరివిడి లక్ష్మి సంగీతానికి ఓ నివాళి.. ఈ సినిమా



ఆనంది

మన సంస్కృతిపై ప్రేమతో రూపొందిస్తున్న చిత్రమే 'గరివిడి లక్ష్మి' అంటున్నారు నిర్మాతలు టి.జి.విశ్వప్రసాద్, కృతిప్రసాద్. ఈ ఇద్దరూ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై రూపొందిస్తున్న చిత్రమిది. టైటిల్ పాత్రలో ఆనంది నటిస్తున్నారు. నరేశ్, రాశి, రాగ్ మయూర్, శరణ్య ప్రదీప్ కీలక పాత్రల్ని పోషిస్తున్నారు. గౌరీనాయుడు జమ్ము దర్శకత్వం వహిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "1990ల్లో ఉత్తరాంధ్ర జానపద సంప్రదాయాలకు విశేష ప్రాచుర్యం లభించేలా కృషి చేసి చరిత్రకెక్కారు గరివిడి లక్ష్మి. బుర్రకథ కళాకారిణి అయిన ఆమె జీవిత ప్రయాణానికి, సంగీత వారసత్వానికి ఓ నివాళిలాంటి సినిమా ఇది. మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతూ, ఉత్తరాంధ్ర జీవితాల్ని తెరపైన ఆవిష్కరించిన తీరు ప్రతి ఒక్కరి మనసుల్ని తాకుతుంద"న్నారు. ఈ సినిమాకి సంగీతం: చరణ్ అర్జున్, ఛాయాగ్రహణం: జె.ఆదిత్య.




సాయి పల్లవి

సీతగా సాయిపల్లవిని తీసుకోవడానికి కారణమిదే!

చిత్రపరిశ్రమలో ప్రస్తుతం అందరి దృష్టి 'రామాయణ' మీదే. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. బాలీవుడ్ కథానాయకుడు రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి జంటగా నటిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్‌ని, సీతగా సాయి పల్లవిని తీసుకోవడం వెనుక కారణాల్ని వెల్లడించారు క్యాస్టింగ్ డైరెక్టర్ ముఖేశ్ ఛబ్రా. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. "తన ప్రశాంతమైన వ్యక్తిత్వమే రణ్‌బీర్‌ను రాముడిగా తీసుకోవడానికి ముఖ్య కారణం. గొప్పగా నటించే నైపుణ్యం ఆయనలో ఉంది. సీత పాత్రలో నటించడానికి కూడా చాలా మందిని అనుకున్నాం. కానీ సాయిపల్లవిని మాత్రమే ఈ పాత్రకు ఎంపిక చేయడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. ఆమె గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటుంది. అందం కోసం సర్జరీలు చేయించుకోలేదు. సహజ అందమే బాగుంటుందని మా సినిమాతో సందేశమిచ్చినట్లు ఉంటుందని ఆమెను తీసుకున్నామ"ని తెలిపారు. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

650 మంది స్టంట్‌మ్యాన్‌లకు ఇన్సూరెన్స్ చేయించిన అక్షయ్



అక్షయ్ కుమార్

సినిమాల్లో తన యాక్షన్‌తో అదరగొడుతుంటారు బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్. ఇప్పుడాయన ఆ ఫైట్స్ వెనుక ఉండే అసలైన స్టంట్ మాస్టర్ల కోసం ఓ మంచి నిర్ణయాన్ని తీసుకున్నారు. చిత్రపరిశ్రమలోని 650 మంది స్టంట్ మ్యాన్‌లకు ఇన్సూరెన్స్ చేయించారు అక్షయ్. ఈ పాలసీలో ఆరోగ్య, ప్రమాద బీమా రెండూ ఉంటాయి. ఫైట్ మాస్టర్స్ సెట్‌లో, బయట ఎక్కడ గాయపడినా రూ.5 లక్షల వరకు బీమా పొందవచ్చు. ఇటీవలే తమిళ పరిశ్రమలో ఓ సినిమా చిత్రీకరణలో ప్రమాదవశాత్తూ స్టంట్ మ్యాన్ రాజు మృతి చెందిన ఘటనే ఈ నిర్ణయానికి కారణం. ఈ సందర్భంగా 'గుంజన్ సక్సేనా', 'జిగ్రా' లాంటి చిత్రాలకు పనిచేసిన బాలీవుడ్ స్టంట్ మాస్టర్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ.. "అక్షయ్‌కి ధన్యవాదాలు. దాదాపు 650 నుంచి 700 మంది స్టంట్‌మ్యాన్, యాక్షన్ సిబ్బంది ఇప్పుడు బీమా పరిధిలోకి వచ్చారు. మీరు చేసిన ఈ గొప్ప పనితో ఎంతో మంది జీవితాలు బాగుపడతాయ"ని అక్షయ్‌పై ప్రశంసలు కురిపించారు. ప్రస్తుతం అక్షయ్ 'భూత్‌బంగ్లా', 'జాలీ ఎల్ఎల్‌బీ 3' తదితర చిత్రాలతో బిజీగా ఉన్నారు.

రణ్‌వీర్‌కి జోడీగా శ్రీలీల?

అదిరిపోయే స్టెప్పులు.. సహజమైన నటనతో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోంది అందాల తార శ్రీలీల. ప్రస్తుతం 'జూనియర్'గా థియేటర్లలో సందడి చేస్తున్న ఈ భామ.. కోలీవుడ్, బాలీవుడ్ అంటూ ఇతర భాషల్లోనూ రాణించే ప్రయత్నం చేస్తుంది. ఇప్పటికే శ్రీలీల.. కార్తిక్ ఆర్యన్‌తో కలిసి హిందీలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడామె మరో బాలీవుడ్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. కథానాయకుడు రణ్‌వీర్ సింగ్‌తో కలిసి ఆమె ఓ సినిమా కోసం జోడీ కట్టిందట. "బాబీ డేవోల్, రణ్‌వీర్ కలయికలో ఓ భారీ ప్రాజెక్ట్ రూపొందుతుంది. ఈ యాక్షన్ చిత్రంలో కథానాయికగా శ్రీలీలను ఎంపిక చేసే పనిలో ఉంది చిత్రబృందం. ఇప్పటికే ఈ సినిమా కోసం కసరత్తులు మొదలెట్టారు రణ్‌వీర్, బాబీ. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంద"ని శ్రీలీల సన్నిహిత వర్గాలు తెలిపాయి.



విజువల్ వండర్‌గా శంబాల



ఆది

మార్మిక ప్రపంచాన్ని ఆవిష్కరించే కథతో 'శంబాల' రూపొందుతోంది. ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నారు. రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి... 'ఎ మిస్టికల్ వరల్డ్' అనేది ఉపశీర్షిక. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమాని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు సినీ వర్గాలు ప్రకటించాయి. ఇటీవలే అమెరికాలో జరిగిన నాట్స్ వేడుకల్లో ప్రదర్శించిన ఈ టీజర్‌కి గొప్ప స్పందన లభించిందని నిర్మాతలు తెలిపారు. "సూపర్ నేచురల్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్న చిత్రమిది. ఓ విజువల్ వండర్‌గా, అత్యున్నత సాంకేతిక హంగులతో సినిమాని రూపొందిస్తున్నాం. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామ"న్నారు నిర్మాతలు.

ఆ జ్ఞాపకాలే ఏ.ఐ.ఆర్ సిరీస్‌కి స్ఫూర్తి!

సరి కొత్త కంటెంట్‌తో ప్రేక్షకుల్ని అలరిస్తోంది ఈటీవీ విన్. స్వచ్ఛమైన వినోదం పంచడమే లక్ష్యంగా ప్రతి వారం వినూత్నమైన కథల్ని ప్రేక్షకులకు అందుబాటులోకి తీసుకొస్తోంది. అందులో భాగంగానే ఇటీవల 'ఏ.ఐ.ఆర్: ఆల్ ఇండియా ర్యాంకర్స్' సిరీస్ వచ్చింది. అటు కుర్రకారుతోపాటు, ఇటు కుటుంబ ప్రేక్షకుల్నీ మెప్పిస్తోంది సిరీస్. ఈ సందర్భంగా దర్శకుడు జోసెఫ్ క్లింటన్‌తో 'ఈనాడు సినిమా' ప్రత్యేకంగా ముచ్చటించింది.

'ఏ.ఐ.ఆర్: ఆల్ ఇండియా ర్యాంకర్స్'కి లభిస్తున్న స్పందన ఎలా ఉంది?

మా కథని మాకు మళ్లీ చెప్పినట్టు ఉందని, మా జీవితంలోని ఇంటర్ మీడియట్ రోజుల్ని మరోసారి తెరపై చూసుకున్నామని చాలా మంది ఫోన్లు చేస్తున్నారు. తెలియని వాళ్ల నుంచి కూడా సందేశాలు, కాల్స్ వస్తున్నాయి. ఈ స్పందన ఎంతో తృప్తినిచ్చింది. కథ రాసుకున్న తర్వాత నిర్మాతలు సూర్య వాసుపల్లి, సందీప్‌రాజ్‌లకు, ఈటీవీ విన్ బృందానికి చెబుతున్నప్పుడు ప్రతి ఒక్కరూ కనెక్ట్ అయ్యేవారు. మాకూ ఇలా జరిగిందంటూ వాళ్ల అనుభవాల్ని తిరిగి కథలుగా చెప్పేవారు. ఇంతగా కనెక్ట్ అవుతున్నారేమిటి, ఆ స్థాయిలో ఈ కథని తెరపైకి తీసుకురాగలనా అని అప్పుడప్పుడూ నాకే భయం కలిగేది. కానీ నిర్మాతలు, ఈటీవీ విన్ సహకారంతో నేను అనుకున్నదానికంటే ఘనంగా ఈ సిరీస్ సిద్ధమై ప్రేక్షకుల ముందుకొచ్చింది. సీనియర్ నటులు సునీల్‌తోపాటు, ఇతర నటులు, సాంకేతిక బృందం గొప్ప పనితీరుని కనబరిచింది.



జోసెఫ్ క్లింటన్

ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ జీవితం నేపథ్యంలో సిరీస్ తీయడానికి మీకు ప్రేరణనిచ్చిన విషయాలేమిటి?

పిల్లలు స్కూల్‌లో ఉన్నంతసేపూ వాళ్లని తల్లిదండ్రులు చిన్న పిల్లల్లాగే చూస్తారు. అదే ఇంజినీరింగ్, గ్రాడ్యుయేషన్‌లో చేరగానే ఎంతో కొంత పెద్దవాళ్లైపోయారనే ఓ ధోరణిని కనబరుస్తుంటారు. ఇంటర్మీడియట్ మాత్రం అదొక ప్రత్యేకమైన దశ. అప్పుడు తప్పు చేస్తే ఇంకా చిన్న పిల్లాడు అనుకుంటున్నావా అంటారు. అలా అని కొంచెం ఏదైనా ఎక్కువ మాట్లాడితే అప్పుడే పెద్దవాడివైపోయానని అనుకుంటున్నావా అంటారు. తమ పిల్లల గురించి తల్లిదండ్రుల్లోనే ఒక రకమైన గందరగోళం కనిపిస్తుంది. ఈ దశలో చాలా డ్రామా ఉంటుంది. తెలిసీ తెలియని ఆ రోజుల్లో చాలా జ్ఞాపకాలే ఉంటాయి. ఆ జీవితాన్నే కథగా చెప్పాలనుకున్నా. ఇప్పటివరకూ మన తెలుగులో ఇంటర్ నేపథ్యంలో సిరీస్‌లు రాలేదు. సినిమాలు కూడా 'కొత్త బంగారు లోకం' తర్వాత ఏవీ రాలేదు. అందులో కూడా ఇంటర్ ప్రపంచం అరగంటే కనిపిస్తుంది, ఆ తర్వాత ఎక్కువగా ప్రేమకథే! అలా కాకుండా, కేవలం ఇంటర్ ప్రపంచం చుట్టూనే ఈ కథ రాసుకున్నా. అందుకే జోక్స్ కూడా మ్యాథ్స్, కెమిస్ట్రీపైన ఇలా ఆ ప్రపంచం చుట్టూనే ఉంటాయి. అక్కడ పాత్రలకి ఎదురయ్యే సమస్యలు కూడా సినిమాటిక్‌గా కాకుండా, పరీక్షల విషయంలో పిల్లలు పడే ఒత్తిడి, అందులో తప్పులు, పర్యవసనాలు వీటి చుట్టూనే కథ తిరుగుతూ ఉంటుంది.

ఓటీటీలో వచ్చే సిరీస్‌లు అనగానే బోల్డ్ సన్నివేశాలతో ప్రేక్షకుల్ని ఆకర్షించాలనే ప్రయత్నాలే ఎక్కువగా కనిపిస్తుంటాయి. కానీ మీరు మాత్రం ఎక్కడా అసభ్యతకి చోటు లేకుండా సన్నివేశాల్ని మలిచారు..

ఇంటర్ చదువుతున్న కుర్రకారులో ఏదైనా చేయగలమనే ధైర్యం ఉంటుంది కానీ, తమ పరిధికి మించి వెళుతున్నప్పుడు భయం కూడా ఉంటుంది. ఆ వయసులో వాళ్లు ఏం చేస్తారో, అంతవరకే సన్నివేశాల్ని మలిచాం. అంతకు మించి వెళ్లలేదు. ఈటీవీ విన్ కంటెంట్ అంటే స్వచ్ఛంగా ఉంటుంది. ఇలాంటి విషయాలపై ఆ సంస్థ ఒత్తిడి చేయదు, మాకూ అలాంటి ఆలోచన లేదు. అందుకే ఈ సిరీస్‌ని ఇంటిల్లిపాదీ కలిసి చూస్తున్నారు. ఓ సన్నివేశం విషయంలో మాత్రం ఓ వర్గం అసంతృప్తి వ్యక్తం చేసింది. వెంటనే దాన్ని తొలగించాం.

కార్పొరేట్ విద్యాసంస్థలు, నేటి విద్యా విధానంపై కూడా వ్యంగ్యాస్త్రాల్ని సంధించారు కదా?

ఒక దశలో అలా అనిపించొచ్చు కానీ, మేం అటువైపు దృష్టి పెట్టలేదు. ఇందులో ప్రధానంగా మూడు విషయాలపై దృష్టిపెట్టా. పిల్లలు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు. కార్పొరేట్ సంస్థల్ని తప్పు పట్టడం సులువు కావొచ్చు కానీ, తల్లిదండ్రులు పిల్లల్ని అక్కడ చేర్పించడానికే ఆసక్తి చూపుతుంటారు కదా. సమాజం ఎలా ఉంటుందో, అందులో నుంచి పుట్టుకొచ్చినవన్నీ అలాగే ఉంటాయని నా నమ్మకం. కార్పొరేట్ కళాశాలలు అలా ఉండటానికి కారణం మన మధ్య తరగతి ఆలోచనలు, ఆశలు, తల్లిదండ్రులు, వాళ్ల కలలే. మనం మారితే కళాశాలలు అలా ఉండవు కదా. ఆ విషయం ప్రతిబింబించేలాగే...విద్యార్థుల భావోద్వేగాలు, కళాశాలలవైపు ఉండే ఒత్తిళ్లని ఇందులో చూపించే ప్రయత్నం చేశాం.

సిరీస్‌గానే ఎందుకు చేయాలనుకున్నారు, సినిమాగా తీయకపోవడానికి కారణం ఏదైనా ఉందా?

ముందస్తు ప్రదర్శనలు వేసి చూపించినప్పుడు చాలా మంది ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. సినిమా అంటే ఎక్కడో ఒక చోట, ఎన్నో కొన్ని లార్జర్ దేన్ లైఫ్ అంశాలు ఉండాల్సిందే. కానీ ఈ కథని నేను చెప్పాలనుకున్న విధానం వేరు. సినిమాటిక్ ప్రేమ కానీ, సినిమాటిక్ కష్టాలు అసలే మాత్రం కనిపించకుండా ఎంచుకున్న ప్రపంచానికి ఫిక్స్ అయిపోయి, వాస్తవానికి దగ్గరగా ఉండేలా కథ చెప్పాలనుకున్నా. అందుకు సిరీస్‌గా తీయడమే సరైన నిర్ణయం అనిపించింది. సిరీస్ అయితే ఎక్కువ కథని, ఎక్కువసేపు చెప్పే వెసులుబాటు ఉంటుంది.

రెండో భాగం కూడా ఉందనే సంకేతాలతో తొలి భాగాన్ని ముగించారు కదా, రెండో భాగం సిరీస్‌కి కథ సిద్ధమైందా?

తొలి భాగం కథ రాస్తున్నప్పుడే రెండో భాగంపై కొన్ని ఆలోచనలు వచ్చాయి. స్క్రిప్ట్ పక్కాగా రాయాల్సి ఉంది. అది పూర్తయ్యాకే రెండో భాగం సిరీస్‌ని మొదలుపెడతాం.

మీ నేపథ్యమేమిటి?

మాది విశాఖపట్నం. ఐదేళ్లు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశా. 'తండేల్' కథ కోసం రచయిత కార్తీక్ తీడ దగ్గర అసోసియేట్ రచయితగా పనిచేశా. ఆ తర్వాత ఈ కథ రాసుకున్నా. ఈటీవీ విన్, నిర్మాతలు సూర్య వాసుపల్లి, సందీప్‌రాజ్ ప్రోత్సాహంతో దర్శకత్వం చేశా. సినిమాల కోసం ఐదు స్క్రిప్ట్‌లు సిద్ధం చేసి పెట్టుకున్నా.

ఏడాది ముందుగానే టికెట్ సేల్స్... నిమిషాల్లో అమ్మకాలు పూర్తి



క్రిస్టోఫర్ నోలన్


సాధారణంగా హాలీవుడ్ సినిమాలంటే.. సూపర్ హీరోల కథలు.. యాక్షన్ సీక్వెన్స్ గుర్తొస్తుంటాయి. కానీ కాలంతో ప్రయోగాత్మక చిత్రాలు చేస్తూ అంతర్జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేసిన దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్. ఈ ఏడాది ప్రారంభంలోనే ఆయన 'ఓపెన్ హైమర్' సినిమాకిగానూ ఏడు ఆస్కార్ అవార్డుల్ని సొంతం చేసుకున్నారు. ఇప్పుడాయన దర్శకత్వంలో రాబోతున్న చిత్రమే 'ది ఆడిస్సీ'. టామ్ హాలండ్, మాట్ డామన్, జెండయా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది జులై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఏడాది ముందుగానే ఈ సినిమాకు సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్‌ను మొదలు పెట్టినట్లు వెల్లడించింది చిత్రబృందం. అమెరికాలోని ఐమ్యాక్స్ 70 ఎంఎం స్క్రీన్స్‌కు సంబంధించిన టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. సేల్స్ మొదలైన కొన్ని నిమిషాలలోనే పూర్తిగా అమ్ముడుపోయాయి. హోమర్ రాసిన ఇతిహాసం నుంచి ఈ ఎపిక్ యాక్షన్ ఫాంటసీ చిత్రాన్ని తీర్చిదిద్దారు.

విరోధిగా మారిన ఏఐ ప్రోగ్రాం బతకాలనుకుంటే...!

ఐకానిక్ సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో చాలా కాలంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న హాలీవుడ్ ఫ్రాంఛైజీలలో 'ట్రాన్' ఒకటి. ఈ ఫ్రాంఛైజీలో మూడవ భాగంగా 'ట్రాన్: ఏరిస్' రానున్నట్లు చిత్ర బృందం గతేడాది ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా వాల్ట్ డిస్నీ స్టూడియోస్ మోషన్ పిక్చర్స్ ఈ చిత్రం అక్టోబరు 10న విడుదలకు సిద్ధంగా ఉందంటూ..మొదటి ట్రైలర్‌ను ఆవిష్కరించింది. ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రానికి జోచిమ్ రోనింగ్ దర్శకత్వం వహించారు. ఈ ట్రైలర్ ప్రారంభ సంభాషణలు..'సమయం ఆరంభం నుంచి మనిషి విశ్వాన్ని ఆశ్చర్యంతో చూస్తూ ప్రశ్నించేవాడు. మనలా ఎవరైనా ఉన్నారా అని. ఎక్కడ చూసిన మనం ఏఐ(కృత్రిమ మేధ) గురించే వింటున్నాం. ఏరిస్ ది అల్టిమేట్ సోల్జర్ ఏఐ. అమోఘమైన శక్తి, వాయువేగం, అపారమైన తెలివితేటలతో ఉన్న ఈ ఏఐ రణరంగంలో బలైనా సింపుల్‌గా ఇంకొకటి చేసేస్తా" అని ఏఐని పరిచయం చేస్తున్న దృశ్యాలతో ఆసక్తిగా సాగుతోంది. ఈ సన్నివేశాలలో ఏరిస్ మొదట మనిషి రూపంలో ఉన్న రోబోలా కనిపించినప్పటికీ..సందర్భానికి తగినట్లుగా బైక్‌గా, విమానంలా మారిపోతుంటది. అలానే ఈ ఏఐ పూర్తిగా నాశనమైనప్పటికీ దాని నుంచి కొత్తగా మళ్లీ పుట్టుకొస్తుంటుంది. ఇలా థ్రిల్లింగ్‌గా అనిపించే విజువల్స్‌తో 'నేను దేనికోసమో వెతుకుతున్నాను. నాకు అర్థం కానిదని తెలిసినా వెతుకుతున్నాను. విరోధిగా మారిన ఒక ఏఐ ప్రోగ్రాం బతకాలనుకుంటోంది..ఎందుకని" అంటూ ఆకట్టుకునే సంభాషణలతో సాగుతోన్న ఈ ట్రైలర్ ఆద్యంతం అలరిస్తోంది. హై ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలు, అద్భుతమైన విజువల్ సీన్స్‌తో ఈ ట్రైలర్ సినీ ప్రియుల్ని ఆకట్టుకునేలా ఉంది. ఇందులో జారెడ్ లెటో, జెఫ్ బ్రిడ్జెస్, గ్రెటా లీ, ఇవాన్ పీటర్స్, జోడి టర్నర్ స్మిత్, కామెరాన్ మోనాఘన్, హాసన్ మిన్హాజ్, గిలియన్ ఆండర్సన్ తదితరులు నటించారు.



'ట్రాన్: ఏరిస్'



గర్జించిన రిలయన్స్

- 78% వృద్ధితో రూ.26,994 కోట్లకు లాభం
- ఒక త్రైమాసికంలో ఇదే అత్యధికం
- దుమ్మురేపిన టెలికాం, రిటెయిల్ వ్యాపారాలు

'2025-26 ఆర్థిక సంవత్సరాన్ని అద్భుతంగా ప్రారంభించాం. అంతర్జాతీయ పరిస్థితుల్లో ఒడుదొడుకులు ఉన్నప్పటికీ మొదటి త్రైమాసికంలో ఏకీకృత ఎబిటా గణనీయంగా మెరుగుపడింది. గత త్రైమాసికంలో చమురు ధరల్లో భారీ హెచ్చుతగ్గులతో ఇంధన మార్కెట్లు ప్రతికూలతలు ఎదుర్కొన్నాయి. దేశీయ గిరాకీ కారణంగా ఓ2సీ వ్యాపారం రాణించింది. ఇంధన, డౌన్‌స్ట్రీమ్ మార్జిన్లు మెరుగుపడటంతో మంచి పనితీరు నమోదుచేశాం.'

- రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ

ముంబయి

దేశంలోనే అత్యంత విలువైన కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆర్థిక ఫలితాల్లో రాణించింది. రిటెయిల్, టెలికాం వ్యాపారాలు దుమ్మురేపడంతో ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో సంస్థ ఏకీకృత నికర లాభం రూ.26,994 కోట్లు (ఒక్కో షేరుకు రూ.19.95)గా నమోదైంది. ఒక త్రైమాసికంలో కంపెనీకి ఒక త్రైమాసికంలో ఇదే అత్యధిక లాభం కావడం విశేషం. 2024-25 ఇదే కాల లాభం రూ.15,138 కోట్లతో పోలిస్తే లాభం 78.3% పెరిగింది. మార్చి త్రైమాసిక లాభం రూ.19,407 కోట్ల కంటే కూడా ఇది 39% ఎక్కువ. కార్యకలాపాల ఆదాయం 5.26% వృద్ధి చెంది రూ.2.48 లక్షల కోట్లకు పెరిగింది. 2024 ఏప్రిల్-జూన్‌లో ఇది రూ.2.36 లక్షల కోట్లుగా ఉంది.

✦ **ఓ2సీ వ్యాపారంలో:** కంపెనీకి కీలకమైన చమురు రిఫైనింగ్, పెట్రోరసాయనాల వ్యాపారం(ఓ2సీ)లో లాభం 1.5% తగ్గింది. ముడిచమురు ధరలు తగ్గడం, ప్లాంట్ షట్‌డౌన్ కారణంగా తక్కువ అమ్మకాలు ప్రభావం చూపాయి. ఎబిటా 10.8% వృద్ధి చెందింది.

✦ **రిటెయిల్ లాభాల్లో 29% వృద్ధి:** రిలయన్స్ రిటెయిల్ వెంచర్ (ఆర్ఆర్‌వీఎల్) నికర లాభం 28.3% వృద్ధితో రూ.3,271 కోట్లకు చేరింది. ఏడాది క్రితం లాభం రూ.2,549 కోట్లుగా ఉంది. స్థూల ఆదాయం రూ.75,615 కోట్ల నుంచి 11.3% వృద్ధితో రూ.84,171 కోట్లకు పెరిగింది. కార్యకలాపాల ఆదాయం రూ.66,260 కోట్ల నుంచి 11.3% అధికమై రూ.73,720 కోట్లుగా నమోదైంది. అన్ని విభాగాలు మెరుగ్గా రాణించాయని, గ్రోసరీ, ఫ్యాషన్ విభాగాల్లో పరిశ్రమలోనే అత్యధిక వృద్ధి సాధించామని కంపెనీ తెలిపింది. రుతుపవనాలు తొందరగా రావడం వల్ల వినియోగదారు ఎలక్ట్రానిక్స్, పరికరాలపై ప్రభావం పడిందని, ప్రస్తుతం రికవరీ నడుస్తోందని వెల్లడించింది. రిటెయిల్ వ్యాపార వినియోగదారుల సంఖ్య 35.8 కోట్లకు పెరిగింది. కొత్తగా 388 స్టోర్లను తెరవడంతో మొత్తం సంఖ్య 19,592కు చేరింది. ఫాస్ట్ ఫ్యాషన్ యాప్ షీన్ ఇండియాను తీసుకొచ్చిన ఆరు నెలల్లోపే 20 లక్షల డౌన్‌లోడ్‌లు దాటాయి.

25% పెరిగిన జియో ప్లాట్‌ఫామ్స్ లాభం

కంపెనీ డిజిటల్ విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ నికర లాభం 2025-26 మొదటి త్రైమాసికంలో రూ.7,110 కోట్లకు పెరిగింది. 2024-25 ఇదే కాల లాభం కంటే ఇది 25% అధికం. స్థూల ఆదాయం 19% వృద్ధితో రూ.41,054 కోట్లకు పెరిగింది. ఒక్కో వినియోగదారుపై సగటు ఆదాయం (ఆర్పు) రూ.181.7 నుంచి రూ.208.8కు పెరిగింది. మార్చి త్రైమాసికంలో ఇది రూ.206.2గా ఉంది. వినియోగదారుల సంఖ్య 49.81 కోట్లకు చేరింది. టెక్నాలజీ మౌలిక సదుపాయాల సృష్టి కొనసాగిస్తున్నామని, 5జీ, ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్‌లో అగ్రస్థానం నిలబెట్టుకున్నామని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ ఛైర్మన్ ఆకాశ్ అంబానీ పేర్కొన్నారు.

✦ జూన్ త్రైమాసికంలో జియో స్టార్ రూ.11,222 కోట్ల ఆదాయాలను, రూ.1,017 కోట్ల ఎబిటాను నమోదుచేసింది. జనవరి- మార్చిలో రూ.10,006 కోట్లుగా ఉంది. ఐపీఎల్ సీజన్ ఇందుకు దోహదపడింది.



రాస్‌నెఫ్ట్ భారత రిఫైనరీపై ఈయూ ఆంక్షలు

చమురు ధరల పరిమితి తగ్గింపు

దిల్లీ: రష్యా ఇంధన దిగ్గజం రాస్‌నెఫ్ట్‌కు చెందిన భారత చమురు రిఫైనరీపై ఐరోపా సమాఖ్య (ఈయూ) శుక్రవారం ఆంక్షలు విధించింది. దీంతో పాటు చమురు ధరల పరిమితిని తగ్గించింది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి వ్యతిరేకంగా చేపడుతున్న చర్యల్లో ఇది భాగమని తెలిపింది. రష్యాపై తాజాగా చేపట్టిన చర్యల్లో కొత్త బ్యాంకింగ్ ఆంక్షలు, రష్యా ముడిచమురు నుంచి ఉత్పత్తి చేసిన ఇంధనాలపై ఆంక్షలు కూడా ఉన్నాయి. తగ్గించిన ధరల పరిమితిని ప్రస్తుతం బ్యారెల్‌కు 60 డాలర్లుగా నిర్ణయించారు. అంటే రష్యా తన ముడిచమురును బ్యారెల్ 60 డాలర్ల కంటే తక్కువ ధరలకే విక్రయించాల్సి వస్తుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద చమురు ఉత్పత్తిదారుగా రష్యా ఉంది. తాజా నిర్ణయంతో భారత్ లబ్ధి పొందనుంది. మన దేశ మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా దాదాపు 40 శాతంగా ఉంది. మొదటిసారిగా భారత్‌లో అతిపెద్ద రాస్‌నెఫ్ట్ రిఫైనరీ కోసం ఫ్లాగ్ రిజిస్ట్రీని నియమిస్తున్నామని ఈయూ ఫారిన్ పాలసీ చీఫ్ కాజా కల్లాస్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ నుంచి అదానీ గ్రూప్ నిష్క్రమణ

దిల్లీ: ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్(అంతక్రితం అదానీ విల్మర్) నుంచి అదానీ గ్రూప్ శుక్రవారం నిష్క్రమించింది. ఆ కంపెనీలో మిగిలిన 10.42% వాటాను రూ.3,732 కోట్లకు బహిరంగ మార్కెట్ లావాదేవీల్లో విక్రయించినట్లు బీఎస్ఈ గణాంకాలను బట్టి తెలుస్తోంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ కంపెనీ అదానీ కమొడిటీస్ మొత్తం 11 దఫాల్లో ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్‌లో తనకున్న 13,54,82,400 షేర్లను లేదా 10.42% వాటాను విక్రయించింది. ఎఫ్ఎంసీజీ నుంచి నిష్క్రమించాలన్న ప్రణాళికలో భాగంగా గురువారం కూడా ఈ కంపెనీలో 20% వాటాను విల్మర్ ఇంటర్నేషనల్ సింగపూర్‌కు రూ.7,150 కోట్లకు అదానీ గ్రూప్ అమ్మిన సంగతి తెలిసిందే.

ఫండ్ స్థానంలో స్కీమ్

● పథకాలకు కొత్త వర్గీకరణ
● మరింత స్పష్టత కోసమే: సెబీ

దిల్లీ: మ్యూచువల్ ఫండ్ పథకాలకు సంబంధించి ప్రస్తుతం పాటిస్తున్న వర్గీకరణను సమీక్షించాలని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ప్రతిపాదించింది. ఫండ్ పథకాల్లో మరింత స్పష్టత, పోర్ట్‌ఫోలియోలో ఒకే తరహా పెట్టుబడులు లేకుండా చూడటంలాంటివి లక్ష్యంగా పెట్టుకుంది. కొన్ని ఫండ్ పథకాల్లో ఒకే రకం పెట్టుబడులు ఉండటాన్ని గమనించిన తర్వాత, ఇదే తరహా పోర్ట్‌ఫోలియోతో వస్తున్న పథకాలను నివారించేందుకు స్పష్టమైన పరిమితులను తీసుకురావాలని భావిస్తోంది. ఈ మేరకు ఒక చర్చా పత్రాన్ని విడుదల చేసింది. అందులో సెబీ ప్రతిపాదనలు ఇలా..

✦ మ్యూచువల్ ఫండ్ సంస్థలు వాల్యూ, కాంట్రా ఫండ్‌లను రెండింటినీ అందించేందుకు అనుమతించాలి.

✦ స్కీమ్‌ల పోర్ట్‌ఫోలియోలు ఏ సమయంలోనూ 50 శాతానికి మించి ఓవర్‌ల్యాప్ కాకూడదు. దీన్ని ఎన్ఎఫ్ఓ (న్యూ ఫండ్ ఆఫర్) తీసుకొచ్చిన సమయంలోనే కాకుండా, ఆరు నెలలు, వార్షిక ప్రాతిపదికన సమీక్షించాలి.

✦ అనుమతించిన దానికంటే ఎక్కువ ఓవర్‌ల్యాప్ ఉంటే, ఫండ్ సంస్థ 30 వ్యాపార రోజుల్లో దాన్ని సమతుల్యం చేయాలి. అవసరాన్ని బట్టి, అదనంగా మరో 30 రోజుల గడువును పొందేందుకు వీలుంటుంది. దీనికి సరైన కారణాలు వెల్లడించాలి.

✦ ఈ వ్యవధి ముగిసిన తర్వాతా ఫండ్ సంస్థ పోర్ట్‌ఫోలియోను సరిదిద్దకపోతే.. మదుపరులకు ఎలాంటి అమ్మకపు రుసుము (ఎగ్జిట్ లోడ్) లేకుండా యూనిట్లను విక్రయించుకునేందుకు అవకాశం ఇవ్వాలి.



✦ మ్యూచువల్ ఫండ్లు తమ పోర్ట్‌ఫోలియోలో మిగిలిన భాగాన్ని ఈక్విటీ, డెట్, బంగారం, వెండి, రీట్స్ ఇన్విట్స్ వంటి వాటిల్లో ఈక్విటీ విభాగం కిందే మదుపు చేసేందుకు అనుమతినివ్వాలి.

✦ మదుపరులకు అవగాహన పెంచేందుకు డెట్ స్కీమ్‌ల పేర్లలోనూ మార్పులు చేయాలి. ముఖ్యంగా 'డ్యూరేషన్'కు బదులుగా 'టర్మ్'గా పేర్కొనాలి. పథకం పేరు.. పెట్టుబడి లక్ష్యాన్ని మరింత స్పష్టంగా ప్రతిబింబించేలా చూడాలి.

✦ మ్యూచువల్ ఫండ్లు సెక్టోరియల్ డెట్ ఫండ్లను ప్రారంభించేందుకు అనుమతించాలి.

✦ మ్యూచువల్ ఫండ్ పథకాల చివరలో 'ఫండ్' అనే పదాన్ని 'స్కీమ్'గా మార్పు చేయాలి. ఉదాహరణకు 'లార్జ్ క్యాప్ ఫండ్' అని కాకుండా 'లార్జ్ క్యాప్ స్కీమ్' అని పిలవాలి.

ఇవే కాకుండా, హైబ్రిడ్, ఆర్బిట్రేజ్ ఫండ్లకూ మార్పులను ప్రతిపాదించింది. మొత్తం మీద ఈక్విటీ-ఓరియెంటెడ్ స్కీమ్, డెట్-ఓరియెంటెడ్ స్కీమ్, హైబ్రిడ్, సొల్యూషన్ ఓరియెంటెడ్ స్కీమ్, ఇతరాలు అనే 5 విభాగాల్లో అందుబాటులో ఉంటాయి. ఈ చర్చా పత్రంపై ప్రజలు ఆగస్టు 8 వరకూ సలహాలను అందించాలని ఆహ్వానించింది.

అందుబాటులోకి ఐటీఆర్-2



ఈనాడు, హైదరాబాద్: గత ఆర్థిక సంవత్సరం(2024-25)లో మూలధన లాభాలున్న వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) ప్రస్తుత మదింపు సంవత్సరం (2025-26)లో రిటర్నులు దాఖలు చేసేందుకు వీలుగా ఐటీఆర్-2ను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చింది. ఆదాయపు పన్ను శాఖ ఇ-ఫైలింగ్ పోర్టల్‌లో ముందుగానే భర్తీ చేసిన (ప్రీ-ఫిల్డ్) సమాచారంతో ఇది ఉంటుందని, పన్ను చెల్లింపుదారులు సులభంగానే ఈ రిటర్నులు దాఖలు చేసేందుకు వీలవుతుందని ఆదాయపు పన్ను విభాగం తెలిపింది. వేతనం, మూలధన లాభాలున్నప్పుడు ఈ ఫారాన్ని ఉపయోగించుకునేందుకు వీలుంటుంది. వ్యాపారం, వృత్తి ద్వారా ఆదాయం ఆర్జించిన వారికి ఇది వర్తించదు. ఆదాయపు పన్ను రిటర్నుల(ఐటీఆర్) గడువు తేదీని జులై 31 నుంచి సెప్టెంబరు 15 వరకూ పొడిగించిన విషయం విదితమే. ఈ నెల 17 నాటికి మొత్తం 1,41,83,616 రిటర్నులు దాఖలయ్యాయని, ఇందులో 1,37,82,543 వెరిఫై అయినట్లు ఐటీ విభాగం తెలిపింది. 1,12,77,922 రిటర్నులను ప్రాసెస్ చేసింది.

సునీల్ మిత్తల్ పారితోషికం రూ.32.5 కోట్లు



దిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ భారతీ మిత్తల్ రూ.32.5 కోట్ల పారితోషికాన్ని అందుకున్నారు. 2023-24లో ఆయన అందుకున్న రూ.32.27 కోట్లతో పోలిస్తే ఇది 0.8% ఎక్కువ. ఇక వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గోపాల్ విత్తల్ పారితోషికం రూ.18.55 కోట్ల నుంచి 9.1% పెరిగి రూ.20.24 కోట్లకు చేరింది. సునీల్ మిత్తల్ రూ.32.5 కోట్ల పారితోషికంలో రూ.21.57 కోట్ల వేతనం, అలవెన్సులు, రూ.7.5 కోట్ల పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలు, రూ.3.48 కోట్ల ప్రయోజనాలున్నాయి. ఎయిర్‌టెల్ విదేశీ అనుబంధ సంస్థ నెట్‌వర్క్ ఐ2ఐ (యూకే) లిమిటెడ్ నుంచి 2.20 మిలియన్ పౌండ్ల పారితోషికాన్ని కూడా సునీల్ మిత్తల్ పొందారు.

కొత్త అపాచీ ఆర్‌టీఆర్ 310

పరిచయ ధర రూ.2,39,990



చెన్నై: టీవీఎస్ మోటార్ కంపెనీ, ప్రముఖ మోడల్ అపాచీ ఆర్‌టీఆర్ 310 సీసీలో 2025 వెర్షన్‌ను విపణిలోకి విడుదల చేసింది. బేస్ వేరియంట్ పరిచయ ధర రూ.2,39,990 కాగా.. టాప్ వేరియంట్ ధర రూ.2.57 లక్షలు. బిల్ట్ టు ఆర్డర్ మోటార్‌సైకిల్ ధర రూ.2.75 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. ఈ మోడల్ దిల్లీ, ముంబయి, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై సహా ప్రధాన మెట్రో నగరాల్లో లభిస్తుందని కంపెనీ తెలిపింది. కొత్త అపాచీ 310సీసీలో ఓబీడీ2బీ-నిబంధనలు, యూఎస్‌డీ 43 డయా ఫ్రంట్ సస్పెన్షన్, సీక్వెన్షియల్ టర్న్ సిగ్నల్ ల్యాంప్, హ్యాండ్ గార్డ్స్, ట్రాన్స్‌పరెంట్ క్లచ్ కవర్, డ్రాగ్ టార్క్ కంట్రోల్ వంటి ఫీచర్లను చేర్చారు. ఈ బైకు మూడు కొత్త రంగుల్లో లభించనుంది.

భారత్‌లో తొలి భూ అయస్కాంత రీసైక్లింగ్ యూనిట్

జర్మనీ సంస్థతో బ్యాట్‌ఎక్స్ ఎనర్జీస్ ఒప్పందం

దిల్లీ: బ్యాటరీ రీసైక్లింగ్ సేవల సంస్థ అయిన బ్యాట్‌ఎక్స్ ఎనర్జీస్ మనదేశంలో తొలిసారిగా అరుదైన భూఅయస్కాంతాల రీసైక్లింగ్, రిఫైనింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయనుంది. దీని కోసం జర్మనీకి చెందిన రాక్‌లింక్ జీఎంబీహెచ్ అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. జీరో లిక్విడ్ డిస్‌ఛార్జి (జడ్ఎల్‌డీ) ప్రమాణాలతో రిఫైనింగ్ యూనిట్‌ను నెలకొల్పనున్నట్లు ఈ సందర్భంగా బ్యాట్‌ఎక్స్ ఎనర్జీస్ వెల్లడించింది. అరుదైన భూఅయస్కాంత మూలకాలను విడదీయటానికి అవసరమైన అత్యాధునిక సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్ టెక్నాలజీలను రెండు సంస్థలు కలిసి ఆవిష్కరిస్తాయి. దీనికి సంబంధించిన పేటెంట్ల కోసం మన దేశంతో పాటు ఐరోపా దేశాల్లో దరఖాస్తు చేస్తాయి. తద్వారా రెండు సంస్థలు కలిసి మేధో సంపత్తి హక్కులు (ఐపీఆర్) సృష్టించినట్లు అవుతుంది. మనదేశంలో అరుదైన భూఅయస్కాంతాల ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను ఆవిష్కరించటానికి ఈ రెండు కంపెనీలు కృషి చేస్తాయి.

కోడి గుడ్లు



19న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	520
గోదావరి	500
విశాఖపట్నం	540
చిత్తూరు	563

జాతీయ భద్రత దృష్ట్యానే భారత వాహనాలపై పన్నులు: అమెరికా



ఇంటర్నెట్ డెస్క్: భారత్ ఆటోమొబైల్, విడిభాగాలపై తాము విధిస్తున్న పన్నులు ప్రపంచ వాణిజ్యసంస్థ(డబ్ల్యూటీఓ) నిబంధనల ప్రకారం రక్షణాత్మక వైఖరి కిందకు రావని అమెరికా తేల్చిచెప్పింది. తమ దేశ జాతీయ భద్రతను దృష్టిలోపెట్టుకొని మాత్రమే వాటిని విధించామని, వీటిపై భారత్ ఎటువంటి ప్రతీకార సుంకాలు విధించడానికి అవకాశం లేదని వెల్లడించింది. ఈ మేరకు డబ్ల్యూటీఓకు సమాచారం ఇచ్చింది. 'ట్రంప్ తీసుకొన్న చర్యలు రక్షణాత్మక వైఖరి కాదు' అని వెల్లడించింది. అంతేకాదు.. డబ్ల్యూటీఓ అగ్రిమెంట్ ఆన్ సేఫ్‌గార్డ్స్ కింద చేపట్టాల్సిన చర్యలను భారత్ పాటించడం లేదని ఆరోపించింది. అమెరికా సెక్షన్ 232 టారిఫ్‌లను చర్చించదని ఎందుకంటే తాము వీటిని రక్షణాత్మక చర్యలుగా చూడటం లేదని వెల్లడించింది.

మాకా హక్కు ఉంది.. భారత్: భారత్ మాత్రం తమకు టారిఫ్‌లు విధించే హక్కు ఉందని తేల్చిచెప్పింది. దీంతోపాటు అమెరికా విధించిన అదనపు పన్నుల వల్ల దేశీయ వాహన, విడిభాగాల పరిశ్రమకు హాని జరుగుతోందని పేర్కొంది. భారత్ కూడా కొన్ని రాయితీలపై ఎత్తివేత ప్రతిపాదనలను సిద్ధం చేసింది కానీ, అవి ఏమిటో బహిర్గతం చేయలేదు.

యాక్సిస్ బ్యాంక్ ఈడీగా నీరజ్ గంభీర్



దిల్లీ: యాక్సిస్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా నీరజ్ గంభీర్ నియమితులయ్యారు. ఆగస్టు 4న లేదా ఆర్‌బీఐ అనుమతిని ఇచ్చిన రోజు.. ఈ రెండింటిలో ఏది తర్వాత అయితే ఆ రోజు నుంచి ఈ నియామకం అమల్లోకి వస్తుందని యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. నియామక అమలు తేదీ నుంచి మూడేళ్ల వరకు గంభీర్ ఈ పదవిలో కొనసాగుతారు. అయితే వాటాదార్ల అనుమతిపై ఇది ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం యాక్సిస్ బ్యాంక్‌లో గ్రూపు ఎగ్జిక్యూటివ్ (ట్రెజరీ, మార్కెట్స్, హోల్‌సేల్ బ్యాంకింగ్ ప్రోడక్ట్స్)గా గంభీర్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రిలయన్స్ రిటెయిల్ చేతికి కెల్వినేటర్

దిల్లీ: మన్నికైన వినియోగ వస్తువుల బ్రాండు కెల్వినేటర్‌ను స్వీడన్ సంస్థ ఎలక్ట్రోలక్స్ గ్రూపు నుంచి రిలయన్స్ రిటెయిల్ కొనుగోలు చేసింది. ఎంత మొత్తానికో కొనుగోలు చేసిందనే వివరాలను రిలయన్స్ రిటెయిల్ వెల్లడించలేదు. అయితే ఎలక్ట్రోలక్స్ 2025 రెండో త్రైమాసికానికి విడుదల చేసిన మధ్యంతర నివేదిక ప్రకారం.. ఈ కొనుగోలు లావాదేవీ విలువ 180 స్వీడిష్ క్రోనాలు (సుమారు రూ.160 కోట్లు)గా తెలుస్తోంది. వేగంగా విస్తరిస్తున్న ఖరీదైన గృహోపకరణాల మార్కెట్‌లో తన ఉనికిని మరింతగా పటిష్ఠం చేసుకునేందుకు ఈ లావాదేవీ రిలయన్స్ రిటైల్‌కు ఉపయోగపడనుంది. ప్రస్తుతం భారత్‌లో కెల్వినేటర్ బ్రాండుపై రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు, ఎయిర్ కూలర్లు, వాషింగ్ మెషీన్లను లాంటి ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	2,309	879	43,147	42,943
హిందుస్థాన్ జింక్	2,234	2,345	7,771	8,130
ఎల్‌టీ ఫైనాన్స్	701	685	4,260	3,784
ఎమ్ఆర్‌పీఎల్	(272)	66	17,356	23,247
హట్సన్ ఆగ్రో	148	131	2,535	2,375
బంధన్ బ్యాంక్	372	1,063	6,201	6,082
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	1,111	633	8,866	7,568

అమెరికాతో చర్చల్లో భారత్ 'జాగ్రత్త, తెలివి'గా వ్యవహరించాలి

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై రాజన్

దిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చించే సమయంలో భారత్ 'చాలా జాగ్రత్తగా, తెలివిగా' వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వ్యవసాయ రంగం విషయంలో అత్యంత జాగ్రత్త అవసరమన్నారు. భారత ఆర్థిక వృద్ధి 6-7 శాతం శ్రేణిలో ఉండొచ్చని, అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితుల ప్రభావం వృద్ధిపై చాలా తక్కువగానే ఉంటుందని అన్నారు. వాషింగ్టన్‌లో ఈ వారం భారత బృందం అయిదో దశ చర్చలు చేపట్టిన సంగతి తెలిసిందే. పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఇంకా ఏమన్నారంటే..



'వ్యవసాయం వంటి రంగాల్లో ప్రతీ దేశం తన ఉత్పత్తిదార్లకు సబ్సిడీలు ఇస్తుంటుంది. మన ఉత్పత్తిదార్లు వారితో పోలిస్తే తక్కువగానే ఉండొచ్చు, సబ్సిడీలు తక్కువ తీసుకుంటుండొచ్చు. అయితే ఇతర దేశాలకు చెందిన వ్యవసాయ ఉత్పత్తులు మన దేశంలోకి వచ్చినపుడు వారికి సమస్యలు చుట్టుముట్టే అవకాశం ఉంది. కాబట్టి వాణిజ్య చర్చల సమయంలో ఈ విషయంలో భారత్ అప్రమత్తంగా ఉండాలి. కావాలంటే ఈ రంగాల్లో విలువ జోడింపు ఉత్పత్తుల్లో అభివృద్ధి చెందిన దేశాల నుంచి మరింత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రోత్సహించవచ్చు. తద్వారా మన పాల ఉత్పత్తులు, పాల పొడి, చీజ్ వంటి వాటిని మెరుగుపరచుకుంటే.. అది పాల ఉత్పత్తిదార్లకూ ప్రయోజనమే కలిగిస్తుంది. ఇతర దేశాల నుంచి వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల విషయంలో మన భారత అధికారులు తెలివిగా చర్చలు చేపట్టాలి.

వాణిజ్య ఉద్రిక్తతలు అటు ఎగుమతులు, ఇటు పెట్టుబడుల పరంగా ప్రతికూలతలనే తెచ్చిపెడతాయి. అమెరికా వంటి దేశాలను ప్రత్యామ్నాయ మార్గంగా భారత్ చూసినపుడు గొప్ప అవకాశాలూ కలుగుతాయి. భారత్‌తో పోలిస్తే చైనా, ఇతర ఆసియా దేశాలపై టారిఫ్ అధికంగా ఉంటే మాత్రం అది భారత్‌లో తయారీ అవకాశాలను తెచ్చిపెడుతుంది. అమెరికాకు భారత తయారీ ఎగుమతులు మరీ భారీగా ఏమీ లేవు. భారత్‌పై ఆ విషయంలో టారిఫ్‌లు అధికంగా ఉన్నా మనకు పెద్దగా నష్టమేమీ ఉండదు. టారిఫ్‌ల విషయంలో కొన్ని అంశాల్లో భారత్ మరీ రక్షణాత్మకంగా వ్యవహరిస్తుంది. కాస్త దానిని సడలించవచ్చు.'

ఫండ్ వ్యాపారంలోకి ది వెల్త్ కంపెనీ

ఈనాడు, హైదరాబాద్: పాంటోమాత్ గ్రూపులో భాగమైన ది వెల్త్ అసెట్ మేనేజ్‌మెంట్ హోల్డింగ్స్ మ్యూచువల్ ఫండ్ల వ్యాపారంలోకి అడుగు పెట్టనుంది. ఇందుకోసం మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఆమోదం లభించిందని శుక్రవారం వెల్లడించింది. దీంతో రూ.74.41 లక్షల కోట్ల మ్యూచువల్ ఫండ్ల పరిశ్రమలోకి ది వెల్త్ కంపెనీ మ్యూచువల్ ఫండ్ పేరుతో ప్రవేశించనుంది. స్టాక్ మార్కెట్ ఆధారిత ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు మరిన్ని పెట్టుబడి మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యాన్ని విధించుకున్నట్లు ఈ సందర్భంగా కంపెనీ వెల్లడించింది. ముఖ్యంగా రెండు, మూడో అంచె నగరాలపై దృష్టి సారించినట్లు పేర్కొంది. ఉన్నత, నాణ్యమైన పథకాలను అందించి, వాటి ద్వారా మదుపరులకు సంపదను సృష్టించేందుకు ప్రయత్నిస్తామని ది వెల్త్ కంపెనీ వ్యవస్థాపకులు, ఎండీ-సీఈఓ మధు లునావత్ తెలిపారు. చిన్న పట్టణాల్లో సమర్థంగా సేవలను అందిస్తామని పేర్కొన్నారు.

నిర్మాణ రంగంలోనూ ఏఐ

బెంట్లీ సిస్టమ్స్

ఈనాడు, హైదరాబాద్: మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగాల్లో ఆధునిక సాంకేతికత వినియోగం పెరుగుతోందని బెంట్లీ సిస్టమ్స్ దక్షిణాసియా రీజనల్ ఎగ్జిక్యూటివ్ కమల కన్నన్ తిరువది అన్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధ(ఏఐ)లాంటివి ఈ రంగంలో ఎంతో కీలకంగా మారాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థలు, ఇంజినీరింగ్ కంపెనీలు, మౌలిక సదుపాయాల కన్సల్టెన్సీలు సాంకేతికతపై ఆధారపడటం పెరిగిందన్నారు. ఒక ప్రాజెక్టును ప్రతిపాదిత దశ నుంచి పూర్తిగా నిర్వహణలోకి తీసుకొచ్చే వరకూ అవసరమైన సాఫ్ట్‌వేర్ సేవలను అందిస్తున్నామని వివరించారు. ఆటోమేషన్, ఇంటిగ్రేషన్, వర్క్‌ఫ్లోల ద్వారా సంస్థలు తమ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు వీలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కొత్త రైల్వేలు, ఓడరేవులు, పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసే విషయంపై ఆంధ్రప్రదేశ్ దృష్టి సారించిందని, తెలంగాణలోనూ మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడం, కొత్త మెట్రో, ఫ్లైఓవర్లు వస్తున్నాయన్నారు. ఈ రాష్ట్రాల్లో ఇప్పటికే పలు సంస్థలకు తాము సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్ కాలేజీలు తమ ఉత్పత్తులను ఉచితంగా వినియోగించుకునేందుకూ అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు.

బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు



● నిఫ్టీ 25000 పాయింట్ల దిగువకు
● రూ.2.5 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరి

ఎఫ్ఐఐల కొనుగోళ్లు... రూ.374.74 కోట్లు
డీఐఐలు కొనుగోళ్లు.. రూ.2,103.51 కోట్లు

సెన్సెక్స్ ▼502 81758 | నిఫ్టీ ▼143 24968

సమీక్ష

ఏప్రిల్- జూన్ త్రైమాసికానికి యాక్సిస్ బ్యాంక్ ప్రకటించిన ఫలితాలు విశ్లేషకుల అంచనాలను అందుకోకపోవడంతో ఆ ప్రభావం బ్యాంకింగ్ షేర్లపై పడింది. దీంతో సూచీలకు నష్టాలు తప్పలేదు. నిఫ్టీ 50 సూచీ 25000 పాయింట్ల దిగువకు వచ్చింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 4 పైసలు తగ్గి రూ.86.16 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.88 శాతం పెరిగి 70.12 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్ల విషయానికొస్తే.. జపాన్, దక్షిణ కొరియా నష్టాల్లో; హాంకాంగ్, తైవాన్, సింగపూర్, చైనా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు మిశ్రమంగా ఆరంభమయ్యాయి.

✦ మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.50 లక్షల కోట్లు తగ్గి రూ.4,58,37,201.15 కోట్ల (5.32 లక్షల కోట్ల డాలర్లు)కు పరిమితమైంది.

స్వల్ప నష్టాలతో ఆరంభం..: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ క్రితం ముగింపు (82,259.24)తో పోలిస్తే స్వల్పంగా 65 పాయింట్లు తగ్గి 82,193.62 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత అదే ఒరవడిని కొనసాగిస్తూ 81,608.13 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి దిగివచ్చింది. చివరకు 501.51 పాయింట్ల నష్టంతో 81,757.73 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 143.05 పాయింట్లు కోల్పోయి 24,968.40 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,144.60 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 24,918.65 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 742.74 పాయింట్లు, నిఫ్టీ 181.45 పాయింట్లు నష్టపోయాయి.

యాక్సిస్ బ్యాంక్ షేర్లకు ఒత్తిడి..

సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 8 మినహా మిగతా కంపెనీల షేర్లన్నీ నష్టాల్లో ముగిశాయి. అత్యధికంగా యాక్సిస్ బ్యాంక్ షేరు 5.24 శాతం నష్టపోయి రూ.1,099.10 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 7.40 శాతం వరకు డీలాపడింది. ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో ఈ ప్రైవేట్ రంగ బ్యాంకు నికర లాభం 3 శాతం తగ్గడమే ఇందుకు కారణం. ఇక బెల్ 2.34%, భారతీ ఎయిర్‌టెల్ 1.44%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.47%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.44%, టెక్ మహీంద్రా 0.96% నష్టపోయాయి. మరోవైపు బజాజ్ ఫైనాన్స్ 1.94%, టాటా స్టీల్ 1.66%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.52%, హెచ్‌సీఎల్ టెక్ 0.32%, ఇన్ఫోసిస్ 0.24% చొప్పున లాభపడ్డాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో భారీ యంత్రపరికరాలు 1.5%, బ్యాంకెక్స్ 1.33%, ఇండస్ట్రియల్స్ 1.07%, టెలికమ్యూనికేషన్ 0.99%, విద్యుత్ 0.9% చొప్పున నష్టపోయాయి. లోహ, సేవలు, ఐటీ రంగాల సూచీలు రాణించాయి.

✦ ఏప్రిల్- జూన్ త్రైమాసికానికి విప్రో నికర లాభంలో 9.8 శాతం వృద్ధిని ప్రకటించడంతో ఈ కంపెనీ షేర్లు రాణించాయి. బీఎస్ఈలో 4.43 శాతం పెరిగి రూ.271.80 వద్ద ముగిశాయి.

✦ ఇండిక్యూబ్ స్పేసెస్ తొలి పబ్లిక్ ఆఫర్‌కు (ఐపీఓ) ధరల శ్రేణిగా రూ.225-237ను నిర్ణయించారు. ఈ ఐపీఓ ఈ నెల 23న ప్రారంభమై 25న ముగియనుంది. ప్రతిపాదిత ఇష్యూ ద్వారా కంపెనీ రూ.700 కోట్లను సమీకరించాలని అనుకుంటోంది.

✦ జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ తొలి పబ్లిక్ ఆఫర్‌కు ధరల శ్రేణి రూ.225- 237. ఈ ఐపీఓ ఈ నెల 23న మొదలై 25న ముగియనుంది. ప్రతిపాదిత ఇష్యూ ద్వారా రూ.4,600 కోట్లను కంపెనీ సమీకరించాలని అనుకుంటోంది.

✦ జేబీ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్‌లో మెజార్టీ వాటాను రూ.19,500 కోట్లకు కొనుగోలు చేసే ఒప్పందానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా అనుమతిని టోరెంట్ ఫార్మా అడిగింది.

✦ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా (ఏపీఐ) సహకారంతో దగ్గు చికిత్సా కేంద్రాలను (కఫ్ క్లినిక్స్) ప్రారంభించనున్నట్లు బెండ్రైల్ దగ్గు మందు తయారీ సంస్థ కెన్వ్యూ తెలిపింది.

✦ రిటైల్ టెక్ అంకురం షాప్‌కిరాణాను కొనుగోలు చేసినట్లు ఉడాన్ తెలిపింది. పూర్తిగా షేర్ల రూపేణా ఈ లావాదేవీ జరిగింది.

నేటి బోర్డు సమావేశాలు: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, యెస్ బ్యాంక్, ఏయూ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, ఇండియా సిమెంట్స్, జేకే సిమెంట్, రిలయన్స్ పవర్

రూ.లక్షల్లో జీతం వచ్చే ఉద్యోగం ఉంది...
- నాన్న ఆశయం ముందు అదేమంత పెద్దగా కనిపించలేదు!

విలాసవంతమైన సౌకర్యాలున్నాయి...
- మనస్సాక్షే.. కుదురుగా కూర్చోనీయలేదు!

అన్నీ వదిలేసి సైకిలెక్కాడు... నగరాలు, రాష్ట్రాలు, దేశాలు చుట్టేస్తూ ముందుకు సాగుతున్నాడు **దాగర రంజిత్ కుమార్.** ఎన్నో సవాళ్లు ఎదుర్కొని, ఇప్పటికి 42 వేల కిలోమీటర్లు ప్రయాణించాడు. సిరిసంపదలు కాదు, ఆయురారోగ్యాలే ముఖ్యమంటూ.. దానికోసం శారీరక శ్రమ చేయాలంటూ తన ప్రపంచ యాత్రతో అందరికీ చాటి చెబుతున్నాడు.



రూ.లక్షల జీతం వదిలి... సైకిలెక్కాడు!

కరోనా.. ప్రపంచాన్నే అతలాకుతలం చేసిన మహమ్మారి. అది ధనవంతుడిని బికారిగా మార్చేసింది.. అర్ధాంతరంగా ఆరోగ్యవంతుడి ఆయుష్షు తీసింది. ఆ విలయంలో కుటుంబానికి పెద్ద దిక్కైన నాన్నని కోల్పోయాడు రంజిత్. క్రిమినల్ లాయర్‌గా ఆయనకి సొంతూరు వరంగల్ జిల్లా గిర్మాజిపేటలో మంచి పేరుండేది. ప్రతిక్షణం వెన్నంటి ఉండే నాన్న అకాల మరణంతో ఏడాదిపాటు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు రంజిత్. దాన్నుంచి తేరుకున్నాక.. మనిషి ఆరోగ్యంగా ఉండటం ఎంత ముఖ్యమో తెలిసొచ్చింది. ఇది వీలైనంత ఎక్కువమందికి తెలియజేయాలనుకున్నాడు. అదీగాక రంజిత్ నాన్నకి ట్రావెలింగ్ అంటే చాలా ఇష్టం. ఈ రెండూ కలిసి వచ్చేలా సైకిల్ యాత్రను ఎంచుకున్నాడు.

సౌకర్యాలు వదిలి..

యాత్ర ప్రారంభించేనాటికి ఫార్మసిస్ట్‌గా రంజిత్ నెలకి రూ.మూడున్నర లక్షలు అందుకుంటున్నాడు. పదీ పాతిక వేల రూపాయల కోసం నానా కష్టాలు పడే రోజులివి. అంత మంచి జీతం వదిలి కష్టాల బాట పట్టొద్దని చాలామంది హితవు పలికారు. కానీ సంపాదన కాదు.. విలువైన ప్రాణం, దాన్ని నిలబెట్టుకునే ఆరోగ్యమే ముఖ్యమని నమ్మాడు రంజిత్. వీటిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సైక్లింగ్ ఎంచుకున్నాడు. మొదట నగరాలు తిరిగాడు. తర్వాత రాష్ట్రాలు, దేశాలు.. ఇప్పుడు ఖండాలూ దాటేస్తున్నాడు. అక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, వింతలూ, విశేషాలను 'రంజిత్ ఆన్ వీల్స్' పేరుతో యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుగు ప్రజలకు తెలియజేస్తున్నాడు.

యాచకురాలి దయతో..

2021 ఏప్రిల్లో.. రంజిత్ హైదరాబాద్-కన్యాకుమారి యాత్ర మొదలైంది. అలవాటు లేని పని కావడంతో మొదట్లో చాలా ఇబ్బంది పడ్డాడు. కర్నూలుకి వెళ్లేసరికి అంగుళం కదల్లేని పరిస్థితికి వచ్చాడు. అప్పుడు ఓ పోలీసు అధికారి చికిత్స చేయించారు. అదే సమయంలో కరోనా రెండోవేవ్ లాక్‌డౌన్ విధించారు. ఆహారం, నీటికి అలమటించాడు. ఓ రోజైతే తిండి లేక సొమ్మసిల్లి, మధురైలోని ఓ ఆలయంలో పడుకున్నాడు. ఆ సమయంలో ఒక యాచకురాలు తన దగ్గరున్న ఇడ్లీలు ఇచ్చి కడుపు నింపింది. కర్ణాటకలోని శివమొగ్గలో కొందరు దుండగులు రంజిత్‌ని లూటీ చేసి నడిరోడ్డుపై వదిలేశారు. తర్వాత పోలీసుల సాయంతో తన సామాను, సైకిల్‌ని తిరిగి పొందగలిగాడు.

మొదటి యాత్ర కొన్ని చేదు అనుభవాల్ని మిగిల్చినా, అంతులేని ప్రోత్సాహాన్ని అందించింది. వెంటనే వరంగల్, లద్దాఖ్ యాత్ర మొదలుపెట్టాడు. మనాలి వరకూ ట్రక్‌లో వెళ్లి, అక్కడ్నుంచి సైకిల్ ఎక్కాడు. మనాలి, లద్దాఖ్, కశ్మీర్‌లో సైక్లింగ్ అంటే ప్రాణాలతో చెలగాటమే. మంచు చరియలు విరిగిపడటం, ఘాట్‌రోడ్లలో ప్రమాదాలు అక్కడ నిత్యకృత్యం. ఈ ప్రయాణంలోనే ఓ రోజు హిమాలయాల ప్రాంతంలో టెంట్ వేసుకుని పడుకున్నాడు. ఉదయం నిద్ర లేచేసరికి మంచులో కూరుకుపోయి ఉన్నాడు. దాంతో చిన్న గ్యాస్ పొయ్యిని వెలిగించుకొని, వేడి రాజేసుకుని అతి కష్టమ్మీద బతికి బయటపడ్డాడు. ఆపై హిమాలయాల్లోనే అత్యంత ఎత్తైన, కఠినమైన ప్రదేశాల్లో ఖార్దుంగ్లా పర్వతం చేరుకున్నాడు. లద్దాఖ్, కశ్మీర్, హరియాణా, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రల మీదుగా తిరిగి వరంగల్ చేరుకున్నాడు. కరోనా సమయంలో విశేష సేవలందించాడు నటుడు సోనూసూద్. అతడికి ట్రిబ్యూట్‌గా అతడి ఫొటో పెట్టుకొని ప్రయాణం చేశాడు రంజిత్. తిరుగుయాత్రలో అతడ్ని కలవాలని ముంబయి చేరుకున్నాడు. అభిమానుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న సోనూసూద్ వేరేచోట ఉన్న తన షూటింగ్‌ని మధ్యలోనే నిలిపివేసి మరీ ముంబయి వచ్చి కలిశాడు. రెండు యాత్రల్లో దేశ పశ్చిమ సరిహద్దు దాదాపు కవర్ చేశాడు. మూడోసారి తూర్పు వైపు వెళ్లాలనుకున్నాడు. హైదరాబాద్‌లో మొదలై.. విజయవాడ, విశాఖపట్నం, భువనేశ్వర్, కోల్‌కతా, అస్సాం, సిక్కిం ఇలా తూర్పు వైపునున్న రాజధానులు, రాష్ట్రాలు దాటుతూ, 6 వేల కిలోమీటర్లు పూర్తి చేసి హిమాలయాల్లోని ఇండో-చైనా సరిహద్దు వరకు చేరుకున్నాడు.

సరిహద్దులు దాటి..

నాలుగోసారి సరిహద్దులు దాటాలనుకున్నాడు రంజిత్. మొదటిసారి శ్రీలంక ఎంచుకొని, 30రోజుల్లో ఆ దేశం చుట్టేశాడు. రామసేతు దగ్గర అనుమతించిన దానికన్నా ఎక్కువ దూరం వెళ్లాడని అక్కడి ఆర్మీ అధికారులు రంజిత్ తలకు తుపాకులు గురిపెట్టి బెదిరించారు కూడా. శ్రీలంక పర్యటన అనంతరం అంతర్జాతీయ యాత్రలు అధికం చేశాడు. సైక్లింగ్ చేస్తూ ఆయా దేశాల్లోని అలవాట్లు, ఆహారం, ఇతర వింతలు, విశేషాలు అప్‌లోడ్ చేశాడు. వియత్నాంలో వీసా గడువుకన్నా ఎక్కువ రోజులు ఉన్నావంటూ పోలీసులు అతడి దగ్గరున్న డబ్బులు లాక్కున్నారు. కాంబోడియాలో అతిపెద్ద హిందూ దేవాలయమైన ఆంగ్‌కోర్‌వాట్‌ని సందర్శించాడు. థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్ నగరం మొత్తాన్ని సైకిల్‌పైనే చుట్టేశాడు. మలేసియాలో సైక్లింగ్ చేస్తున్న విషయాన్ని తెలుసుకుని 2023లో ఇండియన్ హైకమిషన్ ఆహ్వానించింది. దాంతో భారత స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నాడు. ఆ సమయంలో మలేసియా తెలుగు అసోసియేషన్ అతడిని సన్మానించింది. తర్వాత చైనా, జపాన్, దక్షిణకొరియాలో వేల కిలోమీటర్లు సైక్లింగ్ చేశాడు. తైవాన్, మంగోలియా, ఆస్ట్రేలియా చేరుకున్నాడు. అక్కడా రకరకాలు అనుభవాలు మూటగట్టుకొని తెలుగువారికి అందించాడు. మొత్తానికి 14 దేశాల్లో, సుమారు 42వేల కిలోమీటర్లు విజయవంతంగా ప్రయాణం చేశాడు. ఇప్పటికి ఆసియా, ఆస్ట్రేలియా ఖండాలను కవర్ చేసిన రంజిత్.. మరో పదేళ్లలో మిగతా నాలుగు ఖండాలనూ చుట్టేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు.

- గొడిశెల వినయ్‌గౌడ్, హైదరాబాద్

ప్రకృతి సోయగాలు..

ఒకవైపు కనుచూపు మేర పచ్చని పొలాలు.. మరోవైపు సంద్రంలా అతి పొడవైన తీరం ఉన్న చెరువు గట్టు.. మధ్యలో ఈ రెండింటినీ విడదీసే ఎర్రమట్టి రోడ్డు... ఆకాశంలో డ్రోన్ నుంచి చూస్తే అద్భుతంగా కనిపించే రమణీయత.. ఊహించుకుంటేనే మనసు పరవళ్లు తొక్కుతుంది కదూ! హైదరాబాద్ నగరానికి అరవై కిలోమీటర్ల దూరంలో, సంగారెడ్డి పట్టణానికి సమీపంలో ఉంటుందీ దృశ్యం.. మల్కాపూర్ అనే గ్రామంలో. ఈ చెరువులో బోటింగ్ చేయొచ్చు, చెరువు పక్కనే గుడారాలు వేసుకొని ప్రకృతిలో సేదతీరవచ్చు. వారాంతంలో ప్రకృతికి దగ్గరగా ఉండే ఓ ప్రదేశానికి వెళ్లి రావాలనుకుంటే దీనిపై ఓ లుక్కేయండి.

వీకెండ్ వండర్



వెలిగే గ్లౌజులు..

దూరప్రయాణాలే కాదు.. బండిపై ఓ మోస్తరు దూరం వెళ్లే రైడర్లకి చేతి గ్లౌజుల అవసరమేంటో తెలుసు. అదేపనిగా క్లచ్ నొక్కడం, బ్రేకులు వేస్తుంటే.. చేతులు, వేళ్లు నొప్పి పుట్టడం ఖాయం. వీటి నుంచి ఉపశమనం పొందాలన్నా, గాయాల తీవ్రత తగ్గాలన్నా గ్లౌజులు ధరిస్తుంటారు. అంతేకాదు.. మేం తయారు చేసిన *SignalWear smart motorcycle gloves* వేసుకుంటే మరో ప్రయోజనమూ ఉందంటోంది తయారీదారు. వీటి ప్రత్యేకత ఏంటంటే.. ఇవి రాత్రివేళల్లో వెలుగులీనుతుంటాయి. అదీ కాకుండా మోటార్‌సైకిల్ ఎటువైపు టర్న్ తీసుకుంటే అటువైపు గ్లౌజులు అధికంగా మిణుకుమిణుకుమంటాయి. అంటే సైడ్ ఇండికేటర్ల మాదిరిగా పని చేస్తాయన్నమాట. దీనికోసం బొటన వేలు, చూపుడు వేలు కలిపి పట్టుకుంటే చాలు. గ్లౌజు అంతర్భాగంలో అమర్చిన అతి సూక్ష్మమైన మెకానిజం, టెక్నాలజీ ఆధారంగా ఇవి పని చేస్తాయి. ఒకసారి రాత్రివేళ వెలుతురు లేమి కారణంగా తను భయంకరమైన ప్రమాదాన్ని కళ్లారా చూసిన తర్వాత రెండేళ్లు కష్టపడి ఈ గ్యాడ్జెట్ గ్లౌజులను తయారుచేశాను అంటున్నాడు సిగ్నల్‌వేర్ సీఈవో ట్రాయ్ డీ బాకా.





పట్నం అయినా, పల్లెటూరైనా.. కుర్రకారు ఎక్కడైనా ఒక్కటే. రాకెట్‌లాంటి వేగం.. ఫైర్‌లాంటి జోష్, ఆకాశాన్ని అందుకునే ఉత్సాహం.. వాళ్ల సొంతం. మరి కోనసీమలో ఉండే అబ్బాయి, భాగ్యనగరిలో బుల్లబ్బాయిల జీవనశైలి.. ఎలా వేర్వేరుగా ఉంటుందో ఈ రెండు ప్రపంచాల్నీ చూసిన ఓ యువకుడు చెబుతున్నాడు.

పట్నం మాల్స్ Vs పల్లెటూరు పొలంగట్లు

- నాలుగు వరుసల రహదారులు - రెండు వరుసల రోడ్లు
- ఫ్లై ఓవర్లు- కొబ్బరి చెట్లు
- మసాలాలు- వెటకారాలు
- ఖరీదైన కార్లు- అందమైన బైక్‌లు
- జనరేటర్లు- ఇన్వర్టర్లు
- ప్రతిచోటా పార్కులు- పొలం గట్లు
- పక్షుల బొమ్మలు- రామచిలుకలు
- ఘాటైన బిర్యానీలు- నోరూరించే తీపి రుచులు
- అడుగడుగునా మాల్స్- వీధివీధికీ కిరాణా కొట్లు
- నెలవారీ వేతనాలు- రోజూ రాబడులు
- ఈవీ బైక్‌లు- చలోచలో సైకిళ్లు
- రెచ్చిపోవడానికి పబ్‌లు- ప్రశాంతతకు గుళ్లు
- అక్కడక్కడ చెరువులు- అన్నిచోట్లా గోదారి గట్లు

– రంకిరెడ్డి రాజు, అమలాపురం

మరువలేను.. నీ జ్ఞాపకాల మజిలీ..!

మనసులో మాట

ఆఫీసకి వెళ్లగానే బాస్ పిలుపు. 'రేపట్నుంచి ఈమెకి నువ్వే ట్రైనింగ్ ఇవ్వాలి' అంటూ ఒకమ్మాయిని చూపించారు. గుండ్రని మోము, కాటుక కళ్లు, బ్లాక్ అండ్ వైట్ డ్రెస్‌లో చక్కనిచుక్కలా ఉంది. ఆమెని చూడగానే కళ్లు జిగేల్‌మన్నాయి. చప్పగా సాగిపోతున్న నా జీవితంలోకి వెలుగులా వచ్చింది అనిపించింది. 'తక్షిత'.. గమ్మత్తైన పేరు తనది. 'సర్', 'మీరు' అని సంబోధిస్తుంటే.. 'గారెలు, బూరెలు వద్దు.. పేరు పెట్టి పిలిస్తే చాలు' అన్నా. ఫోన్ నెంబర్లు ఇచ్చిపుచ్చుకునే టప్పుడు ఫోన్ ఎక్కువగా వాడనని చెప్పా. 'నేనేమైనా మీ గాళ్‌ఫ్రెండ్‌నా? అస్తమానం ఫోన్ చేసి విసిగించడానికి.. అవసరమైతేనే చేస్తా' అంది. అమ్మాయి బాగా చొరవ తీసుకునే రకమని అర్థమైంది.

వీకెండ్‌లో తను పిలిస్తే, చెప్పిన చోటికి వెళ్లాను. ఓ గ్యాంగ్‌ని వెంటేసుకొని వచ్చింది. 'ఈయనే మా సర్.. ఎప్పుడూ చిల్‌గా ఉంటారు' అంటూ అందరికీ పరిచయం చేసింది. వాళ్లంతా నన్ను 'బ్రో' అని పిలవాలని హుకూం జారీ చేసింది. అందరం కలిసి ట్యాంక్‌బండ్, బిర్లా టెంపుల్, చార్మినార్.. ఇలా నగరమంతా చుట్టేశాం. మర్నాడు మెసేజ్ చేసింది. 'హాయ్ మంకీ.. నిన్న నా లైఫ్‌లో ఎన్నడూ లేనంతగా ఎంజాయ్ చేశా. ఈ సంతోషం జీవితాంతం కావాలనిపిస్తోందబ్బాయ్.. నా ఇంటిపేరు పొడుగ్గా ఉంది.. నీ ఇంటిపేరు పర్మనెంట్‌గా ఇవ్వొచ్చుగా?' అంటూ. ఎగిరి గంతేశా. ఈ క్షణం కోసమే ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్నా. మా సైడ్ ఓకే.. ఇక పెద్దల్ని ఒప్పించి, పెళ్లి చేసుకోవడమే తరువాయి.

ఇలా మా ప్రేమ ప్రయాణం హ్యాపీగా సాగిపోతుండగా.. ఓరోజు వాళ్ల నానమ్మకు బాగా లేదంటూ సడెన్‌గా ఊరెళ్లిపోయింది తక్షిత. చేరగానే ఫోన్ చేస్తానంది. కానీ వారమైనా జాడ లేదు. నేను చేస్తే స్విచ్ఛాఫ్. ఆమె స్నేహితుల్ని అడిగితే 'నెంబర్ మార్చేసింది. మాకూ టచ్‌లో లేద'న్నారు. 'మా ఊరికి వెళ్లాలంటే పదిగంటల ప్రయాణం' అని ఓసారి చెప్పినట్టు గుర్తు. అయినా అన్నిరకాలుగా తన గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించా. ఈ బాధ, ఎదురుచూపుల్లో ఉండగానే నన్ను బదిలీ చేశారు. తక్షిత జ్ఞాపకాలతో ముడిపడిన ఆఫీసు వదిలి వెళ్లనని ఎంత బతిమాలినా మేనేజ్‌మెంట్ వినలేదు. చేసేదేమీ లేక వేరే రాష్ట్రానికి వెళ్లా. అక్కడ చలాకీగా ఉండే ఏ అమ్మాయిని చూసినా, తక్షిత రూపమే కళ్లముందు మెదిలేది. నా చెక్కిళ్లపై కన్నీళ్లు నిలిచేవి.

రెండేళ్లయ్యాక ప్రాజెక్టు పనిమీద హైదరాబాద్ వెళ్లా. సాయంత్రానికి ఆఫీసులో పని ముగించుకొని లిఫ్ట్ దగ్గరికొచ్చా. లిఫ్ట్ తెరుచుకోగానే గులాబీ రంగు చీరలో ప్రత్యక్షమైంది ఒకావిడ. తనెవరో కాదు.. నేను ఇన్నాళ్లుగా వెతుకుతున్న నా ప్రాణం, సర్వస్వం. ఒక్కసారిగా నా కళ్లను నేను నమ్మలేకపోయా. 'ఎలా ఉన్నావు.., ఏమైపోయావు.. ఇన్నాళ్లు ఎక్కడున్నావు?' వరుసగా దూసుకొచ్చాయి ప్రశ్నలు. తక్షిత ఉలకలేదు, పలకలేదు. ఆఫీసు బయటికొచ్చి, బస్టాపు వరకూ వెళ్లింది. మౌనంగా తననే అనుసరించా. కనీసం తిరిగి కూడా చూడలేదు. కాసేపటికి ఒక వ్యక్తి చిన్న పిల్లాడితో వచ్చాడు. ఆ పిల్లాడిని భుజాన వేసుకొని, అతడి బైక్‌పై కూర్చుంది. ఆ బాబుపై నీలం రంగు శాలువా కప్పి ఉంది. వాలెంటైన్స్ డే నాడు నేను తనకి ప్రేమగా ఇచ్చిన కానుక అది. ఆ దృశ్యంతో నాకు పరిస్థితి మొత్తం అర్థమైంది. అక్కడే స్థాణువులా నిల్చుండిపోయా.



కాసేపటికి తన ఫ్రెండ్, మా పాత కొలీగ్ ఒకరు నన్ను గుర్తు పట్టి పిలిచింది. తక్షిత ఆరోజు ఊరెళ్లిపోవడం దగ్గర్నుంచి జరిగిందంతా చెప్పింది. తను ఇంటికి వెళ్లేలోగా వాళ్ల నానమ్మ చనిపోయిందట. ఆ క్లిష్ట పరిస్థితుల్లో మా ప్రేమ విషయం చెప్పే ధైర్యం చేయలేదట. కానీ కొన్నాళ్లకే చుట్టాల అబ్బాయిని పెళ్లి చేసుకొమ్మని తల్లిదండ్రులు ఒత్తిడి చేశారు. అసలే బాధలో ఉండటం, మా సామాజికవర్గాలు వేరు కావడం, వాళ్లు మా పెళ్లికి ఒప్పుకొనే పరిస్థితి లేకపోవడంతో అతడితో తాళి కట్టించుకుందట. కానీ నన్ను మోసం చేశాననే గిల్టీ ఫీలింగ్ వేధిస్తోందనీ.. నన్ను జీవితాంతం మర్చిపోననీ చెబుతూ ఏడ్చిందట. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో ఈమధ్యే మళ్లీ ఉద్యోగంలో చేరిందని చెప్పిందా ఫ్రెండ్. ఇదంతా వినేసరికి నా గుండె బరువెక్కింది. తనతో ఊహించుకున్న కలలన్నీ కన్నీళ్లలా బయటికొచ్చాయి.

ప్రతి ప్రేమకీ సంతోషకరమైన ముగింపు ఉండకపోవచ్చు. మా ప్రేమలా. కానీ ఒక్కసారి ఒక వ్యక్తిని ప్రేమిస్తే.. జీవితాంతం వాళ్ల మంచి కోరుకోవడమే అసలైన ప్రేమ లక్షణం. నేను ఇప్పుడదే చేస్తున్నా. మా జ్ఞాపకాల మజిలీలతో ముందుకు సాగిపోతున్నా.

– మహేశ్

చిటికెలో రీల్

జనం రీల్స్ చుట్టూ తిరుగుతున్నారా? జనాన్ని రీల్స్ తమవైపు తిప్పుకొంటున్నాయా? అంటే చెప్పడం కష్టంకానీ.. రీల్స్, షార్ట్స్ లేకుండా రోజు గడవని కుర్రజనం ఇప్పుడు అరుదు. అందుకేగా నెలకి రెండువందల కోట్ల మంది రీల్స్ చేయడంలో యమా బిజీగా ఉంటున్నారు. పడక దిగితే రీల్.. పక్క ఊరెళ్తే రీల్.. విందులో పాల్గొంటే రీల్.. విమానం ఎక్కితే రీల్.. అన్నట్టుగా తయారైంది పరిస్థితి.

ఇంక పండక్కి, శుభ సందర్భాలకైతే చెప్పనలవే కాదు. ఎంత చేసినా, ఎంత చూసినా.. రీల్స్ అందరూ మెచ్చేలా చేయడం కొందరికి రాదబ్బా! 'అందుకేగా మేం ఉన్నది' అంటోంది 'ఫ్లషాట్' అనే యాప్. సందర్భం ఏంటో చెబితే చాలు.. మీ మనసు జిగేల్‌మనేలా రీల్స్ చేసి పెడతాం అంటోంది. యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే.. 'మీ పెళ్లిరోజా? దిగాలు పడకండి.. మీకు అదిరిపోయే రీల్స్ చేస్తాం', 'కొత్త కారు కొన్నారా? ఆ సందర్భాన్ని ఒక మర్చిపోలేని అనుభవంలా మార్చేస్తాం', 'రాత్రికి రాత్రే మీరు ఇన్‌ఫ్లుయెన్సర్ అయిపోవాలా? భారీగా ఫాలోవర్లను తెచ్చిపెట్టే బాధ్యత మాది' అంటూ ఊరిస్తోంది. పక్కాగా, ప్రొఫెషనల్‌లా రీల్ చేయాలనుకుంటే.. ఇన్‌స్టంట్ కాఫీలా ఇన్‌స్టంట్ రీల్ కావాలనుకుంటే ఈ యాప్‌ని ఫాలో అయితే చాలు.

వైభవంగా.. చోళీ, లెహెంగా

ఆధునికతతో ఆకర్షించే స్టైల్స్ ఎన్నైనా ఉండొచ్చుగాక... అమ్మాయి ఒంటిపై సంప్రదాయం ఉట్టిపడాలన్నా, రాజసం కట్టిపడేయాలన్నా.. సంప్రదాయ డిజైన్ దుస్తులకు పట్టం కట్టాల్సిందే! పడుచు ప్రాయులైనా, జనం ఆరాధించే తారకలకైనా ఇదే సూత్రం. మరి ఈమధ్యకాలంలో వాళ్లు బాగా ఆదరిస్తున్న ట్రెడిషనల్ డ్రెస్‌లు ఏవంటే వినిపిస్తున్నవి చోళీ, లెహెంగాలే. అసలే అందానికి చిరునామాలా ఉండే సెలెబ్రిటీలు లెహెంగా, చోళీలు ధరించి.. చంద్రకాంతిలా మరింత వెన్నెల కురిపిస్తున్నారు. పండగలు, సినిమా ఫంక్షన్లే కాదు.. ప్రైవేటు కార్యక్రమాల్లోనూ పలుమార్లు ఈ సొగసు వస్త్రాలు ధరించి కుర్రాళ్ల హార్ట్‌బీట్‌ని హైజాక్ చేసేస్తున్నారు. సొగసూ, సౌకర్యం వీటి సొంతం గనకే.. సిల్క్ లెహెంగాలు జరీవర్క్ చోళీలపై చక్కనమ్మలు మోజు పడుతున్నారు. మరింత ఆధునికంగా కనిపించాలనుకునే భామలు వీటిలో కురచవి ఎంచుకుంటూ రచ్చ చేస్తున్నారు. ఈమధ్యకాలంలో ఈ ట్రెండ్‌కి బ్రాండ్ అంబాసిడర్లుగా మారిన నాయికల జాబితా పెద్దదిగానే ఉంది. టిప్‌టిప్ బర్సా పానీ ఫేం రవీనా టాండన్ కూతురు రాషా తడానీ మోనోక్రామ్ లెహెంగా, జీబ్రా ప్రింటెడ్ స్కర్టుతో అదరగొడితే, తాజా అందం.. వామికా గబ్బీ పింక్ పాలనురగ లెహెంగా, బంగారు వర్ణం చోళీ ధరించి కుర్రకారు మనసు దోచేసింది. జనరేషన్ జడ్‌కి చిరునామాలా ఉండే ఖుషీ కపూర్.. వైబ్రంట్ హృదయాకారపు మోతిఫ్స్‌ల డిజైన్ లెహెంగా, హృదయాకారపు క్రాప్‌టాప్‌తో అచ్చమైన దేశీయ అవతారంలో మెరిసింది. టాలీవుడ్‌లో గెలిచి, బాలీవుడ్‌కి మకాం మార్చిన మన రకుల్‌ప్రీత్ సైతం ఈ ట్రెండ్‌ని బాగానే అందిపుచ్చుకుంది. ఎరుపురంగు కట్‌వర్క్ లెహెంగా, ఎరుపురంగు త్రీడీ బ్లౌజు.. వాటిపై సెక్విన్ ఎంబ్రాయిడరీ.. క్రిస్టల్ దుపట్టాలతో రిచ్ లుక్‌లో దర్శనమిచ్చింది. బంగారు వర్ణం చోళీ, లెహెంగాలలో అగ్ర తార రష్మిక మందన్నా, భూమి పెడ్నేకర్, పాలక్ తివారీలాంటి భామలు సైతం ఈ స్టైల్‌లో మెరిసిపోయినవాళ్లే.


రకుల్‌ప్రీత్


భూమి పెడ్నేకర్
వామికా గబ్బీ

పంచుకుందాం

- నేనో మాటల మాంత్రికుడిని నీ ముందు మాత్రం.. నోరులేని మూగవాడిని!
- నా ప్రేమను తెలుపుదామంటే అక్షరాలు, మాటలు, సైగలు.. ఇవేమీ సాయం చేయనంటున్నాయ్!
- మన ప్రేమ గమ్యాన్ని చేరలేదు కానీ.. ప్రయాణంలోని ప్రతిక్షణం అపురూపమే!
- నీ నుంచి ప్రేమను తప్ప మరేదీ ఆశించలేదు! అయినా... బరువైన జ్ఞాపకాలే మిగిలాయి!

– ఎం.రత్నకిషోర్

30 ఏళ్లయ్యాకే.. పెళ్లి



భారత్‌లోని మెట్రో నగరాల్లో కుర్రకారు అన్నింట్లో మహా ఫాస్ట్‌గా ఉంటారు. పెళ్లి విషయంలో మాత్రం చాలా వెనకే ఉన్నారు. భారత్‌లో అమ్మాయిలు సగటున 30 ఏళ్లకు పెళ్లికూతురు అవుతున్నారట. దక్షిణకొరియాలోని నగరాల్లో అయితే 37 ఏళ్లు వచ్చేదాకా అమ్మాయిలు పెళ్లే చేసుకోవడం లేదు.

నిలిచి గెలిచిన పృథ్వీ.. ఓడించిన ఘోరీ!


రాణి కీ వావ్

తొలి మధ్యయుగంలో క్రీ.శ.750 నుంచి 1200 వరకు భారతదేశంలో రాజకీయ అనైక్యత నెలకొంది. అనేక రాజ్యాలు వెలిసి దేశ రాజకీయ ఐక్యతను దెబ్బతీశాయి. ఉత్తర భారతదేశంలో 36 రాజపుత్ర రాజ్యాలు ఏర్పడ్డాయి. తూర్పు భారతదేశాన్ని (బిహార్, బెంగాల్) పాలవంశం, ఆ తర్వాత సేనవంశం పరిపాలించాయి. దక్కన్‌ను రాష్ట్రకూటులు, ఆ తర్వాత కళ్యాణి చాళుక్యులు పాలించగా, దక్షిణ భారతదేశంలో బలమైన చోళ సామ్రాజ్యం కొనసాగింది. పోటీపరీక్షార్థులు ఈ కాలంలో పరిపాలించిన రాజ వంశాలు, వారిలో గొప్పవారు, వారి పాలన, నిర్మాణాలు, తదితరాలపై దృష్టి సారించాలి.

తొలి మధ్యయుగం

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

రాజపుత్ర రాజ్యాలు

మధ్యయుగ ఉత్తర భారతదేశంలో రాజకీయంగా అత్యంత బలమైన రాజ్యంగా పేరొందిన రాజపుత్రుల ఆవిర్భావం గురించి సరైన సమాచారం లేదు. మధ్య ఆసియా నుంచి వలస వచ్చి భారతదేశంలో స్థిరపడిన తెగలకు చెందిన వారికి, భారతీయ స్త్రీలకు రాజపుత్రులు జన్మించారని జేమ్స్ టోడ్ 'Annals and Antiquities of Rajastan' అనే పుస్తకంలో పేర్కొన్నారు. రాజపుత్రుల్లో మొత్తం 36 వంశాలున్నాయి. వీరు ఉత్తర భారతదేశంలో అనేక రాజ్యాలను స్థాపించి పాలించారు. వీటిలో ఆరు వంశాలు ముఖ్యమైనవి. అవి:

ప్రతిహారులు

వీరు మధ్య ఆసియా నుంచి వచ్చి భారతదేశంలో స్థిరపడిన 'ఘూర్జర' తెగకు చెందినవారు. ప్రారంభంలో ప్రతిహారులు (ద్వారపాలకులు)గా పని చేయడం వల్ల వీరిని ఘూర్జర ప్రతిహారులు అంటారు. కనోజ్ రాజధానిగా ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాలను పాలించారు.

మిహిరభోజ (9వ శతాబ్దం): ఈ వంశంలో అత్యంత సుప్రసిద్ధుడు మిహిరభోజుడు. ఇతడి విజయాలను గ్వాలియర్ శాసనంలో లిఖించారు. క్రీ.శ.851లో అరబ్ యాత్రికుడు సులేమాన్ ఇతడి రాజ్యంలో పర్యటించి గొప్పచక్రవర్తి అని కీర్తించాడు. వైష్ణవ మతాన్ని ఆదరించి 'ఆదివరాహ' అనే బిరుదు పొందాడు.

మహేంద్రపాల (10వ శతాబ్దం): ఇతడి ఆస్థానంలో సుప్రసిద్ధ సంస్కృత కవి రాజశేఖరుడు ఉండేవాడు. కర్పూరమంజరి, కావ్యమీమాంస, భువనకోశం, హరవిలాసం, విద్ధసాలభంజిక మొదలైనవి ఇతడి ముఖ్య రచనలు.

రాజ్యపాల (11వ శతాబ్దం): మహమ్మద్ గజిని 1018లో కనోజ్‌పై దండెత్తగా రాజ్యపాలుడు యుద్ధం చేయకుండా పారిపోయాడు.

పరమారులు

ఈ రాజ్య స్థాపకుడు ఉపేంద్రుడు. వీరు ప్రారంభంలో ఉజ్జయినిని, ఆ తర్వాత ధార్ రాజధానిగా మాళ్వా ప్రాంతాన్ని (మధ్యప్రదేశ్) పాలించారు.

వాక్పతిముంజ (10వ శతాబ్దం): ఇతడి ఆస్థానంలో నవసాహసాంకచరిత రచించిన పద్మగుప్త, దశరూపను రచించిన ధనుంజయ ఆస్థాన కవులుగా ఉండేవారు.

పరమార భోజ (11వ శతాబ్దం): ఈ వంశంలో అందరికంటే గొప్పవాడు. ఇతడి బిరుదు కవిరాజు. 24 సంస్కృత కావ్యాలను రచించాడు. ఇందులో సమరాంగణ సూత్రధార (వాస్తుశిల్ప కళలు), ఆయుర్వేద సర్వస్వ (వైద్యశాస్త్ర గ్రంథం), యుక్తి కల్పతరు (పరిపాలన గ్రంథం), రాజమార్తాండ (యోగ), తత్వప్రకాశ (శైవ గ్రంథం) ముఖ్యమైనవి.

✦ భోజ్‌పూర్ అనే నూతన నగరాన్ని, ధార్‌లో భోజశాల, సరస్వతి కంఠాభరణ మహావిద్యాలయ అనే సంస్కృత కళాశాలను నిర్మించాడు. సరస్వతి మాతను వాగ్దేవిగా పూజించాడు.

ఉదయాదిత్య (11వ శతాబ్దం): ఇతడు ఉదయ్‌పూర్ (మధ్యప్రదేశ్)లో నీలకంఠేశ్వర ఆలయం, ఉదయేశ్వర మహాదేవ ఆలయాన్ని నిర్మించాడు.

చహమానులు/చౌహాన్లు

వీరు ప్రారంభంలో ప్రతిహారులకు సామంతులుగా ఉండేవారు. శాకంబరి, ఆ తర్వాత అజయమేరు (అజ్మీర్) రాజధానులుగా రాజస్థాన్‌ను పాలించారు. వీరి వంశ స్థాపకుడు వాసుదేవుడు.

విగ్రహరాజు-IV విశాలదేవ: చౌహాన్ వంశంలో ముఖ్యమైన రాజు. సంస్కృతంలో హరికేళినాటక అనే నాటకాన్ని రచించి కవిబాంధవ బిరుదు పొందాడు. ఇతడు ఢిల్లీని పాలిస్తున్న తోమార రాజపుత్రులను ఓడించి సామంతులుగా చేసుకున్నాడు. ఇతడి ఆస్థానకవి సోమదేవుడు లలిత విగ్రహరాజ అనే సంస్కృత నాటకాన్ని రచించాడు.

పృథ్వీరాజ్ చౌహాన్-III (1179–1192): ఇతడిని పర్షియన్ గ్రంథాల్లో రాయ్ పితుర అని పిలిచేవారు.

◆ ఇతడి ఆస్థాన కవి చాంద్ బర్దాయ్ హిందీలో తొలి కావ్యంగా గుర్తింపు పొందిన 'పృథ్వీరాజ్‌రాసో'ను రచించాడు. పృథ్వీరాజ్ చౌహాన్-III గహద్వాల రాకుమార్తె సంయుక్త/సంయోజితను ప్రేమించి వివాహం చేసుకోవడం ఈ కావ్యంలోని కథాంశం.

◆ ఇతడు మహమ్మద్ ఘోరీతో రెండు యుద్ధాలు చేశాడు. 1191లో మొదటి తరైన్/మొదటి స్థానేశ్వర్ (హరియాణా) యుద్ధంలో ఘోరీని ఓడించి తరిమికొట్టాడు.

◆ 1192లో రెండో తరైన్/రెండో స్థానేశ్వర్ యుద్ధంలో ఘోరీ చేతిలో అంతమయ్యాడు. ఈ యుద్ధమే దేశంలో ముస్లిం పాలనకు పునాదులు వేసింది. అయితే పృథ్వీరాజదేవ, మహమ్మద్ బిన్ సామ్ అనే పేర్లు ఒకవైపు, మహాలక్ష్మి ప్రతిమ మరొకవైపు ఉన్న నాణేలు లభించడంతో పృథ్వీరాజ్ చౌహాన్ కొంతకాలం మహమ్మద్ ఘోరీకి సామంతుడిగా పాలించి ఉండొచ్చని చరిత్రకారులు అభిప్రాయం.

ఛందేలులు

ఛందేలులు మహోబ (ఉత్తర్‌ప్రదేశ్), ఖజురహో (మధ్యప్రదేశ్) రాజధానులుగా జజేకభుక్తి (బుందేల్‌ఖండ్) ప్రాంతాన్ని పాలించారు. భారతదేశంలో తొలి హిందీ శాసనాలు వీరి కాలంలోనే వేశారు. వీరు బంగారు నాణేలను ముద్రించే ప్రాచీన కాలపు సంప్రదాయాన్ని పునరుద్ధరించారు. ఈ రాజ్య స్థాపకుడు నన్నుక.

● 11వ శతాబ్దంలో ఖజురహోలో అద్భుత దేవాలయాల నిర్మాణం చేపట్టారు. శిఖర/నగర శైలిలో దాదాపు 85 దేవాలయాలను నిర్మించారు. యునెస్కో ఖజురహోను ప్రపంచ వారసత్వ కేంద్రంగా గుర్తించింది.

గహద్వాలులు

వీరు కనోజ్‌ను మొదటి రాజధానిగా, కాశీ రెండో రాజధానిగా ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాలను పరిపాలించారు. ప్రారంభంలో వీరు రాష్ట్రకూటులకు సామంతులుగా పనిచేశారు. వీరి వంశ స్థాపకుడు యశోవిగ్రహ రాజు.

గోవిందచంద్ర: ఇతని విదేశాంగ మంత్రి లక్ష్మీధరుడు కృతకల్పతరు, కల్పద్రుమ అనే ధర్మశాస్త్రాలను రచించాడు. గోవిందచంద్రుడి భార్య కుమారదేవి సారనాథ్‌లో ఒక బౌద్ధ విహారం నిర్మించింది.

జయచంద్ర: ఇతడు గహద్వాల వంశంలో అత్యంత ప్రముఖుడు. ఇతడి ఆస్థాన కవి శ్రీహర్షుడు నైషధచరిత అనే సంస్కృత కావ్యాన్ని రచించాడు. ఇది శ్రీనాథుడు తెలుగులో రచించిన శృంగార నైషధానికి మూలం.

❖ మహమ్మద్ ఘోరీ 1194లో జరిగి చాందవార్ యుద్ధంలో జయచంద్రను చంపి గహద్వాల వంశాన్ని అంతమొందించాడు.

సోలంకి/అన్హిల్ వార చాళుక్యులు

వీరు ప్రతిహారులకు సామంతులుగా ఉండి, తర్వాత కాలంలో స్వతంత్రులుగా మారారు. అన్హిల్ వార (ప్రస్తుతం పాటన్) రాజధానిగా 3 శతాబ్దాలకు పైగా గుజరాత్‌ను పాలించారు. ఈ రాజ్య స్థాపకుడు మూలరాజు.

భీమ-I: ఇతడి కాలంలోనే 1025లో మహమ్మద్ గజిని సోమనాథ్ ఆలయాన్ని ధ్వంసం చేసి దోచుకున్నాడు. ఈ దాడి సమయంలో భీమ-I కచ్ ప్రాంతానికి పారిపోయి తలదాచుకున్నాడు.

జయసింహ సిద్ధరాజు: ఈ వంశంలో అందరికంటే గొప్పవాడు. సిద్ధపుర అనే నగరాన్ని నిర్మించి, అక్కడ రుద్రమహాకాళి ఆలయాన్ని నిర్మించాడు. ఇతడు పరమారులను ఓడించి, అవంతినాథ అనే బిరుదును పొందాడు. ఇతడి ఆస్థానంలో సుప్రసిద్ధ జైనకవి హేమచంద్ర (12వ శతాబ్దం) ఉండేవారు. హేమచంద్రుడు నేమినాథ చరిత్ర, సిద్ధహేమచంద్ర, త్రిషష్టి శలకపురుష, కుమారపాల చరిత, పరిశిష్ట పర్వన్ లాంటి అనేక గ్రంథాలు రచించి కలికాలసర్వజ్ఞ అనే బిరుదు పొందాడు.

కుమారపాల: ఇతడు హేమచంద్రుడి ప్రభావంతో జైనమతం స్వీకరించి, జంతువధను నిషేధించాడు.

భీమ-II: ఇతడు 1178లో మౌంట్‌అబు యుద్ధంలో మహమ్మద్ ఘోరిని ఓడించాడు.

▮ సోలంకిలు తమ కాలంలో అత్యంత సుప్రసిద్ధ కట్టడాలు నిర్మించారు. అవి:

రాణీ కీ వావ్: 11వ శతాబ్దంలో రాణి ఉదయమతి పాటన్ గుజరాత్‌లో అత్యంత సుందరమైన శిల్పాలతో నిర్మించిన మెట్లబావి. భర్త భీమ-I మరణానంతరం తన జ్ఞాపకార్థం దీన్ని నిర్మించింది. యునెస్కో ఈ కట్టడాన్ని ప్రపంచ వారసత్వ కేంద్రంగా గుర్తించింది.

మౌంట్‌అబు జైన దేవాలయాలు: ఇవి 11-13 శతాబ్దాల మధ్యకాలంలో మౌంట్‌అబులోని దిల్వార (రాజస్థాన్)లో నిర్మించిన అత్యద్భుతమైన జైన దేవాలయాలు. వీటిలో విమలషాహి, లూనవషాహి ఆలయాలు ముఖ్యమైనవి.

విమలషాహి ఆలయం: 11వ శతాబ్దంలో భీమ-I మంత్రి విములషా నిర్మించాడు. ఇది మొదటి తీర్థంకరుడైన రుషభనాథుడి ఆలయం.

లూనవషాహి ఆలయం: 13వ శతాబ్దంలో భీమ-II మంత్రులు వస్తుపాల, తేజపాల ఈ ఆలయాన్ని నిర్మించారు. ఇది 22వ తీర్థంకరుడైన నేమినాథుడి ఆలయం.


రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

715 Word of the Day

Repatriate

Telugu meaning: స్వదేశానికి తిరిగి పంపడం

English meaning: The word repatriate (రిపేట్రియేట్) is a verb that means to send someone back to their own country, especially after a war or exile.

Synonyms: Deport, Send back

Antonyms: Let, Allow

Usage: **1.** The government decided to repatriate the refugees after the conflict ended.

2. Many workers were repatriated when the company shut down its overseas branch.

కరెంట్ అఫైర్స్



తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ నియమితులయ్యారు. మే 26న సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో జులై 14న కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందించారు.

▮ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించిన జస్టిస్ అలోక్ అరాధే జనవరి 21న బాంబే హైకోర్టుకు బదిలీ కావడంతో ప్రస్తుత నియామకం చేపట్టారు.

▮ టీజీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేశారు.

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఎండీ, సీఈఓగా ఆర్.దొరైస్వామి నియమితులయ్యారు. ప్రధాని నేతృత్వంలోని మంత్రివర్గ నియామకాల సంఘం ఆమోదం మేరకు, ఆర్థిక సేవల విభాగం ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2028 ఆగస్టు 28 వరకు ఆయన ఈ పదవిలో ఉండనున్నారు. ఎండీ, సీఈఓతో పాటు ఎల్ఐసీకి నలుగురు ఎండీలు ఉంటారు.

కేంద్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికిగానూ ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరం తొలి స్థానంలో నిలిచింది. ఈ నగరం వరుసగా ఎనిమిదోసారి పరిశుభ్ర నగరంగా అవార్డు సొంతం చేసుకుంది. రెండో స్థానంలో గుజరాత్‌లోని సూరత్, మూడో స్థానంలో నవీ ముంబయి అవార్డులు దక్కించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఈ జాబితాలో నాలుగో స్థానం కైవసం చేసుకుంది. దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జులై 17న ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

వాణిజ్య బ్యాంకుల జాతీయాకరణ చేసిన రోజు


జులై 19 చరిత్రలో ఈనాడు

విత్త (ఆర్థిక) మార్కెట్‌లో వాణిజ్య బ్యాంకులు ముఖ్య భాగం. ఖాతాదార్ల నుంచి డిపాజిట్లు సేకరించే ఆర్థిక సంస్థలుగా వీటిని పేర్కొంటారు. ఇవి తీసుకున్న మొత్తాన్ని ఇతరులకు లేదా సంస్థలకు వడ్డీకి రుణాలుగా ఇస్తాయి. అప్పులు ఇవ్వడం ద్వారా ఇవి డబ్బు సంపాదిస్తాయి. అయితే దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారత్‌లో ప్రైవేట్ రంగానికి చెందిన బ్యాంకులే ఎక్కువగా ఉన్నాయి. వీటిపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండేది కాదు. కొంత మంది ధనికులకు, వ్యాపారులకు మాత్రమే బ్యాంకింగ్ సదుపాయాలు అందుబాటులో ఉండేవి. ఆశించిన రీతిలో ఆర్థికాభివృద్ధి జరగలేదు. దీంతో ఇందిరా గాంధీ ప్రభుత్వం 1969, జులై 19న బ్యాంకులను జాతీయం చేయాలనే నిర్ణయం తీసుకుంది. ఇది బ్యాంకింగ్ వ్యవస్థలోనే విప్లవాత్మక మార్పులకు కారణమైంది. వీటి గురించి ముఖ్య విషయాలను తెలుసుకుందాం..!

✦ స్వాతంత్ర్యానంతరం దేశంలోని వాణిజ్య బ్యాంకులన్నీ కేవలం లాభాపేక్ష కోసమే కార్యకలాపాలు నిర్వహించేవి. దీంతో వ్యవసాయ రంగంతోపాటు, పారిశ్రామిక అవసరాల కోసం నిధుల కొరత తలెత్తి, ఆర్థిక కార్యకలాపాలు మందగించాయి.

✦ 1947-55 మధ్య కాలంలో దేశంలో 361 ప్రైవేట్ బ్యాంకులు కుప్పకూలాయి. ఎంతోమంది ఖాతాదార్లు తమ సొమ్ము పోగొట్టుకున్నారు. 1969 నాటికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఒక్కటే ప్రభుత్వరంగ బ్యాంకు కాగా, మిగిలినవన్నీ ప్రైవేట్ రంగానికి చెందినవే.

✦ 1967లో హజారే కమిటీ 'ఇండస్ట్రియల్ ప్లానింగ్ అండ్ లైసెన్సింగ్ పాలసీ'పై ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పరిశ్రమలు, బ్యాంకుల మధ్య అనుసంధానం లేకపోతే పరపతి ప్రణాళిక తీసుకురావడం కష్టమని పేర్కొంది. అదేవిధంగా వివిధ రంగాల్లోని ప్రైవేట్ సంస్థలను జాతీయం చేయాలనే డిమాండూ అధికంగా ఉండేది. ఈ నేపథ్యంలో నాటి ప్రధాని ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయం చేయాలనే నిర్ణయం తీసుకున్నారు.




✦ దీనికి అనుగుణంగా 1969, జులై 19న బ్యాంకింగ్ కంపెనీస్ అక్విజిషన్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ అనే ఆర్డినెన్స్‌ను జారీ చేశారు. తర్వాత దాన్ని చట్టం చేశారు. ప్రైవేట్ రంగంలో రూ. 50 కోట్లు, అంతకంటే ఎక్కువ డిపాజిట్లు కలిగిన 14 వాణిజ్య బ్యాంకులను జాతీయం చేశారు. అవి:

✦ అలహాబాద్ బ్యాంక్ (కోల్‌కతా), బ్యాంక్ ఆఫ్ బరోడా (బరోడా), బ్యాంక్ ఆఫ్ ఇండియా (ముంబయి), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (పుణె), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కోల్‌కతా), కెనరా బ్యాంక్ (మంగళూరు), దేనా బ్యాంక్ (ముంబయి), ఇండియన్ బ్యాంక్ (మద్రాస్), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (మద్రాస్), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (దిల్లీ), సిండికేట్ బ్యాంక్ (మణిపాల్), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ముంబయి), యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కోల్‌కతా), యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్ (కోల్‌కతా).

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

రాష్ట్ర ఆర్థిక సంఘం, సహకార సంస్థలు

భారతదేశం ఒక సమాఖ్య వ్యవస్థ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ సక్రమంగా జరగాల్సి ఉంటుంది. దీని కోసం ఆర్థిక సంఘాలను ఏర్పాటు చేస్తుంటారు. ఈ సంఘం రాజ్యాంగబద్ధమైన సంస్థ. ఈ కమిషన్ ఇచ్చే సిఫార్సులకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. గ్రామీణ వ్యవసాయదారులను, వృత్తి కార్మికులను ఆదుకోవడానికి సహకార సంస్థలు ఏర్పాటయ్యాయి.



భారతదేశంలో 70% ప్రజలు వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్నారు. వ్యవసాయం నుంచి నికరమైన ఆదాయం రాకపోవడంతో ఖర్చులు అధికమై, పొదుపు లేక రైతులు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

✦ 1875లో దక్కన్ ప్రాంతంలో జరిగిన అల్లర్లు వ్యవసాయదారుల రుణబాధలను బ్రిటిష్ ప్రభుత్వానికి తెలిసేలా చేశాయి. ప్రభుత్వం 1876లో దక్కన్ వ్యవసాయదారుల ఉపశమన చట్టం చేసింది. 1883లో భూమి అభివృద్ధి రుణాల చట్టం, 1884లో వ్యవసాయదారుల రుణాల చట్టాలను అమల్లోకి తీసుకువచ్చింది.

సహకార వ్యవస్థ

ఆంధ్రప్రదేశ్‌లో మొదటి సహకార సంఘాన్ని 1918లో కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో స్థాపించారు. ఇది స్వయంప్రతిపత్తి కలిగిన సంఘం.

▮ ఏటా నవంబరు 14 నుంచి 20 వరకు సహకార వారోత్సవాలను నిర్వహిస్తారు.

సహకార పరపతి వ్యవస్థ, రాష్ట్ర ఆర్థిక సంఘం విధులు - తొలగింపు విధానం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

ఏపీపీఎస్సీ - ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) 691 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా 256 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు (ఎఫ్‌బీఓ), 435 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ (ఏబీఓ) పోస్టుల భర్తీ చేయనుంది. దరఖాస్తు ఫీజు రూ. 330. అర్హులైన అభ్యర్థులు 2025, ఆగస్టు 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

☛ ఇంటర్మీడియట్ విద్యార్హతతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనుకునే వారికి ఇదొక చక్కటి అవకాశం. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించిన ప్రీ రికార్డెడ్ వీడియో పాఠాలు, ఈ–బుక్స్, ప్రాక్టీస్ టెస్ట్స్, కరెంట్ అఫైర్స్ మొదలైనవి ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో టార్గెట్ ఏపీపీఎస్సీ కోర్సులో అందుబాటులో ఉన్నాయి. పూర్తి వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

పెయిడ్ ఇంటర్న్‌షిప్ పోస్టులు

భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)కు చెందిన డిఫెన్స్ మెటలర్జికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ (డీఎంఆర్ఎల్), హైదరాబాద్ ఆధ్వర్యంలో అండర్ గ్రాడ్యుయేట్/పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు 6 నెలలపాటు పెయిడ్ ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 20. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 25 జులై 2025.

నేడే (జులై 19) చివరి తేదీ

☛ హెవీ వెహికల్స్ ఫ్యాక్టరీలో 1850 జూనియర్ టెక్నీషియన్ పోస్టులు. పదో తరగతి, సంబంధిత విభాగంలో ఎన్ఏసీ/ఎన్‌టీసీ/ఎస్‌టీసీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams

Mathematics

Averages

1. The average age of 12 members in a committee increases by 2 years when a person aged 48 years is replaced by a new member. What is the age of the new member?
A) 72 years B) 70 years
C) 74 years D) 76 years

2. The average of 9 consecutive even numbers, if the smallest of them is denoted by x, is:
A) x + 8 B) x + 4
C) x + 9 D) x + 6

3. The average weight of 25 students in a class is 48 kg. When a new student weighing 42 kg replaces an old student, the average weight of the class decreases by 0.5 kg. What is the weight of the student who was replaced?
A) 55 kg B) 54.5 kg
C) 54 kg D) 50 kg

4. The average temperature on Tuesday, Wednesday, and Thursday is 40°C. The average temperature on Wednesday, Thursday, and Friday is 44°C. If the average temperature on Tuesday and Friday is 28°C, then what is the temperature on Tuesday?
A) 25°C B) 22°C
C) 27°C D) 28°C

5. A student named Arjun appeared for five subjects in a competitive exam. His average score in the first three subjects was 76, and his average score in the last three subjects was 88. If his average score in all five subjects was 84, what was his score in the third subject?
A) 72 B) 90 C) 96 D) 100

6. The average monthly income of Arun and Bharat is Rs.5600. The average monthly income of Bharat and Charan is Rs.6800. The average monthly income of Arun and Charan is Rs.5900. What is the monthly income of Arun?
A) Rs.5400 B) Rs.5600
C) Rs.6000 D) Rs.4700

7. The average weight of 10 people increases by 3.2 kg when a new person replaces one of them weighing 72 kg. What is the weight of the new person?
A) 104 kg B) 104.2 kg
C) 102 kg D) 106.2 kg

8. The average age of 25 players is 18 years. When the coach joins the group, the average becomes 19 years. What is the age of the coach?
A) 43 years B) 44 years
C) 45 years D) 46 years

9. A batsman scored 45, 52, 36, 61, 48, and 52 runs in his first 6 innings. How many runs must he score in his 7th innings to increase his batting average by 5 runs?
A) 91 B) 95 C) 84 D) 86

10. The average of 60 observations was found to be 42. Later, it was discovered that one observation recorded as 18 was actually 43. What is the correct mean?
A) 42.25 B) 42.35
C) 42.30 D) 42.42

11. The mean of 40 numbers was calculated as 45. Later, it was found that two numbers were incorrectly taken as 96 and 18 instead of 69 and 39. What is the correct mean?
A) 44.5 B) 45.5 C) 44.85 D) 45.25

12. What is the average of the first 67 natural numbers?
A) 34 B) 33.5 C) 35 D) 34.5

13. In a group of 25 students, 24 of them spent Rs.240 each at a bookstore. The 25th student spent Rs.30 more than the average amount spent by all 25 students. What was the total amount spent by the group?
A) Rs.6,031.25 B) Rs.6,300.75
C) Rs.6,150.25 D) Rs.6,250.75

14. In a class of 60 students, the average score in a science test is 55. If 40% of the students are girls and the rest are boys, and the average score of boys is 25% less than that of girls, what is the average score of girls?
A) 60.5 B) 64.7 C) 70 D) 75.1

15. In a company of 80 employees, the average monthly salary is Rs.32,000. If 5 managers earn Rs.85,000 each, and the average salary of 10 team leads is Rs.55,000, what is the average salary (in Rs.) of the remaining employees?
A) Rs.24,375.6 B) Rs.24,636.6
C) Rs.24,648.6 D) Rs.24,384.6

16. The average of n numbers is 48. If each of 60% of the numbers is increased by 10 and each of the remaining numbers is decreased by 5, what will be the new average of the numbers?
A) 50 B) 51 C) 52 D) 53

17. The average age of eight members of a family is 35 years. When a guest joins them, the average age increases by 10%. What is the age of the guest?
A) 63 years
B) 66.5 years
C) 70 years
D) 75.5 years

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

రుషికొండను బోడిగుండు చేశారు

● ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ కోసం రుషికొండను బోడి గుండు చేసి నిర్మాణం పేరుతో రూ.500 కోట్లు దుర్వి నియోగ పరిచారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్ప లనాయుడు మండిపడ్డారు. ఉత్తరాంధ్రను దోపిడీలు, దౌర్జన్యాలకు అడ్డాగా మార్చారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వంలో ఉత్తరాంధ్రలో జరుగుతున్న అభి వృద్ధిని మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. అశోక్‌గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించినందుకు ఎన్డీయే ప్రభుత్వానికి, సీఎం చంద్ర బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆది కర్మయోగిపై అవగాహన కార్యక్రమం

ఈనాడు, అమరావతి: గిరిజనుల సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆదికర్మ యోగి'పై అవగాహన కార్యక్రమాన్ని విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి అనంత్ ప్రకాశ్‌పాండే వర్చువల్‌గా పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'ఆదికర్మ యోగి' అమలుకు విశాఖపట్నంలో ఈ నెల 23 నుంచి 26 వరకు అవగాహన తరగతులు నిర్వహిస్తు న్నట్లు వివరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి, అదనపు డైరెక్టర్ సరస్వతి, 22 శాఖల అధికారులు పాల్గొన్నారు.

'పథకాలు అమలు చేయకపోతే.. చర్యలకు సిఫారసు చేస్తాం'

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పథకాలు సరిగా అమలు చేయకపోతే సంబంధిత అధికారులపై సుమో టోగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునేలా ఉన్న తాధికారులకు సిఫారసు చేస్తామని చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం విజయవాడలోని ఆహార కమిషన్ భవనంలో.. రేషన్ పంపిణీ, మహిళా శిశు అభి వృద్ధి సంస్థ (అంగన్‌వాడీ), మధ్యాహ్న భోజన పథకం, వసతిగృహ విద్యార్థులకు సౌకర్యాలు, పీఎం మాతృవందన యోజనపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆహార కమిషన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యాయ విద్య కళాశాలల అనుమతులకు ప్రకటన

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ప్రైవేట్ న్యాయ విద్య కళాశాలలకు అనుమతులు ఇచ్చేందుకు ఉన్నత విద్యామండలి ప్రకటన విడుదల చేసింది. న్యాయస్థానం ఆదేశాలతో దీన్ని విడుదల చేసింది. కొత్తగా కళాశాలలు ఏర్పాటు చేయాలనుకునే యాజమా న్యాలు దరఖాస్తు చేసుకునేందుకు పోర్టల్‌ను శనివారం నుంచి అందుబాటులోకి తీసుకొస్తారు.

దోసె ముక్క గొంతులో ఇరుక్కుని బాలుడి మృతి

అనంతపురంలో ఘటన

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: దోసె ముక్క గొంతులో ఇరుక్కుని ఓ బాలుడు ఊపిరాడక మృతి చెందిన ఘటన అనంతపురం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. అనంతపురం నగరం తపోవనంలో ఉండే అభిషేక్, అంజినమ్మల రెండేళ్ల కుమారుడు కుశాల్.. శుక్రవారం ఉదయం దోసె తింటుండగా ఒక్కసారిగా గొంతులో ఇరుక్కుపోయింది. దీంతో ఊపిరాడక బాలుడు కింద పడిపోయాడు. తల్లిదండ్రులు బాలు డిని సర్వజనాసుపత్రికి తరలించగా, కొద్దిసేపటికే మరణించాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు కళ్ల ముందే కన్నుమూయడంతో తల్లిదం డ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

'జీవో ప్రకారం ఎస్‌బీఐ బీమా పాలసీ అమలుచేయాలి'

ఈనాడు, అమరావతి: ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆర్టీసీ ఉద్యోగులకు ఎస్‌బీఐ బీమా పాలసీ అమలు చేయాలని, దీనివల్ల ప్రస్తుతమున్నట్లు ఒక్కో ఉద్యోగి నుంచి నెలకు రూ.200 ప్రీమియం రికవరీ చేయా ల్సిన అవసరం ఉండదని నేషనల్ మజ్దూర్ యూనియ‌న్ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) తెలిపింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి రాజే శ్‌కుమార్ శుక్రవారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరా వును కలిసి వినతిపత్రం అందజేశారు. క్యాన్సర్, కిడ్నీ, గుండె సంబంధిత జబ్బులు ఉన్న వారికి నగదు రహిత వైద్య సేవలు అందేలా చూడాలని, ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యంతో ఉన్న డ్రైవర్లు, ఇతర ఉద్యోగులకు ఇతర ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. వీట న్నింటికీ ఎండీ సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకునేందుకు హామీ ఇచ్చినట్లు నేతలు వెల్లడించారు.

'పదోన్నతుల్లో బీసీ, ఓసీ, మైనారిటీ ఉద్యోగులకు న్యాయం చేయాలి'

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ శాఖల పదోన్న తుల్లో బీసీ, ఓసీ, మైనారిటీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీకి ఆల్ ఇండియా ఈక్వాలిటీ ఫోరం కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర సచివాలయం బీసీ, ఓసీ, మైనారిటీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు రాజేశ్, ప్రసాద్, మైనారిటీ సంఘాల నాయకులు దాదా బాషా వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదో న్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌పై మంత్రుల కమిటీ శుక్రవారం సచివాలయంలో సమావేశమైన సందర్భంగా వినతిపత్రం సమర్పించారు. పదోన్నతుల్లో ఓసీ, బీసీ, మైనారిటీ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

ఆ 71 పనులు చేపట్టేందుకు ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గతంలో పనులు నిలుపుదల చేసిన 71 సాగునీటి ప్రాజెక్టుల పనులు చేప ట్టేలా వీలు కల్పిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024 ఏప్రిల్ 1 నాటికి ఆయా పనులు ప్రారం భించని, 25%లోపు మాత్రమే పనులు చేసిన వాటిని నిలుపుదల చేస్తూ గతంలో ఆర్థికశాఖ మెమో ఇచ్చింది. ఆ తర్వాత వాటిలో ఏవి ప్రాధాన్యమో పరిశీలించిన అనం తరం ప్రస్తుతం 71 పనులు చేపట్టేందుకు వీలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రివర్గ సమావేశంలో నిర్ణ యం మేరకు ఈ ఆదేశాలు వెలువడ్డాయి.

అనుమానాలకు తావులేకుండా ఓటరు జాబితా పరిశీలన

● ఈసీ చేపడుతున్న తీరుతో మరింత పకడ్బందీగా జాబితా!

● తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలన(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్)లో కేంద్ర ఎన్నికల సంఘం చేపడు తున్న ప్రక్రియ అనుమానాలకు తావు లేకుండా ఉన్నట్లు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీని వాసరావు తెలిపారు. ఈ ప్రక్రియతో జాబితా మరింత పకడ్బందీగా ఉంటున్నారని నమ్మకం కలిగించిన చెప్పారు. ఈ ప్రక్రియపై ఆయన, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు శుక్రవారం అసెంబ్లీలో విలేకరులతో మాట్లాడారు. "ఆధార్‌లో పేరు, బయో మెట్రిక్ డేటాను మినహాయించి మిగిలిన సమాచారా న్నంతా ఎడిట్ చేయవచ్చు. అందువల్ల ఆధార్‌ను అథీ కృత(అథెంటిక్) ధ్రువీకరణగా తీసుకోలేం. ఇందుకు ప్రతిగా 11 పత్రాల్లో సమాచారాన్ని తీసుకుం టున్నాం. బీఎల్‌వోలు, బీఎల్ఏలు సంయుక్తంగా ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తే మంచి ఫలితం ఉంటుం దని ఈసీ తెలిపింది" అని చెప్పారు. బీఎల్‌వోల వేత నాలను పెంచితే వారు మరింత బాధ్యతగా పనిచేస్తా రని తెదేపా తరఫున సూచించినట్లు వెల్లడించారు.

రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి

పెట్టాలి: విష్ణుకుమార్‌రాజు

ఓటరు జాబితా రివిజన్‌లో దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రక్రియను స్వాగతిస్తున్నామని విష్ణుకుమార్‌రాజు తెలిపారు. 2024 ఎన్నికల ముందు విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తే 40వేల దొంగ ఓట్లు బయటపడ్డాయని తెలిపారు. దానిపై అప్పట్లో కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశా మని, అయితే ఇప్పటివరకూ దొంగ ఓట్ల తొలగింపు పూర్తి కాలేదని తెలిపారు. గతంలో జగన్ హయాంలో తిరుపతి ఉప ఎన్నికల సమయంలో కుప్పలుతెప్ప లుగా దొంగ ఓట్లను చేర్పించిన వివరాలనూ ఈసీకి అప్పట్లో నివేదించామని, దానిపై ఈసీ చేసిన విచార ణతో కొందరు అధికారులు సస్పెండ్ అయ్యారని గుర్తు చేశారు. ఇప్పుడు చేపట్టిన ఓటరు జాబితా పరి శీలనలో కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర సీఈవో ప్రత్యే క దృష్టి పెడితే తప్ప రాష్ట్రంలో దొంగ ఓట్లను పూర్తిగా తొలగించే పరిస్థితి ఉండదన్నారు.

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

● రాష్ట్ర పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం

ఈనాడు, అమరావతి: అనంతపురం జిల్లా పంచా యతీ అధికారి (డీపీవో) టి.నాగరాజు నాయుడిని దూషించిన తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. విధి నిర్వహణలో ఉన్న జిల్లా స్థాయి అధికారిపై దుర్భాషలాడటం, మనోధైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం తగదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీఎస్ వరప్రసాద్, గౌరవాధ్యక్షుడు డి.వెంక ట్రావు, ప్రధాన కార్యదర్శి కేవీఎస్ ప్రసాదరావు, కార్యని ర్వాహక అధ్యక్షుడు జీవీ సూర్యనారాయణ, కన్వీనర్ నాతి బుజ్జి అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల దస్త్రం తిరుగుటపా

● అధికారుల తీరే కారణం

ఈనాడు, అమరావతి: పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు.. ఆ సంస్థలోని అధి కారుల తీరుతో మరింత జాప్యమయ్యే పరిస్థితి తలె త్తుతోంది. కింతకాలం కిందటే సీనియర్ స్కేల్ అధి కారి నుంచి ఈడీ స్థాయి వరకు అధికారుల పదోన్న తులకు ప్రభుత్వ క్లియరెన్స్ ఇచ్చింది. అయితే కింది స్థాయి ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించిన దస్త్రం పంపే విషయంలో అధికారులు పెడుతున్న కొర్రీల కారణంగా దానికి ప్రభుత్వం వద్ద ఆమోదం లభిం చడం లేదు. గతంలో అధికారుల పదోన్నతులకు సంబంధించి వార్షిక రహస్య నివేదిక (ఏసీఆర్) తప్ప నిసరి అనే నిబంధనను సడలించి, ఆర్టీసీలో ఉండే మెరిట్ రేటింగ్ రిపోర్ట్‌లను పరిగణనలోకి తీసుకొనే వారు. కిందిస్థాయిలో ఆర్టీసీ ఉద్యోగులకు చిన్నచిన్న తప్పులకు సైతం ఛార్జిషీట్, సస్పెన్షన్, తొలగింపు వంటి క్రమశిక్షణ చర్యలు ఉంటాయి. వీటివల్ల పదో న్నతులు పొందడం కష్టమని, అందుకే వీటి నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. ఇందుకు ప్రభుత్వం సమ్మతిం చింది. అయితే ఉద్యోగుల వరకు మాత్రమే క్రమ శిక్షణ చర్యల నుంచి మినహాయింపుతో పదోన్నతు లకు దస్త్రాన్ని పంపాల్సి ఉండగా, ఆర్టీసీ ఉన్నతాధికా రులకు కూడా ఇటువంటి మినహాయింపు ఇవ్వా లంటూ దస్త్రాన్ని పంపారు. ఇందులో ఉన్న లొసు గును ముఖ్యమంత్రి కార్యాలయ అధికారి గుర్తిం చారు. ఆర్టీసీ అధికారులకు మినహాయింపు ఎలా కోరతారంటూ దస్త్రాన్ని వెనక్కి పంపారు. ఇలా ఆర్టీసీ ఉన్నతాధికారుల తీరుతో మూడు వేల మంది ఉద్యో గులకు నష్టం జరుగుతోందని ఉద్యోగుల సంఘాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి.

ఆదివాసి మహిళలకు స.హ.చట్టం ఒక ఆయుధం

● రాష్ట్ర సమాచార కమిషనర్

ఈనాడు, అమరావతి: ఆదివాసి, గిరిజన మహి ళలు సమాచార హక్కు చట్టాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకోవాలని రాష్ట్ర సమాచార కమిషనర్ రెహానా బేగం తెలిపారు. చట్టం గురించి ఆ మహి ళలు అవగాహన కల్పించుకోవాలని సూచించారు. 'నిరక్షరాస్యత వల్ల గిరిజన ప్రాంతాల్లోని మహిళలు ప్రభుత్వాలు వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, హక్కుల గురించి తెలుసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. వారిలో చురుకైన మహిళలను గుర్తించి సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కల్పించడం ద్వారా వారిలో ప్రశ్నించే తత్వం పెరుగుతుంద'ని పేర్కొ న్నారు. లిబ్ టెక్ ఇండియా, యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ క్యాంపెయిన్-ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మన్యం, అల్లూరి సీతారామరాజు, ప్రకాశం జిల్లాల్లోని ఆదివాసి, గిరిజన మహిళలకు అవగాహనలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్ర మంలో మంగళగిరి నుంచి వర్చువల్ విధానంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

సెలవులో పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్

ఈనాడు, అమరావతి: పాఠశాల విద్యా శాఖ డైరె క్టర్ విజయరామరాజు ఈ నెల 21 నుంచి 25 వరకు సెలవులో వెళ్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి టాంజానియా, కెన్యా దేశాల సందర్శనకు వెళ్తున్నట్లు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయన తిరిగి విధులకు హాజరయ్యేంత వరకు ఇన్‌ఛార్జిగా సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాస రావును నియమించింది.

సన్నరకాల వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

● మంత్రివర్గ ఉపసంఘం సూచన

ఈనాడు, అమరావతి: సన్నరకాల వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రివర్గ ఉప సంఘం అధికారులకు సూచించింది. శుక్రవారం సచివా లయంలో మంత్రులు కె.అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నిత్యావసరాల ధర లపై సమీక్షించారు. వరిపై మార్కెట్ రుసుమును 2% నుంచి 1% చేసే విషయంపైనా మంత్రులు చర్చిం చారు. టమాటా ఉత్పత్తిని బేరీజు వేసుకుంటూ.. ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహార నాణ్యతా విభాగాన్ని బలోపేతం చేయాలని నిర్ణ యించారు. సిబ్బంది కొరత నివారణలో భాగంగా ఇతర శాఖల నుంచి అర్హులైన వారికి శిక్షణ ఇచ్చి నియమిం చాలని చెప్పారు. తూనికలు, కొలతల విభాగం ఆధ్వ ర్యంలో విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాల్లో ఆహార నాణ్యతపై తనిఖీలు నిర్వహించాలని ఆదేశిం చారు. సమావేశంలో పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు డిప్యూటీ కమిషనర్లకు పోస్టింగులు

ఈనాడు, అమరావతి: ఎక్సైజ్ శాఖలో ముగ్గురు డిప్యూటీ కమిషనర్లకు పోస్టింగులు ఇస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా శుక్రవారం ఉత్త ర్వులు జారీ చేశారు. వై.శ్రీనివాసచౌదరిని విజయన గరం జిల్లాకు, వి.వివేకేను ప్రధాన కార్యాలయానికి డిప్యూటీ కమిషనర్లుగా నియమించారు. ఎస్.సుధీర్‌సింగ్‌ను ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా నియమించారు.

విశాఖ, కడప ఉక్కు కర్మాగారాల కోసం డీవైఎఫ్ఐ ధర్నా

ఈనాడు, దిల్లీ: విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని, కడపలో వెంటనే ఉక్కు పరి శ్రమ ఏర్పాటుచేయాలన్న డిమాండ్‌తో భారత ప్రజా స్వామ్య యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) శుక్రవారం దిల్లీలోని జంతర్‌మంతర్‌లో ధర్నా నిర్వహించింది. ఏపీ డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంటీ రమణ ఈ కార్య క్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీవై ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఏఏ రహీం మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిన భాజపా.. ఇప్పుడు నష్టాల పేరుతో విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు కుట్ర చేస్తోంది.



దిల్లీ జంతర్‌మంతర్‌లో డీవైఎఫ్ఐ ధర్నాలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఏఏ రహీం, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వెంకట్, ఇతర ప్రతినిధులు

విభజన చట్టం ప్రకారం రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లా లను నిధులు కేటాయించాలి. కడపలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలి. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలి' అని రహీం డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బి.వెంకట్, ఐద్వా అఖిల భారత కోశాధికారి ఎస్.పుణ్యవతి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్య దర్శి జి.రామన్న మాట్లాడారు. 'అమరావతి నిర్మా ణానికి కేంద్ర ప్రభుత్వం అప్పులు ఇప్పించడం కాకుండా గ్రాంట్లు మంజూరు చేయాలన్నారు. పోలవరం నిర్వా సిత యువతకు ఉద్యోగాలు కల్పించాలని, అనంతపురం జిల్లాలో పేదలకు సేవలు అందిస్తున్న ఆర్డీటీని పరి రక్షించాలని కోరారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రభు త్వరంగ పరిశ్రమలు ఏర్పాటుచేయాలన్నారు.

దారులే.. ఏరులై



వరద నీటితో నిండిన దిల్‌సుఖ్‌నగర్-చైతన్యపురి రహదారి

● హైదరాబాద్ సహా తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షం..

● పొంగిపొర్లిన వాగులు.. నాలాలు

● రాజధానిలో స్తంభించిన ట్రాఫిక్

● గోడ కూలి మహిళ దుర్మరణం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా వానలు దంచికొట్టాయి. ప్రధానంగా మధ్య తెలంగాణ జిల్లాలు అతలాకుతలమయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ప్రారంభమైన వర్షం రాత్రి వరకు కురుస్తూనే ఉంది. ప్రధానంగా హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిలో ఈ ఏడాదిలో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో 12.9 సెంటీమీటర్ల కురి సింది. సికింద్రాబాద్ పరిధి మారేడుపల్లిలోని పికెట్ ప్రాంతంలో 11.5 సెం.మీ నమోదైంది. ఇంకా మేడ్చల్- మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, వికారా బాద్, జనగామ, పెద్దపల్లి, మెదక్, యాదాద్రి, సిద్దిపేట, నిర్మల్ తదితర జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వాగులు, వంకలు, నాలాలు పొంగిపొర్లాయి. ప్రధానంగా హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో కురిసిన వర్షానికి జనం విలవిలలాడారు. సాయంత్రం కార్యా లయాల నుంచి ఇళ్లకు బయలుదేరిన వారు రోడ్లపైనే నిరీక్షించారు. పాతబస్తీ నుంచి సికింద్రాబాద్ వరకు, కూకట్‌పల్లి నుంచి ఎల్బీనగర్ వరకు రోడ్లపై రాక పోకలు గంటల తరబడి నిలిచిపోయాయి. ఉప్పల్ నుంచి బేగంపేట, రామంతాపూర్ నుంచి చాద ర్‌ఘాట్, ఎల్బీనగర్ మార్గాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. మరోవైపు ప్రధాన రహదారులపై వాగుల్లా మారాయి. పెద్దపత్తున జనం మెట్రో రైళ్లలో ప్రయాణించారు. నాలాలు పొంగిపొర్లడంతో లోతట్టు ప్రాంతాల్లో జనజీ వనం స్తంభించింది. జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్‌డీఆర్ఎఫ్, కంటోన్మెంట్ బోర్డు సిబ్బంది సహాయక చర్యలు చేప ట్టారు. హైడ్రా సిబ్బంది బాధితులను పడవల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆదిభట్ల రాజా పరిధిలోని నాదర్‌గుల్‌లో గోడ కూలి నల్గొండ జిల్లా నాయకులతండా కు చెందిన లక్ష్మి(35) మృతిచెందారు.

నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం నుంచి మంగళ వారం వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈదురు గాలులు కూడా వీస్తాయని పేర్కొంది. దక్షిణ కోస్తా.. దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.

19, 20 తేదీలు: సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్.

20, 21 తేదీలు: పై జిల్లాలతో పాటు ములుగు, భద్రాద్రి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, వనపర్తి, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, నల్గొండ, జయశంకర్ జిల్లాల్లో వానలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు తెలంగాణ సీఎం ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండా లని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, విద్యుత్, పోలీసు, ఎస్‌డీఆర్ఎఫ్, హైడ్రా బృందాలు, ఇతర విభా గాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని శుక్ర వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అంబేడ్కర్ సార్వత్రిక వర్సిటీ సిబ్బందికి ఏడు నెలలుగా జీతాల్లేవ్

ఈనాడు, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వ త్రిక విశ్వవిద్యాలయం ఉద్యోగులు, సిబ్బందికి గత ఏడు నెలలుగా జీతాలు అందడం లేదు. బిల్లు చేయడంలో ఏర్పడిన సందిగ్ధత కారణంగా ఉద్యోగులకు జీతాలు నిలిచిపోయాయి. దీంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. కుటుంబ పోషణకు అప్పులు చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని ఉమ్మడి ఏపీలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 10ఏళ్ల వరకు ఏపీలోనూ సేవలు అందించింది. విభజన జరిగి పదేళ్లు పూర్తయినందున సేవలను నిలిపివేసింది. గత జనవరి నెల వరకు స్టడీ కేంద్రాల సిబ్బందికి జీతాలు, పెన్షనర్లకు పెన్షన్లను వివ రాలను సైతం హైదరాబాద్‌లోని సార్వత్రిక విశ్వవిద్యాలయ యానికి పంపించేవారు. అక్కడి జీతాల బిల్లులు చేసి ఏపీ ఉన్నత విద్యామండలికి పంపేవారు. అనంతరం ఉన్నత విద్యా మండలి ద్వారా సీఎఫ్ఎంఎస్‌లో బిల్లు పెట్టేవారు. ఉన్నత విద్యామండలి విధులు నిలిపివేయడంతో ఈ జీతాల బిల్లును ఎవరు ఆమోదించాలనే దానిపై సందిగ్ధత నెల కొంది. ఏపీలో ఇంతవరకు వర్సిటీని ఏర్పాటు చేయలేదు. స్టడీ కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. ఇటీవల క్యాబినెట్‌లో వర్సిటీ ఏర్పాటుకు ఆమోదం తీసుకున్నా.. ఇంతవరకు ఎలాంటి కదలిక లేదు. ఉన్నత విద్యాశాఖ సైతం జీతాల బిల్లు ఆమోదంలో నెలకొన్న అస్పష్టతపై ఎలాంటి వివ రణ ఇవ్వడం లేదు. దీంతో ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి ప్రతి నెలా ఉద్యో గులు, పెన్షనర్లకు రూ.44 లక్షల జీతాలను ఏపీ ప్రభు త్వమే భరిస్తోంది. బిల్లుల ఆమోదం మాత్రమే సమస్యగా లేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు బిల్లులు ఎవరు చేయాలి? ఎవరు ఆమోదించాలనే దానిపై ఇప్పటికైనా ఉన్నత విద్యా శాఖ స్పష్టత ఇస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

అలాంటి వ్యాఖ్యలు జగన్‌కు తగవు

● ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

ఈనాడు, అమరావతి: 'సినిమాలో రప్పా రప్పా అనే డైలాగ్‌ను రాసుకుని మావాళ్లు ఫ్లకార్డు పట్టుకుంటే తప్పా' అంటూ ఎమ్మెల్యే, గతంలో ముఖ్యమం త్రిగా చేసిన జగన్ మాట్లాడటం ఆయన స్థాయికి తగదని శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. 'ఆ డైలాగ్ తప్పయితే సెన్సార్ వాళ్లు ఎలా అనుమతించారు.. అని జగన్ అంటున్నారు. అలాగైతే ఒక పెద్ద హీరో నటించిన సినిమాలో రేప్ సీన్ ఉందనుకోండి, ఆ సినిమాను సెన్సార్ అనుమతించింది కాబట్టి.. ఆ సినిమా చూసి బయట రేప్ చేస్తే తప్పేంటి అని అంటే ఎలా ఉంటుంది?.. రప్పా రప్పా అనే డైలాగ్ అంటే తప్పేంటని మాట్లాడటం కూడా అలాగే ఉంది' అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో శుక్ర వారం విలేకరులతో రఘురామకృష్ణరాజు మాట్లాడారు. 'రప్పా రప్పా అనే డైలాగులు ఏంటి? బీజేపీ ఒక్కు కొడితే 'పడిపోవాలి' అంటూ పేర్నినాని చేసిన వ్యాఖ్యల గురించి ప్రస్తావించగా.. 'నేను రాజకీయాల గురించి మాట్లాడను. పేర్ని నాని ఇప్పుడు ఎమ్మెల్యే కాదు. జగన్ అంటే ఎమ్మెల్యే కాబట్టి, ఆయన మాట్లాడింది ఆయన స్థాయికి తగదని అనిపించి, అదే విషయాన్ని చెబు తున్నా' అని రఘురామ వ్యాఖ్యానించారు.

జగన్‌పై కేసు నమోదు చేయాలి

● తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

ఈనాడు, అమరావతి: 'పోలీసులను బెదిరించే రీతిలో మాట్లాడిన జగన్, సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతున్న వైకాపా నాయకులపై వెంటనే కేసులు నమోదుచేసి అరెస్టు చేయాలి' అని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మద్యం కుంభకోణంలో సిట్ దర్యాప్తు ముమ్మరం చేయడంతో వైకాపా నేతల కళ్లలో భయం, కాళ్లలో వణుకు మొదలైంది. మీరు కూడా దిగితే శాంతిభ ద్రతలకు విఘాతం కలుగుతుందని బంగారుపాళ్యంలో ఎస్పీ అభ్యంతరం చెబితే ఆయన మీద రౌడీషీట్ పెడతానని హెచ్చరిస్తారా.. ఆ ఎస్పీకి ఇంకా 25 ఏళ్ల సర్వీసు ఉంది. అప్పటికి ఆయన రాష్ట్రానికి డీజీ అవుతారు. మీరు జైల్లో ఉంటారో.. లండన్‌లో ఉంటారో మీకే తెలియని పరిస్థితి. వంశీని మంచివాడు అంటారా..? రూ.కోట్లు కొట్టేసిన చెవిరెడ్డి నీతిప రుడా? ఆయన్ను చూస్తే బాధేస్తుందా? నిందితులంటే జగన్‌కు ఎందుకంత ప్రేమ? అసభ్యంగా మాట్లాడిన పోసానిని చూస్తే జగన్ గుండె చెరువు అయ్యిందా.. మహిళా ఎమ్మెల్యేపై ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఎందుకు మీ గుండె చెరువు కాలేదు. తప్పులు చేసిన ఓఎస్డీ కృష్ణమోహ‌న్, ధనుంజయరెడ్డిని చూస్తే గుండె తరుక్కుపోతుందా..? మీ పాల నలో దళితులను దారుణంగా చంపారు. అప్పుడు మీ గుండె ఎందుకు ద్రవించలేదు. కన్నీరు కారలేదు' అని వర్ల రామయ్య ప్రశ్నించారు.

డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల నిరసన

ఈనాడు, అమరావతి: డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాతన పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ డీఎస్సీ-2003 టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టారు. "మాకు 2003లో డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చినప్పుడు పాత పెన్షన్ విధానం అమల్లో ఉంది. నియామక ప్రక్రియ ఆలస్యం కారణంగా సరిగ్గా 2005 సంవత్సరంలో రావ డంతో మా తప్పిదం లేకుండానే సీపీఎస్ పరిధిలోకి తెచ్చారు. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం వల్ల నష్టపోయిన ఉద్యోగులను తిరిగి పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావచ్చని కేంద్ర ప్రభుత్వం 2019లో జారీ చేసిన మెమో-57 మాకు వర్తిస్తుంది. దీని ఆధారంగా మాకు న్యాయం చేయాలని విద్యాశాఖ మంత్రికి వినతిపత్రాలు ఇచ్చాం. మా న్యాయమైన డిమాండును ప్రభుత్వం పరిష్కరించ కపోతే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తాం" అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలు, బోధనాసుపత్రుల్లో అసోసియేట్ ప్రొఫెసర్ల పదోన్నతులకు కసరత్తు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ వైద్యశాలలు, బోధనాసుపత్రుల్లో పనిచే స్తున్న అసోసియేట్ ప్రొఫెసర్లకు ఒకసారి ప్రత్యేక అవకాశం కింద ప్రొఫెస ర్లుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త వైద్య కళా శాలల్లో బోధనా సిబ్బందికి ఎన్ఎంసీ ఇచ్చిన సూచనల మేరకు సమస్య తలెత్తని ఉన్నతోట పోస్టులను అత్యవసర ప్రాతిపదికన నింపేందుకు వైద్య విద్యా సంచాలకుల కార్యాలయం ఈ చర్యలు చేపట్టింది. ఈ కసరత్తులో భాగంగా తాత్కాలిక జాబితా విడుదల చేసింది. 77 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టి 262 మంది నుంచి పదోన్నతులకు అభ్యర్థనలు వచ్చాయి. అభ్యంతరాల స్వీక రణకు ఈ నెల 19 వరకు అవకాశం ఇచ్చారు.

జలవనరుల శాఖ నిడదవోలు ఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు సస్పెన్షన్

ఈనాడు, అమరావతి: గోదావరి పశ్చిమ డివిజన్ నిడదవోలు కార్యనిర్వా హక ఇంజినీరు (ఈఈ) పి.సుబ్రహ్మణ్యేశ్వరరావును సస్పెండ్ చేస్తూ జలవ నరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్త ర్వులు ఇచ్చారు. విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం, బాధ్యతా నిర్వహణలో వైఫల్యం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. రబీ పంట అనంతరం నిడదవోలు రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద కాలువలోని దాదాపు క్రాస్ బండ్ తొలగించలేదు. ఇరిగేషన్ కాస్ రెగ్యులేటర్ గేట్ల వద్ద తూటికాడను తొలగించలేదు. ఓ అండ్ ఎం నిధులు విడుదల చేసినా తగిన సమయంలో పనులు చేయలేదు. దీంతో గోదావరి పశ్చిమ ప్రధాన కాలువ పరిధిలోని నిడదవోలు, నిడదవోలు ఆయకట్టు నియోజకవర్గ ఆయకట్టుకు నీటి కొరత ఏర్పడింది. ఈ అన్ని కారణాలను ప్రస్తావిస్తూ సుబ్రహ్మణ్యేశ్వరరావును సస్పెండ్ చేశారు.

ఓఎంసీ నిందితురాలు శ్రీలక్ష్మి పిటిషన్‌లో తీర్పు వాయిదా

ఈనాడు, హైదరాబాద్: ఓఎంసీ కేసులో డిశ్చార్జి పిటిషన్‌ను సీబీఐ కోర్టు కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ 6వ నిందితురాలైన అప్పటి పరిశ్ర మల శాఖ కార్యదర్శి, ఐఏఎస్ అధికారి వై.శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిష న్‌పై తెలంగాణ హైకోర్టు శుక్రవారం తీర్పును వాయిదా వేసింది. శ్రీలక్ష్మి పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఆమె తర ఫున సీనియర్ న్యాయవాది కె.వివేక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఓఎంసీకి లీజులు కేటాయించాలన్న నిర్ణయం తీసుకున్నది అప్పటి పిటిషనర్ బాధ్య తలు స్వీకరించడానికి ముందే అని చెప్పారు. లీజుల మంజూరులో పిటిషనర్ పాత్ర నామమా త్రమని, ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేశారన్నారు. ఎవరికో కుట్ర జరి పినా ఆధారాలు లేవన్నారు. సీబీఐ తరఫున కృపాకరం, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిలను కింది కోర్టు నిర్దోషులుగా విడుదల చేసిం దని, అదే కేసు శ్రీలక్ష్మికి కూడా వర్తిస్తుందన్నారు. సీబీఐ ప్రత్యేక న్యాయ వాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ నోటిఫికేషన్ తయారు చేసి లేదని మంత్రి చెప్పారన్నారు. అంతేగాకుండా మంత్రి ఆమోదానికి ముందే కేంద్రం అనుమతుల కోసం పంపారన్నారు. మంత్రి పాత్ర లేదనడానికి ప్రా తిపదిక లేదని, ఐ ఉత్తర్వులను ఇష్టం వచ్చినట్లు వర్తించనన్నారు. కావాలంటే విచా రణ ఎదుర్కొని కేసు లేదని రుజువు చేసుకోవాలన్నారు. వారికీ న్యాయం, శ్రీలక్ష్మికి ఓ న్యాయం ఉండటం అన్యాయమన్నారు. ఓఎంసీకి అనుకూలంగా అన్ని నిర్ణయాలు శ్రీలక్ష్మి హయాంలోనే జరిగాయన్నారు. ఓఎంసీ అక్రమ మైనిం గ్‌కు శ్రీలక్ష్మి ముఖ్యమైన కారణమన్నారు. ఇరుపక్షాల వాద నలను విన్న న్యాయమూర్తి తీర్పును వాయిదా వేశారు.

2 నుంచి పుర పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ఈనాడు,అమరావతి: పుర, నగరపాలక సంస్థల్లో పారిశుద్ధ్య, ఇంజినీ రింగ్ పబ్లిక్ హెల్త్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే నెల 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు రాష్ట్ర మున్సి పల్ కార్మికుల సంఘం ప్రకటించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.రంగనాయకులు, పి.సుబ్బరాయుడు గుంటూరు జిల్లా మద్దేశ్వరంలోని పురపాలకశాఖ సంచాలకుల కార్యాలయంలో అదనపు సంచాలకుడు మురళీకృష్ణగౌడ్‌కు శుక్రవారం సమ్మె నోటీసు ఇచ్చారు. కార్మికుల వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఇతర సమ స్యలు పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు.